
క చూడండి!
సోమేశ్వరరావు సమర్పించు
చిత్రా వారి
ళ్ళి రోజు
ప్రత్యేకంగా జమున ద్విపాత్రాభినయంతో
యానాపురం
M.S. శ్రీరామ్ - K. నాగేశ్వరరావు
శ్రీ నటరాజ్ పిక్చర్స్ - విజయవాడ
పిక్చర్స్ - రాజమండ్రి
గుంతకల్లు
Roophala

శ్రీ వాణీ సాహిత్య క్రాస్‌వర్డ్ పజిల్ నెం. 15

Licensed by the District Collector Warangal. L. No.1 Dt. 8—10—67

(ఈ పజిల్ తాలూకు కీ సొల్యూషన్ జిల్లా కలెక్టరుగారి కార్యాలయములో సీలు చేయబడినది)

నిఘంటువు : శబ్దార్థ చంద్రిక

రూ. 800 లు

పోటీచేసి గెలుపొందండి !

మొదటి బహుమతి రు. 400 రైట్ ఆన్సర్

రెండవ బహుమతి రు. 250 ఒక తప్పు ఆన్సర్

3 వ బహుమతి రు. 150 రెండు తప్పుల ఆన్సర్

1 అ	జం	2	■	3	ష	4 థ	ము	■	5 లో
	■	6 ప్ర		చి	■		■	■	
లు	■	■	■		■	7 ము	8 హా		ము
■	9	భ్యు	డు	■	10	■		■	■
11	■	■	■	12	మ్మ	లు	■	■	13
14 ని		15 య	ము	■	■	■	16 ప	ర్వ	
■	■		■	17 భా	18	ర		■	■
19 స		ని	■	■	ర్యా	■	■	20 రా	
	■	క	■	21	కొ	ము	■		■
22 కి		■	■	■	ము	■	23	చే	ము

ముగింపు తేది **5-10-1968**

నెం. 15 ఆధారములు

అడ్డము:- 1. అత్యంత మనోజ్ఞమైన వివిధ శిల్ప సౌందర్య భంగిమలలో శతాబ్దాలుగా మన ప్రాచీన సంస్కృతినీ నాగరికతనూ ప్రతిబింబింప జేస్తున్న గుహారాజము. 3. రుగ్మత తొలగుటకై కొందరుదీన్ని సేవిస్తారు. 6. మన ప్రాచీన తంత్రీ వాద్యము. 7 రెండు ఘడియల కాలము. 9. సభలలోనూ సమావేశాలలోనూ యీతని అభిప్రాయమే ఎక్కువగా చెలామణీ అవుతున్నదనవచ్చు. 12 సాధారణంగా చెట్లకు కాయలు వీటికే కాస్తాయి. 14. శాస్త్రవేత్తలు ధ్రువపరచిన అభిప్రాయ సారాంశమును యిలా అంటాము. 16. లేవడిలోనున్నవారికి మామూలురోజు ఈరోజు సమానమే నంటారు. 17. శివుని జటాజూటమునుండ భారతావనికి దిగి వచ్చిన ప్రసవంతీమ తల్లి. 19. తామరతీగ. 20. మిత్రుడు. 21. ధిల్లీలు నేటికీ దీనితో వేటాడుటకద్దు. 22. పాలపిట్ట. 23. సాధారణంగా ఇది అందరి ఇండ్లలోనూ వుంటుంది. **నిలువు** — 1. ఇటువంటివారు పాలకులుగానున్న రాజ్యమందలి ప్రజలకు సుఖశాంతులుండనంటారు. 2. పువ్వు పుట్టుటతోడనే యిది వ్యాపిస్తుంది. 3. ఇది కలిగినవారి కీర్తిబడునదే దానమవుతుంది. 4. అదృష్టహీనులకిది లభ్యము కాదు. 5. ఇది వున్న వారికి వేరే దుర్గుణ మెందుల కన్నారు పెద్దలు. 8. పొరుగింటికి యిది లేకుండా పోవుట అగౌరవముగా భావిస్తారు. 10. పసిపిల్ల కత్యంత ప్రియమైనది. 11. ఒక భూభాగంమీద దురాక్రమణ జరిగినప్పుడు సాధారణంగా యిది సంభవిస్తూంటుంది. 13. దీనికి పాలు పోస్తే విషముగా మారుట సహజముగదా! 15. ఆత్మబలములేనివారు దీనివెనుక వాటకనాడుతుంటాంట. 16. మార్గము. 18. వేదములు మొదలైన మన ప్రాచీన గ్రంథములు వ్రాయుటలో నుపయోగింపబడిన భాష. 19. నాట్యము చేసే స్త్రీ. 20. రాజమరాళము.

కూపను ఒక్కింటికి ఒక్క రూపాయి మాత్రమే

నిబంధనలు:- 1. కూపనులు తుడుపులు, కొట్టివేతలులేకుండా తెల్లకాగితముపై చదరము గళ్ళరూపములో గీసి చక్కగా సిరాతో వ్రాసి పంపవచ్చును. లేదా 30 పైసల పోస్టేజి పంపినచో అచ్చు కూపనులు పంపుదుము. కాని లిస్టు రూపములో వ్రాయబడిన కూపనులు చెల్లనేరవు. 2. ప్రవేశరుసుము ప్రతికూపనుకు ఒక్క రూపాయి చొప్పున నగదురూపమునగాని, మనియార్డర్ లేక క్రాస్‌చేయని పోస్టల్ఆర్డర్ద్వారా గాని పంపాలి. మనియార్డరైనచో M.O.రసీదు కూపనుతో తప్పక జతచేసిపంపవలెను. లేనిచో కూపనులు పోటీలో మంచబడవు. 3. ఒకపేరుతో రెండు కూపనులకంటె యెక్కువ పంపరాదు. ప్రతి కూపనుపైన మరియు పోస్టల్ఆర్డరు, మనియార్డర్‌ఫారములవెనుకభాగమున తప్పక పోటీదారుని పూర్తిపేరు, అడ్రసు వగైరా విశదముగా వ్రాయవలెను. 4. కూపనులు ముగింపుతేది సాయంత్రం 8 గంటలలోపుగా మాకు చేరునట్లు పంపాలి నియమిత సమయందాటినతరువాతవచ్చిన కూపనులు పోటీలో చేర్చబడవు. 5. ఈ పజిల్సులో ప్రతిపోటీదారు తానుపంపే రైటుమొదలు-రెండు తప్పులవరకుగల ప్రతి కూపనుకు బహుమతిపొందవచ్చును. 6. A. కీ సొల్యూషను మాత్రం 'ఆంధ్ర పత్రిక' తెలుగు దినపత్రికలో ముగింపు తేది తరువాత ఒక వారములో ప్రకటించబడును. విజేతల లిస్టు, కొత్త పజిల్ కూపనులు వగైరా కావలసినవారు 30 పైసల పోస్టేజి పంపి తెప్పించుకొనవలెను. 6.B. తమ కూపనుల పునఃపరిశీలనకోరే పోటీదారులు విజేతల లిస్టు ప్రకటించబడిన తేదీలగాయతు 30దినములలోపుగా రూ.5లు స్క్రూటినీ ఫీజు క్రింద మనియార్డరుద్వారా పంపుతూ ఒకదరఖాస్తు స్క్రూటినీ కమిటీ చైర్మన్‌గారిపేర వ్రాసి M.O. రశీదు దానితో తప్పక జతపరచి మేనేజర్ అడ్రసుకు పంపవలెను. అప్పుడు వీలైనంత త్వరలో కమిటీ నిర్ణయాన్ని పోటీదారులకు తెలుపుదుము అట్టిపోటీదారులు విజేతలైయైనచో రావలసినబహుమతి మొత్తముతోపాటు స్క్రూటినీ ఫీజుకూడ తిరిగి పంపించబడును. కానిచో స్క్రూటినీ ఫీజు జాపుచేయబడును. నిర్ణీత గడువు దాటిన తరువాత ఎట్టి ఆక్షేపణలు అంగీకరింపబడవు. 7. కీ సొల్యూషన్‌లోని మాటకు సరిపోని ప్రతిమాట ఒక తప్పుగా నెంచబడును. 8. ఈ పజిలుతాలూకు అన్ని విషయములలో మేనేజరుదే తుదినిర్ణయము. 9.ఇండియాలో తప్పయితర దేశములలో నివసించువారు ఈ పోటీలో పాల్గొనుట నిషేధించడమైనది. 10. పైనిబంధనలు ప్రభుత్వ రూల్సుననుసరించి రూపొందించ బడినవి. కావున పోటీదారులెల్లరు పాటించి సహకరించ గోరుచున్నాము. 11. కూపనులు మనియార్డర్లు వగైరా ఈ క్రింది అడ్రసుకు మాత్రమే పంపాలి.

The Manager, Sri Vani Sahitya Puzzles, Warangal-2. (A.P.)

ఉత్తరాలు

ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకు లందరికీ మా దసరా శుభాకాంక్షలు.

ఈ సంచికలో ప్రారంభం అవుతున్న సీరియల్ నవల "జీవిత వలయాలు" రచయిత్రి శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారి జీవిత వివరాలు, ఫోటో ఈ దిగువ ప్రచురిస్తున్నాము. —సం.

కామరాజు వారి యింటి ఆడపడచు ఇల్లిందల వారి కోడలు. హైదరాబాద్ కాపురము. స్టాన్లీ గర్ల్సు హైస్కూల్లో స్కూలుఫైనలు, ఉస్మానియా యూనివర్శిటీలో జర్నలిజమ్ కోర్సు. హైదరాబాదు నగరములోని సారస్వత సామాజిక కార్యక్రమాలలో పాతిక సంవత్సరాల నుంచి కృషి



శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి.

చేస్తున్నారు. రెండు సంవత్సరాలు ఆంధ్ర పత్రిక వారపత్రికలో 'వనితాలోకము' వ్యాసాలు, ఆరు సంవత్సరాలు కృష్ణా పత్రికలో 'ఇయంగేహేలక్ష్మీ' వ్యాసాలు వ్రాశారు. జాతీయ మహిళా విద్యా సంఘానికి స్టేట్ సభ్యురాలు. ఆంధ్ర రచయిత్రుల సంఘం సభ్యురాలు (సాహిత్య అకాడమి) ఈమె వ్రాసిన వ్యాసాలు కొన్ని టెక్స్టు బుక్కులలోకి తీసుకోవబడ్డవి. కథలు కన్నడ, ఆంగ్ల, ఉర్దూ, హిందీ భాషలలోకి అనువదింపబడ్డాయి. 1963 లో గృహలక్ష్మి స్వర్ణకంకణము లభించింది. 1958 నుండి 1966 వరకు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిలు సభ్యురాలుగా ఉన్నారు.

క థ లు

"కె. రామలక్ష్మి" గారు రాసిన "తాలి చూపు" కథ ప్రేమికులకు ఎంతో ఆదర్శవంతంగానూ, హృదయవిదారకంగానూ వుంది.

డి. మంజులారాణి, (రాజమండ్రి—2)

* * *

పి. ఎస్. నారాయణగారి "నన్ను చెప్పనీయ్" కథలో శశిరేఖ సత్యంకు అక్కయ్య అవుతుంది. కాని రచయిత అక్కయ్యను తీసికొని 'అది' అనడం ఎట్టెట్టుగా వుంది.

సుబ్బి అత, (ముదునూరు).



సి ని మా

27—9—68 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో **శ్రీ ఎం. సత్యంగారు,** నేను **శ్రీ ఎన్. టి. రామా రావుగారు** గురించి తెలిపిన విశ్వాసాభిప్రాయాల్ని వ్యతిరేకిస్తూ, పత్రికా విలేఖరిగా నా బాధ్యతను కర్తవ్యాన్ని నాకు గుర్తు చేసినందుకు కృతజ్ఞుణ్ణి.

ఎన్నో సంవత్సరాలుగా చిత్రపరిశ్రమలో వుంటున్న శ్రీ సత్యంగారు యిటువంటి సూచన యివ్వడం నిజంగా అభినందనీయమే. వ్యాసంపై యింతటి అక్కరను ప్రదర్శిస్తున్న శ్రీ సత్యంగార్ని మనసారా అభినందిస్తున్నాను.

శ్రీనివాస్, (మదరాస్).

సీరియల్


ఆంధ్రసచిత్ర వారప్రత్రికలో ఈ మధ్య ప్రచురితం అవుతున్న ఒక్కొక్కకథా ఒక్కొక్క మచ్చుతునక. ముఖ్యంగా 6.9.68 వార పత్రికలో 'సుజాత సీరియల్'లో పిల్లల పెళ్లిళ్ల విషయం చెప్పదానందం యిచ్చిన భాషణ చూచిన, చదివిన ఈ కాలంలో కొన్ని కుటుంబాలలోని తల్లితండ్రులు తమ పంతాలూ, పట్టింపులూ మానుకొని, ఆడ పిల్లల జీవితాలు నాశనం యింకా చేయకుండా కళ్లు తెరుస్తారని ఆశిద్దాం. రచయిత్రికి మా శుభాభినందనలు మీ ద్వారా అందజేయండి.

'సిగ్గు తెరలు' ఒక క్రొత్త ప్రయోగాత్మక మైన పంథాలో వ్రాసిన రచయితకీ మా అభినందనలు.

సరిహద్దులలో పనిచేసే ఆంధ్రులు.
యు డి. సి ద్వారకా రామారావు,
సుబేదార్ రావు.
సైనీరు పి. సుందర్రావు.

ఆ ట లు

శ్రీ కె.ఎస్. నరసింహన్‌గారిచేత ప్రతివారం 'ఆటలు' శీర్షిక కూడ నిర్వహింపబడటం మా లాంటి క్రీడాభిమానులకు ఎంతో సంతోషముగా వున్నది. కాని 20—9—68 సంచికలో ఒక చిన్న పొరపాటు దొర్లినందుకు మేము చాల విచారిస్తున్నాము. ఆరు సంవత్సరముల క్రిందట మనదేశం పి.కె. గోస్వామి నాయకత్వం క్రింద ఫుట్‌బాల్ ఆసియన్ చాంపియన్‌షిప్ గెలుచుకొంది. అంతేగాని జర్నల్‌సింగ్ నాయ



ఉ త్త రా లు

కల్యాన కాదు అని గమనించ గోరుతున్నాము.

ఎప్పుడూ సినిమా తారలనే పరిచయాలు, ప్రశ్నలు—సమాధానాలు చెప్పించకుండా అప్పుడప్పుడు ప్రముఖ క్రీడాకారుల పరిచయాలు, వాళ్లతో ప్రశ్నలకు సమాధానములు చెప్పిస్తే ఇంకా బాగుంటుందని మీరు కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పిన వారవుతారని ఆశిస్తున్నాము.

చాన్‌ఖాన్, వి. ఎల్. ప్రసాద్(హైద్రాబాద్)

వ్యా సా లు

తే. 20.9.68 ది ఆంధ్రపత్రికలో "కుక్క కాటు....." అనే వ్యాసం ఎంతో బాగుంది. రచయిత "శుభ"గార్కి నా ధన్యవాదాలు.

కుక్కకాటు వల్లనేకాక ఈ వ్యాధి కొన్ని ఇతర జంతువుల కాటు ద్వారా కూడా వ్యాపించవచ్చు. తోడేలు, గబ్బిలాలు, చుంచులు మొదలైనవి కూడా ఈ రేబీస్ (Rabies) వ్యాధిని వ్యాపింప చేస్తాయి. రచయిత, కాటు తరువాత ఈ వ్యాధి $1\frac{1}{2}$ సంవత్సరాల వరకు రావచ్చని అన్నారు. 6 నెలలు మాత్రమే చాలని సాధారణంగా అన్ని పుస్తకాలు రాస్తాయి. అంతేకాక ఎన్ని ఇంజక్షన్లు కావాలో డాక్టరు నిర్ణయిస్తారని అన్నారు. నిజానికి ఇవి 14 ఇంజక్షన్లు మాత్రమే. ఇవి మార్చడానికి అవకాశం లేదని అనుకొంటాను. ఇది కనిపెట్టిన పాశ్చరు మహాశయుడే, ఒక సందర్భంలో అవసరం కొద్ది 7 రోజుల్లోనే రోజుకు రెండు చొప్పున 14 ఇంజక్షన్లూ ఇచ్చాడు. మరొక విషయం, ఇంజక్షన్లు బొడ్డుచుటూ, పొట్ట మీద ఇస్తారు. దీనికి కారణం ఇంజక్షన్లు ఇచ్చే ద్రవం ఎక్కువ అని అంటారు.

ఆ మహానుభావుడు పాశ్చరు ఈ ఇంజక్షను పదార్థం కనిపెటడం నిజంగా ఒక "మహావీరుని సాహసగాథ!"

జమ్మి కోనేటిరావు, (కడప.)

మ న వి

ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించిన 'ఆశ్రయం' నాటక రచయిత శ్రీ ఆదివిష్ణు చిరునామా తెలియజేయమని కోరుతూ చాలామంది పాఠకులు ఉత్తరాలు రాస్తున్నారు. విడివిడిగా అందరికీ రాయడం సాధ్యంకాదు కాబట్టి క్రింద యిచ్చిన రచయిత చిరునామాకి నేరుగా రాయ గోరుతున్నాము:

—సం.

శ్రీ ఆదివిష్ణు, ఆదివిష్ణు భవన్,
చిలకలపూడి పోస్టు, మాచవరం,
మచిలీపట్నం.

ఆంధ్రసచిత్ర వారపత్రిక


వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 4—10—'68
కీలకనామ సం॥ ఆశ్వయుజ మాసం శు. త్రయోదశి
సంపుటము : **61** సంచిక : ***6***

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

విషయానుక్రమణిక


నన్నెదిరించడానికి నీకెన్నిగుండెలున్నాయి!
కేంద్రం
కేరళ
హర్యానా మంత్రివర్గం
పార్టీ మనుషుల తత్వం
నువ్వు సవారీ చెయ్యలేకపోతే నేను చెయ్యగలను
సుఖంగా లేదా? ఎంత విచారించదగిన విషయం! ఈ 'అయిస్‌క్రీం' తీసుకో.
రష్యా ఆక్రమణ
ఆర్థిక సహాయం
జెకోస్లోవేకియా

గాంధీ నేర్పిన గుణపాఠాలు



శ్రీమతి ఇందిరాగాంధీ

ఇది గాంధీ శతజయంత్యుత్సవాల సంవత్సరం. గాంధీగారిని, ఆయన మహత్తర కృషిని గుర్తు చేసుకొనటానికి మరొక అవకాశం. ఇది వనితలకి ప్రత్యేకమయిన సంచిక కాబట్టి ఈ దేశ ప్రధాని అయిన ఒక భారత వనిత రాసిన వ్యాసంలోని ముఖ్యభాగాలని ఈ కింద ప్రచురిస్తున్నాము. —సం॥

ఒక్కొక్క వ్యక్తి, మారి ఎదిగిన కొద్దీ ఆ వ్యక్తి గాంధీగారిని తదనుగుణంగా అర్థం చేసుకుంటాడు. గాంధీగారు బతికిఉన్నప్పుడు నా వయస్సు వారెందరికో ఆయన తత్వం అర్థం అయ్యేదికాదు. ఆయనకి సంబంధించినవి కొన్ని మాకు చాదస్తాలుగా కనిపించేవి. వాటిని చూసి విసుక్కునేవాళ్లము. ఆయన సిద్ధాంతాలు కొన్ని మాకు అర్థం అయ్యేవికావు. ఆయన మహాత్మ గుణాలని అంగీకరిస్తూనే ఆయనతో రాజకీయాలలోకి ఆధ్యాత్మిక విషయాలు తీసుకువచ్చినందుకు ఆయనతో పోట్లాడుతూ ఉండేవారము.

• ఇది నా తరంవారికి మాత్రం వర్తించే విషయం కాదు. తమ స్వీయచరిత్రలో మా నాన్నగారు అన్నారు, తమ తరంవారు గాంధీయ సిద్ధాంతాలని తను ఆలోచనా— పద్ధతులతో సమ్మిళితం చెయ్యటానికి ఇబ్బంది పడతారని. కాని, క్రమంగా, జాతీయోద్యమం యొక్క ఆటూ పోటూతో బాటు గాంధీ తత్వంకూడా బాగా అవగాహన అయి దానిని తమ ఆలోచనా విధానంలోకి ఆకళింపుచేసికొన గలిగారు మా నాన్నగారు. ఆయన గాంధీని ఇంద్రజాలికుడనేవారు; గాంధీయ సిద్ధాంతాలని సమకాలీన పరిభాషలోకి తర్జుమా చెయ్యటానికి భక్తితో ప్రయత్నించేవారు. వాటిని యువతీ యువకులకి అందుబాటులో ఉండేట్లు చెయ్యటానికి ప్రయత్నించే వారు.

గాంధీగారు తాము చెప్పిన వాటినన్నిటినీ విధేయతతో శిరసావహించమని అనేవారు కారు. తమ సాధనాలనీ, ధ్యేయాలనీ పరిశీలించకుండా స్వీకరించమని ఆయన కోరే వారుకారు. నేను కేవలం ఒక చిన్న అమ్మాయిగా ఉన్నప్పుడు ఆయనతో ఎన్ని సార్లు వాదించలేదు? హృదయపూర్వకంగా ప్రకటించిన ఏ అభిప్రాయాన్ని ఆయన చిన్నదని తోసివేసేవారుకారు. తమతో అంగీకరించనివారితో వాదించేతీరిక ఆయనకి ఉండేది—మనదేశంలో గురువులకీ ఇతర ప్రదేశాలలో ప్రవక్తలకీ ఈగుణం సాధారణంగా లోపించే ఉంటుందని అంగీకరించాలి. ఆయన నిగూఢసత్యాన్ని బయటపెట్టటానికి ప్రయత్నించని ప్రవక్త. ఆశపెట్టటంగాని, భయపెట్టటంగాని ఆయన పద్ధతికాదు. తను ఉద్యమం బరువు ఆయనని వంచి పారవెయ్యలేదు. ఛలోక్తులు విసరి నవ్వగలిగే మహాత్ముడు ఆయన.

ఇది గాంధీగారి శతజయంతి ఉత్సవం సంవత్సరం. ఇదే జలియన్ వాలా బాగ్ ఘోరం జరిగిన అర్ధశతాబ్దం తర్వాతి సంవత్సరం కూడా. ఈ ఘోరం ఎంత పెద్ద పరిణామాలకి దారితీసిందో బలం మంకుపట్టు ఒకటే అనుకునే వారు ఆలోచించవలసిన విషయం. మోతీలాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ టాగూర్ వంటివారిమీద ఈ సంఘటన ప్రభావం అవర్ణనీయం. టాగూర్ తమ 'సర్' బిరుదుని వదులుకున్నారు. ఆవేశంతో, వివేకంతో సామ్రాజ్యవాదం గురించి రాశారు. మా కుటుంబం అందరితోబాటు మా తాతగారు కూడా గాంధీగారి ప్రభావానికి లోనయ్యారు. మా జీవితాలు మారిపోయాయి. దేశంలోని భావ విధానమే మారిపోయింది. ఆ సంవత్సరం గాంధీగారు మన రాజకీయోద్యమానికి నాయకత్వం వహించారు. ఈ అర్ధ శతాబ్దాన్ని తరచి చూస్తే ఆయన వ్యక్తిత్వంయొక్క ప్రభావాన్ని, ఆయన బోధనల ప్రభావాన్నిమరింత చక్కగా అర్థం చేసుకొన గలుగుతాము. వీటిని పూర్తిగా తూచటం సాధ్యం కాదు. మనం ఇంకా ఆయనకి మరీ దగ్గరగా ఉన్నాము. ఇంకా మారుతూ ఉన్నాము. కొన్ని దశాబ్దాలదాకా ఆయన భారతదేశానికీ, అఖిల ప్రపంచానికీకూడా చేసిన సేవ నిజరూపాన్ని తెలుసుకోలేము. అయినప్పటికీ ఆ ఒక్క సంవత్సరంలో గాంధీగారు మన చరిత్రని ఎలా మార్చగలిగారో తలుచుకుంటె అద్భుతంగా ఉంటుంది. తమ రెండుచేతులతో ఒక దేశం

ప్రజలనందరినీ 'ఎత్తివేశారా' అన్నట్లు అనిపిస్తుంది. గొప్పవారు, సామాన్యులు— అశేష జనంలో ఎందరి జీవితాలలో ఎంతటి మార్పులు తీసుకునచ్చారు? రాజకీయాలలో సంచలనం తీసుకురావచ్చుకాని మానవుల అంతరాళాలలో మార్పులు తీసుకురావటం సాధారణమయిన పనికాదు. గాంధీగారు ఆభిజాత్య రాజకీయాలని తోసివేసి ప్రజా బాహుళ్యంలో సంచలనం తీసుకురాగలిగారు. ఇదే ఆయన ప్రత్యేకత...ఆయన ఒక అల శిఖరంవంటివారు. అల ప్రజల స్వరూపమే.

గాంధీగారు మనని భయంనుంచి విముక్తి చేశారు. రాజకీయంగా మనదేశానికి వచ్చిన స్వాతంత్ర్యం ఆధ్యాత్మికంగా సాధించిన ప్రగతి ఏకైక ఫలితం కాదు. సాంఘికంగా భారతదేశంలో ఏర్పడిన మార్పులో ఇంకా ముఖ్యమయినవి. మన సాంఘిక సాంప్రదాయాల సంకెళ్ళనుంచి గాంధీగారు మనల్ని విడిపించారు. పురుషులూ, స్త్రీలూ, అగ్రవర్ణంవారూ, తక్కువవర్ణంవారూ—అందరూ సమానులే అన్నది ఆయన మూలసిద్ధాంతం. ప్రజాబాహుళ్యం ఈ సిద్ధాంతంవల్ల ఆకర్షింపబడి ఆయన ఉద్యమంలో పాల్గొన్నది. సుదీర్ఘమైన భారతదేశ చరిత్రలో ఎందరో సంస్కర్తలు వర్ణాశ్రమ ధర్మాన్నీ, స్త్రీల అణచివేతనీ ఖండించి వాటికి ఎదురుగా పోరాడారు. కాని, ఈ యుద్ధంలో గాంధీగారు నెగ్గినంతగా మరెవరూ నెగ్గలేదు. పాత సంప్రదాయాల బాధలకి లోనయిన అందరిలాగే భారతదేశ స్త్రీలు ఆయనకి ప్రత్యేకంగా ఋణపడి ఉన్నారు.

మహాత్మాగాంధి ఒకసారి ఇలా రాశారు:

'ఎవరూ నా శిష్యుడిని అనరాదు. నేనే నా శిష్యుడినిగా ఉంటే చాలు. నేను నాకు తగిన శిష్యుడిని కానని తెలుసు, ఎందుకంటే నా నమ్మకాల స్థాయిలో నేను జీవించలేకపోతున్నాను.

గాంధీగారు ఒక సార్వజనికమయిన సిద్ధాంత స్వరూపాన్ని సృష్టించినట్లు కొందరు గాంధీ అభిమానులు చెప్తారు. అన్నిటినీ క్షుణ్ణంగా అనుశీలించి, అన్నిటినీ సమన్వయంచేసి అన్నిరకాల సందర్భాలకీ పరిష్కారాలకీ తయారుచేసి పెట్టినట్లు మాట్లాడుతారు. సర్వజ్ఞత్వం ఉందని ఎప్పుడూ అనుకోని ఒక మనిషి మీద సత్యం, వివేకం వీటితో తన పరిశోధనలని ఎన్నటికీ ఆ పని ఒక వ్యక్తి మీద ఇలా నింద మోపటం ఎంత అన్యాయం! ఆయన పరిపూర్ణ వ్యక్తి. కాని, ఆయన సంపూర్ణవాది కాదు. ఆయనని మించిన ఆశయవాది లేడు; కాని, ఆయనకన్నా లౌక్యంగా ఉండేవారూ తక్కువ. మౌలికసత్యాలనే ఆయన బోధించేవారు. అయితే ఆయన తయారుచేసిన ప్రతి కార్యక్రమంలోనూ 'ఒకసారి ఒక మెట్టు చాలు' అనే పద్ధతిని అనుసరించేవారు.

మనం రెండు దశాబ్దాలుగా అనుసరిస్తున్న పారిశ్రామికాభివృద్ధి విధానం గాంధీ సిద్ధాంతాలకి వ్యతిరేకం అని కొందరు వాదిస్తారు. ఈ ఆరోపణతోబాటు కుటీర పరిశ్రమలు మాత్రం చాలు అనే ఈ వర్గం

(72వ పేజీ చూడండి)



ముఖంమీది ముసుగు మహమ్మదీయులతో భారతదేశానికి వచ్చినదని ఎందరో నమ్ముతారు. కొంత కాలంకింద ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ముసుగుని వదలటం మంచిది కాదంటూ ఒక తమిళదేశపు రచయిత రాసిన పుస్తకం సమీక్షపడింది. సమీక్షని పటి ఆ రచయిత ప్రాచీన తమిళ సమాజంలో ఎందరో వనితలు ముసుగులు ధరించేవారని నిరూపించే ఉదాహరణలని తమ పుస్తకంలో పేర్కొన్నట్లు వూహించవచ్చు! ముఖాన్ని కొన్ని వేళలలో కప్పుకొనటం చాలా సమాజాలలో ఉంది. ప్రాచీన మధ్యధరా ప్రాంతపు సమాజాలలో ఈ అలవాటు బాగా వాడుకలో ఉన్నట్లు చరిత్ర పుస్తకాలు చెప్తాయి. 'టవ్‌రెగ్' అనే ఉత్తరఆఫ్రికాతెగలోనేటికీమగవారు...ముఖాన్ని కప్పుకుంటారు! (అయితే టవ్‌రెగ్ పురుషులు చాలా పౌరుషం కలవారు! ఆడంగివారుమాత్రం కాదు! సిక్కులు పొడుగు జుట్టుని ముడివేసుకున్నంతమాత్రాన వారు నెమ్మదివారు కారనే విషయాన్ని కొందరు బ్రిటిషు రచయితలు కూడా నొక్కి చెప్తూ ఉంటారు....) అతి ప్రాచీన కాలాలలో ముఖంమీది ముసుగు అలవాటు భారతదేశానికి పశ్చిమ ఆసియా ప్రాంతాల నుంచి వచ్చినదని కొందరి అభిప్రాయం. సుప్రసిద్ధ మనశాస్త్రజ్ఞుడు హటన్ పర్దా భారతదేశంలో ఆర్యులకి పూర్వంనుంచీ ఉన్నదనటానికి ఆధారాలు ఉన్నాయని రాశాడు. పారశీక ప్రభావాలు కూడా ముసుగు వాడకాన్ని పెంపొందించాయని చరిత్ర పుస్తకాలలో చదువుతాము.

తమిళ గ్రంథాలలోనేకాక సంస్కృత గ్రంథాలలో కూడా ముసుగుకి సంబంధించిన ఉదాహరణలు ఉండటంలో ఆశ్చర్యంలేదు. సాంస్కృతిక ప్రభావాలు చాలా అప్పుడూ ఇప్పుడూ కూడా ఉత్తరంనుంచి దక్షిణానికే అధికంగా సోకుతూ వచ్చాయి.

భాసుడి 'ప్రతిమా నాటకం'లో రాముడు అడవిలోకివెళ్ళేముందు సీతాదేవితో ముఖంమీది ముసుగుతీసి అక్కడ పోగవబోయే జనానికి దర్శనం ఇవ్వమని చెప్తాడు. ఈ ముసుగుని కవి 'అవగుంఠనం' అన్నాడు. సీతాదేవి ముసుగు తీసినప్పుడు రాముడు 'యజ్ఞ యాగాదుల సమయంలో, వివాహాలలో, అడవులలో, ఆపత్సమయాలలో స్త్రీలు ముఖాలని బయలు పరచవచ్చు'నని అంటాడు. ఇదే నాటకంలో దశరథ మహారాజు భార్యలు తమ వైధవ్యం తర్వాత ఆయన విగ్రహం ఉన్న భవనంలోనికి ముసుగుతో వెడ్తారు.

సంసార స్త్రీలే కాక వేశ్యలు కూడా మేలిముసుగు ధరించే వారవటానికి నిదర్శనం మృచ్ఛకటికంలో వసంతసేన తల్లి కూతురిని అవగుంఠనంతో బయటికి వెళ్ళమని చెప్పే సంఘటనే. అవగుంఠనాన్ని రాఘవభటుడనే వ్యాఖ్యాత 'సశిరో ముఖప్రావరణ'మని విశదీకరించాడుట (అంటే 'తలనీ, ముఖాన్నీ కప్పే' దని) భారవి ముసుగుని 'వ్యాపాంశుకం' అన్నాడుట. కాళిదాసు, బాణుడు మొదలైనవారి గ్రంథాలలో కూడా 'పర్దా'కి సంబంధించిన వర్ణనలు ఎన్నో వున్నాయి.

వీటన్నిటినీ బట్టి ప్రాచీనకాలలలో వనితలు బహిరంగ ప్రదేశాలలో, పెద్దవారి ముందు, అపరిచితుల సమక్షంలో మొహాలని కప్పుకునే వారని వూహించవచ్చు. కవులు ముసుగులని అవగుంఠనం నిరంగి, నీరంగికా, ముఖపటం, శిరోవస్త్రం, యవనికా అని వర్ణించారని తెలుస్తున్నది! ముసుగులు రకరకాల రంగులలో వలలు వలే కూడా ఉండేవిట. 'రక్తాంశుకేన కృతశిరోవగుంఠనా, అరుణాంశుకావగుంఠితముఖీ, నీలావగుంఠనేనేవ, జాలికాది పటాదిమయశిరోవస్త్రమ్' వగైరా...

— ఉతరీయాకృతావగుంఠనధారి

ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలంటే..?

'ప్రపంచం మూడు గొప్ప ప్రమాదాలని ఎదుర్కొనబోతున్నది. మొదటిది అణు సంగ్రామం. రెండవది అపరిమితమైన జనాభా. మూడవది నిరుద్యోగం'—అని 'ఇన్‌వెంటింగ్ ది ఫ్యూచర్'లో డెన్నిస్ గాబొర్ అన్నారు. ఇది అక్షరాలా నిజం! అణు సంగ్రామం వచ్చినా, నిరుద్యోగం ఏర్పడినా దానికి ముఖ్యకారణం అధిక జనాభా!

'జనాభా పెరుగుదల అంటే తక్కువ అభివృద్ధి, ఎక్కువ సమస్యలు' అన్నది మన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీగారి నినాదం.

ఒక పసికందు భూమ్మీద అడుగు పెడుతున్నదీ అంటే - ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దానికి ఉజ్వల భవిష్యత్తు అనేది కనిపించడంలేదు. పిల్లల భవిష్యత్తును తల్లిదండ్రులు తీర్చిదిద్దాల్సి వుంది. అనురాగాన్ని పిల్లలందరికీ సమంగా పంచాలి. ఆహారాన్ని పంచాలి. ఆరోగ్యాన్ని పంచాలి. సర్వమూ త్యాగం చేస్తూ వుండాలి. చివరికి తల్లిదండ్రులకి మిగిలేది ఏమిటి? నిస్సారమైన బ్రతుకు, కష్టాల పరంపర!

తమ తమ పరిమితి ఎంతో తలిదండ్రులకు తెలుసు. చూస్తూ చూస్తూ సంతానాన్ని నరకకూపంలోకి దించే అధికారం వారికి లేదు. అది వారికి న్యాయం కాదు. భూమ్మీద నివసించడానికి పరిస్థితులు బాగోలేవని శిశువు జన్మించడం మానదు. అన్ని సమ్మెలులాగే 'జననసమ్మె' అమలు జరపగల స్వాతంత్ర్యం వాటికి లేదు. అందు చేత తల్లితండ్రులే ఈ విపత్తును తప్పించాలి. లేకపోతే సంతానం 'ఘెరావ్'లకు బలికావాల్సిన సమయం తలిదండ్రులకు వస్తుంది!

జనాభా పెరుగుదల కేవలం ఒక కుటుంబ సమస్య కాదు. సంసారం సుఖమయం కావడానికి కొద్దిమంది పిల్లలు ఎంత అవసరమో — దేశం సుభిక్షంగా వుండాలంటే తక్కువ ప్రజలూ అంతే అవసరం. అలానే ప్రపంచానికి కూడా!

జననాలు ఎక్కువవుతున్నాయి. మరణ సంఖ్య నానాటికి క్షీణిస్తున్నది. ఇరవయ్యవ శతాబ్దం దాటేసరికి పరిమితమై వున్న ఈ భూమిమీద ఒక మనిషికి ఎంత స్థలం లభిస్తుంది? అనేది ప్రశ్న. లెక్కవేసిన శాస్త్రజ్ఞులు—ఈతరం దాటితే మనిషి ఒకటికి ఒక చదరపుగజం మాత్రం మిగులుతుంది—అన్నారు. మనిషికి ఒక్క చదరపుగజం మిగిలితే అతని నిత్యావసరాల మాటేమిటి? అతను వుండడానికి ఇల్లు కావాలి. తినడానికి తిండి కావాలి. ఇల్లు కట్టుకునే దెక్కడ? ఆహారం పండించే దెక్కడ? భూమ్మీద వున్నది మనుష్యజాతి ఒక్కటే కాదుగా! ఇంకా ఎంత జీవకోటి వుంది? వాటి సంగతేమిటి?

ఇప్పుడు మనకి ఇన్నిప్రశ్నలు వేసుకోవలసిన అగత్యం లేకపోతున్నది. కారణం, మనం ఇంకా ఈ ఇబ్బందులకి ఎరకాకపోవడమే! సత్వరచర్యలు తీసుకోకపోతే మనం కాకపోతే మన సంతతి అయినా ఆ పరిస్థితిని ఎదుర్కోవడం ఖాయమని శాస్త్రజ్ఞులంతా చెవినిల్లు కట్టుకుని పోరుతున్నారు.

భూమిమీద స్థలం లభించకపోతే—సముద్రాలున్నాయి. వాటిపైనే నివాసాలు ఏర్పరచుకోవచ్చు. ఆహారంగా చేపలినీ తదితర జలచరాల్నీ తీసుకోవచ్చు—అనే వాదం కూడా ఒకటుంది. జె. బి. ఎస్. హాల్డేన్ ఈ విషయాన్ని ముందుగానే ఆలోచించి వుంచారు. అంతరిక్షయాత్రలు అప్పుడు ప్రయోజనాత్మకంగా వుంటాయని కూడా ఒక ఆశ!

పెరుగుదలని క్షుణ్ణంగా పరిశీలించిన ఒక శాస్త్రజ్ఞుడు భారతదేశం గురించి అతి భయంకరమైన భవిష్యత్తును వూహించారు. మనదేశంలో జనాభా పెరుగుదల ఇదే స్థాయిలో వున్నట్టయితే—పంటలు ఎంత పుష్కలంగా పండినా, విదేశీ సహాయం ఎంత ముమ్మరంగా లభించినా, ఇరవయ్యవ శతాబ్దం అంతంలో ఆకటి చావులు తథ్యం అన్నారు! అనేకమంది ప్రజ 'అన్నమో రామచంద్రా' అంటూ నాశనమైపోతారని సూచించారు. ఆసియా మొత్తంమీద ఈసంఖ్య కోట్లకు మించుతుందని ఆయన అంచనా! జనసంఖ్య తగ్గడానికి ఇంత దారుణమైన మార్గమా?

దీనినిబట్టి వూహించినా, మనకు మనం లెక్కలు కట్టుకుని యదార్థాన్ని తెలుసుకున్నా— ఈ భయంకర నరకం మన కళ్ల ముందు కనిపించక మానదు!

'సంతానంవల్ల కలిగే సుఖాన్ని దూరం చేసే ఈ మందులు ఎందుకు, కాల్చనా!' అని ఫ్రాయిడ్ వాదించాడు. 'మా సంస్కృతి అలాంటిది. మా తాతలు తండ్రులు మమ్మల్ని కని తనివితీరా మురిశారు. అలామే మెందుకు ఆనందించకూడదు?' అని అనుకునే తెగ ఈ వాదాన్ని సమర్థించవచ్చు.

ఆకలిగా వున్నవాడు పిడికెడు అన్నం కోసం ప్రాకులాడుతాడు. కడుపునిండినవాడు ఇంకావుంటే బావుణ్ణు అనుకుంటాడు. లేకపోతే అతను మనిషేకాడు.

పరిస్థితులను అర్థం చేసుకోగల్గితే —ఒక కుటుంబంలో 2. 3 పిల్లలు మించినప్పుడు ఆ భారాన్ని భూమి మొయ్యలేదు అంటున్నారు. ఈ విషయాన్ని పెడచెవిని పెట్టినప్పుడు—ఇప్పుడు దేశాలు — దురాక్రమణలు అంటున్నాముగాని, అప్పుడు పూట పూటకీ తిండికోసం ఒక యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో ప్రపంచంలోని ప్రతిమనిషీ పాలు పంచుకుంటాడు!

జనాభా పెరుగుదలని దృష్టిలో వుంచుకుని ఎలుకలమీద ఒక ప్రయోగం చేయడం జరిగింది. బాగా తినమరిగిన ఎలకలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరిగి పెరిగి ఒక నిర్ణీత సంఖ్యదగ్గర ఆగిపోయాయి. అప్పుడు అవి కొట్లాట ప్రారంభించ

క్షీణదశకు వచ్చాయి. ఎలకలకన్నా మనుషులు వివేకవంతులు. ఎలకలు తినడానికి వుండీ కీచులాడుకున్నాయి. ఆ పరిస్థితుల్లో మనుషులకు తినడానికి వుండదు. మరి, వీరి సంగతి అప్పుడు ఎలా వుంటుందో చెప్పలేం. ఆ దుర్దశకు రాకుండా జాగ్రత్త పడటమే ప్రధాన కర్తవ్యం!

గర్భ నిరోధాన్ని ఆమోదించని వారు ఎక్కువ సంఖ్యలో రోమన్ కాథలిక్కులు కనిపిస్తున్నారు. వీరి మతానికి సంతాన నిరోధం విరుద్ధం. ఇక మహమ్మదీయులున్నారు. వీరి మత సాంప్రదాయం జనాభా సంఖ్యని పెంచడాన్నే ప్రోత్సహిస్తూ వుంటుంది. ఇవి తెగని సమస్యలు. తక్కిన ప్రజలంతా ఆమోద యోగ్యమైన సూచనలని పాటిస్తూనే వున్నారు. ఒకళ్ళు సంతానాన్ని కనిపారేస్తూ వుంటే — మిగతావాళ్ళకి నిబంధనలు అన్నప్పుడు కడుపుమంటగా వుండకపోదు!

గర్భ నిరోధం ప్రకృతి విరుద్ధమని విమర్శిస్తూ ఆ మధ్య పోప్‌గారు ఈ ప్రక్రియని తీవ్రంగా ఖండించారు. దానిని చట్టబద్ధం చెయ్యాల్సిన అగత్య మేర్పడుతుందన్నప్పుడు ఆయన కన్నీరు కూడా కార్చారట! (అయితే ఇది ఆయనకి అలవాటే అని కూడా తెలియ వచ్చింది.)

సంతాన నిరోధ మంటే స్త్రీజాతిని అవమాన పర్చడం అని ఆయన అన్నారు. కృత్రిమ గర్భనిరోధం అంటే నీతి తప్పి వ్యవహరించడమనీ, సృష్టికి ద్రోహం తలపెట్టడమనీ, దానివల్ల రాజకీయ పరమైన విపత్తుకూడా సంభవిస్తుందనీ ఆయన భయపెట్టారు!

గర్భ విచ్ఛిత్తి రూపంలో కంటే — గర్భనిరోధం రూపంలో కుటుంబ నియంత్రణ కొనసాగినప్పుడు అది ధర్మవిరుద్ధం కాదని కొందరు ప్రవక్తలు ప్రవచించారు. చాల మంది ఒప్పుకుంటున్నారు.

ధర్మ పన్నాలు కన్నా — కుటుంబం, లేదా దేశం, లేదా ప్రపంచం భవిష్యత్తు ముఖ్యమని నిజాన్ని గ్రహించిన ప్రజలకి అనిపించకపోదు!

1951లో మన దేశం జనాభా 36 కోట్లు మాత్రమే. పదిహేనేళ్ళ తర్వాత 50కోట్లకు దాటింది. ఇప్పుడు 53 కోట్లుంది. ఇరవయ్యవ శతాబ్దం అంతానికి 150కోట్లు దాటుతుంది!

దేశంలో దాదాపు పదికోట్లు సంతానార్హులైన దంపతులున్నారు. ఈ దంపతులంతా ఒక్క పిల్ల, లేక పిల్లవాడితో సరిపెట్టుకుంటే వెయ్యికి తొమ్మిది మంది చొప్పున మాత్రమే జనభా పెరుగుతుంది. ఇద్దరితో సరిపుచ్చుకుంటే పదిహేడు మంది అవుతారు. ముగ్గురయితే సంఖ్య ఇరవయ్యయిదు అవుతుంది. ఇప్పుడున్న నిష్పత్తి 41.


మన దేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం సఫలమవుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికి ఇరవైలక్షల జననాలు తగ్గాయి. ఇదేవిధంగా అమలు పరచినట్టయితే ఏటా కోటి సుమారుగా జననాలు తగ్గుతాయి. ఇప్పుడు సంవత్సరానికి కోటీ ముప్ఫయిలక్షలు పెరుగుతున్న ఈ జనాభాని చూస్తున్నప్పుడు భయం కల్గినా — ఈ లెక్కలు కొంత ఉపశమనాన్ని కల్గించక పోవు! ఆ చరణలో వున్నప్పుడే ధైర్యం కల్గుతుంది.

ముగ్గురుకంటె ఎక్కువ పిల్లలున్న తలిదండ్రులకి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కొన్ని శిక్షల్ని విధించింది. ఆపైన గర్భాన్ని ధరించిన స్త్రీలకు 'మెటర్నిటీ లీవు' ఇవ్వకూడదని కూడా కొన్ని ప్రభుత్వాలు నిర్ణయించుకో జూస్తున్నాయి. ఇలాంటి అక్రమ పద్ధతులు సంతాన నిరోధాన్ని ప్రోత్సహించలేవు. అసలే జీవనభృతి గడవని మధ్యతరగతి ప్రజ - మలమల మాడిపోవడం తప్పితే ఇలాంటి వాటివల్ల ప్రయోజనం వుండదు.

యువతులు ఇరవయ్యేళ్ళ తర్వాత, యువకులు ఇరవయ్యయిదేళ్ళ తర్వాత వివాహం చేసుకుంటె ఎంతో కొంత జనాభా సంఖ్య తగ్గుతుందన్నది నిజమే కావొచ్చు. కాని, దానివల్ల చాలా ఇబ్బందుల నెదుర్కోవలసి వస్తుంది. యువతీ యువకుల్లో నైతిక పతనం ఆరంభం కావొచ్చు. వ్యభిచారం పెరగవచ్చు. చట్ట విరుద్ధమైన గర్భస్రావాలకి అవకాశం వుంది. ప్రాణాలకికూడా ముప్పు. ఇవి నిర్వివాదాంశాలు.

మన దేశంలో గర్భనిరోధ కార్యక్రమం జయప్రదం కాక పోవడానికి చాలా కారణాలున్నాయి. అనాదిగా మన దేశంలో సెక్సు విషయాలు చాలా రహస్యంగా వుంచబడుతున్నవి. ఆ విషయం తలుచుకుంటేనే చాలు సిగ్గుతో ముడుచుకుపోయే మనుషులు మనకున్నారు. దీని గురించిన సంభాషణ అనేది పెద్ద తప్పుగా ప్రచారం పొందింది. సంఘంలో ఇలాంటి ఆచారం వున్నందువల్ల గర్భ నిరోధక సాధనాల్ని కూడా పేరు పెట్టి పిలవలేక పోతున్నారు! ఇది నిజంగా విచారించవలసిన విషయం. సంతాన నిరోధాన్ని అమలు జరపాలని మనసారా వాంఛించినా — ఇది సెక్సుకు సంబంధించిన విషయం గనక — ఈ తక్కువ రకపు అభిప్రాయం మనుషుల్ని అంతగా ప్రోత్సహించలేక పోతున్నది. మత సంబంధమైన ఆంక్షలు, మూఢ విశ్వాసాలు వీటికి బలాన్ని కూరుస్తున్నాయి. ఈ అభిప్రాయాలున్నంత వరకు మన సంతాన నిరోధ కార్యక్రమం జయప్రదం కాదు! ప్రజలు మారాలి. అందుకు ప్రభుత్వం శ్రమ పడాలి.

— సి. సత్యవతి ●



రచయిత్రులంటే చదువరులకి ఎక్కువ అభిమానం ఎందుకు!



రచయిత్రీవిజయమ్

శివకుమారి

'ఏవండోయ్ శ్రీ వారూ—మీ అభిప్రాయమేమిటీ?—'

'దేన్ని గురించీ?—'

'మా రచయిత్రుల రచనలంటేనే పాఠకులు మక్కువ పడుతున్నారు...'

'అని ఎవరన్నారూ?—'

'మీరు కాదులెండి. మా రచనలు విడవక చదివే పాఠకులు, మా రచనల్ని అభిమానించే పాఠకులు'

'మీ రచనల్నా?—అభిమానించని. మధ్య నాకేం?—'

'అదికాదు—మీరూ రచయితే కనక అడుగుతున్నా, మా రచనలంటే ఎక్కువగా ఎందుకు ఆసక్తిగా వున్నారూ?—అనీ.'

'అదీ ప్రశ్నే?—రచయిత్రులు గనక, అంటే ఆడవాళ్ళు గనుక.'

'మరీ అంత చులకనగా మాటాడకండి, ఇదేం మీలాగా పంతులు ఉద్యోగం కాదు. అమ్మాయిల్నిచూసి మార్కులెయ్యటానికి,'

'అయితే మరేమిటంటావ్?—'

'ఇంతకాలమూ చరయితల రచనలే చదివారు. చాలా కాలంగా చదివారు ఇంకా ఎంతకాలం చదువుతారూ? — విసుగెత్తిపోయారు. షడ్రుచులతో శాకపాకాలు హితవుగా వండి వార్చి వడ్డించగల ఈ చేతులతో కలం పట్టుకున్నారు మహిళలు, రచనా వ్యాసంగానికి నడుం కట్టారు. నవరస భరితమయిన సాహిత్యం కురిపించారు. నలుగురినీ మెప్పించారు...'

'అవునోయ్ నీ ఉపన్యాసం వింటూ వుంటే గుర్తొస్తోంది. ఈనాడుపత్రికలలో తెగరాసి పారేస్తున్నారోయ్ మీ రచయిత్రులు. ఎక్కడ చూనా...'

'ఏం మీ మీద ఏమేనా రాశారా?—ఎందుకలా విరుచుకు పడతారూ?—'

'అది కాదోయ్, మీ మటుక్కి మీకు ఆడవాళ్ళ పత్రికలంటూ వేరే ఉన్నాయ్ కదా, వాటికి రాసుకోకూడదూ?—మా పత్రికలలో కూడా ఎందుకలా పేజీలకి పేజీలు మింగుతారూ?—'

'మీరు రాయలేరేమోనని సాయంచేసి పెడుతున్నాం. మరీ అంతలా కుళ్ళుకుపోతారెందుకనీ?—నాలుగురాళ్ళు ముట్టజెపుతామంటే ఆడవాళ్ళ పత్రికలకి మీరు మాత్రందాయరూ?—ఆడవాళ్ళ పేర్నెట్టుకుని మీరెన్ని రాయలేదూ?—'

'అలాగని చెప్పి మమ్మల్ని మరీ అణగదొక్కేస్తే ఎలా? — మీ రచయిత్రు



అంతా ఈనాడు మరి టాప్ ర్యాటర్సయి కూచున్నారోయ్. పత్రికలలో, రేడియోలో, సినిమాల్లోనులో, మీటింగుల్లో, మహా సభలలో ఎక్కడచూసినా మీరేనాయె. మీ రంతా అంత హైలైట్సులో వుండటంతో పాఠకజనం అసలు మా రచయితల పేర్నే మరిచి పోతున్నారోయ్.'

'అది మీ ఖర్మా, మా అదృష్టం'

'ఇంతకీ మీ రచనలలో అంత ప్రత్యేకత ఏవిఁటేడ్సిం దంటావ్—?'

'అలా పెడసరంగా మాటాడకండి. మీ ప్రశ్నకి సమాధానం ఒక్కమాటలో చెప్పటం కుదరదు. ఒక్కొక్క రచయిత్రిలో ఒక్కొక్క ప్రత్యేకత...'

'ఆహా—వోహోహో!—మీ ప్రత్యేకతల్ని మీరే మెచ్చుకోవాలి. ఒక కుమారీ రచయిత్రి—ఇంకా బొడ్డూడిందో లేదోగానీ ఫామిలీ ప్లానింగు గురించీ, సెక్సు సమస్యల్ని గురించీ పెద్ద ఆరిందాలాగా తరచి తరచి రాస్తుంది. మరొక మహా రచయిత్రి సంగతి చెప్పమన్నావా?—'

'మళ్లీ మధ్యనో ప్రశ్న కూడా ఎందుకూ?—కడుపులో కుళ్లు కక్కండి—'

'ఆవిడేం— ఏవో నాగులు కథలు గిలుకుతుంది. ఆ నాలుగూ ఒక కథల సంపుటీ, అవే కథలు గుదిగుచ్చి మళ్లీ ఒక నవలగా రాసి పారేస్తుంది. దీన్నిబట్టే తెలుస్తుంది మీ రచయిత్రులు ఎంతలో వున్నారో!—'

'ఏవండోయ్, ఏ విషయంలోగాని మంచి తీసుకునే వాళ్లకి మంచే కనబడుతుంది. మీ దృష్టిలో ఏదో దోషం వుంది. అందుకే ఇలాంటివి మా[illegible]

[illegible]. ఏవేళో ఒకళ్లిద్దరు తప్పు చేశారని ఆ నేరం మాకందరికీ అంట గట్టడం న్యాయం కాదు. ఇక ఆ సెక్సు వ్యాపా లసంగతా? ఏమో—ఏ శిష్యురాలి పేరుతోనో లైంగిక సమస్యల్నిగురించి మీరే రాశారేమో?—'

'మరీ అంత ఘోరనేరం నానెత్తిమీద వెయ్యకు. అసలుసగంతి చెప్పమన్నావా?—'

'ఇంకాఅసలుకుళ్లు వేరేవుందేవిఁటీ—'

'లేకేం?—వినూమరి — ఈ రోజుల్లో ఆడపిల్లలికి పెళ్లిళ్లు కావటం మరీ కష్టంగా వుందా? — ధరవరులన్నిటితో పాటూ కట్నాలు కా ను క లూ మరీ టాప్‌కి పోయాయా?'

'ఇది పరిచయమా?—ఉపోద్ఘాతమా?— చెప్పేదేదో సరిగా చెప్పండి'

'నామిత్ర రత్నానికి సరిగ్గా ఇదేసమస్య ఎదురయింది. వాడూ ఢజనుమంది ఆడ పిల్లలతండ్రి. పిల్లలు ఎదిగి కూచున్నారే గావి, సంబంధాలే రాలే. ఇది పనికాదని మావాడేం చేశాడూ?— తన కుటుంబ చిక్కుల్లో కాసిన్నితీసి ఒక నవలగా రాసేశాడు. వాళ్ల పెద్దమ్మాయి పేర ఒక పత్రికకి పంపాడు. పత్రికలో నవల పూర్తయ్యేసరికి కట్నంఖర్చు లేకుండా పెద్దపిల్లకి పెళ్లయి ఎంచకా కాపురానికెళ్లింది.'

'అంటే విూరనేది...'

'పాఠకులకు రచయిత్రులంటే' ఉత్త గ్లామరు తప్ప నిజమయిన అభిమానం ఏకోశానా లేదు. చాలామంది రచయిత్రులు అస్సలు అందంగానే ఉండరుట కనక— ఈరచనా వ్యాసంగంతో ఫేస్ పౌడరు రాసుకున్నట్టు లేని గ్లామరు తెచ్చిపెట్టు కుంటున్నారు.'



[illegible] తెలుగు తో [illegible] అంటారు. మీకే కాదులెండి చాలామంది రచయితలకి మా మీద గుర్రుగా వుంది. మేమేదో వాళ్ల కీర్తి ప్రతిష్ఠలకు అడ్డు తగులుతున్నామని.'

'అక్కడికి మీలో మహా సామరస్యం, సహకారం ఏడ్చినట్టు. అయినా ఇంకెప్పుడు మిమ్మల్నెవరడ్డగలరులే ?— అబ్బో— కావలిసినంతమంది ఫాన్సూ, వాళ్లు కురిపించే అంతులేని ఉత్తరాలూ...'

'ఏవిఁటీ ?—ఆ ఉత్తరాలని గురించిన విసురేవిఁటీ ?'

'నీకుమాత్రం తెలియదా ఏం ?— మీరు సృష్టించిన ఫలానా పాత్ర నాకెంతో నచ్చింది, మిమ్మల్నెలా అభినందించాలో తెలీటం లేదు. మిమ్మల్నొకసారి స్వయంగా కలుసుకోవాల నుంది—అని ఒకడు. మీకు వివాహమయినదా ?—అని మరొకడు. మీకు అభ్యంతరము లేకున్న నన్ను చేసు కొందురా ? — అని ఇంకొకడు. ఇలాంటి ఉత్తరాలుచూసి మిమ్మల్ని పట్టుకున్నవాడు ఎవడూరుకోగలడూ ?'

'అదా మీ ఏడుపూ ?—మీ మానసోద్యో దలు కాపాడే భారం నాదీ. హామీ ఇస్తున్నా. తీ సు కో ం డి. అయితే ఒక్క సంగతి మాత్రం నిజం. ఇది రచయిత్రుల యుగం. మీరు ఎన్ని అవస్థలు పడ్డా మా కీర్తికేం ఢోకాలేదు. మా పేరు ప్రతిష్ఠలకేం లోటులేదు. మాలో జనరంజకంగా రాయగల చేవ వుంది. శక్తి సామర్థ్య లున్నాయ్. మా రచనల కెప్పుడూ ఆదరణ లభిస్తుంది. అనాది నించీ మమ్మల్ని వంట పొయ్యిలో అణగదొక్కేశారు. బానిసలుగా చూశారు. బొత్తిగా ఎల్తిరిల్లకుండా మమ్మల్ని తొక్కిపారేశారు...'

'అందుకని ఇప్పుడు పైకి తేలిపోతా మంటారా?—'

'మీరే చూస్తూ వుండండి, కొద్ది రోజుల్లో ఏం జరుగుతుందో—'

'ఏం? ఏం జరుగుతుందేం?—'

'ఏం జరుగుతుందా?—మీరు మా చాటున తల తిప్పుకోవలసిన పరిస్థితి వస్తుంది. అప్పుడు ఆడవాళ్లని—ఫలానా గుమాస్తాగారి భార్య అనరు. ఫలానా పంతులుగారి పెళ్లాం అనరు.'

'మరీ ?—'

'మిమ్మల్నే—ఫలానా రచయిత్రి భర్త అని గుర్తిస్తారు.'

'అవా—' ●

ప్రశ్నావళి ?

కె. రామలక్ష్మి

జి. ఎస్. ఆర్, హైదరాబాదు

నలుగురు పురుషులు ఒకే స్థలములో పరస్పరము అర్థం చేసుకొని ఉండగలరు కాని, స్త్రీలు ఉండడం కష్టతరం అవుతుంది...

మరి హాస్టల్సులో ఎలా ఉంటున్నారుట?

జి. పి. ఆర్, విజయవాడ

స్త్రీలు కండ్లకు ఉపయోగించు కాటుక తయారుచేయు విధానమేది? పొగ పేస్టు కాకుండా ఏంచేయాలి?

కొంచెం దళసరి వత్తివేసి ఆముదంగాని నెయ్యిగాని దీపం పెట్టి గాలి రానిచోట ఉంచాలి. ఆ దీపం మీద ఆనకుండా కొంచెం దగ్గరగా ఉండేలా శుభ్రమైన పళ్లెం బోర్లిస్తే మసి దాన్నిపట్టుతుంది.

యన్. జి. ఎమ్, ఖర్గపూరు

నలుపు నన్ను ఆకర్షిస్తుంది దేందుకో

కాని అందరికీ మేచ్ కాదు.

జె. ఆర్. కె, కాకినాడ

మనకష్టం ఎదుటివాడికెంతకీ అర్థం కాదు. అవునా? .

అవును. జోడు మన్నెక్కడ కరుస్తోందో ఎదుటివాడి కెలా అర్థం అవుతుంది.

బి. ఎమ్. ఆర్, రాజమండ్రి

తప్పుచేసినట్టు ఒప్పుకున్నా క్షమించరు కొందరు. అప్పుడే మహా కోపం వస్తుంది.

అదిసరే. నిన్న చేసిన తప్పు ఒప్పుకున్నందుకు నిదర్శన ఏమిటి? ఈ రోజు చేయకపోతే కదా!.... కోపం వచ్చి మళ్ళా అదే చేస్తే లాభం ఏమిటి?

జి. ఆర్. ఆర్, మద్రాసు

మిమ్మల్ని పూర్తిగా అర్థంచేసుకున్నాను!

కొద్దిగానైనా అర్థం చేసుకోవడం గొప్ప! గొప్పగా అపార్థం చేసుకున్న కంటే? ఏమంటావు బ్రదర్?

యస్. [illegible]. ఎమ్. కె, [illegible]పురం

స్త్రీల ఉన్నతిని అభ్యున్నతిని ఓర్చుకోలేని పురుషులను ఏమనాలి?

ఏమీ అనక్కరలేదు. వారిని లెక్క చేయకుండా వూరుకుంటే చాలు.

స్నేహం అనే పదానికి అర్థం ఏమిటి?

డబ్బు అప్పుఅడక్కుండా ఉన్నట్టయితే జీవితాంతం కొనసాగే తీయని అనుబంధం.

పి. పి. ఆర్, హైద్రాబాదు

మనదేశం అప్పుచేయని దేశంలేదు కదా! ఒక్కసారి అన్నిదేశాలూ ఒక్కుమ్మడిగా 'మా అప్పు మాకు తీర్చు' మని అంటే మనగతి ఏమవుతుంది అక్కయ్యగారూ?

అదేం మనకు తెలియని మంత్రమా తమ్ముడూ ....అందరికీ బెబ్బెబ్బే!!

నిర్మించుకున్న ఆశా సౌధాలు కూలిపోతే అప్పుడతని బ్రతుకెలా ఉంటుంది?

కూలిపోయినవి ఆశాసౌధాలేగా. మళ్లీ వోర్పుగా నేర్పుగా నిర్మించుకునే ప్రయత్నాలు చేయాలే గాని బ్రతు కెలాగో అయిపోవడం ఎందుకు?

వి. జి. ఎస్, బొంతిగుమ్మి

బుద్ధుని వంటి మహాపురుషుడే తన ఘనతకై ఇతరులను శరణార్థులుగా చేసుకొనుచున్నప్పుడు అతను తన ప్రశస్తికై పాటు పడుటకాదా?

అంతేమరి! నా పబ్లిసిటీ ఆఫీసరు గైరుహాజరు లేకుంటే గొప్పగా (నా!) నా తరపున సమాధానం యిస్తే ఎంత బాగుండును! అనిపించింది. ఎవరి గొప్ప వారు చాటుకోకపోతే ఈనాడే కాదు బుద్ధుని నాడు కూడా గతిలేదు అన్నమాట! అంతేకదూ?

పి. ఎస్. ఎమ్, చిట్వేలి

కష్ట సుఖాలను కావడికుండలతో పోల్చడంలోకల సారాంశమేమి?

కావడి సుఖంగా మోయ కల్గడానికి రెండు కుండల బరువూ సమానంగా ఉండాలి. ఎక్కువ తక్కువ లుంటే బాలెన్సు కుదరదు. జీవితం అంతే. అన్నీ సమానంగా ఉంటే హాయిగానే ఉంటుంది. సుఖాలో కష్టాలో ఎక్కువ తక్కువలైతే — వస్తుంది చిక్కు.

ఎమ్. ఎస్. ఆర్, కాళహస్తి

వివాహం అనే భావి సతీమణికి అందానికి ప్రాధాన్యం యివ్వమంటారా? ధనానికి ప్రాధాన్యం ఇవ్వమంటారా?

ధనం ఉన్నవాళ్లు అందంగానే ఉంటారు అంటారు పెళ్లి కావలసిన కుర్రవాళ్లు!!

ఎమ్. ఎస్, వరంగల్లు

ఒక వ్యక్తి మంచి చెడులను అతను మరణించిన తర్వాతనే చెప్పుకుంటారు. ఎందుచేత?

బ్రతికుండగా నిజం చెప్పుకుంటే ఏమైనా అనుకోగల ప్రమాదం ఉంటుంది కదా! అందుకు.

ఏ. జె, అనంతవరం

మీ రెలా ఉంటారు?

బాగానే ఉన్నాను!? పొరపాటు. ఉంటానవాలి కాబోలు!

ఎస్. వి. ఎస్, దుర్గ్

నాకు మనస్సులో ఉన్నమాట ముఖం మీద అనేయడం, కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడడం అలవాటు ఈవైఖరి మంచిదా? కాదా?

అలాగే మీపట్ల ఎవరేనా ప్రవర్తించినప్పుడు కోపం తెచ్చుకోకుండా ఉంటే మంచిదే. కాని అది సాధ్యం కాదు. కనక మాటనేర్పు అలవరచుకోవాలి ●


ఒకపారం విపరీతం

నచ్చని పెళ్లి - కంఠానికి ఉరితాడు

కోసప్పాళయంలో విజయలక్ష్మి అనే ఆమెకు మొన్న నాలుగో తేదీన పెళ్లి అయిందట. తన వూహలన్నీ నాశన మయ్యాయనీ, తనకు వూహించిన భర్త దొరకలేదనీ, దొరికిన భర్త నచ్చలేదనీ మాంగల్యం అలంకరించిన తన కంఠానికి అయిదో తేదీ రాత్రి వురితాడు అలంకరించి, ఆత్మహత్య చేసుకుందిట.

ఆగ్రహం-హత్యా-ఆత్మహత్యా

తిరునాళ్ళకు తనతో రమ్మంటే భర్త రానుపో అన్నాడని పొన్నమ్మాల్ అనే ఆమె తన రెండేళ్ళ కొడుకును నూతిలో పారేసి, తనూ దూకి ఆత్మ



హత్య, హత్య రెండూ చేసిందట. పొలం కోత పనీ అవీ వున్నాయి. మనకి యివేకదా ముఖ్యం. ధాన్యం యింటికి చేరేసుకున్నాక ఎక్కడికెళ్ళినా ఫరవాలేదు అన్నాడట భర్త కృష్ణన్. దాంతో యిద్దరికి పోట్లాట వచ్చిందట. కృష్ణన్ కోపంతో ఆమెను కొట్టాడట. అంతే ఆమె ఆ రకంగా ప్రతీకారం చేసింది. ఇది ఆర్కోణం తాలూకా కన్‌డిగై అనే గ్రామంలో జరిగింది.

* * *

నిమ్మయప్పాడు అనే వూళ్లో 23 ఏళ్ళ విశ్వనాథం అనే అతనికి వివాహేచ్ఛ కలిగిందట. కొన్నాళ్ళు మథనపడి, చివరికి తన కోర్కె తెగించి తలిదండ్రులకు తెలియజేశారట. దరిమిలాను వారో సంబంధం చూసి, అది తమకే నచ్చకపోవడం వల్ల మరో సంబంధం చూస్తామని అన్నారట. దాంతో తనకిక యీ జన్మకి పెళ్ళియోగం లేదని భయపడి, బాధపడి, వెంటనె వురిపోసుకుని చనిపోయాడట.


తిరుచ్చి 'ఆల్ సెయింట్స్' (అంతా సాధువులే) స్కూలు హాస్టలులో వండిన సాంబారులో బల్లి పతనం వల్ల 34 మంది విద్యార్థినులు స్థానిక ఆసుపత్రిలో చేర్చబడ్డారట. చిన్న బల్లిపడి ఎంత మందినైనా చంపగలదు. పెద్దబాలశిక్షలో 'బల్లి పతనం— ఫలితాలు' జాబితాలో యీ రకం పతనాలు కూడా చేర్చడం మంచిది— కాదూ!

సీటుకోసం దత్తత

బ్రాహ్మణ కులానికి చెందిన ఒక విద్యార్థికి మెడికల్ కాలేజీలో సీటు దొరకనందువల్ల, హరిజనులకే చాలా సీట్లు కేటాయింపబడడంవల్ల ఆ విద్యార్థి తలిదండ్రులు తమ కన్నకొడుకును వో హరిజనుడికి దత్తత యిచ్చారట. తద్వారా అతనికి హరిజన విద్యార్థుల జాబితాలో సీటు వచ్చిందట. ఇది రాజస్థాన్‌లో జరిగింది. మెడికల్ కాలేజి సీటులకు ఇది రాచబాట అన్నమాట— సెహభాష్!

* * *

సిరిగిరిపల్లి అనే గ్రామానికి చెందిన ఎంజన్ అనే డెబ్బయి ఏళ్ళ ముదుసలి వ్యక్తిని ఒక స్తంభానికి కట్టి వో ఎనమండుగురు రాళ్ళతో కొట్టి దారుణంగా చంపేశారట. ఇంత అమానుషంగా అంత పండు ముసలి అతన్ని చంపడానికి కారణం కేవలం దొంగతనమట. నారాయణన్ అనే అతనికి చెందిన విరగ్గై (తెలుగులో.......) ని యితను దొంగిలించాడని అతని తోటివారు ఎనమండుగురు కలిసి యీ శిక్ష విధించి అమలు జరిపారట. మరి ఆ ఎనమండుగురికి ఏ శిక్ష విధించాలి?





మనిషి కొవ్వులోంచి సబ్బును తయారు చేయవచ్చని కని పెట్టడమేగాక వో శవంలోంచి కొవ్వు తీసి దానితో వో శాంపిల్ సబ్బును తయారు చేశారట. ఇది వుపయోగించి, బాగున్నదంటే మృత కళేబరాల నుంచి తీసిన కొవ్వుతో సబ్బు పరిశ్రమను నెలకొల్పవచ్చని తీర్మానించుకున్నారు.

విఫలప్రేమ

మద్రాసు వణ్ణార్‌పేటలో వుండే రామలింగం అనే 22 ఏళ్ళ యువకుడు వో యువతిని ప్రేమించాడట. ప్రేమ పెళ్ళివరకూ వచ్చిందట. కానీ ప్రేయసి తలిదండ్రులు వివాహానికి వప్పలేదట. మనస్సు విరిగిన రామలింగం - తాడొకటి తీసుకుని వురి వేసుకుని చనిపోయాడట. అతని తలిదండ్రులు ఆత్మహత్య వివరాలు ఎవరికీ తెలియ నివ్వకుండా అతని శవాన్ని వల్లకాటికి గుట్టుగా తీసుకునివెళ్ళి దహనం చెయ్యబోతుండగా పోలీసులు వచ్చి శవాన్ని స్వాధీనపరచుకున్నారట.

నడికట్లలో వంద-రూపాయల నోట్లు

సెంట్రల్ స్టేషనులో హవురా ఎక్స్‌ప్రెస్ దిగిన వీరాస్వామీ, అప్పారావు అనే యిద్దరు వ్యక్తులను అనుమానంమీద సోదాచేస్తే నడి కట్లలో 985 నూరు రూపాయల నోట్లు దొరికాయట. అంటే తొంభై ఎనిమిదివేల అయిదువందల రూపాయలు అన్నమాట— అంటే పదిహేను వందలు తక్కువ లక్ష!! వారిద్దర్నీ— ఆ డబ్బునూ అరెస్టు చేశారట!!

ఫాలాక్షుడు

మహమ్మదీయులలో బహుభార్యాత్వము!



కె. రామలక్ష్మి

శ్రీ ఆ కృష్ణ పరమాత్ముల వారికి పదహారు వేల మంది భార్యలు!.. ఆ నిజాము ప్రభువువారికి.. అని తాతయ్య పూర్తిగా అనకముందే అమ్మమ్మ "సరే! మీ ముఖానికీ ఒక్కర్తే చాలదనా! ఏం ముద్దూ ముచ్చటా తీర్చేస్తున్నారనీ ?" అంటూ సాగతీసేది. నిజమే. ఒక్క సత్యభామకే ఏడు వారాల నగలూ గట్రా పెట్టాడే ఇంక మిగిలిన వాళ్ళు వూరుకుంటారా? అని ఆలోచిస్తే ఆకృష్ణుడు బంగారం దొంగ వ్యాపారేనా కావాలి. మాంత్రికుడైనా కావాలి, అనిపించేది చిన్నప్పుడు. వయస్సు వచ్చాక అది వేరే సంగతి అనుకోండి. ప్రతి స్త్రీలాగా తన భర్త శ్రీరామచంద్రునిలా ఏక పత్నీవ్రత సంకల్పుడై ఉండాలని కోరుకోవడం సహజమే కదా!

అసలి బహుభార్య లేమిటి? గొడవేమిటి? అని అడిగితే ఈరోజుల్లో అర్థం కనిపించదు. ఎందుకంటారా? కొన్నిమతాల వారికీ, గవర్నమెంటు పర్మిషను (!) ఇచ్చిన వారికీ తప్పించి ఒక్కతె కంటె ఎక్కువ భార్య లుండడానికి వీలులేదాయిరి! అయితే చాలమందిలో రెండో భార్యగా చెలామణి అవుతున్న స్త్రీ పాతకాలపు భాషతో చెప్పుకోవాలంటే ఉంపుడు కత్తె అనాలి మరి. క్షమించాలి!

ఎక్కడా కూడా బహుభార్యాత్వం అన్నది ఒక వివాహ పద్ధతిగా అమలులో ఉన్నట్టు తోచదు. అవసరాన్ని పట్టీ అధికారాన్ని ఆర్థిక సౌభాగ్యాన్ని పట్టీ ఈ బహుభార్యలు కల్గి ఉండడం అన్నది వచ్చినట్టుంది. బహుభార్యాత్వం ఉన్న చోట కూడా సర్వసాధారణంగా తొలుత చేపట్టిన స్త్రీకే భార్యగా గౌరవం, ప్రథమస్థానం ఉండేది. (అందుకేగా చిన్నభార్యలు గొంతెమ్మ కోరికలు కోరడం వచ్చింది?) అలా కాకుంటే కొంతకాలం పాటు ఏదో ఒక భార్య ముద్దుల భార్యగా చెలామణి అయ్యేదనీ చెప్పవచ్చు.

అనాగరికు లనిపించుకునే అనేక జాతులలో కూడా ఈ బహుభార్యాత్వం అనే దొక రూలుగా పాటించినట్టు కనబడదు— ఆస్ట్రేలియన్, బుష్ మన్ జాతులలో తప్పించి, నిజానికి చిన్న చిన్న వ్యవసాయం చేసుకుని బ్రతుకుతూ, నాగరికతకి కడుదూరం అనిపించుకొనే— దక్షిణ అమెరికన్ ఇండియనులు, మలే కొండజాతులు అండమాను ద్వీప అనాగరికులు, సిలోన్‌లోని వడ్డాన్ ఆఖరికి మధ్య ఆఫ్రికను పిగ్మీలలో కూడా వివాహం ఏక భార్యపరంగా చెలామణి అయిందని చెప్పుకోవచ్చు.

అక్కడ కూడా గొప్పవాళ్ళు, సంఘంలో పై అంతస్తువారు అనబడే వారిలో బహుభార్యాత్వం కన్పిస్తుంది. ఆఫ్రికను తెగలలో యీ అలవాటు బహుళంగా ఉందన్నారొకసారి ప్రొ. ఎగ్రిహన్‌ఫల్స్. కళ్ళతో చూసి వచ్చి నాయన చెప్తే నమ్మకపోతే ఎలాగ? అనుకున్నాము. అక్కడ మన మహమ్మదీయులకిలాగా నలుగురి దాకా అనికూడా లేదు కాబోలు. ఉగండా ప్రభువు ముటెస్సా, లాంగోరాజుకీ ఏడు వేల మందికి పైగా భార్య లుండేవారని వినికిడి! (అపర కృష్ణావతారులు కాబోలు!) బహుభార్యాత్వానికిది లిమిట్!

ప్రాచీన నాగరికత కాలంలో బహుభార్యాత్వానికతి సన్నిహితమనిపించే ఉంపుడు కత్తెల అలవాటు బహుళంగా కన్పిస్తుంది. చైనాలో భార్య కాకుండా, అధికారయుతమైన ఉంపుడు కత్తెలు ఉండే అలవాటు ప్రబలంగా ఉండేది. జపానులో ఈ ఉంపుడు కత్తెల అలవాటు 1880 దాకా బహుళ ప్రచారంగా ఉండేది. పోతే, ఈజిప్టులో ఈ అలవాటు ఉన్నా అది రాజులకీ, వారికీ, పరిమితంగా ఉండేది. బాబిలోనియన్ చట్టాల ప్రకారం ఏకపత్నీవ్రతం కంపల్సరీ అయినా "చేసుకున్న భార్యకి అనారోగ్యం ముంచుకు వస్తే" రెండో భార్యని చేసుకోవచ్చు. ఒకవేళ ఆమె గొడ్రాలయితేనే ఉంపుడుకత్తెను చేపట్టవచ్చు! మహమ్మదు ప్రవక్త నలుగురికి పర్మిషన్ ఇచ్చాడు.

హైందవ న్యాయం ప్రకారం ఎక్కడా మగవాడు ఎక్కువ మందిని పెళ్ళాడ కూడదని చెప్పకపోయినా 'ఏకభార్య' వ్రతానికి ప్రాముఖ్యం ఇవ్వబడింది.

క్రిస్టియన్ యూరపులో కూడా బహుభార్యామతం లక్కడా అక్కడా లేకపోలేదు.... థర్టీ యియర్స్ వార్ తరవాత జనాభా చాలా తగ్గిపోవడంతో ఇద్దరు భార్యలని మగవాడు చేపట వచ్చు అన్నారు.

ఇప్పుడేమోగాని, పూర్వం ఈ బహుభార్యాత్వానికి కారణ మేమిటి అని ఆలోచిస్తే గమ్మత్తుగా ఉంటుంది. వయస్సు వచ్చిన కన్నెల సంఖ్య ఎక్కువగా ఉండడం. అనాగరిక జాతులలో ఎప్పుడేనా ఇలా సంభవించినప్పుడు బహుభార్యాత్వం అమలులోకి వచ్చేది. అందుబాటులో ఉన్న స్త్రీల సంఖ్య ఈ గుణానికి ప్రోత్సాహం యిచ్చిన మానవుని సహజ చాపల్యమే బహుభార్యాత్వానికి ముఖ్య కారణం అని చెప్పుకోవచ్చు. ప్రసవాలూ, పురుళ్ళూ, మైలలూ అందమైన స్త్రీ సంపుసొంపు ఆకర్షణ, సహజమైన కోరికలు ఇవి మగవాణ్ణి పటి బహుభార్యాత్వం వైపు లాగులాయి అంటారు. వంశోద్ధారకుడు కావాలన్న ఉబలాటం కూడా ప్రబల కారణమే అంటారు. నిజానికి మన పక్కల ఇదే ప్రబల కారణంగా చెలామణి అవుతుంది. మనిషికి సంఘంలో పరపతి, ప్రతిష్ఠ, ఆర్థికంగా ఉపయోగమూ అవడంవల్ల— యిది— అమలులోకి వచ్చిందని చెప్పుకున్నా తప్పులేదు. పూర్వంలో భార్యల చాకిరి వల్ల రాబడి అధికం కావడమే కాకుండా భర్తకి సుఖం హెచ్చేది. ఇదే ప్రకారం సాగి సహజ సంపదలు ఉన్నవారికే పెరగడం లేనివారికి తరగడం జరిగి-- దీనికి తోడన్నటు ఎదురు కట్నం ఇచ్చి భార్యని కొనుక్కోవలసిన అగత్యం కూడా ఉండడంతో..... కొందరు మగాళ్ళకెందరు భార్యలైనా కొనగల స్తోమత పెరిగేది. అసలు భార్య లేనివాడికి ఒక భార్యే కరువయ్యేది!

కాలంవారి వరకట్నానికి బదులు వోలి (వధూకట్నం) వస్తే ఎంత బాగుండును! అప్పుడు ఈనాటి మగవాడు ఒక భార్యని కొనుక్కుందుకే— యమయాతన పడేవాడు కదా! ప్చ్! తీరని కోరికలు!

అందుకే అమ్మమ్మ ఎప్పుడూ తాతని ఛాలెంజి చేస్తూనే ఉంటుంది— 'ఎవరిస్తారయ్యా నీ కింకో పిల్లనీ? చేవుంటే ఇంకో పెళ్ళాన్ని తీసుకురా చూస్తాను' అంటుంది. అమ్మమ్మ అంతటి మొండిదే — నోటీసిచ్చేయకల్డు !! ఉన్న మొగుడు కాస్తా జైల్లోకి పోతేనేంగాక!

'ఏకపత్నీవ్రతం రూలు చేస్తే ఎవ డాచరిస్తాడు? అంతా రూలంటే అతిక్రమించాలనే చూస్తారు' అంటారు మా వారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని అనవసరంగా మగాళ్ళచేత అబద్ధాలాడిస్తోంది. ఛాన్సిస్తే పాపం చాలా మంది—నిర్బంధం లేకుండానే ఏకపత్నీవ్రతం అవలంబిస్తారు— ఆర్థికంగా స్తోమతో? అందుకనీ..... లేకుంటే కొంపతీసి ఉద్యోగస్తురాళ్ళే కావాలంటూ...... ఆరు వేల మందిని, పదహారువేల మందినీ.... హతోస్మి!

మహమ్మదీయులలో ఈ బహుభార్యాత్వం ఇంకా ముమ్మరంగానే మిగిలి ఉంది. అంతేకాదు బైగమీ చట్టసమ్మతం కాదని తెలిసిన పెద్దలు యీ మతాన్ని అవలంబించి హాయిగా రెండోపెళ్ళి చేసుకుంటున్నారు. రాజ్యాంగం ఏకపత్నీత్వాన్ని చట్టసమ్మతం చేస్తూనే మధ్యన ఇతరత్రా బహుభార్యాత్వాన్ని పోషించడానికా అన్నట్టు మతం ఒప్పుకుంటుందన్న వంకన కొందరిని ఊరుకోవడం ఏమిటి? ఆ మాటకివస్తే మన పూర్వీకులు ముస్లిములు కానివాళ్ళు స్వేచ్ఛగా యిష్టంవచ్చిన రీతిగా ఇష్టం వచ్చినంత మందిని పెళ్ళి చేసుకోలేదా ? ఇప్పుడు ఈ చట్టం— అదే బైగమీని నిషేధిస్తూ ఎందుకు చేసినటు? అటు మహమ్మదీయులలోనూ, ఇటు ఇతర మతాలలోనూ కూడా ఒక్కరైనే పెళ్ళి చేసుకుని హాయిగా ఉంటూన్నవాళ్ళూ ఉన్నారు. అన్ని మతాలలోనూ ఏదో వంకన ఇద్దర్ని, యింకా ఎక్కువ మందినీ వివాహం చేసుకుంటూన్నవాళ్ళూ ఉన్నారు. చేస్తే మతాల ప్రసక్తి లేకుండా అందరికీ వర్తించే ఒకటే చట్టం ప్రతిపాదించి ఉండాల్సి

లేదా సాంఘిక వ్యవస్థతో తల దూర్చించకుండానైనా ఉండాలి— మన ప్రభుత్వం ఎప్పుడూ అంత మంచి పనులు చేయదు!

అసలు ఒక మతంవారిని ప్రోత్సహిస్తూ 'ఒక్కర్తి కాదు మీ మతం చెప్పినట్లు నలుగుర్ని కట్టుకో నాలుగు మూళ్ళ పన్నెండు మంది సంతానం దాకా నీకు హక్కు' అంటూ ఉంటే యీ కుటుంబ నియంత్రణ ప్రణాళిక లేమయ్యేను? కనీసం, కోట్లు కర్చుపెట్టి అమలు జరిపి, ఉన్న జనాభికి తిండి సమృద్ధిగా ఉండేలా చూడాలని తాపత్రయ పడుతున్న ప్రభుత్వం సర్వత్రా అన్ని మతాలలోనూ కూడ బహుభార్యాత్వం నిషిద్ధమే అంటూ గట్టిగా ఎందుకు చెప్పదు: "మెత్తనివాణ్ణి చూస్తే మొత్త బుద్ధి అన్నట్లు వూరుకుంటున్నాము కదా అని మనకి యీ నిషేధాలన్నీ పెట్తోంది"— అంటూ వాపోతాడు తాతయ్య. నిజమే మరి. ఎక్కువ మంది భార్యలని పోషించ కల్గినా కలక్కపోయినా ఒద్దనడానికి ప్రభుత్వం ఎవరని మండదూ? మరి!

మన రాజ్యాంగం ప్రతి మగవాడికీ ఒకతే భార్య— అంటే దాన్లో అసలు మతాల ప్రసక్తికి స్థానం ఉండకూడదు. 'ఫలానా అందుకు ఫలానావారికి' 'ఫలానా ఇందుకు ఫలానా వీరికి' ఒకర్తె కంటే ఎక్కువ మంది భార్యలుండొచ్చు అనడం పర్మిషనులు యివ్వడం ఏం సొబు? సంతాన నిరోధన ప్రణాళికలకి గొడ్డలి పెట్టులా ఉంటున్న యీ బహుభార్యాతత్వాన్ని ప్రభుత్వం పూర్తిగా కళ్ళు తెరిచి చూడాలి. ఏో పక్కన ద్విగమీ చట్టాన్ని నిర్మించగానే పని ముగిసిందని వూరుకోవడం ఏం బాగులేదు' అంటూ గట్టిగా వాదించే నాబోటి దాన్ని 'మీ ఆడవాళ్ళే కదా రెండో భార్యలుగా మూడో భార్యలుగా ఉండడానికి ఒప్పుకుంటున్నది. వారి చెవిన పోరు" అన్నాడు రఫీమని మాతాతయ్య.

ప్రేమపేరిట రెండో భార్యలుగా చెలామణీ అవుతున్న స్త్రీలీనాడు కోకొల్లలు. వారి వివాహం చట్ట సమ్మతం కాదు. వారి పిల్లలు అక్రమ సంతానం అనిపించుకోక తప్పదు. ఇవన్నీ తెలిసీ కూడా చదువుకున్నవాళ్ళు ఉద్యోగినులు, ఇతరత్రా ఆధారం కలవాళ్ళు కూడా ఇటువంటి రెండోస్థానాలకి దిగుతున్నారు. జీవితంలో పెళ్ళే ముఖ్యం. అది ఎవరికైతేనేం అన్న ధోరణిలో తోటి స్త్రీ జీవితంలో నిప్పుపోసి, తమ సౌభాగ్యం పెంచుకుంటున్నాం అనుకుంటున్నారే గాని వారి జీవితాలలో శాంతి ఎక్కడ? ఏ క్షణాన మొదటి భార్య నోటీసిచ్చినా ప్రేమసౌధం సమూలంగా కదలిపోక తప్పదు.

బహుభార్యాత్వం అమలులో ఉన్నంత కాలం సాటి స్త్రీకి అన్యాయం జరక్క తప్పదు. దేశానికి విపరీత సంతానపు యీతిబాధా తప్పదు. ఎలాగా చట్టం చేసింది కనుక ప్రభుత్వమే తీవ్రంగా ద్విగమీ చట్టాన్ని అమలులోకి తెచ్చి జాతిమత వివక్షత లేకుండా చర్యలు తీసుకోవడం ప్రారంభించాలి. అప్పుడే అసలు మానవుడి నైజం బయట పడుతుంది. 'అదేదో గట్టిగా చేయించవే వచ్చి నీ కడుపున పుడతాను' అంటూంది— అమ్మమ్మ. మాట్లాడితే మా తాతయ్య ఇంకోత్తెని తెస్తాను అంటూ బెదరించడం చూసి దడుసుకుంది. అమ్మమ్మలకే ఇలాఉంటే సంసారం మూడు పూవులూ ఆరు కాయలుగా సాగవలసిన సమయంలో గంగమ్మ తల్లులు నెత్తి కెక్కితే వయసు స్త్రీల మధన చెప్పాలా? ముస్లిము స్త్రీలు సహితం యీ సవతుల పొత్తును ఎంతో యిష్టంతో స్వీకరిస్తున్నారని ఎందుకు అనుకోవాలి. ఏ జాతికి చెందినా ఆడది ఆడదే. ఆమె తన భర్తను సాటి స్త్రీతో పంచుకుందుకు ఒప్పుకోదు. అలా ఒప్పుకుంటే— దానికి చాలా ప్రబలమైన కారణాలు ఉన్నాయి అనుకోండి., అసలు పూర్తిగా భర్తని వదులుకోలేక తలవంచిందని నిర్భయంగా చెప్పుకోవచ్చు. ●



సుజాత

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

సుజాత టీచరుగా పని చేస్తూ మానేసి స్టెనో నేర్చుకున్నది. అన్న పూర్ణా ఇంజనీరింగు వర్క్సులో స్టెనో పిస్టుగా చేరింది. ఆ కంపెనీ అధిపతి నీలకంఠం. అతని కొడుకు శ్రీధర్. శ్రీధర్‌ని ఎక్కడో చూసి నట్టు అనిపిస్తుంది సుజాతకి. సూర్యం సుజాతకి మేనబావ. ఆమెని వెతుక్కుంటూ వస్తాడు. వాళ్లిద్దరికీ పెళ్లి చెయ్యాలని తలిదండ్రులు చిన్నప్పుడే అనుకున్నారు. సూర్యం అందంగా వుండడు. చదువు కూడా అబ్బలేదు. సుజాత అతన్ని తప్పించుకు తిరుగుతూ వుంటుంది మొదట్లో ఏదో అనుకున్నా, తర్వాతర్వాత సుజాతని సూర్యాని కివ్వాలనే ఆలోచనని విరమించుకున్నారు ఆమె తల్లిదండ్రులు. శ్రీధర్ సుజాతతో పరిచయం పెంచుకోవాలని చూస్తుంటాడు. సీతాపతి గారింట్లో పిల్లవాడ్ని చూడ్డానికి వెళ్తుంది సుజాత. ఆమెకి షాపింగ్‌లో సాయం చేస్తాడు శ్రీధర్.

8

కళ్లు మూసుకుని పడుకున్న తల్లి వంక రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చుంది సుజాత. 'ఆలోచించటానికే భయం వేసే పరిస్థితులు తనని చుట్టుముట్టుతున్నాయి. అసలు ఏ ఆలోచనలూ లేకుండా మెదడు మొద్దుబారిపోయేటందు కేదైనా మార్గం వుంటే బాగుండును —కళ్లు మూసుకుని ఒళ్లు తెలియకుండా పడివుండే మత్తు మందు తీసుకుంటే తప్ప అది సాధ్యం కాదేమో—అసలీ పరిస్థితిలో మరికొన్ని రోజులుంటే తనకి పిచ్చెక్కదు కదా...' పర ధ్యానంగా వున్న ఆమెకి బయట శ్రీధర్ గొంతు వినిపించి వులిక్కిపడింది. 'అన్నాడే కాని నిజంగా ఇవాళ సాయంకాలమే వస్తాడా అనే అనుమానం ఏమూలో వదలకుండా పట్టుకుంది ఇంతసేపూ. అతని గొంతులాగే వుంది.' అనుకుంటూ మరోసారి వినటానికి ఆత్రపడిపోయింది చెవులు రిక్కించుకుని— మాటలు దగ్గరవుతున్న కొద్దీ మనస్సు కుదుటపడింది.

'వీరే డాక్టరు చలపతిరావు' అంటూ అతను గదిలో అడుగు పెట్టాడు. సుజాత లేచి నిలబడి ఇద్దరికీ నమస్కారాలు చేసింది. మీనాక్షమ్మకూడ చేతులు జోడించింది. ఆ ఇద్దర్నీ వోసారి పలకరించి మంచం దగ్గరవున్న ఛార్టు చూసి తల పంకిస్తూ 'నేను డాక్టరు వెంకట్రావుతో చెప్తాను. మీరేం ఖంగారుపడకండి' అని 'నాకు పని వుంది వెళ్తాను. వీలయినప్పుడల్లా వచ్చి చూస్తూంటాను' అని వెళ్లిపోయాడు అతను. అతనితోపాటు కాస్తదూరం వెళ్లి మళ్లీ వెనక్కివచ్చిన శ్రీధర్‌ని చూస్తూ 'కూర్చోండి' అంటూ కుర్చీ కాస్త పక్కకి జరిపింది. దాన్ని మరి కాస్తదూరంగా జరుపుకొని కూర్చున్నాడతను. ఎన్నో చెప్పా లనిపించినా ఎలా చెప్పాలో తెలియటం లేదతనికి.

'నీలకంఠంగారు ఇక్కడ లేరనీ, ప్రస్తుతం ఆఫీసు విషయాలన్నీ ఆయన కొడుకే చూసు కుంటున్నాడని అమ్మకి తెలుసు—అయినా ఇతనిలా చొరవగావచ్చి కూర్చోటం, అమ్మ ఏమీ అనుకోవటంలేదు కదా'అనుకుంటూంది సుజాత.

'ఓ అపరిచితవ్యక్తి, మొగవాడు అందు లోనూ తన కూతురు పనిచేసే ఆఫీసు యజమాని ఎదురుగా కూర్చుంటే అలా పడుకోటానికి చచ్చేంత మొహమాటంగా వుంది మీనాక్షమ్మగారికి— 'అయినా తప్పదు తను లేవకూడదు. కొడుకూడ దని మొండితనం చేస్తే మళ్లీ ఏమవు తుందో, అసలు ఎన్నాళ్లిలా పడివుండాలో— ఇతను చాలా మంచివాడిలాగే వున్నాడు. ఇతని మాటమీదయినా డాక్టరు శ్రద్ధ పట్టిచూసి త్వరగా నన్ను మామూలు మనిషినిచేస్తే బాగుండును' అనుకుం టోంది ఆవిడ—ఆముగ్గురిమధ్యా కొద్ది క్షణాలు అల్లుకుపోయిన నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ 'మీరు మధ్యాహ్నం భోజనం చేశారా?' అన్నాడు శ్రీధర్ సుజాతతో.

'చేశాను. నాకసలేం తీసుకోవాలనిపించ లేదు. కాని జగన్నాథంగారి భార్య వదిలి పెట్టలేదు—మధ్యాహ్నం చాలాసేపు ఇక్కడ కూర్చుని వెళ్లారు వాళ్లాను— వాళ్లకీ మీకూ అందరికీ బోలెడు శ్రమ ఇస్తున్నాం' అంది సుజాత.

'శ్రమకేముంది. మీరలా ఎప్పుడూ అను కోవద్దు—ఏ సహాయం కావలసి వచ్చినా ఫోనుచేస్తూవుండండి' అంటూ లేచా డతను.

'అలాగే చేస్తుంది—ఈ మహాపట్నంలో మీలాంటి వారికంటె కావలసినవాళ్లు మాత్రం ఎవరున్నారు.' అంది మీనాక్షమ్మ మెల్లిగా—

అయితే అవసరం అంటూ కలిగి సుజాత ఫోన్‌చేసేదాకా శ్రీధర్ ఆగలేదు. రెండు రోజులకోసారో వీలయితే ప్రతిరోజూ సాయం కాలం వచ్చి చూసి వెళ్తున్నాడు— అతని సంగతి తెలిసి కాకపోయినా,

'పెద్దవాడిని ఓ సారి వెళ్లిచూసి ధైర్యం చెప్పాలి.' అన్న ఉద్దేశ్యంతో ఓసారి సీతాపతిగారు కూడ వచ్చి వెళ్లారు.

మొదటిరోజు శ్రీధర్ డాక్టర్ చలపతి రావుని తీసుకొచ్చి పరిచయంచేసిన దగ్గర నుండీ డాక్టరు వెంకట్రావు మరింతశ్రద్ధ

కనబరుస్తున్నాడు—హడావిడిగాచూసి వెళ్ళిపోటంకాకుండా అయిదునిమిషాలు నిలబడి సుజాతతో అవీఇవీ మాట్లాడి మీనాక్షమ్మకి ధైర్యం చెప్పి మరీ వెళ్తున్నాడు.

'అంతేనమ్మా ఎక్కడచూసినా పలుకుబడీ సిఫారసులూను, లేకపోతే ప్రాణం పోతున్నా తమకి పట్టనట్లు వూరకుంటారు ఒకోసారి' అనేది మీనాక్షమ్మ.

మొదటిరోజు కలిగిన సంకోచం బిడియం అన్నిపోయి చనువుగా మాట్లాడగలుగుతున్నాడు శ్రీధర్—కేవలం తన యజమాని అనే దృష్టిపోయి తన క్షేమం కోరే ఆత్మీయుడు అన్నభావం కలగసాగింది సుజాతకి–మీనాక్షమ్మ పరిస్థితి సరే సరి. ఆమెకళ్ళకి అతను దేవుడులాగా కనిపిస్తున్నాడు. ఈ వయస్సులో ఇంత విచక్షణ ఇతరులకి ఇళ్లా సహాయపడే గుణం ఎంత మందిలో వుంటుంది అనుకుంటూండేది ఆవిడ.

'అది వరకు మిమ్మల్ని మీ నాన్నగారిని గురించి అమ్మాయి ఎప్పుడూ చెప్తుండేది —మీ మంచితనం ఇప్పుడు నేను స్వయంగా చూస్తూనే వున్నాను — లక్ష పనులున్నా గుర్తుపెట్టుకుని వీలుచేసుకుని వచ్చి చూసి వెళ్తున్నారు. మీరు చెప్పకపోతే ఈ డాక్టరింత శ్రద్ధగా చూసేవాడు కాదు—మీ ఋణం మేం ఈ జన్మలో తీర్చుకోలేం.' అంటూ అవకాశం వచ్చినప్పుడల్లా తన మనస్సులో మాటలు పైకే వెల్లడిస్తూండే దావిడ.

పదిరోజులు గడిచి పోయాయి.

క ర స్పాం డె న్సు చూసుకుంటున్నాడు శ్రీధర్. ఫోను మ్రోగింది.

అవతల సుజాత కంఠం పలకటంతో, 'నేనే, ఏమయింది' అన్నాడు ఆదుర్దాగా.


తెల్లవారగట్ల మళ్ళీ నొప్పి వచ్చిందండీ—అప్పట్నుంచీ మళ్ళీ ఆమె కోలుకోలేదనిపిస్తోంది. నాకేమిటో భయం వేస్తోంది— మీ రొకసారి డాక్టరుగారితో మాట్లాడితే బాగుంటుందేమో ... సాయంకాలం తప్పకుండా వస్తారు కదూ...' వెక్కిళ్లని అణుచుకుంటున్నట్లున్న ఆమె కంఠం వింటూ చలించి పోయాడతను. అవ్యక్తమైన భయంతో గుండె పట్టుకుపోయినట్లయింది—పరిస్థితి ప్రమాదకరంగానే పరిణమించిందేమో, లేకపోతే సుజాత స్వతంత్రంగా ఇలా ఫోను చెయ్యదు అనుకుని,

'మీరేం ఖంగారు పడకండి. నేనిప్పుడే కొంచెం సేపటిలో వస్తాను,' అని ఫోను పెట్టేసి సీతాపతిగారిని పిలిచి చెప్పాడు తను వెళ్తున్నట్లు. అతని హడావిడి చూసి—

'నేనూ వస్తాను' అంటూ బయలుదేరాడు సీతాపతిగారు—

ఆస్పత్రిలో దృశ్యం చూస్తూనే శ్రీధర్ మనస్సు నీళ్ళు కారిపోయింది. సుజాత భయం నిజం కావటానికి ఇంక ఆట్టే వ్యవధిలేదేమోనన్న వూహ వస్తూనే ఆపాదమస్తకం జలదరించి నట్లయింది —క్రితం సాయంకాలానికి ఇప్పటికి అసలు గుర్తుపట్టలేనంతగా క్షీణించి పోయిం దావిడ పరిస్థితి. తల్లి మంచందగ్గరగా కుర్చీ జరుపుకుని మంచానికి తల ఆనించి కళ్ళుమూసుకు కూర్చుంది సుజాత. బలహీనమైన తనచేతో కూతురు శిరస్సు నిమురుతున్న ఆవిడ శ్రీధర్ని చూస్తూనే 'వాళ్ళు వచ్చారమ్మా' అంది మెల్లిగా. మాట అతి బలహీనంగా వస్తున్నా పత్తికాయలలాంటి ఆమె కళ్లల్లోకి కాస్త కళ వచ్చినట్లయింది అతన్ని చూడగానే—

సుజాత తల ఎత్తి చూసింది. కన్నీళ్ళు వోడ్చి వోడ్చి ఉబ్బిపోయి వున్నాయి ఆమె



కళ్ళు — చెంపలమీద కరడు కట్టిపోయిన కన్నీటి చారికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి — శ్రీధర్‌ని చూడగానే ఆదరణ కోసం అశ్రులు చాస్తున్నదానిలా లేచి ముందుకువచ్చి

'వచ్చారా ?' అంది ఆమె కంఠం బొంగురుపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఏదో అనబోయిన శ్రీధర్ గొంతు పెగిలి మాటరాలేదు. కళ్ళల్లో చివ్వున చిప్పిల్లిన కన్నీళ్ళు క్రిందికి జారకుండా చటుక్కున పక్కకి తిరిగి వత్తుకున్నాడు—ఇంక బాధ్యత తనదే అన్నట్లు సీతాపతిగారు మొదలు పెట్టారు.

'డాక్టరుగారితో మాట్లాడే వస్తున్నాం—ఏం భయం లేదని చెప్పారు — విశ్రాంతి కావాలని డాక్టరు చెప్పిన మాటలు మీరేం లక్ష్య పెట్టకుండా వూరికే హైరానపడి జబ్బు ఎక్కువ చేసుకుంటున్నారు.' అన్నాడు డాక్టరు చెప్పాడంటే వాళ్ళకి కాస్త ధైర్యంగా వుంటుందని.

'గుండెలు నిండిపోయేటంత దిగులుతో విశ్రాంతి ఎలా వస్తుంది బాబూ—తోడ బుట్టిన వాళ్ళు లేనేలేరు — ఆ తండ్రి పోవటంతో దానికి నేను నాకు అది తప్ప ఇంకెవ్వరూ లేకుండా మిగిలాం — నేను కూడ కన్ను మూస్తే ఆడపిల్ల దిక్కు లేకుండా ఈ ప్రపంచంలో ఎలా బ్రతుకుతుందో...' ఆయాసం వచ్చి ఒక్క క్షణం ఆగింది.

సుజాత

ఏడుపు పైకి వినిపించకుండా కొంగు నోటికి అడ్డం పెట్టుకుని అటు తిరిగి నిలబడి వున్న సుజాత గబుక్కున వచ్చి తల్లి గుండెలు నిమురుతూ—'నీకేం భయం లేదమ్మా — నాకోసం అయినా బ్రతుకుతావు' అంది.

'లేదమ్మా—ఆ ఆశ ఇంక లేదు — నిన్నో యింటిదాన్ని చెయ్యకుండానే నన్ను పిలుచుకు పోతున్నాడా భగవంతుడు — నా కోరిక తీరనే లేదు.'

'ఆ భగవంతుడు నిన్ను పిలవటం నిజమే అయితే నేనూ నీ వెంటే వస్తాను—ఒంటరిగా ఇక్కడేం బాధలు పడతానో అనే భయం నీ కక్కర్లేదు...'

'ఇస్. ఏం మాటలవి?' అంటూ కూతుర్ని మందలించి ఇంకా ఏదో చెప్పబోయింది. కాని దుఃఖం ముంచుకు రావటం వల్ల కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని కుమిలిపోయింది.

శ్రీధర్ సీతాపతిగారి వంక చూశాడు. 'మనం ఏం చేస్తాం — ఎంత వోదార్చినా లాభం వుండదు— వాళ్ల వాళ్ళెవరికైనా ఉత్తరం వ్రాస్తే ఎందుకయినా మంచిది.' అన్నారాయన మెల్లిగా.

కాని ఆ మాటలు శ్రీధర్ వినిపించుకోలేదు. ఒక్క క్షణం దీర్ఘాలోచనలో మునిగిపోయినవాడిలా అలా చూస్తూ నిలబడి పోయాడు. అంతలో ఏదో నిర్ణయించుకున్నట్లు గబగబ అడుగులు వేసుకుంటూ మంచాన్ని సమీపించాడు,

'ఇలా చూడండి — మీ అమ్మాయికి వచ్చిన భయం ఏం లేదు — నేను మాట ఇస్తున్నాను. ఈ క్షణం నుండి సుజాత భారం నాది...'

వింటున్న సీతాపతిగారు కొయ్యబారి పోయాడు. 'ఈ పదిరోజుల నుండీ అతని ప్రవర్తన గమనిస్తున్నా, తన ఆఫీసులో పని చేస్తోంది, పైగా కావలసిన వాళ్ళెవరూ దగ్గరలేరు అన్న జాలితో ఆ మాత్రం ఆసరాగా నిలబడ్డాడు అనుకున్నాడే కాని మరో భావానికి అసలు అవకాశం వుండొచ్చు అన్న ఆలోచనే తనకి రాలేదు. ఛ. తనెంత వెర్రివాడు, వయస్సు వచ్చిందే కాని తను కంటితో చూస్తున్నదాన్ని అర్థం చేసుకోలేక పోయాడు — ఆ నాడు తను ఆ అమ్మాయిని గురించి కాస్త చులకనగా మాట్లాడబోయే సరికి అతనికి అంత కోపం రావటానికి కారణం ఇదా — అమ్మాయి గట్టిదే.' అనుకుంటూ అటు చూశాడు.

సుజాత, మీనాక్షమ్మ నీళ్ళు నిండిన కళ్ళతో అయోమయంగా చూస్తున్నారు శ్రీధర్‌వైపు.

'మీకు అర్థం అయిందను కుంటాను—సుజాతని నేను పెళ్ళిచేసుకుంటాను— మీ ఆరోగ్యం బాగయిం తరువాత మానాన్నగారు వచ్చింతరువాత...'

'బాబూ, నాకంత దురాశ లేదు—నాబిడ్డ జీవితానికి వో గమ్యం అంటూ నాచేతుల మీదుగా ఏర్పరచలేకపోయానే అని బాధ పడుతున్నానే కాని—మీముందు ఏడ్చి నాబాధ వెళ్ళబోసుకుని—మీ మనసు కరిగేలా చేసి, మీరు అలాంటి నిర్ణయానికి వచ్చేలా చెయ్యటం నా ఉద్దేశ్యం కాదు' సిగ్గుతో కుంచించుకుపోతూ అంది మీనాక్షమ్మ.

'మీరు పొరపాటు పడుతున్నారు—నాకు ఈ ఉద్దేశ్యం ఇవాళ ఈక్షణంలో కలిగిందికాదు—తన అభిప్రాయం తెలుసుకుని మిమ్మల్ని అడగాలనుకున్నాను—కాని ఇంతలోనే పరిస్థితులిలా వచ్చాయి...'

'కాదు—మీకు తెలియదు—నాకా అర్హత లేదు' గొంతు పెగుల్చుకుని మెల్లిగా అంది సుజాత.

'మీ అర్హత లేమిటో నాకు తెలుసు—



ఒక్క అంతస్తుల భేదం తప్ప మరేలాంటి అభ్యంతరమూ నాకు కనిపించలేదు—ఆ అంతస్తులని నేను లెఖ్ఖచెయ్యనప్పుడు అవి మీకు అవరోధంగా నిలబడలేవు...'

నిద్దట్లోకూడ తన అంతస్తుని మరిచిపోలేని నీలకంఠంగారి కొడుకు నోటంట ఆమాట వినటం సీతాపతిగారికి వింతగానూ వినోదంగానూ కూడ వుంది. ఆ తండ్రీ కొడుకులు ఈ సమస్యని ఎలా పరిష్కరించుకుంటారో చూడాలనిపించింది — అయితే శ్రీధర్ ఇచ్చిన మాటని నిలబెట్టుకుంటాడా అన్న విషయంలో మాత్రం ఆయన కెలాంటి అపనమ్మకం కలగలేదు.

సుజాత మౌనంగా వుండిపోవటంతో శ్రీధర్ తనే అన్నాడు మళ్లీ 'నేనింతవరకూ నన్నుగురించే చెప్పుకొచ్చాను. మీ అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నమే చెయ్యలేదు. మీకుఇష్టం లేకపోతే...'

తల్లి తలగడలో తలదూర్చి వెక్కివెక్కి పడుతున్న సుజాతనిచూస్తూ ఆ వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు శ్రీధర్—భరించ శక్యంకాని బాధని దుఃఖాన్ని దిగమింగటానికి విఫల ప్రయత్నం చేస్తూ మౌనంగా కూతురుతల నిమురుతూ వుండిపోయింది మీనాక్షమ్మ—ఉన్నట్టుండి ఆవిడ మొహంలో వచ్చినమార్పు కనిపెట్టి 'డాక్టర్ని తీసుకువస్తాను' అంటూ పరుగుపెట్టాడు సీతాపతిగారు—

కాస్సేపటి తరువాత ఆయన డాక్టరుతో తిరిగి వచ్చేసరికి శ్రీధర్ చేతిలో సుజాత చెయ్యి వుంది. కలిసిన ఆరెండు చేతులనీ సంతోషంగా సంతృప్తిగా చూసుకుంది. మీనాక్షమ్మ. అలౌకికమైన తేజస్సు కళ్లల్లో ప్రతిఫలిస్తూండగా ఆనందంగా దీవించుతూ కూతురితలని నిమరబోయిన ఆమెచెయ్యి మధ్యలోనే క్రిందికి వాలిపోయింది.

* • * *

'మాతో వచ్చేసెయమ్మా—నా కంటె అయినవాళ్లెవరున్నారు నీకు ?' అంది శాంతమ్మ.

'నా పిల్లలతో పాటే నువ్వూనూ—మీ అత్తయ్య నీకు ఏ లోటూరాకుండా చూసుకుంటుంది.' అన్నాడు సుజాత మేనమామ రామశేషయ్య.

మీనాక్షమ్మ మరణవార్త వింటూ అటునుంచి శాంతమ్మ సూర్యనారాయణా ఇటునుంచి రామశేషయ్య వచ్చారు.

'ఎవరు వచ్చిమాత్రం ఏం చేస్తారు. నా దుఃఖం ఒకరు తీర్చగలిగేది కాదు' అని దుఃఖిస్తున్న సుజాతని ఓదారుస్తూ.

'ఇలాంటి సమయంలో అయినవాళ్లకి తెలియజేయకపోతే బాగుండదమ్మా'అంటూ వాళ్ల ఎడ్రసులు తీసుకుని వుత్తరాలు వ్రాశారు ఇంటి యజమాని జగన్నాథంగారు సీతాపతిగారు సంప్రతించుకుని.

వాళ్లు వచ్చేదాకా జగన్నాథంగారి కుటుంబమే సుజాతని కంటికి రెప్పలా చూసుకుంది. శ్రీధర్ రోజూవచ్చి చాలా సేపు కూర్చుని అవీ ఇవీ మాట్లాడుతూండే వాడు.

స్వంత మేనత్త మేనమామ వచ్చిన తరువాతకూడ సుజాత తనకసలు ఆత్మీయులు అన్నవారు లేనట్లు ఒంటరిదానిలా దిగులుగా వుండటం గమనించాడు అతను—ఆమె ముభావంగా వుండటం ఇంట్లో పరాయి మనుష్యులు తిరగటం దీనితో అతనికి అదివరకులా మాట్లాడటానికి బిడియంగా వుండటంవల్ల—

'మీరుకాస్త తరుచు వెళ్లి చూస్తూండండి' అని సీతాపతిగారికి అప్పగించాడు అతను—

తిరుగు ప్రయాణానికి సిద్ధపడుతూ మేనత్తవాళ్లు అన్నమాటలకి,

'నే నెక్కడికీ రాను. ఉద్యోగం వుండనే వుందికదా— ఉండటానికి ఇల్లూ వుంది—అంతగా ఒక్కదాన్ని వుండలేకపోతే ఏ హాస్టల్ కయినా వెళ్లిపోతాను' అంది సుజాత.

ఇదెక్కడి విడ్డూరం అన్నట్టు చూశారు వాళ్లు ముగ్గురూ.

'ఈ మాయదారి ఉద్యోగంకోసం ఇక్కడ కాపరంపెట్టి అమ్మని పోగొట్టుకున్నావు—అయినా మనస్సు బాగుండటం బాగుండక పోవటం మన గ్రహచారాన్ని బట్టి వుంటుంది కాని ఊరు ఏంచేసిందీ—నిక్షేపంలాంటి ఊరు, ఇల్లువదిలి ఇక్కడికి వచ్చిపడ్డారు—సరే అంతా ఇలా జరగవలసి వుంది' అంటూ ముక్కు చీదుకుంది శాంతమ్మ.

సుజాత తన పట్టు విడవలేదు.

సాయంకాలం జగన్నాథంగారు సీతాపతిగారు అంతా వుండగా ఆ విషయం చెప్పి,

'మీరయినా కాస్త నచ్చ చెప్పండి. ఆ ఉద్యోగం చేసుకుంటూ ఒక్కతే ఇక్కడెలా వుంటుంది, ఎన్నాళ్లు వుంటుంది — ఎవరో ఒకరం పూనుకుని తరువాతి సంగతి చూడాలికదా—' అంది శాంతమ్మ.

గోడ నానుకుని చాపమీద కూర్చుని దూరంగా ఎటో చూస్తున్న సుజాతవంక చూశారు సీతాపతిగారు. 'కాస్త స్థలం మార్పుకోసం కావాలంటే తీసుకువెళ్లి కొద్ది రోజులు వుంచుకోండి అదీ అమ్మాయి ఇష్టపడితేనే. అంతేకాని సంబంధాల విషయమై మీరేం శ్రమపడక్కర్లేదు — కూతురి పెళ్లికళ్లతోచూసుకునే అదృష్టం ఆమెకి లేకపోయింది కాని మీ వదినగారు వుండగానే నిశ్చయం అయిపోయింది—'

'ఆ—నిజంగానే—సంబంధం నిశ్చయం అయిపోయిందా—మాటమాత్రం చెప్పావు కావేం—ఏవూరు ?' అంటూ రామశేషయ్య సూర్యనారాయణ శాంతమ్మ ముగ్గురు ఆశ్చర్యంలో తలమునకలై పోతూ ఒక్కసారే ప్రశ్నించారు.

'పుట్టెడు దుఃఖంలో వుండి ఏం చెప్తుంది ? సమయం చూసుకుని ఆ విషయం చెప్పాలని నేను అనుకున్నాను — సంబంధం ఈ వూరే అతన్ని మీరూ చూశారు. వాళ్ల ఆఫీసరే' అన్నారు జగన్నాథంగారు.

వాళ్లు ముగ్గురూ నిశ్చేష్టులైపోయి; తెరిచిన నోరుకూడ మూయటం మరిచిపోయారు. విస్మయంతోపాటు రవంత అసూయకూడ చోటు చేసుకోటం ప్రారంభించింది.

'ఎవరూ—ఆ పెద్దకారు వేసుకు వచ్చేవారు—ఎర్రగా బక్కపలచగా పొడుగ్గా...'

'ఆ, ఆ, అతనే.' మధ్యలోనే అందుకుని సమాధానం చెప్పాడు సీతాపతిగారు, సుజాత తలవంచుకుంది.

'వాళ్ల ఆఫీసులో పనిచేస్తున్నానని చెప్పిందే' ఇంకా నమ్మకం కలగనట్లే అడిగింది శాంతమ్మ.

'ఔను. అతనే.' అన్నాడు సీతాపతిగారు. ఎన్నిసార్లు చెప్పినా అర్థంకానట్లు అడుగుతారేమిటి అని విసుగొస్తోంది ఆయనకి.

'ఇంకనేం, అన్నీ నిశ్చయం అయిపోయా

యన్నమాట — ఉద్యోగం చేసుకుంటాను, హాస్టల్‌కి వెళ్తాను అంటావెందుకు— త్వరలో ఆమూడు ముళ్ళూ పడిపోతే ఇంక మాకే దిగులూ వుండదు...'

'నామనస్సేం బాగుండ లేదత్తయ్యా, కొన్నాళ్ళు పెళ్ళిసంగతి ఆలోచించదలుచు కోలేదు' చటుక్కున సుజాత అన్నమాటలు విని అందరికంటె ఎక్కువగా సీతాపతిగారే తెల్లబోయారు. 'ఏమిటీ అమ్మాయి? అతి వినయమా, మూర్ఖత్వమా—జమీందార్లకి అల్లుడు కాదగిన చినబాబు స్వయంగా నోరుతెరిచి అడిగితే ఇలా బెట్టుచేస్తోంది.' అనిపించింది ఒక్కక్షణం. మరు క్షణం ఆయన ఆలోచనలు మరోలా సాగిపోయాయి.'

అతిశయం అహంభావం ఆవేశం అన్నీ వంట పట్టించుకున్న నీలకంఠంగారిని గురించే ఈ అమ్మాయి భయపడుతోంది. అది సహజమే—అందుకే ఆవిషయం అప్పుడే వెల్లడి చెయ్యటంకూడ అమెకి ఇష్టం లేనట్లుంది.' అనుకున్నాడు—

ఇంతప్పటినుంచి తను ఎరిగివున్న చిన్నబాబు, మరణశయ్యమీద ఉన్న ఆమెతల్లికి వాగ్దానంచేసి ఆమె సమక్షంలో సుజాత చేయి అందుకున్న చిన్నబాబు, ఎలాంటి పరిస్థితిలోనూ మాట తప్పడు అని తనకి నమ్మకంవున్నా ఆసమయంలో మరింత ఆ సంభాషణని పొడిగించటం ఇష్టంలేక.

'నిజమేలెండి ఈ సమయం సందర్భం అలాంటి ఆలోచనకే అవకాశం ఇవ్వవు మరి.' అంటూ సర్దిచెప్పేశాడు.

మర్నాడే వాళ్ళ ప్రయాణం. సుజాత బయలుదేరనని స్పష్టంగా చెప్పేసింది.

'సరే మీరంతా ఉన్నారుకదా — ముహూర్తం పెట్టగానే తెలియ జెయ్యండి' అంటూ జగన్నాథంగారి కుటుంబానికి సుజాత బాధ్యతని అప్పగించి సీతాపతిగారికి కూడ మరీ మరీ చెప్పి వాళ్ళంతా వెళ్ళిపోయారు — శ్రీధర్‌ని కలుసుకుని తమ పెద్దరికాన్ని నిలబెట్టుకుంటూ ఏదైనా మాట్లాడితే బాగుండునని వాళ్ళకి అనిపించింది కాని సుజాత మౌనం ముభావం వాళ్ళు మనకెందుకీ అనవసరపు గొడవలు అనుకునేలా చేశాయి.

(ఇంకా ఉంది)

బంధుత్వపు వివాహాలు విపరీత పరిణామాలు

బంధుత్వపు వివాహాల (మేనరికాలే కాకుండా మిగిలిన రకాలైన అయిన సంబంధాలు)—ఫలితాలను రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటిది దంపతులమధ్య సాంసారికంగా వచ్చే మానసిక, ఆర్థిక పరిణామాలు. రెండవది వారి సంతానానికి సంక్రమించే మానసిక, దైహిక ఆరోగ్య లక్షణాలు (లేక అవలక్షణాలు), మా ప్రస్తుత పరిశోధన ప్రధాన లక్ష్యము రెండవ రకమైనది.

కొన్ని కొన్ని లక్షణాలు వంశ పారంపర్యంగా వస్తూ వుంటవని అందరికీ తెలుసు, ఉదాహరణకు ఒక కుటుంబంలో ఎవరైనా పిచ్చివారుంటే తరువాత తరాల్లో వారికి కొందరికైనా సంక్రమిస్తుందనేది బహిరంగ సత్యం. ఇలాగే గ్రుడ్డితనము, మూగతనము, చెముడు నత్తి మొదలైనవి; చేతులు, కాళ్ళు, వేళ్ళు ముఖము కండ్లు మొదలయిన అవయవాల్లో దోషాలు; యింకా మధు మేహంలాంటి వ్యాధులు వంశానుగతంగా సంక్రమించేవే. ఇటువంటివి ఏ విధంగా, ఎంత తరచుగా సంక్రమిస్తున్నవి, ఎవరి నుండి ఎవరికి సంక్రమిస్తున్నవి అనేవి ప్రధాన అంశాలు—అంతేకాక, ఎవరికైనా ఒక లోపముంటే ఆ కుటుంబంలో పుట్టబోయే పిల్లలకు అది సంక్రమించడానికి గల అవకాశమేమిటి? కాబట్టి వారు సంతానోత్పత్తి, పెంపకాలలో తీసికోదగు జాగ్రత్తలేమిటి? ఇవి కూడ ముఖ్యమైన సమస్యలే.

కాగా, కాని సంబంధాలలో కంటే, అయిన సంబంధాలలో అనువంశికంగా వచ్చే లోపాల సంక్రమణం హెచ్చుగ వుంటుంది. అందువలన ఇటువంటి అనువంశిక లోపాలున్న కుటుంబాల వంశ వృక్షములు (జనన మరణములు, గర్భస్రావముతో సహా) పరిశీలిస్తే విలువైన సమాచారం దొరుకుతుందనే ఆశతో ఈ పరిశోధనకు పూనుకున్నాము.

ఈ సమాచార సేకరణకు ఒక ప్రశ్నావళి గూడ తయారు చేశాము.

కాబట్టి ఈ బంధుత్వపు వివాహాలను గూర్చి తెలిపి మా పరిశోధన ఫలవంత మయేటట్లుగ తోడ్పడ వలసినదిగా అందరిని కోరుతున్నాము. అలా సహాయపడ దలచినవారు మాకు వ్రాసిన యెడల ప్రశ్నావళిని పంపగలము. వారు పంపే సమాచారము రహస్యంగా వుంచబడుతుందని హామీ యిస్తున్నాము.


మా పరిశోధనల ఫలితంగా మాకు సమాచారాన్ని యిచ్చే వారికి ఏవైనా సలహాలు యివ్వవలసి వస్తే వారికి స్వయంగా తెలుపుతాము.

చిరునామా: ప్రొఫెసర్, డిపార్టుమెంట్ ఆఫ్ జెనెటిక్సు, ఉస్మానియా విశ్వ విద్యాలయము హైదరాబాదు—7

దసరా పండుగ

ఫొటోలు: ఎన్. రామకృష్ణ
వ్యాసం: ఖులుసు వేంకటరమణయ్య

మన సంవత్సరం వసంత నవరాత్రులతో ప్రారంభమవుతుంది. సరిగ్గా మరి ఆరునెలలకి — అంటే సంవత్సర మధ్యకాలంలో దేవీ నవరాత్రులు—అంటే శరన్నవరాత్రులు వస్తాయి. వసంతోత్సవాలు



భవానీసాగర్‌లోని భవానిదేవి
(ఆధునికసాంప్రదాయం)

తొమ్మిదిరోజులే జరుగుతాయి కాని, శరదుత్సవాలు విజయదశమితో కలుపుకుని పది దినాలు చాలా వైభవంగా జరుగుతాయి. ఈ దశరాత్రోత్సవాలే దసరా పండుగ. పదిదినాలు వరసగా జరిగే ఉత్సవం యిదొక్కటే!

ఈ ఉత్సవాలలో దేవీపూజ ముఖ్యమైనది. నవరాత్రులలో దుర్గా లక్ష్మీ సరస్వతులు ముగ్గురు దేవతలకూ ప్రత్యేక పూజలు జరుగుతవి. మొదటి మూడు రోజులూ దుర్గాదేవికి, తర్వాతివి లక్ష్మీదేవికి, చివరి మూడుదినాలూ సరస్వతీదేవికీ విశిష్టమైనవి. కార్యసిద్ధి, సంపద, విద్య ఆ దేవతల పూజలవల్ల లభిస్తాయి.

ఈ సమయంలో రోగాలు—వర్షాలకారణంగా అధికంగా వుంటాయనీ, వాటివల్ల కలిగే బాధలను తప్పించుకొనుటకు గాను యీ విధంగా విశేషపూజలు జరుపుతారనీ కూడా అంటారు. పూజలతోపాటు కథా కాలక్షేపాలూ, వేద పారాయణాదులూ కూడా జరగడం ఒక విశేషం.

ఈ శరన్నవరాత్రులలో తొమ్మిదవదినం మహార్నవమి! ఆ దినమే ఆయుధపూజ చెయ్యడం యిప్పటి ఆచారం. ఆ ఆచారం యీ దరిమిలాను వచ్చినట్లుంది. విద్య కోరేవారు సరస్వతీపూజ చేసే రీతినే యీ దినం వివిధ కర్మాగారాలలో పనిచేసేవారు తమతమ ఆయుధాలను పూజిస్తారు.

మహార్నవమి మరునాడు విజయదశమి. ఆశ్వయుజ శుక్లదశమి సాయంకాలం నక్షత్రోదయ సమయానికి విజయం అని పేరు. అది సమస్తములైన కోరికలూ విజయం పొందడానికి తగినకాలం. దాన్ని బట్టే విజయదశమి అనే పేరు వచ్చింది. ఈ సంగతి



వాహూర్‌లోని పల్లవులకాలంనాటి దుర్గవిగ్రహం



పన్నెండుచేతులకాళి—దుర్గ
అవుదయార్‌కోయిల్ (చోళసాంప్రదాయం)

'అశ్వినస్య సితే పక్షే
దశమ్యాం తారకోదయే,
స కాలో విజయోనామ
సర్వకామార్థ సాధకః'.

అనే శ్లోకం తెలియజేస్తున్నది.

విజయుడు—అంటే అర్జునుడు నాటి దినం, శమీవృక్షంమీద నున్న ఆయుధాలను తీసుకుని, విరటునిగోవులను పట్టుకున్న కౌరవులమీదికిపోయి వారిని తానొక్కడూ ఓడించి విజయం పొందినట్లూ, అందువల్ల విజయదశమి అనేపేరు వచ్చిందనీ లోకంలో వాడుక. ఈ వాడుకను అనుసరించే కొన్ని శ్లోకాలు కల్పించడం, కొన్ని ఆచారాలు అమలుకి రావడం జరిగింది. నామసామ్యాన్ని బట్టి విజయదశమితో ఉత్తర గోగ్రహణ కథ అంటగట్టబడింది; అంతేకాని యిది వాస్తవం కాదు: కృష్ణపక్షంలో సప్తమినాడు సుశర్మ దక్షిణ గోగ్రహణం చేసినట్లూ, అష్టమినాడు ఉత్తర గోగ్రహణం జరిగినట్లున్నూ భారతంలోనే ఉన్నది.


ఒక్క భారత కథకే కాదు, రామాయణ కథక్కూడా విజయదశమితో సంబంధం వున్నట్లు కొందరంటున్నారు. శ్రీరాముడు రావణాసురుడి మీదికి యీనాడే దండెత్తి వెళ్ళాడట! కాని, రామాయణాన్ని బట్టి చూస్తే రావణవధ జరిగినది ఫాల్గుణ బహుళ అమావాస్యనాడు!

ఈ విజయదశమికి ఎక్కువ ప్రాశస్త్యాన్ని కూర్చడానికి యీ విధంగా భారత

రామాయణాలతో సంబంధం ముడిపెట బడి వుండవచ్చును.


వర్షాలు నిలిచిపోయి, ప్రయాణాలకు అనుకూలంగా వుండే కాలం శరదృతువు, అందలి విజయదశమినాడు జైత్రయాత్రకు బయలుదేరితే విజయం తప్పక లభిస్తుందని వీరులైన క్షత్రియుల అభిప్రాయం. దాడి వెడలుటకు ముందు దేవీపూజలు జరిపేరు, వారు. అందువల్ల యిది ప్రధానంగా క్షత్రియుల ఉత్సవమనీ చెప్ప వచ్చును.

ఇది విజయం సాధించ దలచినవారి పండుగమాత్రమే కాదు. పిల్లలకూ, మహిళలకూ కూడా ముఖ్యమైనది. శరన్నవరాత్రులు తొమ్మిదిరోజులూ యువతులు బొమ్మల కొలువును వైభవంగా జరుపుతారు. ప్రతిదినం సాయంకాలము పేరంటానికి పిలుస్తూ, పేరంటానికి పోతూ వుంటే చూడడానికి కన్నుల పండువుగా వుంటుంది. పిల్లలకు బొమ్మల కొలువు పెట్టిన ప్రతీ యింటా రకరకాల భక్ష్యాలూ, ఫలాలూ లభిస్తాయి. వాళ్ల ఆనందానికి హద్దు ఉండదు.



ధర్మపురంలోని అష్టాదశభుజ మహాలక్ష్మీ—దుర్గాదేవి
(ఆధునిక సాంప్రదాయం)

కొద్దియేళ్ల కిందటి దాకా దసరా దినాల్లో వీధిబడుల్లో చదువుకుంటున్న పిల్లలు రంగు రంగుల వెదురువిండ్లు పట్టుకున్ని, ఉపాధ్యాయుల అధ్వర్యంతో ఊరిలో తిరుగుతూ శ్రీమంతుల యిండ్లకు పోయి పదాలూ, పద్యాలూ చదువుతూ గృహ యజమానులపైని పూవుటమ్ములను వేసేవారు. (ఆచారం యిప్పటికీ సకృత్తుగా వున్నది.)



తిరువారూర్‌లోని దుర్గ
(చోళ సాంప్రదాయం)

ఆ శ్రీమంతులు సంతోషంతో పిల్లలకు పప్పుబెల్లాలూ, గురువులకు కానుకలూ సమర్పించేవారు.

ఈ ఆచారంకూడా యిది వీరులపండుగ అనే విశదం చేస్తూ ఉన్నది.

తొలిరోజున ఆయుధపూజ జరపడమూ, మలిరోజు విజయయాత్రకు బయలుదేరడమూ, ఎప్పటినుంచి ఆచారానికి వచ్చిందో?

ఒకటి చెప్పడం మరిచిపోయాను.

విజయయాత్రకు ముందు — తమకు తప్పకుండా విజయం కల్గడంకోసం అపరాజితా దేవతాపూజ జరపడం మొదట ఆచారమై వుండేది. పేరునుబట్టే ఆదేవత పరాజయం కలగకుండా చూచేదని తెలుస్తున్నది. క్రమంగా దేవతాప్రాధాన్యం తగ్గి అపరాజిత అనే ఓషధికి ప్రాముఖ్యం వచ్చింది. దాన్ని రక్షగా చేతికికట్టుకోవడం ఆచారమైంది. క్రమంగా ఆ ఆచారాలు అంతరించాయి.

ఆయుధపూజే యిప్పట్లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది.



బొమ్మల కొలువు

ఢిల్లీ వెళ్ళేముందు శ్రీమతి మురుగమ్మ నిజలింగప్ప

'నాకుండే రాజకీయాలన్నీ నాలుగు గోడలమధ్య ఇల్లు సరిగా నిర్వహించుకోటమే...'



శ్రీమతి మురుగమ్మ నిజలింగప్ప

బెంగుళూరు వదలి ఢిల్లీ వెళ్ళవలసిన రోజు వచ్చింది. శ్రీమతి మురుగమ్మ నిజలింగప్ప ఇంతకు ముందు ఢిల్లీ వెళ్ళకపోలేదు. శ్రీ నిజలింగప్ప పార్లమెంటు సభ్యులుగా ఉన్నప్పుడు, ఇతర సందర్భాలలోనూ కూడా ఆమె ఢిల్లీ అప్పుడప్పుడు వెళ్ళివచ్చారు. కాని ఏదో ఒకటి రెండు రోజులు చుట్టపు చూపుగా యాత్రికులు వెళ్ళినట్టు వెళ్ళడం, బంధుమిత్రులను చూడటం, కాన్ఫరెన్సు చూడటం, చూడవచ్చిన బంధుమిత్రులకు ఆతిథ్యం ఈయటంగా ఉన్న రెండురోజులూ గడిపి తిరిగి రావటం అవుతుండేది. కాని ఈసారి అలాకాదు. కాంగ్రెసు అధ్యక్షుల గృహిణిగా, ఆయన ఇల్లు చక్కదిద్దుతూ భర సౌకర్యాలు చూస్తూ 'కరణేషు మంత్రీ' అన్నట్లు ఆయనకు హితం గరపుతూ భారత గృహిణి ఆదర్శంతో రెండేండ్లు అక్కడ ఇల్లు చూచుకోవాలి.

ఆ మర్నాడే విమానంలో బయలుదేరి ఢిల్లీ వెళ్తున్నారు. ఆమెకు పని తీరకుండా ఊపిరాడకుండా ఉన్నది. ప్రయాణానికి సామానులన్నీ సర్దాలి. ఆయన బట్టలు కాగితాలు, స్వంతవస్తువులన్నీ వేరుగా అమర్చాలి. తక్కినవాటితో అవి కలవరాదు. ఎటులేదన్నా పిల్లాపీచు మొత్తం ఎనిమిదిమందైనా రేపువిమానంలో ఢిల్లీ వెళ్తారు. ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్ళు వారివెంటే వస్తున్నారు.

"ఢిల్లీ చేరుకొన్నప్పటి నుండి ఇకవారి పనులు ప్రారంభమవుతాయి. ఇంటి పనులు చూచుకొనే తీరిక ఉండదు. ఇక్కడ బెంగుళూరులో చూడవలసిన చుట్టాలను స్నేహితులను చాలమందిని ఇంకా చూడటమే పడలేదు. కాంగ్రెసు అధ్యక్షులయి ఆరు నెలలయింది. ముఖ్యమంత్రి బాధ్యత వదలుకొని రెండు నెలలయింది. కాని తీరా ఢిల్లీ ప్రయాణ మనాలని రెండురోజుల క్రితందాకా చెప్పనేలేదు. 'బాలబ్రూయి' ఖాళీ చేయించి ఈయాలి. అక్కరలేని సామానులన్నీ కట్టకట్టి చిత్రదుర్గ పంపాలి. ఇంక ఈరోజు పనులు తీరినట్లే. "ఆయన ఎప్పుడూ ఇంతే!" అంటున్నారు శ్రీమతి మురుగమ్మ.

మేము 'బాలబ్రూయి' వెళ్ళేటప్పటికి, మురుగమ్మగారు మనుమడికి తలంటి నీళ్ళు పోస్తున్నారు. ఢిల్లీ వెళ్ళాక సోమవారం వాడికి తలంటి నీళ్ళు పోయటం కుదరదేమోనని ఇన్ని పనులున్నా ఆ హడావిడిలోనే ఈపని కూడా ఇవాళే పెట్టుకున్నారు. పిల్లల పోషణ నౌకర్లకు వదలటం ఆమెకెప్పుడూ మనస్కరించదు. వాళ్ళ స్నానాలు, దుస్తులు, ఫలహారాలు తిండితిప్పలు నిద్రలు అన్నీ ఆమె స్వయంగా చూచుకొనిదే ఆమెకు తృప్తి ఉండదు.

ప్రొద్దున్నపూట మనుమలను చూచి వారిని బడికి పంపించే వరకూ వాళ్ళతాతగారి పనులు చూచేందుకు కూడా ఆమెకు క్షణం తీరదు. "పిల్లల విషయం ముందు చూడాలి" అని ఆమె భావం. స్త్రీకి తన పిల్లలవిషయం ముందు చూచుకోవటమే ప్రథమకర్తవ్యం అంటారు ఆమె.

మేం విలేఖరులమని మా వచ్చిన పని చెప్పాం. "చూడండి! నేను రాజకీయవేత్తనుకాను. కాబట్టి మీకుకావలసినవన్నీ ఆయన నడగండి. వారికి చాలా తెలుసు చెప్తారు" అంటూ ప్రక్కగదిలో ఎవరితోనో తీవ్ర సమస్యఏదో చర్చిస్తున్న తన భర్తను చూపారు. "నా జీవితం పనులూ అన్నీ యీ నాల్గుగోడల మధ్యనే. నా యిల్లేమో, నా పిల్లలేమో, నా కుటుంబమేమో ఇది తప్ప నాకు వేరే లోకం లేదు. ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబం తప్ప వేరే ఆలోచన ఉండనేరాదు" అని ఆమె అన్నారు. కాని భార్య చెప్పేమాట శ్రీ నిజలింగప్పకు వంటపట్టదుగదా! కర్మ!"

మురుగమ్మ పుట్టినిల్లు చిత్రదుర్గం. అప్పట్లో మైసూరులో జిల్లా కేంద్రంగా ఉండేది. అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు ఆర్గురున్నారు. సెకండరీ పాఠశాలలో ఆమె చదువుకొన్నారు. "అప్పట్లో పరీక్ష ఫీజు రు 12 కట్టే పరీక్షకన్నా పెద్ద పరీక్ష ఆడపిలలకు ఉండేదే కాదు" అని ఆమె అన్నారు.

జాతీయ సత్యాగ్రహసమర సమయంలో శ్రీమతి మురుగమ్మ నిత్యం భర్తకు అండగా నిలిచారు. శ్రీ నిజలింగప్ప సత్యాగ్రహసమరమంతా బయట సాగేది. ఆమె తన ఇంటినాల్గుగోడలు విడిచి, కుటుంబాన్ని వదలి బయటికి పోలేదు.

ఆమె తొమ్మండుగురు పిల్లలతల్లి. తన జీవితం తన కుటుంబానికి అంకితం చేసుకొంది. వారిని నిజమైన భారతమాత సంతానంగా పెంచి పెద్దలను చేయటానికే తన కాలమంతా వినియోగించింది. అప్పట్లో శ్రీ నిజలింగప్ప రాజకీయాల్లో క్షణం తీరని సత్యాగ్రహ సమరాల్లో మునిగి ఉండేవారు. పిల్లల పోషణ, చదువుసంధ్యలు, విద్యాబుద్ధులు గరపటం అంత బాధ్యత శ్రీమతి మురుగమ్మగారే వహించారు. పిల్లలకు చదువు ఏమాత్రం ఎక్కడా కుంటుపడకుండా శ్రద్ధవహించారు. నిత్యం శ్రీ నిజలింగప్పకు ప్రోత్సాహం కల్పిస్తూ ధైర్య సాహసాలకు ప్రోదిగా నిలచారు.

"ఆయన రాజకీయాలు, రాజకీయ జీవితం చేపట్టారు. ఆ జీవితంలోపడ్డ మనిషికి ఇతరగ్ర విషయాలేవీ చూచుకొనే తీరిక ఉండదు. వేళకు తిండి నిద్రకూడా ఆయనకు ఉండవు. కాని ఏం చేస్తాం, ఆయన ఆ జీవితం ఎన్నుకొన్నారు, దేశానికి అలాంటివాళ్ళు కొందరు కావాలి. అలా అనుకొనే మనం ఊరటపడాలి" అని ఆమె అన్నారు.

నిజంగా ఆమె కుటుంబం పెద్దది. ఆర్గురు కుమార్తెలు, ముగ్గురు కుమాళ్ళు, నిత్యం ఇంటికి వస్తూ పోతూ ఉండే చుట్టాలు, స్నేహితులుకూడా ఎందరో ఉంటారు. ఆమె స్వయంగా వారందరి ఆతిథ్యం కనిపెట్టి చూచుకొంటుంది.

"నాకు ఇరువైనాల్గు గంటలూ తీరని పని ఉంటూనే ఉంటుంది. నాకుండే రాజకీయాలన్నీ ఈ నాల్గు గోడల మధ్య ఇల్లు సరిగా నిర్వహించుకోటం

మాత్రమే" అంటూ ఆమె చిరునవ్వు నవ్వారు. ఊళ్ళో రాజకీయ సభలూ సమావేశాలూ సాంఘిక సభలూ ఆమెకు పట్టవు.

"భారత స్త్రీకి, ఒక్క భారతస్త్రీ అనేమిటి, ఏ స్త్రీకైనా, స్థానం గృహంలోనే. ఇల్లు చక్కదిద్దుకొని చదువుసంధ్యలు చూచుకొని, తలిదండ్రులకూ సంఘానికీ కూడా పేరు తెచ్చే వారుగా వారిని చేసుకోగలిగితే, ఆడదానికి అంతకన్నా మరేం కావాలి?" అని శ్రీమతి నిజలింగప్ప అన్నారు. "గృహిణీ గృహముచ్యతే" అన్న సామెత అక్షరాలా నిజం. భర్త రాజకీయ జీవితం ఎన్నుకొన్నా సాంఘిక జీవనం ఎన్నుకొన్నా భార్య ఇట్టి వైఖరికన్నా అతడికి ధైర్యస్థైర్యాలను చేకూర్చగల్గినది మరి ఏముంటుంది.

తన భర్తపై వచ్చే దుష్ప్రచారాలకు ఆమె బాధపడతారు. "ఇలాంటి అన్యాయపు మాటలన్నీ పడే మాత్రానికే ఎందుకిల్లా రాత్రింపగళ్ళు వళ్ళుహూనం చేసుకోవాలని అడుగుతా! మావారు పార్లమెంటు సభ్యులుగా ఉన్నప్పుడు వారికి లక్ష రూపాయల ఆస్తి ఉందన్నారు. మరి ఎక్కడ ఉందో నాకు తెలియదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెంగుళూరులో ఆయనకు పది బంగళాలున్నవని ఆడిపోసుకొన్నారు. పది బంగాళాలు ఉంటే ఇవాళ ఈ సామానులన్నీ సర్దవలసిన పని నాకేముంది? అక్కరలేని వన్నీ చిత్రదుర్గం కట్టకట్టి పంపాల్సిన అవసరం ఏముండేది. ఏమోలే! రాజకీయాల్లో పడ్డాక అవి తప్పవేమో. ఈ రాజకీయాలలో ఉన్నవారికి ఈ దుష్ప్రచారాల జాడ్యమేమిటో, అంతకన్నా జరిగినదేదో జరిగాయనుకొని క్షమించుకొని మరచిపోయి, అందరూ కలిసి కట్టుగా పని చేసుకోలేరెందుకో!" అని ఆమె నిట్టూర్చారు.

"బెంగుళూరు వదలిపెట్టి అంతదూరం ఢిల్లీ పోవాలంటే నిజంగా బాధగానే ఉంది. కొత్త మొహాలు, కొత్త భాష, కొత్త పరిసరాలు, బంధువులు, మిత్రులకు దూరంగా కొత్తదేశం" అని ఆమె అంటూంటే, "అన్నీ కొత్తలు, చూడటం మంచిదేగాదండీ!" అని మేము అన్నాము.

"మీ రన్నమాట నిజమే, ఇవన్నీకొత్త. కాని అక్కడ ఉండే జనం, మన పాత సంస్కృతితో మన జనమేకదా! వాళ్ళదీ భారత సంస్కారమేకదా!" అని ఆమె మానోళ్ళు కట్టి వేశారు.

"అమ్మా! నిజలింగప్పగారు బయట ఎప్పుడూ నవ్వుతూ కనబడతారు. కోపం అనేదే కనబడదు. ఇంట్లోకూడా అలా ఉంటారా, లేక బైటి ప్రపంచం మాత్రానికేనా?" అని అడిగాం. "నిజమే ఆయనకు ఎప్పుడో తప్ప కోపం రానేరాదు. పిల్లలమధ్య ఉంటే ఆయనకింకేమీ అక్కరలేదు". అని "కాని కోపం తెచ్చుకొనేందుకు ఆయనకు అతీరికకూడా చాలానే ఉంది" అంటూ భర్త లోపలికి రావటం చూసి అన్నారు.

"మీ అర్ధాంగి గారిని గురించి ఏమైనా చెప్తారా?" అని శ్రీ నిజలింగప్పగారిని అడిగాం. ఆయన నవ్వుతూ "ఇదిగో నా ఇల్లు అంతా చూచారుగా, ఇదంతా ఇల్లాలి కృత్యమేగా!" అంటూ ఆయన అందరినీ నవ్వించారు. ●

ప్రొఫెసర్ సి. ఆర్. రావు



లండన్ రాయల్ సొసయిటీలో సభ్యుడు కాగలిగిన ఆంధ్రుడు ప్రొఫెసర్ కలియంపూడి రాధాకృష్ణరావు ఒక్కరే. ఇదివరలో ఈ గౌరవం మొత్తం పదిహేను మంది భారతీయులకి మాత్రమే దొరికింది. వారిలో కొందరు— శ్రీనివాస రామానుజం, సి. వి. రామన్, జె. సి. బోస్. నేడు జీవించి ఉన్న ఎఫ్. ఆర్. ఎస్. బిరుదుకల ఆరుగురిలోనూ ప్రొ. రావుగారే చిన్నవారు. ఆయన చదువుకున్న శాస్త్రం 'స్టాటిస్టిక్స్' (సాంఖ్య శాస్త్రం?). మనదేశంలో వారిలో ఈ శాస్త్రంలో పేరు పొందిన మరొకరు ప్రొఫెసర్ పి. సి. మహలనోబిస్. రావుగారు వీరి శిష్యులు. ఇద్దరూ ఎఫ్. ఆర్. ఎస్‌లే !

రావుగారు 1920 లో పుట్టారు. ప్రాథమిక విద్య కావలి, నూజివీడు, నందిగామల్లో జరిగింది. విశ్వ విద్యాలయ విద్యాభ్యాసం విశాఖ పట్నంలోని ఎ. వి. ఎన్. కాలేజితో ప్రారంభం అయింది. ఇంటర్మీడియట్‌లో విశ్వవిద్యాలయంలో మొదటి వారుగా ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. 1940 లో వారు స్టాటిస్టిక్స్‌లో ఎం. ఏ. (మొదటి క్లాస్‌లో అందరికన్నా పయిన) డిగ్రీ తీసుకుని కలకత్తా వెళ్లారు. అవి ప్రపంచ యుద్ధపు రోజులు. రావుగారు మిలిటరీలో చేరుదామను కున్నారుట కాని, అక్కడ ఒక వ్యక్తిని కలవటం జరిగింది. ఈ వ్యక్తి కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తూ ఉండేవారు. ఒకసారి వారితో ఆ సంస్థకి వెళ్ళిన రావుగారు తామూ అందులోనే చదువుకుంటే బాగుంటుందనుకుని అక్కడ చేరారు. 1943 లో స్టాటిస్టిక్స్ ఎం. ఏ. డిగ్రీ (ఫస్ట్‌రాంక్, ఫస్ట్‌క్లాస్!) తీసుకున్నారు.

పి. హెచ్. డి. డిగ్రీ 1948 లో కేంబ్రిడ్జిలో తీసుకున్నారు. (ఆ విశ్వ విద్యాలయం వారు డా. రావుగారి పరిశోధనలని మెచ్చి 1965 లో తాము ఇవ్వగలిగిన డిగ్రీలన్నిటిలోనూ అధికమయిన ఎస్. సి. డి. డిగ్రీ ఇచ్చారు.) 1946 లో రావుగారు ఆఫ్రికాలో దొరికిన పురాతన అస్థి పంజరాల పరిశోధనకి స్టాటిస్టిక్స్‌ని వాడారు. ఈ వాడకం ఫలితాలని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం వారు గ్రంథ రూపంలో ప్రచురించారు. కేంబ్రిడ్జిలో రావుగారు సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు రోనాల్డ్ ఫిషర్‌తో కలిసి పనిచేశారు.

1948 లో స్వదేశానికి తిరిగి వచ్చిన డా. రావుగారు ఇన్‌స్టిట్యూట్‌లో తమ 28 ఏట ప్రొఫెసర్‌గా నియమితు లయ్యారు. ప్రస్తుతం అక్కడే 'రిసర్చ్ అండ్ ట్రెయినింగ్ స్కూల్' డయిరెక్టరుగా ఉంటున్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారంటే ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రాధాన్యత ఎటువంటిదో వూహించవచ్చు.

ప్రొఫెసర్ రావుగారు స్టాటిస్టిక్స్‌లో అనేక కొత్త పద్ధతులని ప్రవేశపెట్టారు. ఇవన్నీ ఇప్పుడు పేరుమోసిన గ్రంథాలలోకి ఎక్కిపోయాయి. ఈ పద్ధతులు వ్యవసాయం, పశుపోషణ, ప్రణాళికలు, జనాభాలెక్కలు— వీటికి సంబంధించిన లెక్కలలో వాడుతున్నారు.


రావుగారు ప్రపంచంలో ఎన్నో విశ్వవిద్యాలయాలలో 'విసిటింగ్ ప్రొఫెసర్‌గా' పని చేశారు. ప్రపంచంలో ఎన్నో సంస్థలలో పదవులని అలంకరిస్తున్నారు.

1963 లో వీరికి శాంతిస్వరూప్ భట్నగర్ బహుమతి వచ్చింది. ఆ ధనం మొత్తాన్ని రక్షణ నిధికి విరాళంగా ఇచ్చేశారు. ●

రావుగారికి ఎన్నో బిరుదులు, సన్మానాలూ, పతకాలూ వచ్చాయని వేరే చెప్పనక్కరలేదు. 'సాంఖ్య' అనే స్టాటిస్టిక్స్ శాస్త్రానికి సంబంధించిన పత్రికకి సహసంపాదకులు ప్రొఫెసర్ రావుగారు. వీరి సతీమణి శ్రీమతి భార్గవీదేవి కలకత్తాలోని ఒక కళాశాలలో అధ్యాపకులుగా ఉంటున్నారు. రావు దంపతులకి ఇద్దరు సంతానం, ఒక కుమారుడు, ఒక కుమార్తె.

—డా. ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

పెద్దకథ



(గత సంచిక తరువాయి)

అతను నవ్వుతుంటే, అతను తనవైపు చూస్తుంటే, ఎందుకో చిరాగ్గా కోపంగా వుంది. ఇతని వల్లనే ప్రభుదాసును పోగొట్టుకున్నాననిపిస్తుంది. చాలా చిత్రమైన నింద అది. ఆ విషయం నా మనసుకీ తెలుసు. ఆరోజు మొదటి మారుగా అతను నన్ను దగ్గరకు తీసుకున్నపుడు ఏ అనుభూతీ కలగలేదు. చిన్నప్పుడు, ప్రక్కింటి మురళితో, మాధవితో ఆడుకున్నట్లే వుంది. ఆ రోజు వివాహ శుభలేఖ ఇవ్వడానికి వెళ్ళినపుడు...ప్రభుదాసు స్పర్శలో ఎంత మాధుర్యం వుంది! సర్వం మరచి పోయిందప్పుడు. అలా ... అలా వుండాలి. ఎవరో ఛళ్ళున కొరడాతో కొట్టినట్లయింది. 'భర్త కౌగిలిలో ఏమిటీ దౌర్భాగ్యపు ఆలోచనలు?' నన్ను నేను తిట్టుకుని అతని ఛాతిమీద దిండు మీద పడుకున్నంత హాయిగా పడుకుని అతను చెప్పేవి వింటున్నాను. అతను వున్నట్టుండి పిలిచాడు. 'గోపికా?'

'ఆ'

'నీకీ పేరు ఎవరు పెట్టారు?' నవ్వుతూ అడిగాడు.

'అమ్మ. ఆమె కృష్ణ భక్తురాలు.' ముభావంగా చెప్పి భర్త సమక్షంలో కూడా అమ్మ స్మృతులలోకి జారిపోయాను.

నిజానికి ఆమెకు అతి సౌందర్యవంతుడయిన వంశీమోహనుడంటె భక్తి కంటె ఆరాధన ఎక్కువ. ఆమె ప్రకృతి ఆస్వాదకురాలు. కృష్ణుడు, రాధ, గోపికలు కూడా ప్రకృతిలో భాగాలే అంటుంది. మురళీ కృష్ణుణ్ణి ఆమె ఆరాధించే వైనం నాన్నగారికి కూడా తెలుసు. ఎప్పుడైనా వేకువఝామున్నే మెలుకువ వస్తే భార్యతోపాటు పూజ గదిలోకి వచ్చి, 'ఈ రోజు నా సవతి మొగుణ్ణి నేనూ పూజిస్తాను యశోదా' అంటుంటారు హాస్యంగా; ఆమె తన పిల్లలందరికీ కృష్ణుడివి, అతని ఇష్టాల పేర్లు పెట్టింది. పెద్దక్క పేరు మాధవి. రెండో అక్క పేరు రాధిక, మూడో అక్క పేరు బృంద, అన్నయ్య పేరు మురళి, తమ్ముడి పేరు కృష్ణ. తనకే ఏ పేరూ మిగలక గోపిక అని పెట్టింది.

'గోపిక ఏం పేరు? రాధా! అని పిలుస్తాను' అతను నవ్వుతూ అన్నాడు. అతని కళ్ళల్లోకి చూచాను. అవి కూడా నవ్వుతాయేమోనని. కానీ ఆ గాజు కళ్ళు వెల వెల పోతున్నాయి. ఆ గాజు కళ్ళ దోషానికి ఆ అమాయకుడికి శిక్ష విధించాలనుకున్నాను. కోపంగా అన్నాను.

'గోపిక గోపికే, రాధ రాధే! గోపికా, రాధా కృష్ణుడికి ఒకటే ఎలా అవుతారు?'

అతను ఉడుక్కోలేదు. ఇంకా నవ్వుతూనే అన్నాడు.

'కానీ ఈ మాధవుడికి రాధా గోపికా అంతా నువ్వే'.

అతని నోటివెంట విన్న రాధ గోపిక శబ్దాలలో ఏ మధురత్వమూ గోచరించలేదు. ఈ ఇంట అడుగుబెట్టిన ప్రభుదాసు 'గోపికా!' అని పిలిచినపుడు ప్రతి అణువూ ఎలా స్పందించిందనీ!

అతని ఛాతి ముళ్ల పాన్పులా అన్పించింది. మెల్లగా వచ్చి అటు తిరిగి పడుకున్నాను. అతనేమీ అనలేదు.

* * *

మర్నాడు సాయంత్రం ప్రభుదాసు కృష్ణుడికి పాఠాలు చెప్పడానికి మామూలుగా వచ్చాడు. తన పెళ్లి కాకముందు మధురమైన ఊహలలో తేలిపోతూ అతనికి ఎలా ఎదురుపడాలని ఊహించుకుందో అలాగే ఎదురైంది. కానీ ఈ కలయికలో ఆ అనుభూతి లేదు. ఏదో వెలితి వుంది. అతను సన్నగా నవ్వి, గబగబ కృష్ణుడి గదిలోకి వెళ్లి పోయాడు. ఆ నవ్వు స్పృహ కోల్పోయేలా చేసింది. తీరా స్మృతి వచ్చాక, తన దురదృష్టానికి కారకుడైన భర్తమీద కోపం పెంచుకుంది. ఆ నిర్దోషిని శిక్షించ సాగింది. అనురాగ పూరితమైన అతని కౌగిలినుండి బలవంతంగా తప్పించుకుని ముఖం చేతులలో కప్పుకుని కూర్చున్నాను.

'ఇతనివల్లే...ఇతనివల్లే, తను సౌభాగ్యాన్ని కోల్పోయింది. తను అటూ, ఇటూ

ఊగిసలాడేప్పుడు బలవంతంగా తన జీవితంలోకి ప్రవేశించాడు'

'ఇతనువద్దు నాకు. ఈ పాలరాతి మహాశిల్పం తన కక్కరలేదు. సజీవమైన నవ్వు కావాలి. నాకు కావలసింది విశాలమైన 'గాజాకళ్లు కాదు...భగవాన్! నేను పొరపడ్డాను. ఈ మంచితనం ఒక్కటే చాలదు నాకు. కొస్త అనుభూతి కావాలి. కొస్త చాలు' కళ్లు కోపంతోనూ, రోషావేశాలతోనూ ఎర్రబారాయి. ఆవేశంతో శరీరం వణకసాగింది. అతను దగ్గరగావచ్చి లాలనగా అడిగాడు.

'ఏమైంది నీకు?'

'మీ కెందుకు నాకేమయితే' ఉలిక్కిపడ్డాడతను.

'గోపికా!' రెండు చేతులతో పొదివిపట్టి లేవదీయబోయాడు.

'క్షమించండి. నన్ను కొన్నిరోజులు సర్దుకోనివ్వండి. మీరంటే నాకేభావమూ కలగడం లేదిప్పుడు.' చటుక్కున వదిలేసి గిరుక్కున వెనక్కుతిరిగి తలుపు తీసుకుని వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయిన దిక్కే చూస్తూ అనుకున్నాను. 'తొందర పడ్డాను' అని.

'మగవాడికి ఎంత అవమానం అది!... ఏం చేయగల దిప్పుడు'

భవిష్యత్తును అతి భయంకరమైన ఊహలో వదిలపరుస్తున్న నేను తలుపు చప్పుడవడంతో ఉలిక్కిపడ్డాను.

'పాపా! అతనలా వెళ్లిపోయాడేమమ్మా' ఆ మాతృమూర్తి ముందు మొదటిమారుగా అబద్ధమాడాను.

'ఒక పేషంటుకు వస్తానని మాటిచ్చారటమ్మా...ఇప్పుడే వస్తానని వెళ్లారు.'

'అహా...సరే... సరే' ఆమె వెళ్లిపోయింది.

కూతురి అబద్ధాన్ని ఆమె పూర్తిగా నమ్మింది. ఆమె కంతటివిశ్వాసం కూతురి మీద.

మర్నాటికి అతను మామూలు మనిషిలా అయ్యాడు. ఏమీ జరగనట్టే ప్రవర్తించేవాడు. అదే తనకు నచ్చనిది. అంతమాత్రం పౌరుషం లేదేమి? అతనిలో రక్తం ప్రవహించడంలేదా?

రోజులు గడిచేకొంది అతనంటె ఏదో వాత్సల్యం, ఆప్యాయత, అనురాగం కలగసాగినా, వాటన్నింటి వెనకా బలవత్తరమైన శూన్యమేదో తనను చుట్టుముట్టి నిలవనీకుండా చేస్తోంది.

పేషంట్ల కష్టాలను తనవిగా తీసుకుని అతను అశాంతితో సతమత మవుతుంటే ఓదార్చేది. తలనొప్పివస్తే అమృతాంజనం రాసేది. వేళకు కొసరి కొసరి వడ్డించేది. అతని బట్టలన్నీ స్వయంగా దగ్గరుండి ఉతికించి సర్ది పెట్టేది. వేళకన్నీ అమర్చి పెట్టేది. ఈ పనులన్నీ—మనస్ఫూర్తిగా చేసేది. కానీ అతనిని భర్తగా ఆలోచించాల్సి వచ్చినపుడు, ప్రభుదాసు స్పర్శతో ఇతని స్పర్శను పోల్చవలసివచ్చినపుడు అశాంతితో గిలగిలలాడిపోయేది. ఎక్కడో ఒకమూల ప్రభుదాసును పొందలేకపోయాననే ఆలోచన ఒక్కచోట స్థిరంగా నిలవనీకుండా చేస్తోంది. అతని చిరునవ్వు, కళ్లలో మెరుపు, పెళ్లి అని తెలిసి అతనుపడ్డ ఆవేదన, పెళ్లినాటి అతనికళ్లల్లో నీళ్లు నన్ను నరకద్వారాల సమీపానికి తీసుకెళ్లి వెనక్కు నెట్టేవి.

ఇదికాదు. ఇదికాదు తను కోరుకుంది. ఈ సేవలన్నీ తను పుట్టింట్లో నాన్నగారికీ చేసింది తమ్ముడికీ, అన్నలకీ చేసింది. ఇందులో క్రొత్తేముంది? ప్రత్యేకతేముంది? వీటన్నిటికీ భిన్నంగా తనను వేరే లోకాలలో సంచరింపజేయగల అనుభూతిని పొందగలిగాలి. ఏ అనుభూతినీ మిగుల్చుకోలేని ఈ సేవలలో అర్థమేముంది?'

ఒకరోజు సంధ్య, నిశికాంతతో చేతులు కలిపి ఆహ్వానించే క్షణంలో బలమైన ఊహల తాలూకు రెండు హస్తాలు నన్ను బిగువుగా బంధించి, తప్పించుకోవడానికి వ్యవధిలేకుండా చేసాయి. పొందలేని అనుభూతి తాలూకు మధురమైన ఊహల ఆకర్షణనుండి బయటపడడం నా వల్ల కాకపోయింది. నిజానికి తప్పించుకోవాలని కూడా అన్పించలేదు.

ఒకవైపు భర్తనుండిపొందే అశాంతి, మరొకప్రక్క ప్రభుదాసు ఊహలలో కలిగే అనుభూతి తనను వివేకహీనను చేసేసాయి. పోగొట్టుకున్నదానిని పొందాలనే ఆరాటంలో పరుగు తీసానేకాని దాని ఫలితం ఇవ్వబోయే అశాంతినిగురించి ఆలోచించలేదు.

అసంతృప్తి అణువణువునా ప్రాకిపోయి విరక్తి నా శరీరాన్ని ముంచెత్తే సమయంలో, ఒకేఒక్క ఆలోచన ఆశాకిరణంలా అగుపించింది. అంతకంటె ఇందులోనుండి బయటపడే మార్గం కన్పించలేదు.

'గోపికా. మీరా ... ఇంత రాత్రప్పుడు ఒంటరిగా...ఆయనను తీసుక రావలసింది'

అతను తడబడ్డాడు.

'నేనేమంత పిరికిదానిని కాదులే' ఇక్కడ భర్త ప్రసక్తి తేవడంతో కొస్త ఘాటుగానే జవాబిచ్చాను.

అతను నవ్వాడు.

'మీరు కోపగించుకోకపోతే ఒక్కమాట గోపికా. మీరు మీ జీవితసమస్య గురించే పిరికిగా ఆలోచించారు. ఇప్పుడు క్రొత్తగా మీరు పిరికివారు కాదు అంటె నే నెలా నమ్మడం?'

'అంటే మీ ఉద్దేశం?'

'మీరు దేనిని కోరుతున్నారో దానిని తెలుసుకోవడానికి భయపడ్డారు'

అసలే విసిగి వేసారి పోయున్నాను. దాంతో ప్రభుదాసు మాటల్లోని వేదాంతం నన్ను రెచ్చగొట్టింది.

'అయితే ఆనాడే నా కెందుకు తెలియ జెప్పలేదు?'

'నాకా అవకాశం ఇవ్వలేదు మీరు' సన్నగా గొణిగా డతను.

'నన్ను దోషిగామాత్రం నిలబెట్టకండి గోపికా!' అతనికంఠం ఆర్ద్రమయింది. అతని చూపులలో అనంతమైన భావాలు.

'లేదు లేదు. ఈ దోషంలో మీకు భాగం పంచను. దోషిని నేను. శిక్ష నేనే అనుభవించాలి.' అతను మాట్లాడలేదు. ఎప్పటిలాగే ఆరాధనా పూర్వకంగా చూస్తున్నాడు. ఆ కనుపాపల్లో క్రొత్తగా ఏదో పూజ్యభావం కూడా వుంది. అతని చూపులను ఎదుర్కొనే శక్తి ఈ నాటికీ నాకు లేదు. తలవంచుకుని వణికే కంఠంతో అన్నాను.

'నన్ను ఎక్కడికైనా తీసుకపో ప్రభూ'.

'ఎక్కడికి?'

'ఎక్కడికైనా సరే ... ప్రశాంతమైన చోటికి.'

'ప్రశాంతత—' అతని పెదాలు గొణిగాయి' అది మనస్సులో కాక మరెక్కడుంటుంది?'

'ఉహూఁ... నాకు సాధ్యం కావడంలేదు. ఇన్ని రోజులు వేచి చూసాను. ఇక ఓపిక లేదు. ప్లీజ్... కాదనకు' అతను ఐదు నిముషాల మౌనం తర్వాత అన్నాడు, 'సరే. మీ ఇష్టం.'

'అయితే ఇప్పుడే వస్తాను.'

ఇంటికి వచ్చేసరికి గోడనానుకుని వెన్నెల్లోకి చూస్తున్నారాయన. వెన్నెల్లో తడిసిన పాలరాతి శిల్పంలా మెరుస్తోంది, ఆ మూర్తి స్వరూపం.

నా పాదాల చప్పుడుకి ఇటు తిరిగాడు. 'రా, గోపికా!'

'నేను వెళ్తున్నాను' ఉపోద్ఘాతం లేకుండా చెప్పాను.

'ఎప్పుడు?' అతని కంఠంలో ఎటువంటి వికారమూ లేదు.

'ఇప్పుడే' అతను అతి మామూలుగా విన్నాడు. ఈ మనిషికి తన భార్య ఎక్కడికి వెళ్ళేది తెలుసుకోవాలనే ఆసక్తి కూడా లేదా?' వుండబట్టలేక అడిగేసాను. అతను సన్నగా నవ్వి అన్నాడు.

'నువ్వు ఎక్కడికి వెళ్ళినా తిరిగి నా దగ్గరకు వస్తావు.'

'ఏమిటి గ్యారంటీ?'

'నా నమ్మకం' అతని నమ్మకానికి విస్తుపోయాను.

ఆకర్షణ

'పోనీ ఎక్కడికి వెళ్తున్నాననయినా కుతూహలం లేదా మీకు.' అతని నమ్మకంలో నా పౌరుషం తగ్గిపోసాగింది.

'ఎందుకులేదు?? కానీ అడిగితే నువ్వు బాధపడ్తావు ... నువ్వు సర్దుకునేవరకూ నేను వేచివుండగలను. అది ఎంత కాలమైనాసరే' చాలా దృఢంగా చెప్పాడు.

ఆ మంచితనంతో విసిగిపోయి రెచ్చిపోయాను.

'ఇంతే మీరు నన్నర్థం చేసుకుంది. ఈనాడేకాదు ఏనాటికీ మీరు అర్థంచేసుకోలేరు. ఆ సమయంకూడా మించిపోయింది.'

అతను ఆశ్చర్యాన్నుండి తేరుకోకముందే అక్కడనుండి వచ్చేసి, ఆగడప దాటేసాను.

ప్రభుదాసు రూము దగ్గరపడే కొలదీ నా మనస్సు పదేపదే హెచ్చరించ సాగింది.

పెళ్ళయిన మరునిముషమే స్త్రీకి మాతృత్వం లభిస్తుంది. శిశువుకు తల్లి కాకముందే భర్తకు తల్లి అవుతుంది. ఒక్కక్షణం, నాఒడిలోవున్న భర్తను ఊహించుకున్నాను. ఎంత పసివాడు! నాలో ఎంత నమ్మకం!! రేపీవార్తవిని 'నాగోపిక ఇలాచేయదు' అని తలబద్దలు కొట్టుకుంటాడుకాబోలు.

ఎంత వద్దనుకున్నా అతనికళ్ళలోని ఆప్యాయత, అనురాగం కొట్టవచ్చినట్లు కన్పించాయి. పురుషుడు స్త్రీని అంత గాఢంగా ప్రేమిస్తే ఆమెకూడా అతనిని ప్రేమించకుండా వుండలేదు. అది ఏ రకం ప్రేమయినాసరే. కానీ ఆవిషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి నేను చాలా ప్రయత్నించాను. ఈక్షణం ఎంత బలమైనదోగాని అన్నీ సినిమారీలులా కళ్ళముందు కన్పిస్తున్నాయి. తనకు తలనొప్పివస్తే అతని గాజుకళ్ళలోబాధ, తను అశాంతిగా 'ఫీల్' అయితే అతనిపెదవులు గొణిగేవి నిస్సహాయంగా. తను అతనికి సేవలుచేస్తున్నపుడు అతని, కనుపాపల్లో కృతజ్ఞత ఎప్పుడైనా, అతనితో సరదాగా మాట్లాడితే ముఖం నిండా ఆనందం. ఎలా మరచిపోయింది ఇన్నాళ్ళ?కానీ...కానీ ... ఈ వయస్సులో, కాసింతకరుణ, కృతజ్ఞత చాలా? జీవితమంతా అయిపోయినట్లూ, ఆఖరి దశలో భార్యాభర్తలు ఒకరినొకరు కష్టాలలోనూ, విరక్తిలోనూ బతికేసి నట్టు బతికేయడమేనా? వార్ధక్యంలో వెనక్కు తిరిగి ఆలోచించుకుని, అనుభూతి పొందడానికి కాసిన్ని మధుర స్మృతులనుకూడా మిగుల్చుకోకుండా, ఈ జీవితాన్ని నిద్రపుచ్చేయడమేనా!

అహఁ పాపపుణ్యాలంటూ తనకు తానే జోలపాట పాడుకుని కలత నిద్రపోయేకంటే జీవితాన్ని అనుభవించనీ. ఆ తర్వాత మితిలేని మధురానందంలో జీవితాన్ని సమాప్తం చేసుకోనీ.


సడన్ బ్రేక్‌తో రిక్షా ఆగింది.

'ఏమైంది?' ఆతృతగా ముందుకు వంగాను.

రిక్షా కడ్డంగా ఒక ఇరవైఐదు సంవత్సరాల స్త్రీ. ఏడు సంవత్సరాల కుర్రాడు పెనగులాడుకుంటున్నారు. మొత్తానికి దారి కడ్డంగా గెంతులేస్తున్న వాడిని ప్రక్కకు లాగిందామె.

'ఏమిటమ్మా!' రిక్షావాడు విసుక్కున్నాడు.

'ఏమనుకోకు తాతా! ఈడు పిచ్చెదవ ఏటీ తెల్దు' కొడుకు వైపు ప్రీతిగా చూస్తూ అంది. విసురుగా వచ్చిన గాలికి రిక్షా లైట్ ఆరిపోయింది. దానిని వెలిగించడంలో మునిగి పోయాడు తాత. ఆమెను



రాబిన్ బ్లూ
ప్రపంచమంతటా చాలా హెచ్చుగా అమ్మబడుతున్న నీలి

ప్రపంచమంతటా స్వచ్ఛమైన అల్ట్రా మెరైన్ నీలి. వస్త్రాలకు తెలుపుదనాన్ని చేకూర్చడంలో సాటిలేనిదిగాను రాబిన్ బ్లూ బహుళ ప్రఖ్యాతి పొందివున్నది.

ప్రకృతిసిద్ధమైన కంటికింపుగావుండే తెలుపుదనాన్ని చేకూర్చగల నికార్సయిన నీలి రాబిన్ బ్లూ. ఒక పొట్లంతో ఎన్నోసార్లు వస్త్రాల నుతుకవచ్చు. రాబిన్ బ్లూ వస్త్రాలకు చెరుపు చెయ్యదని జ్ఞాపకం వుంచుకోండి.

నకిలీ వాటిని గమనించండి. అచ్చమైన రాబిన్ బ్లూ కోరి తీసికోండి.





మీ వస్త్రాలకు ప్రకృతిసిద్ధమైన, కంటికింపుగావుండే తెల్లదనాన్ని రాబిన్ బ్లూ చేకూర్చగలదు



ARBC-29 TEL

దగ్గరకు పిలిచాను. చామన ఛాయ ముఖం. నల్లటి కళ్ళలో మెరపు, ఏదో కళ వుంది. ఆ ముఖంలో వికారుడైన పిల్లవాడిని భుజం మీద బలవంతంగా అణుచుకుంటూ వచ్చిందది.

'ఏమైంది?' అడిగాను మరలా

'ఈడు నాకు బగమంతుడిచ్చిన వరం తల్లీ. ఎనక జనమలో ఏం పాపం చేసుకున్నానో, నా బిడ్డ నొసట పిచ్చితనం రాసి నన్ను సిచ్చిత్తున్నాడు. ఇంటికాడ నుంచి నిద్రలో లేచి పారిపోయొస్తే వెంట లగెత్తుకొచ్చాను,'

'ఏమి ఆకర్షణ వుందని ఆ కొడుకు మీద ఆ తల్లికా మమకారం!'

'ఇంత రాత్రివేళ మీ వారు లేరా?' కుతూహలం ఆపుకోలేక అడిగాను.

'ఆడు నిద్దరోతున్నాడు తల్లీ. కాయ కష్టం చేసొచ్చి తొంగున్నాడు, లేపడమెందుకని నేనే లెగొచ్చాను.'

ఆమె కళ్ళలో సిగ్గుతెరల వెనకాతల తనకోసం కష్టపడే భర్తమీద సానుభూతి.

ఇంతలో ఆమెభర్త పరుగెట్టుకుంటూ దానే వచ్చాడు. నల్లగా, బండగా వున్నాడు. అతని ముఖంలో ఒకరకమైన క్రూరత్వముంది.

'ఎందుకు లేసావు మావా?' ఆమె కంఠంలో వ్యధ. 'క్రూరత్వం నింపుకున్న, ఆ కళ్ళలో ఏమి ఆకర్షణ వుందని ఆమె అతనితో జీవితాన్ని బంధించుకుంది?'

ఆకర్షణ

'సాల్లే. ఆడకూతురివి. ఇంత రాత్రేళ బుద్దుంగీ?' అంటూ భార్యను కసురుకున్నాడు వాడు. ఆమె నవ్వుతూ అతని వెంట నడచి వెళ్ళింది. ఆ సంఘటన నా మత్తును పూర్తిగా వదిలించి వేసింది.

ఆ కటిక చీకటిలో, వాళ్ళ తాలూకు కనపడని నీడల్లో మొదటి మారుగా నా భర్తను తలచుకుని హృదయం స్పందించింది. అతనిమీద అనురాగం ఉప్పెనలా పొంగింది. నా ఆలోచనల ప్రమేయం లేకుండా నా నరనరాన్నీ అతని స్వరూపం ఆక్రమించింది. అతనిని నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నట్టు స్పష్టమయ్యింది.

ఈ మార్పు పాపభీతివల్ల గాని, పవిత్రతమీద వున్న మమకారం వల్లకానీ కాదు. అదే కారణ మయ్యుంటే ఇంత సాహసం చెయ్యగలిగేది కాదు. భర్త సమక్షంలో, తెలియనిసత్యం అతనిని పూర్తిగా పోగొట్టుకో బోతున్నపుడు తెలిసి వచ్చింది. నిద్రపోతున్న తన చైతన్యాన్ని ఆ సంఘటన కలిగించిందంతేగాని దాని ప్రభావం తనలో మార్పు తీసుక రాగలిగినంత బలవత్తరమైన దేమికాదు.

తన భ్రాంతిలోనుండి, ప్రలోభంలో నుండి మేల్కొనడానికి ఇన్నిరోజులు పట్టింది.

రిక్షా కదిలింది. అది సాగిపోతోంది. కానీ నాకా విషయం తెలియలేదు. గాడి తప్పబోతున్న నా జీవితాన్ని సరిదిద్దుకుంటున్నాను. గాఢ నిద్రనుండి మేల్కొన్న మనస్సులో నిశ్చయం జరిగిపోయింది.


'తనను ప్రేమించే భర్త, తనను విశ్వసించే భర్త. అంతకంటె ఏంకావాలి? అతని అణువణువునా వున్న ఆప్యాయత, అనురాగం చాలవా తన జీవితాన్ని నిశ్చింతగా గడుపుకోవడానికి!'

రిక్షా ఆగింది. ఉలిక్కిపడ్డాను.

'ఎందుకొచ్చా నిక్కడకు? ఏముందని ఇక్కడ?' ఆపరాయిచోట ఒక్కక్షణమైనా నిలవబుద్ది కాలేదు. గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోవాలనిపించింది. కానీ ప్రభుదాసుకు భయపడి తిరగాల్సిన పనిలేకుండా, నిజాన్ని అతనిదగ్గర ఒప్పేసుకుని క్షమాపణ అడిగి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను.

'వుండు తాతా ఇప్పుడే వస్తాను' అని చెప్పి తేలికపడిన హృదయంతో మెట్లన్నీ చకచక ఎక్కేసాను. ఆఖరు మెట్టుమీద తలెత్తి ఆగిపోయాను. తలుపుకు తాళం కప్ప వేలాడుతోంది. తలుపు సందులో నుండి చిన్నకాగితం తొంగి చూస్తోంది. ఆతృతగా విప్పి చదివాను.

'...మీరు లోకం దృష్టిలో దోషి అయితే కావచ్చు. కానీ నాకు మాత్రం దేవతవు. పాపకూపంలోకి మొదటి అడుగు వేసినప్పుడే శిక్ష మొదలవుతుంది. నా దేవతను నేనెలా శిక్షించను? అదీగాక నాకు తెలుసు 'ఆత్మీయత ఆకర్షణను గెలుచుకుంటుందని' నాకు మీరిచ్చిన కొద్ది కాలపు వ్యవధి చాలు మీరా విషయాన్ని గ్రహించడానికి. మీరు పూర్తిగా మారిపోయి ఆ విషయం చెప్పడానికి వస్తారు. మీ నోటివెంట ఆకర్షణ ఓడిపోయిందని వినడమంత దౌర్భాగ్యం మరొకటి లేదు. ఈ ఆకర్షణను మీరు అసహ్యించుకోవడం ప్రారంభించకముందే, మీ హృదయంలో ఒకమూల ఎప్పుడో జ్ఞాపకాల త్రవ్వకంలో జ్ఞప్తికొచ్చే మధురస్మృతిగా నన్ను మీ జీవితంలోనుండి తప్పుకోనివ్వండి. నేను కూడా మనస్ఫూర్తిగా మారిననాడు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాను. నాకు నమ్మకముంది ఆరోజు తప్పకుండా వస్తుందని...' కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసి, తొందరతొందరగా వచ్చి, రిక్షాలో



కూర్చున్నాను. నరకంలోకి తొంగిచూచి వెనక్కు పరుగెట్టేనంత హాయిగా వుంది.

నా ఇంటిదగ్గర రిక్షా ఆగినప్పుడు, నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మొదటి సారిగా ప్రేమమూర్తి అయిన శ్రీవారికి భయపడ్డాను. అడుగులో అడుగు వేసుకుంటూ ఆయనను సమీపించాను. లైటువేసే వుంది.

ఆయన కళ్ళుమూసుకుని వెల్లకిలా పడుకుని వున్నారు. అతనిలో ఆప్యాయత రూపంలో వున్న ఆకర్షణ దగ్గరకు రమ్మని చేతులు చాపింది. అనురాగం కట్టలు తెంచుకుంది. ఆనకట్ట వేయడం నా తరం కాకపోయింది. ఒక్క పరుగున వెళ్ళి ఆయన హృదయంపై వాలిపోయాను.

'ఈ మందిరంలో తప్ప ఇంకెక్కడ దొరుకుతుంది శాంతి నాకు!'

ఆయన నిద్రించడంలేదు. మెల్లిగా కదిలి, నన్ను రెండు చేతులతో తన గుండెలకు గాఢంగా హత్తుకున్నారు.

'ఆస్పర్శలో ఎంత హాయి వుంది. ఎంత శాంతి, సంతృప్తి వున్నాయి!' జీవితాన్నంతా గెలిచినంత ధీమా కలిగింది. ఈ విషయం తెలుసుకోవడానికి నేనెంత కాలం వ్యర్థం చేసాను?' ఆయన చేతుల్లో చాలా రోజులకు నిశ్చింతగా నిద్రపోయాను. ఆ తర్వాత...

*   *   *

'రాధా!' భర్త పిలుపుతో ఉలిక్కిపడి పూర్వస్మృతుల పుస్తకాన్ని మూసి; లేచింది గోపిక.

ఆనాడు వెళ్ళిన ప్రభుదాసు పదిసంవత్సరాల తర్వాత ఈనాడు వెతుక్కుంటూ వచ్చాడు. వయస్సుతో పాటు జుట్టు తెల్లబడింది, చర్మం నునుపు తగ్గింది. కానీ ఆకళ్ళల్లో మెరుపు, పెదవులమీద చిరునవ్వు మాత్రం మాయం కాలేదు. ఆనాడు మతి పోగొట్టిన ఆకర్షణ ఈనాడేమీ చేయలేకపోతోంది. ప్రత్యేకంగా చూస్తే తప్ప అతనిలో ఆకర్షణ వున్నట్టు ఆమెకు తెలియడంలేదు. ఆరోజు అతను పారిపోయిన తర్వాత అతని తలపు ఆమెనుండి మెల్లి మెల్లిగా తప్పుకోవడం మొదలెట్టింది. అతని దూరాన్ని ఆమె మనసు, దగ్గర చేయలేక పోయింది. దగ్గరగా వున్నప్పుడు అతని కెంత దగ్గరగా పరుగెట్టేదో, అతను దూరమయ్యాక ఆమె మనస్సు అంతదూరంగాపరుగెట్టడంమొదలెట్టింది. ఆ ఆకర్షణ మధ్యన ఏమాత్రపు మమత అనే 'లింక్' వున్నా, ఆమె ఏనాటికీ అతనిని మరచి పోయేది కాదు. ఆ సత్యం ఆమె గ్రహించడానికి ఆట్టే కాలం పట్టలేదు. ఒకరోజు భర్త మెడికల్ కాన్ఫరెన్స్‌కు ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆ వారం రోజులూ అతని తలపులోనే ఆమె బతికింది. అప్పుడనుకుందామె. 'ఆప్యాయత లేని ఆకర్షణ ఎంత బలహీనమైనదీ! మమత నిండిన మమకారం ఎంత బలమైనదీ!' అని. ఆమె కోరుకున్న ఆకర్షణ ఆమె భర్తలో లేకపోయినా, అతనిని సర్వశక్తులా సంతోష పెట్టింది. ఆయన బిడ్డలకు తల్లి అయింది ఆమె.

భోజనం చేస్తూ చేస్తూ తలెత్తి గోపికవైపు చూస్తూ అన్నాడు, ప్రభుదాసు, 'నేను జీవితంలో ఒక మంచి పని చేసానని ఈనాడనుకుంటున్నాను. కానీ మనస్ఫూర్తిగా ఆ నిజాన్ని నమ్మడానికి నాకు చాలా కాలమే పటింది గోపికా'

'కాలానికీ, పరిసరాలకూ, మీకూ కూడా నేను చాలా ఋణపడి వున్నాను మాస్టారూ!' అని 'రియాక్షన్' కోసం భర్తవైపు చూచింది. అతని పెదాలమీద ప్రశాంతమైన చిరునవ్వు తప్ప అనుమానపు ఛాయలే లేవు.

'ఎంత అమాయకుడు ఈయన!' అనుకుంది గోపిక, గడిచిపోయిన దాంపత్య జీవితంలో ఇలా చాలామార్లే అనుకుంది. అప్పటికీ, ఇప్పటికీ మారని ఆయనంటే ఆరాధన ఏనాటికి తగ్గుతుంది ఆమెకు!

నాలుగు రోజుల తర్వాత ప్రభుదాసును రైలెక్కించడానికి వెళ్ళినప్పుడు, అన్నారాయన.

'థాంక్స్ మాస్టారూ!'

'దేనికి? కష్టపడి మీ ఆతిథ్యాన్ని స్వీకరించినందుకా?' అని హాయిగా నవ్వాడు ప్రభుదాసు. ఒక్క క్షణం ప్రభుదాసు కళ్ళల్లోకి చూచి తల అడ్డంగా ఊపుతూ అన్నారాయన.


'కాదు మాస్టారూ, నా అదృష్టాన్ని తిరిగి మీరు భద్రంగా ఇచ్చినందుకు' అని ఆగి 'మీ త్యాగానికి వెలకట్టి నేను మీకే మివ్వగలను కృతజ్ఞతలు తప్ప' అన్నారు. ప్రభుదాసు వింతగా ఆయన కళ్ళల్లోకి చూస్తున్నాడు. గోపిక దృష్టిలో అమాయకుడైన ఆయన ప్రభుదాసుకు కొద్ది కొద్దిగా అర్థమవ సాగాడు.


'అతని మౌనంలో ఎంత తెలివి, ఔన్నత్యం వున్నాయి!'

'లేదు, లేదు. ఇందులో మీరు ప్రత్యేకంగా 'థేంక్స్' చెప్పాల్సిన అవసరం లేదు. రైలు కదిలింది.

'మామూలుగా ఏది జరుగుతుందో అదే జరిగింది. క్షణికమైన ఆకర్షణను, బలమైన ఆత్మీయత గెల్చుకుంది. అంతే... అంతే' సాగిపోయే రైలు ఆ మాటలను మోసుకుంటూ వెళ్ళిపోయింది.

(అయిపోయింది) ●





ఊయలకు పని తప్పింది

రాముకు మూడేండ్లు; వాడికంటే వాడి ఊయల ఒకరోజు చిన్నది. ఇద్దరిదీ విడదీయలేని బంధం. నెమ్మదిగా రాము పెద్దవాడయ్యాడు. ఊయల లేకుండానే నిద్రపోవటం అలవాటు చేసుకున్నాడు. ఊయల వదిలేశాడు. ఊయలకు పని తప్పింది. మరికొన్ని ప్రయోజనాలకు తన పాత స్నేహితుడు పనికి వస్తాడని రాము త్వరలోనే కనుక్కున్నాడు—తన బొమ్మల పుస్తకాలు, ఆట వస్తువులు, ఇంకెన్నో ఊయలలో పెట్టుకున్నాడు. "చూడండి రాముకు ఎన్ని వస్తువులున్నాయో! వీడు చాలా ఆనందంగా వున్నాడు" అన్నది తల్లి. "ఊయలకు చాలాకాలం పని కల్గించకపోవడంలో మన మెంతో మంచి పని చేశాంకదూ" అన్నాడు తండ్రి సగర్వంగా నవ్వుతూ.



నిజమే వాళ్లిద్దరూ తెలివైన దంపతులే. తెలివైన తల్లిదండ్రులెప్పుడూ తమ కుటుంబాన్ని పరిమితం చేసుకుంటారు కుటుంబ నియంత్రణ అంటే కేవలం తక్కువ మంది పిల్లలను కలిగి వుండటమేకాదు. పిల్లలు నిజంగా కావలసినపుడు, తల్లిదండ్రులు పిల్లలకై సిద్ధపడినపుడు మాత్రమే పిల్లలను పొందటంకూడా కుటుంబ నియంత్రణే. శిశువు జన్మించటం ఘటనకాదు; అది మీ అభీష్టమే. **కుటుంబ నియంత్రణకు ధన్యవాదాలు;** ఉచిత సలహాలకు దగ్గరలోనున్న కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని సంప్రదించండి.



davp 68/121

కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు - అనతికాలంలో సత్ఫలితాల సాధన

దేశంలో సాంఘిక సంక్షేమాభివృద్ధి రంగంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం లభించింది. ఈ కార్యక్రమాలకు ఒక ప్రత్యేకత ఒక విశిష్టత ఏర్పడ్డాయి. సాంఘిక వ్యవస్థలో నూతన పరిణామాలు తీసుకుని రావటానికి సాంఘిక సంక్షేమాభివృద్ధి సాధించడానికి ఈ కార్యక్రమాల మూలంగా దోహదం కలిగింది. ప్రజలకు వైద్య సహాయం అందచేయడానికి వీటి మూలకంగా కూడా అవకాశం కలిగింది. ప్రణాళికలు రూపొందించేందుకు ముందు ప్రస్తుతపు స్థితిగతులను క్షుణ్ణముగా తెలుసుకోడం, మన అవసరాలు, వసతులు, లక్ష్యాలు, తెలుసుకోడం ఆయా కార్యక్రమాలు అమలుపరచడానికి ఎంత వ్యవధి కావాలో నిర్ణయించడం చాలా అవసరం. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించడం జరిగింది.

సంతానం కలగడానికి అవకాశం ఉన్న సుమారు 10 కోట్ల మంది దంపతులకు 20 కోట్ల మందికి కుటుంబ నియంత్రణ కార్యక్రమాల మూలంగా ప్రయోజనం కలగవలసి ఉంది. దేశంలో వివిధ ప్రాంతాలలోని నగరాలలో, మారుమూల గ్రామాలలో నివసిస్తున్న ఈ ప్రజలకు ఈ కార్యక్రమం మూలంగా ప్రయోజనం కలిగించటం కష్టసాధ్యం. దీనికితోడు దేశంలో సరియైన రవాణా సౌకర్యాలు లేవు. ప్రజలలో చదువుకున్న వారి సంఖ్య చాలా తక్కువ. ప్రజల ఆచార వ్యవహారాలు అలవాట్లు భిన్నమైనవి. వారు అంతా ఒకే భాష మాట్లాడేవారు కాదు. ఇటువంటి పరిస్థితులలో ఈ కార్యక్రమాలను అమలు పరచడం మరింత కష్టం.

ఇంత బృహత్తరమైన కార్యక్రమాన్ని రూపొందించడానికి విభిన్నమైన ఆచారాలు పాటించి, విభిన్న భాషా వర్గాలకు చెందిన ప్రజలు నివసించు ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను కట్టుదిట్టంగా శీఘ్రంగా అమలుపరచడానికి ఎంతో శ్రద్ధ వహించవలసి వచ్చింది. విస్తృత ప్రాతిపదికపై ఈ కార్యక్రమాన్ని రూపొందించడమే కాకుండా ఈ కార్యక్రమాల పట్ల ప్రజలకు ఆసక్తి, శ్రద్ధ కలిగేలా చేయడానికి కృషిచేయవలసి వచ్చింది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఈ రంగంలో కృషి చేయడానికి అన్నివిధాలా ప్రోత్సాహం కల్పించబడింది. ఫలితంగా ఈ కార్యక్రమాలు శీఘ్రంగా అమలు పరచడానికి వీలు కలిగింది.

ఈ రంగంలో కృషిచేస్తున్న వివిధ సంఘాలు, సంస్థలు, ప్రణాళికలు రూపొందించడంలోనే కాకుండా వాటిని అమలు పరచడంలో కూడా అన్ని విధాల సహాయ సహకారాలు అందచెయ్యడం అవసరం. ఇంతకుపూర్వం వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో పెంపుదల ఉత్పత్తి నిమిత్తం అధిక కృషి జరిగింది. ఆ రంగాలలో అధికోత్పత్తి సాధనకై ఉద్యమాలు నిర్వహించడం అందరూ ఎరిగినదే. కుటుంబ నియంత్రణకు సంబంధించిన రంగంలో కూడా ఇటువంటి కృషి జరిగింది. ఉద్యమాల స్థాయిలో ప్రచారం కొనసాగింది. ప్రజలకు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు సంబంధించిన అన్ని విషయాలు సమగ్రమంగా తెలియచేయడం జరిగింది. కుటుంబ నియంత్రణ కేవలం వ్యక్తిగత విషయం. వ్యక్తుల దృక్పథం మార్చడం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ఆమోదించేలా చేయడం తేలికైన పని ఏమీ కాదు. కాని నిరంతర కృషి ఫలితంగా ఈ రంగంలో కూడా చెప్పుకోదగిన ఘన విజయాలు సాధించడం జరిగింది. పూర్వం మన దేశంలో ప్రజలు కుటుంబ నియంత్రణ గురించీ, గర్భధారణ విషయాలను గురించీ మాట్లాడుకోడానికి చాలా సంకోచపడేవారు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. కుటుంబనియంత్రణ వ్యవహారాల శాఖ చేసిన కృషి ఫలితంగా భారతదేశంలో ప్రజలందరికీ కుటుంబ నియంత్రణ మూలంగా కలిగే ప్రయోజనాలను గురించీ ఈ కార్యక్రమాలను అమలు పరచవలసిన అవసరం గురించి పూర్తి వివరాలు తెలిశాయి. ప్రజలకు పూర్వపు సంకోచాలు పోయాయి. వారిప్పుడు ఈ విషయాలు గురించీ చర్చించుకుంటున్నారు. తెలియని అంశాలను గురించి వైద్య అధికారులను, కుటుంబ నియంత్రణ రంగంలో పనిచేస్తున్న ఇతర కార్యకర్తలను అడిగి తెలుసుకొంటున్నారు. ఫలితంగా బహు పురాతనమైన మన సాంఘిక వ్యవస్థలో ప్రజల జీవన విధానాలలో క్రమంగా మార్పులు వస్తున్నాయి. పరిమిత కుటుంబం వలన కలిగే ప్రయోజనము వారు గుర్తించారు.

సాంఘిక ప్రాధాన్యంగల ఇంతటి బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు పరచడంలో ఎంతో జాగ్రత్త అవసరం. ప్రయోజనం కలుగుతుందని నిర్ధారణ అయిన శాస్త్రీయమైన పద్ధతులను



ఎవరు ఎక్కడికి వెళ్ళినా 'ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలు' అన్న కుటుంబ నియంత్రణ నినాదాలు ఎదురవుతాయి. ఉత్తర ప్రదేశ్‌లోని వీధిలో అమ్ముకునే వారి బండ్లకి తగిలించిన కుటుంబ నియంత్రణ బోర్డులని చిత్రంలో చూడవచ్చు.


కుటుంబ నియంత్రణ...

మాత్రమే అవలంబింప చేయవలసివున్నది. శస్త్రచికిత్స, లూప్‌లు, తొడుగులు వాడకం, ఔషధాలు — వీటిని గురించీ ప్రజలకు నచ్చచెప్పడం అవసరం. సంతాననిరోధం మాత్రలు వేసుకుంటె చాలు. ఇటువంటి మాత్రలు నమూనా పథకాలు అనులు జరుగుతున్న వివిధ కేంద్రాలలో ప్రజలకు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుంది. సంతానం కలగకుండా ఉండేందుకు వివిధ ప్రత్యామ్నాయ పద్ధతులు గురించీ నచ్చ చెప్పడం, ఏవిధమైన నిర్బంధం లేకపోవడం వల్ల ప్రజలకు ఈ కార్యక్రమం పట్ల అధిక శ్రద్ధాసక్తులు కలిగాయి. త్వరలో సత్ఫలితాలు సాధించడానికి, జనాభా విపరీతంగా పెరిగి పోకుండా నివారించడానికి అవకాశం కలిగింది.

1976—77 నాటికి దేశంలో జననాల సంఖ్య బాగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకోడం జరిగింది. ఈ లక్ష్యం సాధించ లేకపోతే మన ఆర్థిక పురోభివృద్ధికి, అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్రమైన ఆటంకం కలుగుతుంది. కనుక ఈ లక్ష్యాన్ని నిర్ణీతకాలంలో సాధించడం అవసరం. ఇందుకు నిర్విరామంగా పెద్ద ఎత్తున కృషిజరగవలసి ఉంది. ఈకార్యక్రమాన్ని అమలు పరచడానికి దాదాపు 1,25,000 మంది శిక్షణ పొందిన ఉద్యోగులు కావాలి. ఇలా శిక్షణ ఇవ్వడానికి దేశంలో వివిధ ప్రాంతాలలో 46 కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇందుకు సంబంధించిన పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయడం కూడా అవసరమే. ప్రస్తుతం దేశంలో ఈరంగానికి సంబంధించిన 21 పరిశోధన కేంద్రాలు ఉన్నాయి. పరిశోధనా ఫలితాల మూలంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను శీఘ్రంగా అమలు పరచడానికి అవకాశం కలుగుతున్నది. దీనికి తోడు ఈ కార్యక్రమాలు అమలు జరుగుతున్న తీరుతెన్నులను గురించీ, కుటుంబ నియంత్రణ పద్ధతులను గురించి ఎప్పటికప్పుడు సమీక్షించడం కూడా జరుగుతున్నది. ప్రస్తుతం జరుగుతున్న కృషి మూలంగా 1976—77 నాటికి జననాల సంఖ్య బాగా తగ్గించడానికి ఏటా కోటీ 25 లక్షల మేరకు జననాలను అరికట్టడానికి వీలవుతుంది.

కుటుంబ నియంత్రణకు సంబంధించిన రంగంలో చెప్పుకోదగిన కృషి జరుగుతున్నది. కానీ ఈ కృషి చాలదు. ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఇంతకు అనేక రెట్లు అధికంగా సత్ఫలితాలు సాధించ వలసి ఉంది. నిర్ణీత కాలంలో లక్ష్యాలను సాధించగలమనే విశ్వాసం కలుగుతున్నది.

—దీపక్ భాటియా



ధర్మపథం.

బులుసు వేంకటరమణయ్య

మండూకప్లుతి

మండూకప్లుతి అంటే కప్పదాటు— అయినా యదార్థంగా కప్పదాటని దాని అర్థంకాదు. క్రమ పద్ధతిలో వెళ్ళకుండా మధ్యను కొన్నిటిని దాటివేసి పోవడం అన్నమాట!

మనవారు బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం — అని నాలుగు ఆశ్రమాలను నిర్ణయించారు. ఆశ్రమాలను —ఒకదాని తర్వాత ఇంకొకటిగా స్వీకరించాలి గాని—మధ్యను విడిచిపెట్టి ఆశ్రమ చంక్రమణం చెయ్యకూడదు. బ్రహ్మచారి అయినవాడు—విద్య పూర్తి అయ్యాక గృహస్థుడయి, కాపురం చెయ్యాలి. అలా కాకుండా వానప్రస్థుడు కావడం కానీ, సన్యాసం పుచ్చుకోవడంకాని కుదరదు. తప్పించుకోవాలని చూచినా సాధ్యపడదు. ఏదో రూపంగా ఆ గృహస్థ ధర్మాన్ని పాటించే తీరాలి! ఆశ్రమ చంక్రమణం చేసేవారికి ముక్తి దుర్లభమే అవుతుంది.

మహా తపస్వి అయిన అగస్త్యుని దగ్గర ఇద్దరు శిష్యులు అన్నదమ్ములు ఉండేవారు. అయుతుడు, నియుతుడు అని వారి పేర్లు. గొప్ప గురుభక్తి కలవారు. అగస్త్యమహామునికి వాళ్ళమీద ఎంతో అభిమానం. విద్యలు పూర్తి అయ్యాక, వాళ్ళకు తగిన కన్యలను తెచ్చి పెండ్లి చెయ్యాలనే సంకల్పం ఆ మహామునికి కలిగింది. భూలోకంలో తగిన కన్యకలున్నట్లు తోచకపోవడంవల్ల ఆయన బ్రహ్మదగ్గరకే వెళ్ళి, వేడి, అందకత్తెలైన యిద్దరు కన్యకలను — సావిత్రి, గాయత్రి అనేవారిని తీసుకువచ్చాడు.


ఆయుతడు గుర్వాజ్ఞను తిరస్కరించి పెళ్ళిచేసుకోలేదు. అందువల్ల ఆ యిద్దరినీ నియుతుడికే ఇచ్చి పెళ్ళిచెయ్యడం జరిగింది.

అగస్త్యుడు వెళ్ళగొట్టినందున అయుతుడు వేరేచోట ఆశ్రమం కల్పించుకొని ఘోరంగా తపస్సు చెయ్యసాగాడు. లోకాలు అట్టుడికినట్లు ఉడికి పోయాయి. అయుతుడి తపస్సు మాన్పించడానికి యింద్రుడు సకుటుంబంగా ముసలి వానప్రస్థుడి వేషంలో వచ్చి తపస్సుమాని, పెళ్ళిచేసుకొమ్మని బోధించాడు; గాని ఫలం లేకపోయింది. ఇంద్రుడు తిరిగి పోతూపోతూ, తాను తలచినపని సాధించడానికి కామధేనువును అక్కడే వదిలి పెట్టాడు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే అది చాలా దైన్యస్థితిలో అయుతుని కంట బడింది. అతడు జాలిపడి దాని సంరక్షణకు పూనుకున్నాడు. కొద్దిదినాల్లోనే అది బాగా తయారైంది. దాని కుటుంబం పెరిగింది. దాని సంరక్షణతోనే అయుతుడికి సరిపోయేది. కొంతకాలానికి తెలివి తెచ్చుకుని అతడు దాన్ని ఆ అడవి నుండి తరిమివేశాడు. అది ప్రక్క వనంలో ప్రవేశించి, యోగనిష్ఠలో ఉన్న వాధూల మహా మునిని త్రొక్కి వేసింది. ఆ మహా ముని కన్నులు తెరిచి చూసేసరికి ఆవును తరుముకు వస్తున్న అయుతుడు కనబడ్డాడు. ఆయన ఆ ముని కుమారుణ్ణి కప్ప అయేటట్లు శపించాడు. తర్వాత అయుతుడి వల్ల సంగతి సందర్భాలు తెలుసుకుని తన తొందరపాటుకు విచారించాడు. గృహస్థాశ్రమాన్ని తప్పించుకొని ముక్తి పొందే ప్రయత్నం నిష్ఫలమనీ, కప్పగా వున్నా, ఆ జన్మలో సంసారం సాగించి, తర్వాత ముక్తి పొందగలవనీ చెప్పి, నరసింహక్షేత్రానికి పొమ్మన్నాడు. అక్కడికి వచ్చి శాపవశం వల్ల కప్ప అయిన కన్యాకుబ్జ రాజకుమారితో కొంతకాలం సంసారం చేసి, సంతానం కలిగిన తర్వాత శాపవిముక్తుడై అయుతుడు మోక్షాన్ని పొందాడు.

తాను ఎంత పట్టుదలతో గృహస్థాశ్రమం కూడదని అనుకున్నా అయుతుడికి కప్ప జన్మ యెత్తినా — గృహస్థ ధర్మ స్వీకరణం తప్పలేదు.

ఆశ్రమ చంక్రమణం అనర్థానికే కారణవౌతుంది. ●





జీవన వలయాలు

ఇల్లిందల సరస్వతీదేవి

మసక చీకట్లలో వీధివాకిలి ఊడుద్దామని సావిత్రమ్మ తలుపు తెరిచేసరికి పెళపెళలాడే గంజిబట్టలతో సన్నగా పొడుగ్గా ఉన్న నర్సు నిలబడి ఉంది. చీపురు పట్టుకున్న చెయ్యి వెనగ్గా పెట్టుకుని "ఎవరి కోసం?" అన్నది సావిత్రమ్మ.

"అమ్మా నన్ను గుర్తుపట్టలేదమ్మా!" సావిత్రమ్మను కౌగలించుకుని బావురుమన్నది విమల.

"నీవు...నీవు. నాతల్లి విమలవా!" కళ్లు మూసుకుని గుండెలకు బలంగా హత్తుకున్నది సావిత్రమ్మ.

"అవునమ్మా. నేను విమలనే. నిన్ను మోసగించి ఇంట్లోనుంచి పారిపోయిన విమలను. అమ్మా నన్ను క్షమించవూ?"

సావిత్రమ్మ కూతురిని పొదివి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్లి చీపురు ఒకమూలకుపెట్టి, ఆమెను మంచంమీద కూర్చోపెట్టింది. వీపు నిమురుతూ "తల్లీ ఎన్నాళ్లకు తిరిగి

కొత్త సీరియల్



కంటపడ్డావు? ఈ వేషమేమిటమ్మా? సావిత్రమ్మ కళ్లు కొంగుతో తుడుచుకుంది.

"నా సంగతి తరువాత చెబుతా గానీ తమ్ముడేడీ? శేషగిరి అన్నయ్య ఏం చేస్తున్నాడు? గోపి అన్నయ్య ఎక్కడ ఉన్నాడు? మెడికల్ కోర్సు అయి ఉండాలి కదా అమ్మా?"

'తీరికగా అన్ని సంగతులు చెప్తాను నేను ఏడుగంటలకు అలా బైటికి వెళ్లాలి. పదకొండు గంటలకల్లా తిరిగి వస్తాను. నీకు చేరెడు బియ్యము పొయ్యిమీద పెట్టి నాలుగు వడియాలు వేయిస్తాను. ఊరగాయముక్క వేసుకుని అన్నం తిను.'

సావిత్రమ్మ మాట పూర్తి చెయ్యక ముందే 'మురళి ఏడీ? వాడు అన్నం తినడా?' అన్నది.

'అందరి సంగతులు నేనువచ్చి చెబుతాను. నీవు స్నానంచేసి అన్నం తిను'

రేగినజుట్టు — బొట్టులేని ముఖం, చిక్కి నల్లబడ్డ దేహం—తల్లిని చూసినప్పటినుంచి విమలకు మనసులో అనుమానం కలుగుతోంది. అడిగితే ఏం చెబుతుందోనని భయంగా ఉంది. కాని మనసులో ఆందోళన ఎక్కువయి పోతోంది. కాళ్లు ఒణుకుతున్నాయి. గొంతు పూడిపోయి మాట బైటికి పెకిలి రావటంలేదు.

సావిత్రమ్మకు విమలను చూసినప్పటి నుంచి దుఃఖము అలలు అలలుగా పైకి పొంగుతున్నది.

విమల ఆపుకోలేక 'అమ్మా నాన్న ··· నాన్న' అంటూ తల్లిమీద పడిపోయింది.

'నాన్న లేరమ్మా. వెళ్ళిపోయారు. నీవువెళ్ళిన తరువాత ఆయన లేచి తిరగ లేదు' సావిత్రమ్మ కూతురుతో పాటు కన్నీళ్ళు కార్చింది. మంచము అదిరిపోయే టట్లు విమల ఏడుస్తోంది.

కిటికీలోనుంచి బైటికి తొంగిచూస్తూ 'విమలా లేచి కాఫీతాగు. ఎండెక్కుతోంది' మనసు చిక్కబట్టుకుని సావిత్రమ్మ లేచింది. వాకిలి ఊడ్చి, నీళ్ళుచల్లి, రెండు ముగ్గుకర్రలు వేసింది. గబ గబా కుంపటి వెలిగించి కాఫీచేసి విమలకో గ్లాసుయిచ్చి తనుకూడా తీసుకుంది. చిన్నగిన్నెతో అన్నం వండి వడియాలు వేయించి పళ్ళెంలో పెట్టి మూతపెట్టింది. కూతురు తల నిమురుతూ ఏడుగంటలు కొడుతుండగా వెళ్ళిపోయింది.

విమల నర్సుడ్రెస్సు విప్పి గోడకు తగిలించింది. స్నానంచేసి తల్లిచీరె కట్టుకుని గది నాలుగుమూలలూ కలయజూసింది. గూళ్ళన్నీ సవరించి వస్తువులన్నీ యధాప్రకారం సర్దింది. తల్లిపెట్టెతీసి బట్టలన్నీ దులిపింది. ఆమెకు బట్టలు ఎన్ని ఉన్నాయి? ఒక్కటే చీరె—తను కట్టుకున్నదే చీరెరూపంలో ఉన్నది. సావిత్రమ్మ కట్టుకున్నచీరె అతుకులు వేసింది. అట్లాంటిదే ఒకటి దండెం మీద కందిరాయ కుట్లతో ఆరవేసిఉంది. శంకరం వెళ్ళేటప్పుడు వదలిపెట్టి పోయిన రెండు పాత నిక్కర్లు మడతలతో ఉన్నాయి. వాటిని

జీవిత వలయాలు

తిరిగి పెట్టెలో సర్దింది. కిటికీలో విసనకర్ర క్రిందఉన్న కాగితాలన్నీ దులిపింది. వాటన్నిటినీ మడతలువిప్పి చూసింది.

'అమ్మా!'

నేను ఎం. ఎస్సీలో చేరాను. సీటు దొరకటం చాలా కష్టమయింది. ప్రొఫెసరుగారు చాలా సహాయం చేశారు. బీద విద్యార్థిక్రింద ఫీజు లేకుండా చేర్చుకున్నారు. కాని మొదట చేరటానికి డబ్బు కావలసి వచ్చింది. ప్రొఫెసరుగారే లెక్చెరర్లచేత చందాలు వేయించి ఫీజు కట్టే ఏర్పాటు చేశారు. హైదరాబాదులో బీదపిల్లలు చదువుకోవటానికి సౌకర్యాలు చాలా ఉన్నాయి. భోజనం ఏర్పాటు కూడా ప్రొఫెసరుగారే రోజు కొకరి యింట్లో ఏర్పాటు చేశారు. అమ్మా, నేనూ ఎలాగో కష్టపడి చదువుకుంటాను. వారానికో ఉత్తరం నీ దగ్గర్నించి వస్తే నాకు ధైర్యంగాఉంటుందమ్మా. రాస్తావుకదూ? ఉంటాను. శేషగిరి'

శేషగిరి అన్నయ్య వారాలు చేసుకుని ఎం. ఎస్సీలో చేరాడా? తగని అభిమానం కల శేషగిరి అన్నయ్య — అమ్మనయినా నోరు తెరచి ఏదీ అడగని అన్నయ్య వారాలు చేసుకుంటున్నాడా? కన్నీళ్ళు తుడుచుకుని మరో ఉత్తరం విప్పింది.

'అమ్మా!

మన ఊరి నుంచి రామన్న పంతులు పనిమీద హైదరాబాదు వచ్చాడు. మన యింటి సంగతులన్నీ ఆయన వల్ల తెలిశాయి. శంకరం దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా? అమ్మా. నీవు ... నీవు ... ఆ వకీలుగారింట్లో వంటకు కుదిరావని విన్న తరువాత నాలుగురోజుల పాటు నాకు అన్నం సహించలేదు. బాధవల్ల సరిగా చదువలేక పోయాను. చదువు మానేసి ఇంటికి వచ్చేద్దామనుకుంది. కాని చదువు మానుకుని ఏం చేస్తాను? పరీక్ష పూర్తిచేసుకుంటే నీ కష్టాలు తీర్చగలనేమో? మా కోసం ఎంత కష్టపడ్డావమ్మా. ఇంతవరకూ నీవు పడ్డ కష్టము ఒక విధమైనది. ఇప్పుడు పడుతున్న కష్టము ఇంకొక విధము. కాని ఎంత భేదం అమ్మా. నిన్ను—నిన్ను— ఎవరింట్లోనో వంటలక్కగా ఊహించుకోలేక పోతున్నానమ్మా. అనుక్షణం ఆ మాటే నన్ను బాధిస్తున్నది. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. నేను కష్టపడి చదివితేగాని ప్యాసు కాలేను. పరిక్ష ప్యాసయితే నీకు సంతోషంగా ఉంటుందని చదువుతున్నాను.


ఇట్లు
శేషగిరి'

ఉత్తరం చేతో పట్టుకుని గోడకానుకుని నిలబడి గుండెకు రెండు చేతులూ చేర్చి కళ్ళు మూసుకుంది. తను లేని ఈ ఎనిమిదేళ్ళ కాలంలో ఎన్ని సంఘటనలు జరిగాయి? వీటన్నిటికీ ఎవరు కారకులు? పెద్దన్నయ్య గోపీనా? లేక తనా?

గజగజ వణుకుతూ మరో ఉత్తరం తీసింది.

అమ్మా!

ఎంత పని చేశావమ్మా! నీకు కష్టంగా ఉంటే మురళి బిచ్చమెత్తుకునయినా మన దగ్గరే ఉండేవాడు కదమ్మా. అందరికంటె చిన్నవాడిని—నీ కత్యంత ప్రియతముడయిన మురళిని ఆ వకీలుగారికి ఎట్లా పెంపకం ఇచ్చావమ్మా? నీ కొంగు పట్టుకుని తిరుగుతూ— నీ పొత్తులో అన్నం తినే మురళిని—పక్కలో పడుకోబెట్టుకుని కష్టాలన్నిటినీ మరచిపోవటానికి ప్రయత్నించేదానివి. వాడు లేకపోతే నీకు నిద్ర ఎట్లా పడుతోందమ్మా? అన్నం ఎట్లా సహించుతోందమ్మా?



జీవిత వలయాలు

కష్టకాలంలో కన్నతల్లి హృదయమయినా కఠినాతి కఠినమవుతుందంటారు. ఇందుకే కాబోలు. పరిస్థితుల వత్తిడివల్ల నీవు ఇంతపని చేసి ఉంటావనుకుంటాను. అయినా మనసులో ఎంత బాధపడుతున్నావో నిన్ను చూడాలని మనసు బాధిస్తోంది. కాని రావటానికి వీలులేదు. చదువుకు భంగం కలుగుతుంది. పైగా డబ్బు ఖర్చు. అందుకోసం ఆ తలంపే మానుకుంటున్నా.

ఇట్లు
శేషగిరి'

'మురళీ—మురళీ.' విమల మంచమ్మీద బోర్లాపడుకుని కడుపులో పేగులన్నీ కదిలేటట్టు ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయింది.

పదకొండు గంటలు దాటిన తరువాత దగ్గరగా వేసి ఉన్న తలుపులు నెట్టుకుంటూ సావిత్రమ్మ లోపల అడుగు పెట్టింది. గాఢ నిద్రలో ఉన్న విమలను చూసి, ఒక్కసారి తలనిమిరి, పొయ్యి మీద ఉన్న గిన్నె మూత తెరిచి చూసింది.

'పిచ్చిపిల్ల. అన్నమన్నా తినకుండా పడుకుందే?' సావిత్రమ్మ విమల వీపు నిమురుతూ ఆ మంచం మీదనే నడుం వాల్చి గోడకేసి తిరిగింది. ఫొటోలో ఉన్న రామనరసయ్య తన వంక చూస్తూ తల ఆడించి నట్లనిపించింది.

రామనరసయ్య తననూ పిల్లలనూ వదలి పరలోకానికి వెళ్ళి ఎనిమిది నిండు సంవత్సరాలయింది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలము తనెట్లా గడిపింది? దుస్సహమూ దుర్భరమూ అయిన వాటికెన్నిటికో తల ఒగ్గింది.

గాలికి తలుపు ముందుకూ వెనక్కూ ఊగుతూ చప్పుడు చేసింది.

తల వెంట్రుకలు ముడివేసుకుంటూ వెళ్ళి తలుపు తీసి చూస్తూ 'అయ్యో. నా భ్రమ కాకపోతే ఇప్పుడు మురళి ఎక్కడి నుంచి వస్తాడు? ఎందుకువస్తాడు? ఎట్లా వస్తాడు?' గాఢంగా నిట్టూర్చి తలుపులు మూసుకుని లోపలికి వెళ్ళింది.

విమల కళ్ళు తెరుచుకుని చూస్తోంది. తల్లిని చూడగానే దుఃఖము పెల్లుబికి పైకి పొంగింది.

* * *

'మురళీ మా నాయనవుకదూ? రేపు ఎక్కడినుంచయినా డబ్బుతెచ్చి నిక్కరూ షర్టూ కుట్టిస్తానురా. ఇవాల్టికి ఇవి వేసుకోరా' సావిత్రమ్మ మురళిని దగ్గరికి తీసుకోటానికి ప్రయత్నిస్తోంది. కాని మురళి ఆమెచేతులు విదిలించేశాడు. కాళ్ళు నేలకురాస్తూ మారాము చేస్తున్నాడు.

సావిత్రమ్మ వకీలు గారింటికి వెళ్ళే వేళ దాటిపోతున్నది. మురళి పట్టువిడువ లేదు.

'నేనివాళ అన్నం తిననుపో'

'మురళి మంచివాడు ఈబట్టలు తొడుక్కుని అన్నం తింటాడు.'

'ఊహూఁ'

మురళి పట్టు విడువలేదు. సావిత్రమ్మ గంటసేపు బ్రతిమిలాడింది. చివరకు విసుగుపుట్టి చేతికి వచ్చినట్టు బాదింది. మురళి చెంపలు కందిపోయాయి. వీపు కండెలు కట్టింది.

కోపోద్రేకంలో మురళిని కొట్టింది కాని సావిత్రమ్మకు చెయ్యి విపరీతంగా బాధపెట్టటం మొదలుపెట్టింది. ఆమె చెయ్యి విదలించుకుంటూ గోడకు చేరబడి పోయింది. తన మనసు ఇవాళ ఇంత కఠినమయిందేం? ఒళ్ళు తెలియకుండా పసివాడిని ఎట్లా కొట్టగలిగింది? ఇందులో వాడి తప్పేముంది? వాడిబట్టలన్నీ పేలికలయిపోయాయి. నలుగురూ మంచివి వేసుకుంటే తనకూ కావాలని మనసు పడ్డాడు. ఆ పసి హృదయానికి తనుపడుతున్న బాధలు ఎలా తెలుస్తాయి? చిన్నతనం కొద్దీ వాడు మంకుపట్టు పడితే పెద్దది తనేం జేసింది? ఇంతవరకూ వాడి ఒంటిమీద చెయ్యివేసి ఎరుగని తను గొడ్డును బాదినట్టు బాదింది. 'పాపిష్టిదాన్ని నాచెయ్యి విరిగిపోతే బాగుండును' అనుకున్నది.

సావిత్రమ్మ చెయ్యి గోడకేసి కొట్టుకుంది. ఆమె కళ్ళనుండి ధారాపాతంగా నీరు కారిపోతున్నది.

మురళి బుంగమూతితో గోడకానుకుని నిలబడి చొక్కాచేతితో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

— తటాలున దొడ్డితలుపు తెరుచుకుంది.

చేతికర్ర ఆడిస్తూ నరసింహం లోపలికి వచ్చాడు.

అయనను చూడగానే సావిత్రమ్మ వెల్లబోయి లేచి నిలబడ్డది.

'ఈబాబు మీ అబ్బాయా తల్లీ?'

'అవును' ఒంటినిండా కొంగు కప్పుకుని తలవంచుకుంది.

'ఏదో మారాము చేస్తున్నట్టున్నాడే?'

'అవును బాబూ నాకుమించిన వస్తువులు కోరితెమ్మని మారాము చేస్తున్నాడు' మురళిని కొట్టినచేతిని చూసుకుంటూ అన్నది.

'నేను మేడమీదినుంచి అంతా చూస్తున్నాను అరగంటకుపైగా వీరు తంటాలు పడుతున్నారు. ఈబాబును మాయింటికి పంపించండి' మురళివైపు చేతులు చాపాడు.

మురళికి అయన బాగాతెలుసు. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు అయనవెంట ఇంటికి వెళ్లటం—ఆయనతోకూడా కాఫీ ఫలహారాలు చెయ్యటం—అయనతో కబుర్లు చెప్పటం, మురళికి బాగా అలవాటు. తనుచెప్పిన కబుర్లతో ఆయన మురిసిపోవటం అతడు కనిపెట్టి ఆయన దగ్గర చనువు పెంచుకున్నాడు.

సావిత్రమ్మ నోటినుంచి ఏమాటా రాలేదు. వికలమయిన ఆమె మనసు ఇంకా స్వాధీనానికి రాలేదు.

తల్లి ఏం జవాబిస్తుందోనని మురళి ఆమె ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తున్నాడు.

'ఏమోయ్. మా యింటికి వస్తావా ?' నరసింహం మురళిని ప్రలోభపెడుతూ మళ్లీ అడిగాడు.

'అమ్మా నేను వెళ్లిపోతున్నా' తల్లి అంగీకారం కోసము చూడకుండా మురళి ముందుకు అడుగువేశాడు. నరసింహం చేతికర్ర ఆడిస్తూ నడుస్తూంటే మురళి ఆయన పక్కగా నడుస్తూ కబుర్లు చెబుతున్నాడు.

ఇంటికి చేరుకోగానే ఒక నౌకరు మురళికి వేడినీళ్ల స్నానం చేయించాడు. కొత్తబట్టలు తొడుక్కొని మురళి నరసింహం పంక్తిలో భోజనం చేశాడు.

సాయంత్రం చీకటిపడి వచ్చి 'అమ్మా నేను బాబుగారింట్లోనే అన్నం తిని అక్కడే ఉంటా' వచ్చిన వెంటనే వెళ్లిపోయాడు. ఆ రాత్రి వాళ్లయింట్లో మెత్తటి పరుపుమీద పడుకుని అలమార నిండా కొత్తబట్టలు కొనుక్కున్నట్టూ, బిస్కెట్లడబ్బా చంకలో ఉన్నట్టూ కలలు కన్నాడు.

మరునాడు సావిత్రమ్మ నరసింహం ఇంటిముందర నిలబడి మురళికోసం లోపలికి చెప్పి పంపింది. మురళికి బదులు నరసింహం బయటికి వచ్చాడు.

'రండీ తల్లీ. లోపలికి రండి — మురళి మీ దగ్గరికి రావటానికి సిగు పడుతున్నాడు'

తడబడుతున్న కాళ్లతో సావిత్రమ్మ లోపలికి వెళ్లింది.

హాలులో చాపమీద రకరకాల బొమ్మలు మోటారుకార్లు, విమానాలు, రైలుబళ్లు —వాటిమధ్య కొత్త బట్టలతో మురళి రాజకుమారుడిలా మెరిసిపోతున్నాడు. ముద్దుగా ఉండే మురళి మరీ ముద్దు వస్తున్నాడు. సావిత్రమ్మ ఆవేదనతో 'నాయనా మురళీ' చేతులు చాపింది.

మురళి కొత్త ప్రపంచంలో మునిగిపోయాడు.

నరసింహం పెదవులపై మందహాసం చిందులాడింది.

'మురళిని ఆడుకోనీయండమ్మా అతడి సంతోషాన్ని ఎందుకు పాడుచేస్తారు ? ఆ పసి హృదయాన్ని సంతోషంగా ఉండనీయండి'

చిన్నబుచ్చుకున్న ముఖంతో సావిత్రమ్మ వెనక్కు తిరిగింది. మూడు నాలుగు రోజులు అలా సావిత్రమ్మ నరసింహం ఇంటికి వెళ్లి వస్తూనే ఉంది.

మురళి ఆ యింటి భోగ భాగ్యాలలో లీనమై పోయాడు. సావిత్రమ్మ వైపు కన్నెత్తి చూడనయినా లేదు.


ఐదవనాడు నరసింహం సావిత్రమ్మ యింటికి వచ్చాడు. అయనను చూడగానే ఆమె కళ్లల్లో నీళ్లు నిలిచాయి. తప్పు చేసిన దానిలా తలవంచుకుంది.

'మీతో ఒకమాట చెప్పాలని వచ్చాను. మీకు ఇష్టమయితే అబ్బాయిని మా యింట్లో ఉంచుకుని చదువు చెప్పిస్తాను. స్కూలుకు వెళ్తానంటున్నాడు. మీకు ఇష్టమయితేనే సుమా — బలవంతం లేదు.'

తలవంచుకుని కాలి బొటనవేలితో నేల రాస్తోంది సావిత్రమ్మ. ఇప్పుడేంచేయటం? ఆడుకోవటానికి వెళ్లిన పిల్లవాడు — అక్కడే ఉండిపోయాడు. భోజనం, పడక —అన్నీ అక్కడే. ఇంక — వాళ్లయింట్లోనే ఉండి చదువుకుంటే తనకు దక్కుతాడా ? ఆమె ఆలోచనలు తీగల్లా సాగుతూ పోయాయి.

'మీరు సరేననండి. నేను సంతోషంతో తిరిగి వెళ్తాను!' ఆయన యింకా గడప లోనే నిలబడ్డాడు.

'నన్ను ఆలోచించు కోనీయండి బాబుగారూ' కళ్లల్లోనుండి నీళ్లు దూకి పడు



కున్నాయి. గడ్డము వణుకుతోంది. ముఖం ఎర్రబడ్డది.

'అలాగే లెండి. రేపు వస్తాను' నరసింహం వెళ్ళిపోయాడు.

రాత్రి తొమ్మిది...పది...పదకొండు... పన్నెండుగంటలు తాలూకాఫీసులో నుంచి సావిత్రమ్మకు వినబడుతునే ఉన్నాయి. ఎంతకీ నిద్రపట్టదు. తోసిపారేద్దామన్నా మురళినిగురించిన ఆలోచనలు కందిరీగల్లా కుట్టిపెడుతున్నాయి. తెల్లవారు జామున వీచిన దక్షిణపుగాలికి ఆమెకు కన్ను మలిగింది.

సావిత్రమ్మ బద్ధకంగా కళ్ళుతెరచి చూసేసరికి సూర్యభగవానుడు అరుణారుణ కాంతులలోనుండి కళ్ళు మిరుమిట్లుగొలిపే ధవళ కాంతులలోకి వచ్చాడు. ఇంక నరసింహం వస్తాడు. ఆయనకేదో ఒకమాట చెప్పాలి. సావిత్రమ్మ చివాలునలేచి గబగబా దినకృత్యాలు నిర్వర్తించుకున్నది. పెనుగాలికి ఊగిపోయే తెరచాపలా ఉన్న మనసు తెల్లవారుజామున పట్టిన నిద్రలో తేరుకున్నది.

వంటయింట్లో గిన్నెలు సర్ది బోర్లిస్తుండగా మురళి భోజనంచేసే పళ్ళెము కనబడ్డది. మురళి ఈ పళ్ళెంలో ఏం తిన్నాడు? ఎటువంటి భోజనం చేశాడు? పెరుగు వెయ్యమని మురళి మారాం చేసిన రోజులు, కూరకావాలని పళ్ళెం ఎత్తి పడేసిన రోజులు, వేడి అన్నం కావాలని

జీవితవలయాలు

ఏడ్చిన రోజులు సావిత్రమ్మకు జ్ఞాపకం వచ్చాయి. గుండె బరువెక్కినట్లయింది.

నరసింహం లోపలికివస్తూ ఉండగానే సావిత్రమ్మ ఎదురుగా వెళ్ళింది. ఆయన కూర్చోటానికి చాపవేసి, తను దూరంగా గోడకానుకుని నిలబడ్డది. నరసింహం నాంది ప్రస్తావనగా ఆమెపిల్లల సంగతులన్నీ అడిగాడు.

ఆమె ప్రశాంతంగా వివరాలతోకూడా జవాబిచ్చింది.

నాలుగు మూలలూ తలత్రిప్పి చూసి 'ఏమంటారు నేనడిగినమాట?' అన్నాడు.

'నేనే మనగలను? వాడు మీకంట పడినప్పుడే వాడిజీవితం ఒకమలుపుకు తిరిగింది. వాడు మీ అభిమానానికి పాత్రుడయిననాడే వాడు అదృష్టవంతు డనుకున్నాను. మీదగ్గర ఉంటే మురళి పెద్ద చదువులు చదువుకుని అభివృద్ధిలోకి వస్తాడు. ఈ నిరుపేదరాలిదగ్గర ఉంటే కడుపునిండా అన్నముకూడా దొ ర క దు' నిదానంగా ఒక్కొక్కమాటే ఉచ్చరించింది.

'చాలా సంతోషం. మీదగ్గరనుండి ఇటువంటిజవాబు వస్తుందని నేననుకోలేదుసుమండీ. మీరేమంటారో ననుకుంటూ వచ్చాను. నేను అదృష్టవంతుడినే'

ఆయన వెళ్ళిపోతుంటే సావిత్రమ్మ కంటినుంచి నీటిబొట్లు రాలాయి.

అంతా పూసగుచ్చినట్టుగా విమలకు చెప్పి కళ్ళు ఒత్తుకున్నది సావిత్రమ్మ.

* * *

'సావిత్రి! సావిత్రి!'

రామనరసయ్య ఆమెకోసం ఇల్లంతా తిరిగాడు. 'ఎక్కడర్రా మీ అమ్మ?' ఒక్క కేక పెట్టాడు.

ఆకేకకు గదిలోఉన్న పిల్లలు నలుగురూ బిలబిలాడుతూ హాలులోకి వచ్చారు.

'అమ్మ ఎక్కడున్నదంటే ఒక్కరూ మాట్లాడరేమిటి?' గర్జించాడు.

'పెరట్లో నాన్నా. బాదంచెట్టు కింద' మళ్ళీ అంతా గదిలోకి వెళ్ళారు.

మధ్యాహ్నం రెండుగంటలవేళ ఎర్రని ఎండలో సావిత్రమ్మ మినప్పప్పు రుబ్బుతున్నది. పచ్చిమిరపకాయలూ అల్లమూ సన్నగా తరిగి రుబ్బినపిండిలో కలపటానికి రోటిదగ్గరగా పెట్టుకున్నది. ఆ ఉదయమే తలంటి పోసుకున్న వెంట్రుకలు ముకమంతా అలుముకుంటున్నాయి. వాటిని ఒకచేత్తో సర్దుకుంటూ రెండవచేత్తో రుబ్బుతున్నది.


'ఏం చేస్తున్నావు దొడ్లో?' కేకలు పెడుతూ రామనరసయ్య వచ్చాడు.

ఆమె జవాబు చెప్పకముందే 'ఓపలేనని అంటూ ఈ ఎర్రటి ఎండలో పప్పు రుబ్బటమేమిటి? అంతగా ఆకలేసినవాళ్ళను హోటలుకు వెళ్ళమను' తల చేత్తో తడిమి చూసుకుంటూ కనుబొమలు చిట్లించాడు రామనరసయ్య.

'ఎంత ఓపలేకపోయినా రేపు పొద్దున గోపి ఊరికి వెళ్ళిపోతాడనగానే వాడికి ఇష్టము వచ్చింది చేసిపెట్టాలని మనసు కొట్టుకుపోతున్నదండీ. వాడికి అల్లమూ పచ్చిమిరపకాయలూ వే సి న గారెలంటే ఇష్టం' అంతలోకే ఆమె కంఠధ్వని మారిపోయింది.

'రేపు ఉదయం వెళ్ళిపోతాడు. మళ్ళీ మేనెల మొదటి వారంలో వస్తానన్నాడు. ఆ హోటలు మె తు కు లు తినలేకుండా ఉన్నాడు. ఇక్కడ ఉండగా అన్నం చల్లారితే తినలేక పోయేవాడు' కళ్ళు తుడుచుకుంటూ సావిత్రమ్మ వంటయింట్లోకి వెళ్ళింది.

పెద్దకూతురు కుంపటి విసురుతూ



అడిగింది. 'అమ్మా అన్నయ్య రేపేనా వెళ్లటం ?'

'అవునమ్మా మళ్లీ అయిదు నెలలకు గాని రాడు' ముఖమ్మీద ముత్యాలలా పోట మరించిన స్వేద బిందువులను తుడుచుకుంటూ, కళ్లు ఒత్తుకుంటూ గారెలు మూకుడులోనుంచి నాలుగు తీసింది. గోపీకి మొదటిప్లేటు అందిస్తూ, 'విమలా. అన్నయ్యకు పీటవేసి మంచినీళ్లు ఇవ్వు' అన్నది కందిపోయిన ముఖంతో.

గోపీ గారెలు తింటుంటే మిగతా పిల్లలు గోడకు ఆనుకుని నిలబడి చూస్తున్నారు. అందరికంటె చిన్నవాడు మురళి. గోపీ ఒక్కడూ పీటమీద కూర్చుని తింటూ ఉంటే మెల్లిగా తల్లిదగ్గరచేరి 'అమ్మా నాకు?' కొంగుపట్టుకుని లాగాడు బుంగ మూతి తిప్పుకుంటూ.

'నీకూను ముందు అన్నయ్యకూ తరువాత నీకూ. అన్నయ్య రేపు ఊరికి వెళ్లిపోతున్నాడు కదూ ?' మూకుడులో ఉడుకుతున్న గారెలు తిప్పుతూ కళ్లు చిట్లించి చూసింది మురళివైపు.

'అయితే ?'

'అన్నయ్య బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తాడు' మురళి చేతికి రెండు గారెలుపెట్టిన పళ్లెం అందించింది.

'అయితే ?'

'అయితే ఏమిట్రా ? అన్నయ్య ఉద్యోగంచేస్తే నీకూ శంకరానికి చదువులు చెప్పిస్తాడు. పెళ్లిళ్లు చేస్తాడు' చిరుకోపంతో మందలించింది.

'నేనూ చేస్తా నాకూ ముందర గారెలు పెడితే' మురళి నేలచూపులు చూస్తూ తల వంచుకున్నాడు. పిల్లలందరూ మురళి మాటలకు పకాలున నవ్వారు.

సావిత్రమ్మ రామనరసయ్యకు ఒకపళ్లెం అందించింది. పిల్లలందరినీ పిలిచి తలా రెండుగారెలూ చేతికిచ్చింది.

అందరి భోజనాలూ ఎనిమిదింటికే పూర్తి అయ్యాయి. ఆరాత్రి పొద్దుపొయ్యే వరకూ సావిత్రమ్మ గోపీకి పెట్టె పక్క చుట్ట సర్దుతునే ఉన్నది. తెల్లవారుఝామున లేచి అన్నంవండి అప్పడాలూ వడియాలూ వేయించి, వంకాయబజ్జి చేసింది. రామనరసయ్య చూడకుండా గోపీని లోపలికి పిలిచి 'ఈ పాతిక రూపాయలు తీసుకో. నీ బూట్లు పాడయిపోయాయున్నాయి. కొత్తవి కొనుక్కో. నాన్న

జీవిత వలయాలు

ఇచ్చే డబ్బు జాగ్రత్తగా వాడుకో. ఎప్పుడయినా పిన్నియింటికి వెళ్ళుతూ ఉండు' వీపు నిమురుతూ చెప్పింది.

గోపీ బయలు దేరేటప్పుడు సావిత్రమ్మ వాకిటివరకూ వచ్చింది. తండ్రి బస్సు వరకూ వెళ్ళాడు. గోపీ బస్సులో కూర్చున్న తరువాత 'జాగ్రత్త, వ్రాయనా' అంటూ బస్సు కదిలేవరకూ నిలబడి వెనక్కు తిరిగాడు.

అక్కడికి నెల్లాళ్ళనుండీ రామనరసయ్య 'ప్రతి పనీ గోపీ వెళ్ళినతరువాత చెయ్యవచ్చు' నంటూ వాయిదాలు వేస్తున్నాడు. తన యు. డి. సి. జీతంలోనుంచి కనీసం నెలకు ఏభయి రూపాయలయినా గోపీకి పంపాలి. ఈ పని ముందుచేసిన తరువాత మిగతా అయిదుగురితో సంసారాన్ని నెట్టుకు వస్తున్నాడు.

'అమ్మయ్య గోపీని బస్సు ఎక్కించి వచ్చాను. నాకింత అన్నం పెడితే ఆఫీసుకు వెళ్తాను' అంటు ఇంట్లో పీట వేసుక్కూర్చున్నాడు రామనరసయ్య తలవంచుకుని కాలు ఆడిస్తూ.

పరికిణీ కుచ్చెళ్ళు కదులాడుతూ ఉండగా విమల ఒయ్యారంగావచ్చి తండ్రికి వడ్డించి గడపకు ఆనుకుని నిలబడ్డది ఆయనవైపు చూస్తూ.

'బడికి వెళ్ళలేదుటమ్మా?'

'లేదు నాన్నా, అమ్మ రేపటినుంచి వెళ్ళమన్నది'

తండ్రి వద్దంటున్నా విమల పచ్చడీ కూరా మారు వడ్డించింది. పరాకుగా భోజనంచేసి రామనరసయ్య ఆఫీసుకు వెళ్ళాడు.

సావిత్రమ్మ ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ పొద్దుపోయి భోజనానికి కూర్చున్నది. ఆనాడంతా ఏ పనిచేసినా ఆమె మనసులో గోపీయే మెదిలాడు. ఇల్లంతా చిన్నబోయినట్లనిపించింది. పగలు కొంచెం సేపు పడుకుని లేచింది. స్కూలుకు వెళ్ళే పిల్లల బట్టలన్నీ ముందరవేసుకుని కూర్చుంది. చినిగిన చోట కుట్టింది. కొన్నిటికి మాసికలు వేసింది. వాటనన్నిటినీ సబ్బునీళ్ళల్లో నానబెట్టింది. గోపీ తరువాత వాడు శేషగిరి. అతడి బట్టలు కుట్టటానికి కూడా వీలుకాలేదు. రెండు ప్యాంట్లు మాత్రం నడిపాతవి. బుష్‌కోట్లు పిగిలి పోయాయి. శేషగిరి హైస్కూలు చదువు ముగించి ఆ సంవత్సరమే కాలేజి చదువులోకి వచ్చాడు. శేషగిరి బట్టలు చూసిన తరువాత సావిత్రమ్మ తను చేసిన పనికి పశ్చాత్తాప పడ్డది. గోపీకి తను రహస్యంగా యిచ్చిన రూపాయలతో శేషగిరికి ఒక జత బట్టలు కుట్టిస్తే బాగుండేది. శేషగిరికి సుమారైన బట్టలు లేకపోతే కాలేజి వాతావరణంలో చిన్న బుచ్చుకోవలసి వస్తుందని అనుకుంది. కాని గోపీకిఉన్న ఖర్చుల వత్తిడి శేషగిరికి ఉన్నదని ఆమె మనసు ఎందుకో అంగీకరించటం లేదు. గోపీ పెద్ద కొడుకు. తండ్రి తరువాత ఇంటికి పెద్ద వాడు. రేపు పెద్ద ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించవలసిన వాడు. బస్తీలో నలుగురిలో తిరగవలసిన వాడు. సావిత్రమ్మ శేషగిరి బుష్‌కోట్లకు పైకి కనబడకుండా పోయిన చోట్ల కుట్లు వేసింది. పగిలిన గుండీలు కత్తిరించి వాటి స్థానంలో కొత్త గుండీలు కుట్టింది.

చూస్తూ చూస్తూ ఉండగానే అయిదు గంటలు కొట్టింది గడియారం. చిన్నవాడు మురళి వచ్చి ఏమయినా పెట్టమని పేచీ పెడతాడు. వాడికి వేయించిన కందిపప్పు పెట్టాలని పొట్లము కట్టింది.

సావిత్రమ్మ లేచి ఇల్లు ఊడ్చుకుని పెరట్లో కాసిన దొండకాయలు దోసెడు కోసుకు వచ్చి వేయించి అన్నం వండింది. రామనరసయ్య విస్తట్లో కూర వడ్డించింది. మురళికి నాలుగు ముక్కలు వేసింది. మిగతా పిల్లలకు ఒక్కొక్క ముక్క రాల్చింది.

'అమ్మా. కూరవద్దుగాని ఆవకాయ ముక్క ఉంటే—వెయ్యమ్మా' తలవంచుకుని అన్నం కలుపుకుంటూ అడిగాడు శేషగిరి.

సావిత్రమ్మ మాట్లాడకుండా ఆవకాయ వడ్డించింది. మిగతా పిల్లలంతా కమ్మ పొడి వడియాలు వేసుకుని తిని లేచారు.

చారన్నం కలుపుకుంటూ సావిత్రమ్మ 'గోపీ చేతికి వచ్చేవరకూ సర్దుకోగలిగితే కష్టాలు గట్టెక్కినట్లే' మనసులోనే అనుకుంటూ లేచి ఇల్లు సర్దుకున్నది.

(ఇంకా ఉంది)

మేషం : వారం ప్రారంభంలోనే వృత్తివ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం వృత్తివ్యాపారాల్లో మీ కార్యమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారంమధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిధునం వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతోకూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం. ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

సింహం ఇంతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాల్లోనే చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. అలంకార వస్తువులు కొంటారు.

కన్య ఫలితంమాట యెలాగఉన్నా, ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. వారం మధ్యలో అనుకోని చికాకులకు గురికాగలరు. సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం రాగలదు.

వారఫలం

4-10-1968 శుక్రవారం మొదలు 10-10-1968 గురువారం వరకు

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

తుల: వృత్తిలో సాటివారితో పోటీ పెరుగుతుంది. ఇతరుల మీద ఆధారపడి యేవ్యవహారమూ ప్రారంభించడం తగదు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. ఆడంబరంకోసం వ్యయంచేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం వ్యాపారంలో మీ ఆలోచలనకు తగిన అవకాశాలు లభిస్తాయి. సాసహముతోకూడిన వ్యవహారాలు లాభిస్తాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా వుంటాయి విలాస వస్తువులు కొంటారు.

ధనుస్సు · కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. సాహసముతోకూడిన వవ్యహారాలు లాభిస్తాయి. విద్యావైజ్ఞానిక రంగాలలో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం. వ్యాపారంలో సాటివారితో పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. ప్రయాణాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలన్న వింటారు.


కుంభం భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మీనం : వృత్తివ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

– మహేష్ ●





వఠివేటి నాగ చంద్రావతి

తింటున్న చింతపండు, పువ్వు పళ్ళెం చటుక్కున పక్కకు తోసి "రా పద్మా" అని ఆహ్వానించింది పిన్ని. మళ్ళీ నీళ్ళోసుకుంది గావును పిన్ని, అమ్మతో చెప్పాలి, అనుకున్నా. వంటింట్లో పీటవాల్చి "కూర్చో, గమ్మున బియ్యం కడుక్కొస్తా. కుంపటి మీద పడేసి కూచోవచ్చు" అంటూ గిన్నె తీసుకుని దొడ్లోకి వెళ్ళింది పిన్ని.

నా చూపంతా చింతపండు పళ్ళెం మీదనే వుంది. పిన్ని ఎప్పుడూ నీళ్ళు పోసుకోవటమే గాని అవి పాలు అయ్యేదీ లేదు, అయినా కడుపు పంట నాలుగు కాలాల పాటు కళ్ళ ఎదట పారాడిందీ లేదు. అందుకే అమ్మ అంటూ వుంటుంది. "పెళ్ళయితే పెద్దాళ్ళు అన్యాయం చేసి రెండో పెళ్ళి వాడికిచ్చారన్నావ్, మరి దీనికేమి చెబుతావ్? పిచ్చిదానా! రాతే! రాత! ఆ భగవంతుడు రాసిన రాతని ఎవరు తప్పించ గలరు? మనం కేవలం నిమిత్తమాత్రులం" అంటుంది. అమ్మది మరీ వాదస్తం! మానవుల దయితేనేం, భగవంతుడి దయితేనేం, మొత్తానికి అమాయకురాలైన పిన్నికి అంతా అన్యాయమే జరుగు తోంది.

బియ్యం గిన్నెతో లోపలి కొస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నావ్" అంది పిన్ని. "అబ్బే ఏం లేదు" అన్నాను. బియ్యం గిన్నె కుంపటి మీద పడేసి, అత్తెసరు నీళ్ళు పోసి పైన పళ్ళెం బోర్లించింది.

"పద మల్లె మొగ్గలు కోద్దాం" చెంబులో నీళ్ళు పోసి వాకిట్లోకి నడుస్తూ అంది. మాట్లాడకుండా వెనకాల నడిచాను. పిన్ని పువ్వులుకోస్తూంటే నేను మాలకడ్తూ అడిగాను, "వాణి దగ్గర్నించి వుత్తర మొచ్చి చాన్నాళ్ళయింది కదు పిన్నీ?"

"మరే — బొత్తిగా మానేసింది మధ్య— కొత్త స్నేహితుడు దొరికాడు కదూ— పాత వాళ్ళని మరిచి పోతున్నట్టుంది" నవ్వింది. నేనూ నవ్వేశా.

వాణి పిన్నికి సవితి కూతురు. అదీ నేనూ ఒకే క్లాసు చదువు కుంటూ ఉండే వాళ్ళం. క్రిందటేడే పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళింది వాణి. అది వున్నప్పటి స్నేహమే పిన్నికీ నాకూ.

మల్లె మొగ్గలు ఎవరెవరి కివ్వాలో, ఇంకా ఎవరి కివ్వాలో చెపుతూంది పిన్ని. అన్నిటికీ వూఁ కొడుతున్నా.

పచ్చగా వుంటుంది పిన్ని. బారెడు జడ. నీడలు కనిపించే బుగ్గలు. అందమంతా వాటిల్లోనే వుందనిపించే చేపల్లాంటి కళ్ళు. దేవుడికి బుద్ధి లేదనిపించింది మేస్టారి పక్కన అవిణ్ణి వూహించుకుంటే. కాని కలలో కూడా ఆ విషయం అనుకున్నట్టే తోచదు పిన్ని తరహా చూస్తే. కట్టిన మాలలో సగం నా జడలో పెట్టి మిగతాది తన తలలో తురుముకుంది.

"ఇక వెడతా పిన్నీ" అన్నా లేస్తూ.

"కూచుందూ ఒక్కదాన్నీ వుండాలి. మేస్టారొచ్చాక వెడుదువు గానిలే" మళ్ళీ కూచోబెడుతూ అంది పిన్ని— "పొద్దు పోతే మీ వీధి దాకా దిగబెడతాలే."

"భయానికి కాదుగాని— అమ్మేమయినా....." అందుకుంటూ అంది పిన్ని "కోప్పడుతుందనా? రేపు నేనొచ్చి చెప్తాలే— మీ అమ్మాయిని కొట్టకండి— నేనే వుంచేశానూ అని" దీర్ఘం తీస్తూ నవ్వింది పిన్ని.

"మరే— చిన్న పిల్లని గదూ" పకపకా నవ్వాన్నేను.

మాటల్లో పడి పొద్దెంత పోయిందీ తెలియనే లేదు మాకు, కిర్రుమంటూ గేటు తోసుకొస్తున్న మాస్టార్ని చూసేవరకూ. "అరుగో మేస్టారొస్తున్నారు— నే పోతున్నా పిన్నీ" లేచి నిలబడ్డాను. లోపలికి వస్తూ అన్నారు మాస్టారు—

"ఎవరూ? పద్మేనా! నీ స్నేహితురాలు ఉత్తరం రాసిందోయ్."

"ఏం రాసిందండీ?" పిన్నితో బొట్టు పెట్టించుకుంటూ అడిగా.

"కులాసాగానే వున్నారట. మిమ్మల్నందర్నీ చూడాలని వుందటా— సంక్రాంతికి వచ్చి తీసికెళ్ళమని రాసింది."

"నా సంగ తేమీ రాయలేదా? రాయదులెండి. దానికి నేను జ్ఞాపక ముంటే కదూ" నవ్వుతూనే అన్నా, లోపలేదో బాధగానే వుంది.

"మరే నీకు మహ అది జ్ఞాపకముందీ? నీ అంతట నువ్వు ఒక్క ఉత్తరం ముక్క రాశావా దానికి చెబుదూ? అది వెళ్ళాక నువ్వూ— మీ పిన్నీ— ఈ ప్రపంచంలోనే పడిపోయావుగానీ— "కూతుర్ని వెనకేసుకొస్తూ అన్నారు మాస్టారు.

"మీరు భలే వారండీ" బయట కొచ్చేస్తూ అన్నా.

"రేపు మీ చెల్లెల్ని పంపు పద్మా పొట్లకాయలిస్తాను" అంటున్న పిన్నికి "ఆ—ఆ" అంటూ సమాధానం చెబుతూ అడుగులు తొందరగా వేశాను.

మేస్టారన్న మాట నిజమే. వాణి అత్తారింటికి వెళ్ళేదాకా పిన్నికీ నాకూ మధ్య వట్టి పరిచయం లాగే వుండేది. వాణితోపాటు నేనూ 'పిన్నీ' అని అవిణ్ణి పిలిచేదాన్ని. అంతే. వాణి అత్తవారింటికి వెళ్ళాక ఏమీ తోచక అల్లాడే నన్ను అదే స్థితిలో వున్న పిన్ని పూర్తిగా ఆకర్షించింది. ప్రతిరోజూ సాయంత్రం కాస్సేపు పిన్నితో కబుర్లు చెప్పుకోనిదే తోచదు నాకు. ఎక్కడికీ పంపనిదైనా, అమ్మకూడా నన్ను వాళ్ళింటికి వెళ్ళేందుకు అభ్యంతర పెట్టేది కాదు. అలా అని రోజూ పంపేదీ కాదు. నేను వెళ్ళని నాడు రెక్కలు కట్టుకు వాలేది పిన్ని. వాణి దగ్గర కంటే పిన్ని దగ్గరే ఎక్కువ చనువైంది నాకు. వాణి తత్వం కాస్త హడావిడి. అది నా స్వభావానికి విరుద్ధం. పిన్ని మంచి నెమ్మది మనిషి. అందుకే అవిడంటే చనువుతోపాటు గౌరవం గూడా వుండేది నాకు.

"ఇంత ఆలస్యమైందేమే?" నేను వస్తూనే అడిగింది అమ్మ.

"వాణి దగ్గర్నించి ఉత్తర మొచ్చిందేమో అని మాస్టారొచ్చేదాకా వున్నా" అబద్ధానికి నిజం జోడిస్తూ అన్నాను.

"వొచ్చిందా?" పీట వాలుస్తూ అంది అమ్మ.

"వొచ్చింది. కులాసానేట" కంచం పెట్టుకుని పీటమీద కూర్చున్నా.

"అంతేనా? నీళ్లేమన్నా—?....." నా మొహంలోకి నవ్వుతూ చూస్తూ అంది అమ్మ, నెయ్యి విదుపుతూ.

"దానికేమీ లేదుగాని పిన్నే....." జ్ఞాపక మొచ్చిన సంగతి చెప్పేశా చిరునవ్వుతో మిళాయించి.

"సర్లే. మళ్ళీ అప్పుడేనా" గప్పున మూతి ముడిచింది అమ్మ.

అల్లాంటప్పుడే అమ్మను చూస్తే నాకు మండుతుంది. ఏడాది బిడ్డను పోగొట్టుకుని ఏడాది దాటిన పిన్నికి అప్పుడేనా అంటుంది గాని, విన్నగాక మొన్న కాపురానికి వెళ్ళిన వాణి నీళ్ళోసుకోలేదని తొందర పడుతుంది. అయినా అమ్మకి వాణి అంటేనే పక్షపాతం. అవును మరి. తల్లిపోయిన కొత్తల్లోనూ, తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్న సందులోనూ ఎప్పుడూ మా ఇంటి దగ్గరే వుండేది వాణి.

"ఆ ఇంట్లో ఒక్కదాన్నీ వుండాలంటేనే భయమేస్తూందండీ దొడ్డమ్మగారూ" అనే వాణి మాటలకి కన్నీటి చెలమలే అయ్యేవి అమ్మకళ్ళు. వాణి తల్లీ, అమ్మా మంచి స్నేహితులు. అవిణ్ణి తలుచుకుని అప్పుడప్పుడూ అమ్మ బాధపడుతూ వుండేది.

పొద్దున్నే ఎలాగో ఒకలా వంటచేసి, తండ్రిని స్కూలుకు పంపి, తానింత తిని మా ఇంటికి పరుగెత్తుకు వచ్చేది వాణి. ఇద్దరం కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. సాయంత్రం దాకా అదో ప్రపంచం. సాయంత్రం వస్తూనే నన్ను తోడు తీసుకుని ఇంటికి వెళ్ళి వంట చేసేది. ఒక్కొక్కనాడు అమ్మ చేతే వండించేసి గిన్నెలు పట్టికెళ్ళి వాళ్ళింటి దగ్గర పెట్టేవాళ్ళం. ఇక సెలవులొస్తే మా యింట్లోనే వుండిపోయేది. వాణి ఆరోజు మేస్టార్నే వండుకు తినమనేది. తల్లి కోసం ఎక్కడ బెంగ పెట్టుకుంటుందో అని ఏమనేవాడు కాదాయన.

ఇద్దరం పెద్దవాళ్ళ మయ్యాం. ఈ మధ్యలో చాలా మార్పులు జరిగినయ్. మేమిద్దరం పెద్దవాళ్ళమై, చదువులు కట్టిపెట్టి ఇంటి దగ్గరే వుంటున్నాము. "మిగతా పిల్లలు పెద్దవాళ్ళు. ఎవరి సంగతి వాళ్ళు చూసుకుంటున్నారు గాని చిన్న పిల్ల! దీని పెళ్ళీ, పేరంటం ఎవరు చూస్తారం"టూ, ఆ వయసులో పిన్నిని చేసుకుని ఇంటికి తెచ్చుకున్నారు మాస్టారు. అందరి కంటే ఎక్కువగా సంతోషించింది అమ్మ పిన్నిని చూసి "అమాయకురాలేనే, వాణిని బాగానే చూసుకుంటుందిలే" అని సంతృప్తిపడింది అమ్మ. నాకు మాత్రం మనసెందుకో చివుక్కుమంది. వాణిని చూసేందుకేనా పిన్నికిపెళ్ళి? ఆమె కేమీ అక్కరలేదా—

పిన్నిని చూస్తే నాన్న రాసే కథల్లోని దేవకన్యకా అనిపించింది. కొత్తలో అవిణ్ణి మళ్ళీ మళ్ళీ చూడాలని తహతహ లాడే దాన్ని గాని మాట్లాడాలంటే మళ్ళీ బెరుగ్గానే వుండేది.

వాణిమాత్రం కొన్నాళ్ళు కొత్తమోజులో పడి మమ్మల్నందర్నీ మర్చేపోయింది. అమ్మ నన్ను తెగ సతాయించేది. "వాణి నొక్కసారి కేకేసుకు రావే మరీ నల్లపూసయి పోయింది" అంటూ. పిలవడానికి వెడితే వాణి "వుండవే పిన్నికి ఎక్క

దేవి వున్నాయో తెలీదూ. నేను లేకపోతే వంటే అవదూ.....''అనేది మహా ఆరిందాలా. కాసేపు కూచోమన్నైనా అనేది కాదు. పిన్ని కూచోమనేది. కాని నాతో కబుర్లు చెబుతూ కూచుందుకు పిన్నికి ఏలా? ఇంటోపనీ పాటా ఒగిపోలా? వాణి సరే, ఆవిడ వెనకాలే పనిలేకపోయినా తెగ తిరిగేస్తూ, పిన్నీ పిన్నీ అంటూ ఏవో సలహాలూ సంప్రదింపులతో, ఛార్జి అప్పగిస్తున్న ఆఫీసరు ధోరణిలో సతమత మవుతున్నట్టుండేది, తీరుబడే లేక పాపం. అందుకని ఆట్టేసేపు కూర్చో బుద్ధయ్యేదికాదు. ఇంటికి వచ్చినా మనసు మాత్రం అయస్కాంతంలా ఆటే పిన్ని మసులుతున్న ఆ ఇంటి వెలుపలనే తారట్లాడుతుండేది.

వాణికైనా ఆమోజు ఎన్నాళ్లో నిలవనే లేదు.

అతరవాత అదివరకటికంటే ఎక్కువగా మాఇంట్లో తిష్ట వేసేది. ఇదివరలోలా వంటపని గూడా లేదుగా. తండ్రి వచ్చేసరికి తను ఇంటి దగ్గర లేకపోతే కేకలేస్తాడని తెలిసినా పిన్ని సర్దేస్తుందని తెలుసు వాణికి. అందుకని ఆవ్వేళకి గూడా ఇంటిదగ్గర వుండేది కాదు. పెత్తనాలు సాగించేది.

పిన్ని ఎంత మంచిదంటే, ఆవిడ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని ఆవిడమీదే ఆధార్టీ చెలాయించేది. వాణి రకరకాలుగా నాస్నతో చెప్పేస్తానంటూ, బెదిరింపు ధోరణిగా ధిమాకీలు చేసేది. ఆవిడ సరే, ఏతప్పు చెయ్యకపోయినా, హడిలి పొయ్యేది. ఆవిడ్ని చూసి విరగబడి నవ్వేది వాణి.

''ఎందుకు పిన్నీ అంత భయపడతావ్! అసలు చెప్పేందుకు ఏముందని''అంటూ వీపు దువ్వేది తరవాత కొంటెగా.

''భలే దానివే'' అంటూ తేలికగా నిట్టూర్చే పిన్నిని చూస్తే, ఆక్షణంలో ఎక్కడ లేని జాలి పుట్టుకొచ్చేది. వాణి విలిపి తనానికి మండుకొచ్చేది. ఆవిడ ఇవన్నీ మనసులో పెట్టుకునేదే కాదట.

పిన్ని

ఆ తరువాత వాణి చెప్పేది.

ఏళ్లు గడిచినయ్.

వాణికీ, నాకూ పెళ్ళిళ్లయినయ్.

వాణి అత్తవారి టికి వెళ్లింది.

నేను మాత్రం శ్రీవారి చదువు పూర్తి కాని కారణాన ఇక్కడే వుండిపోయాను.

ఈలోపల పిన్నికి ముగ్గురు పిల్లలు పోవడం, రెండుసార్లు ఎబార్షన్లు కావడం జరిగింది. ఎప్పటికప్పుడు 'ఈ సారైనా...' అనుకుంటూ మనసు దిటవు చేసుకుంటూ వుండేది పిన్ని.

ఈసారి వాణివస్తే పిన్ని ప్రసవించేదాకా ఉండిపొమ్మని చెప్పాలి. పంపెయ్యవద్దని పిన్నితో చెప్పాలి. ఎప్పుడూ గలగలలాడుతూ బొంగరంలా చలాకీగా ఉండే వాణి, సంసారంలో పడ్డాక ఇప్పుడెలా వుందో—

మళ్ళా నాలుగు రోజులు దాకా పిన్నిగారింటికి వెళ్లటమే పడలేదు.

ఆవేళ మామూలుగా పిన్నిగారింటికి బయలుదేరాను. గేటు తీస్తుంటే మేస్టారి మాటలు వినపడ్డయ్. శనివారంకదూ! ఇంట్లోనే వున్నారు కాబోలు అనుకుంటూ గుమ్మంలోకి అడుగు పెట్టాను. మేస్టారు పిన్ని నేదో కేకలేస్తున్నట్టు తిపిపించి ఆగిపోయా.

''ఇన్నిసార్లు నిన్ను బ్రతిమలాడకుండా నేనే చేయించుకుందును అబ్లడ్ ప్రషర్ లేకపోతే! ఈ వయసులో ఇంకా పిల్లలంటే సిగ్గేస్తోంది కూడానూ...''మేస్టారి గొంతు కరుగ్గా వినిపిస్తోంది. సన్నగా ఏడుస్తోంది పిన్ని. వెళ్లేందుకు సమయం కాదని వెనక్కి తిరిగా.

మర్నాడు పిన్ని వచ్చింది, నిమ్మకాయకోసమని. వెళ్తూ వెళ్తూ నేను ఇన్నాళ్లు రానందుకు నిష్ఠూరమాడి, రేపు తప్పకుండా వస్తానని చెప్పించుకుని మరీ వెళ్లింది. నిన్నటి విషాదచాయల తాలూకు నీడలైనా లేవు పిన్నిలో.

మర్నాడు వెళ్ళాను. నవ్వుతూ ఆహ్వానించింది పిన్ని. తను పప్పు రుబ్బుకుంటుంటే నేను గడ్డిపోచ కొరుక్కుంటూ కూచున్నా. పిన్ని ఎడతెరిపి లేకుండా ఏవో చెప్తూనే వుంటుంది. ఈసారి పుట్టబోయే పాపకు ఏవి దేవుళ్ల పేర్లు కలిపి పెడతానని మొక్కుకుందో చెప్పింది. 'బారెండు కొల్లేటి చేంతాడులా' అని నేనంటే, కిలకిలా నవ్వింది.

మాట్లాడుతున్నసన్న మాటేగాని నామనసంతా మొన్నటి సంఘటన మీదే వుంది. అడగనా వద్దా? కాస్సేపు తటపటాయించి తెగించి మెల్లగా అడిగా.

''మొన్న ఎందుకు పిన్నీ మాస్టారు కేకలేస్తున్నారూ'' ఒకక్షణం తెల్ల పోయింది.

''నీకెలా తెలుసూ'' అనుమానంగా అడిగింది. చెప్పాను.

తలవంచుకుని రుబ్బినపిండి గిన్నెలోకి తీసుకుంటు ''లోపలికి పద'' అంటున్న పిన్ని కంఠంలో కంపం పసికట్టాను. ఎందుకడిగానా అనిపించింది నాకు.

మంచం మీద కూచున్న నాఒళ్లో తలపెట్టి బావుర మంది పిన్ని. అలా పిన్ని ఏడవగా చూడ్డం నాకిది రెండోసారి. మొదటిసారి వాణి అత్తారింటికి వెళ్ళినప్పుడు. అప్పుడు నేనూ పిన్నికి భాగస్వామి నయ్యాను. కాని ఇప్పుడలా చెయ్యలేదు. ఏడుస్తున్న పిన్ని తల నిమురుతూ వుండిపోయాను.

ఆక్షణంలో పిన్నికంటే ఎన్నో రెట్లు పెద్దదాన్నని పించింది.

ఆతరువాత తనని తనే సంబాళించుకుంటూ చెప్పింది పిన్ని. ఇక పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకోమంటున్నారట మాస్టారు.

''ఉన్న పిల్లల్ని నీ పిల్లలనుకోరాదా'' అంటారు— నువ్వు చెప్పు— పద్మా ఎంత ఆప్యాయత చూపినా రక్తం పంచుకు పుట్టిన బిడ్డలవుతారా? ఇంతెందుకు, నన్నింతవరకూ అమ్మా అని పిలవ గలిగారా వీళ్ళు? నాబిడ్డలంటూ నాక్కావాలని నేనన్నందుకు పట్టని స్వార్థ పరురాలినంటున్నారు. ఈ ఒక్క కనీసపు కోరిక కోరేపాటి స్వార్థమైనా వుండ కూడదా నాలో? చెప్పు పద్మా''.

వెక్కివెక్కి ఏడ్చింది పిన్ని. ఏమని ఓదార్చ గలను?


మౌనంగానే నా సానుభూతిని అందచెయ్య గలిగాను. పిన్ని నానుండి పొందగోరింది గూడా అదే.


వాణిని సంక్రాంతికి తీసుకొచ్చారు మాస్టారు.

ఏమీ మారలేదు వాణి. కాకపోతే అదివరకెప్పుడూ సినిమా సంగతులూ అవీ మాట్లాడేది— ఇప్పుడంతా మొగుణ్ణి గురించే—నాకు తెలుసు లోలోపల అమ్మ నవ్వుకుంటోందని.

మాటల సందడిలో అడిగింది అమ్మ 'ఇంకా వుంటావా'ని, ఎప్పటిదాకానో మాకూ తెలుసూ, దానికీ తెలుసు.

''ఆ—తప్పుతుందా?'' వాణి గొంతులో అయి




మీనాక్షీ నువ్వింట్లోకెళ్ళు!
బాపు
దసరా బాణాలు
నీకెందుకోయ్ మాలయ్యా దసరా మామూలు? నే పత్రికలకి పంపించిన కధలు తిరుగు టపాలో భద్రంగా తీసుకొచ్చి నందుకా?
ఎవడ్రా వాడూ? ఇది మామ్మాయి మీదకి వేసింది?
ఎవరేసారో! అవన్నీ చూడ్డవే. నా పనను కున్నారా?
నేను నిజమైన పోలీసు కాదు - దసరా వేషం-- ఓ రెండు రూపాయలు ఇచ్చేయ్ పోతా!
ఏమిటా మొహం నువ్వూనా - దసరా వేషమా?
కాదే తల్లీ - కార్టూనిస్టు పెంళ్ళా ఎగిరి నా మొహాన పడింది!
పైనున్నపిల్లకి పూవు ఇవ్వడానికి ఇంతకంటే వేరేమార్గం లేదట్రా ?

పిన్ని

ష్టత మొగింది. అమ్మా నేనూ ఏమీ మాట్లాడలేక పోయాం.

"అయినా కాస్త తెలుసుకోవాల్లెద్దూ—ఈ వయసులో ఇంకా పిల్లలేమిటని నాన్న కయినా వుండాలి— చెల్లెలో, తమ్ముడో అని చెప్పుకోడానికి నాకే సిగ్గేస్తోంది" నిరసనగా అంది వాణి.

"మీనాన్నకయితే వయసయింది—పిల్లలున్నారనుకో—మరి పిన్ని సంగతి?" వూరుకోలేక చటుక్కున అడిగేశాను. చురచురా చూసింది వాణి నావంక.

"ఏం? మేమందరం ఏమయి పోయామని...? ఆవిడకి బిడ్డల గీతే వుంటే ఇప్పటిదాకా పుట్టిన నలుసులు దక్కనే దక్కేవాళ్ళు"

దానితో వాదించటం నా కిష్టం లేదు.

"అలా సరిపెట్టుకో గలిగితే దేవతలేనే అమ్మా" అంది అమ్మ మళ్ళీ వేదాంతంలో పడుతూ.

నాలుగురోజులు పోయాక వోరోజు ప్రొద్దున్నే వచ్చేసింది వాణి, మా ఇంటికి మొహం మటమట లాడించుకుంటూ. 'ఏం జరిగిందబ్బా' అనుకుంటున్నా. సరాసరి అమ్మదగ్గరికి వెళ్ళి చెబుతోంది.

"సాయంత్రం బండికి వెళ్ళిపోతున్నా దొడ్డమ్మగారూ" అంటూ

"అదేం?" ఆశ్చర్యపోయింది అమ్మ.

"ఆవిడ కనడమే ఇష్టం లేని వాళ్ళం పురుళ్ళేం పోస్తాం?" నిష్ఠూరంగా అంది వాణి.

ఏదో జరిగిందన్న మాట... మనసులో దాచుకోలేని సందేహాన్ని బయటకు కక్కింది అమ్మ.

"అసలు మొదలెట్టింది నాన్నగారు— ఆపరేషన్ చేయించుకుంటుంది —కన్న తరవాతగూడా రెణ్నెల్లు వుండమన్నారు నాన్న. సరేనన్నాను. వంటింటో పిన్ని వింటూనే వుంది. "నేనేమీ ఆపరేషన్ చేయించుకోను. నేను ఒప్పుకున్నట్టే చెబుతారేమిటి?" అంది పిన్ని. దానిమీద నాన్నగారు 'ఎందుకు చేయించుకోవు? ఇప్పటికే నలుగురూ నన్నుచూసి ముందుకొక్కపోయినా వెనక నవ్వుకుంటున్నారు 'ముసలాడికి దసరా పండగని.' నన్నిలా గౌరవంగా బ్రతకనివ్వవా ఏమిటి?' అనడిగారు కాస్త గట్టిగానే. నేనూ వూరుకోలేక, "అవును పిన్నీ ప్రతిసారీ తొమ్మిది నెల్లూ మోసి కష్టపడి కంటమే కాని నీ ఒళ్ళు గుల్ల కావడం మినహా ఏమి మిగులుతుంది? మనసు సరిపెట్టుకోవాలి గాని మేమంతా నీ పిల్లలం కాక పోయామా?"అన్నాను. దానిమీద విరుచుకు పడి పోయిందనుకో. 'మీరూ వో పిల్లలేనా?'అంది 'నాపిల్లయితే నాకిలాటి సలహా ఇచ్చేదా'అంది. తనలో వున్న ఆ ఒక్క కోరికా గూడా నాశనం చేసేసుకుని ఈ ఇంటిల్లపాదికీ చాకిరి చేస్తూ కూచోడం నావల్ల కాదంది. 'అల్లాటి కోరికలున్న మేమే ఉత్త స్వార్థపరులమ'ంది. ఇది అన్నది, అది అనలేదు అని లేకుండా అన్నీ దులిపేసింది." అని కళ్ళనీళ్ళు పెట్టుకుని, "అంత స్వార్థ పరులం పురుడేం పోస్తాం? ఆవిడంటే ప్రేమాభిమానాలు పొంగుకొచ్చే వాళ్ళ చేతే పోయించుకుంటుందిలే— నేనెందుకూ." అంది ముగిస్తూ.

పిన్నికి ఎవళ్ళూ లేరని దానికి తెలుసు. అందుకే అలా చెప్తుతోందని మాకూ తెలుసు.

వాణి ఆవేళే వెళ్ళిపోయింది.

పాపం పిన్ని గతేమిటో అనిపించింది.

"ఆ భగవంతుడు వున్నాడు క్రియకి. అయినా ఆవిడకి అంత తొందర పనికి రాదులే"అంది అమ్మ.

పిన్నిలో ఎన్ని అగ్ని పర్వతాలు రగులుతున్నాయో అమ్మకి ఎందుకు తెలియదా అనిపించింది నాకు.

ఆవేళ 'నిమ్మకాయపిండి' చేసింది అమ్మ. "పుల్లగా వుంటుంది పిన్నికి కాస్త ఇచ్చిరావే," అంటే బయలుదేరాను. నేను వెళ్ళేసరికి మాస్టారెక్కడికో ప్రయాణమవుతున్నారు. నన్ను చూసి "రారా మంచి శకునం" అన్నారు. అడక్కూడదన్న మాటే మర్చిపోయి, "ఎక్కడికండోయ్" అన్నాను నవ్వుతూ.

"ఏముంది— వచ్చిన వాళ్ళని తిట్టి వెళ్ళగొట్టంగా ఇకరానివాళ్ళని బ్రతిమలాడి తీసుకు రావడానికి" వ్యంగ్యంగా వోచూపు పిన్ని మీదకు విసిరేసి వెళ్ళిపోయారు మాస్టారు.

పిన్ని కళ్ళల్లో నీళ్ళు తిరగటం స్పష్టంగా కనిపిస్తూనే వుంది. జరిగిన దానికి విచారిస్తోందనటానికి ఆ కన్నీళ్ళే సాక్ష్యం.

బియ్యం ఏరుకుంటూ మెల్లిగా చెప్పింది పిన్ని. కొడుకుని అడిగి కోడల్ని తీసుకురావడానికి వెళ్ళారట మాస్టారు. కాస్సేపాగి మళ్ళీ చెప్పింది— ఆవేళ అన్నిమాటలు అనాలనుకోలేదట తను. తనకా క్షణం ఏదో ఆవేశం ముంచుకొచ్చి అట్లా అనుకోకుండా వాగేశానంది. లేకపోతే చిన్నప్పటినించీ తను పెంచిన వాణిమీద తన కోపమేమిటంది. వాణిని అనవసరంగా బాధపెట్టినందుకు జలజలా కన్నీరుకార్చిందిపిన్ని. వెర్రి పిన్ని! తనలో ఆకోరిక అంతబలంగా వున్నందుకు తనను తానే తిట్టుకుంది. ఈసారైనా భగవంతుడు చల్లగా చూసి, "ఈ పాపనైనా తనకు దక్కిస్తే వచ్చేసారి తప్పకుండా ఆపరేషన్ చేయించుకుంటాను" అని చెప్పింది పిన్ని. పిన్ని మీద జాలేసింది నాకు.

"నీ కోరికలో తప్పేమీలేదు పిన్నీ! అది భగవంతుడిచ్చే వరం..... నువ్వెందుకు చెయ్యిజాపావు అంతే.... ఎవరేమనుకుంటే నీకేం?" అంటూ వోదార్చాను.

"ఎంత గొప్పగా అన్నావే తల్లీ..... నీ కడుపు చల్లగా......" అని ఉప్పొంగి పోయింది పిన్ని.

మర్నాడు పిన్ని వో మూడేళ్ళ అబ్బాయిని వెంటబెట్టుకుని వచ్చింది.

"ఈ పిల్లాడెవరండోయ్" అంది అమ్మ చొరవ చేస్తూ.

"మనవడు" అంది నవ్వుతూ.

పిల్లలులేని పిన్నికి మనవడు! నాకు నవ్వొచ్చింది.

అంతకన్న "వీడు నా మనువడు" అని కల్మషం లేకుండా, ఆత్మీయత వెళ్ళబోసుకుంటున్న పిన్నిలోని దేవత నా కళ్ళల్లోకి తొంగిచూచింది క్షణం.

"కోడల్ని తీసుకొచ్చారన్నమాట" అంది అమ్మ

పిన్ని నవ్వేసింది "వుహూ"అంది వుదాసీనంగా. "ఆవిడా నీళ్ళు పోసుకుందట— వేవిళ్ళు — రానందట. ఇక మీరే దిక్కు" అంది పిన్ని జాలిగా.

"మీ మాస్టారి ముందాలోచనకి నిదర్శనం....

కితంసారి అక్కిప్తపోయినప్పుడు బెంగపెట్టుకుని ప్రాణంమీదికి తెచ్చుకున్నానట— అందుకని అలా కాకుండా ముందే వీడిని తీసుకొచ్చారు” అంది నవ్వ లేక నవ్వుతూ.

“బాగానే వుంది దీవెన!” కష్టంగా అంది అమ్మ.

కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయింది పిన్ని. మాస్టారి ప్రవర్తనకి చాలాసేపు బాధపడ్డాం అమ్మానేనూ.

చెప్పొద్దూ, ఆ తరువాత పిన్నితో నా సాంగత్యం మరీ ఎక్కువయింది. అన్నీ మనసు విప్పి చెప్పేది పిన్ని నాతో. ముఖ్యంగా పుట్టబోయే పాపపైన ఆశ లన్నీ నింపుకున్నట్లు మాట్లాడేది పాపం. “ఈసారి పాపకు నాపాలు ఇవ్వను పద్మా— ఏ గేదెపాలో పట్టి స్తాను. కాస్త బలహీనంగా వుంటే వుందిలే”అనేది. “పాపని నా చేతుల్తో పెంచాలని లేదు. నాచేతులంత మంచివి కావేమో? ఎవరికైనా పది రూపాయలిస్తే ఇంట్లోవుండి చూడరంటావా?” అంటూ వుండేది. రకరకాల గౌను గుడ్డలూ, చొక్కాగుడ్డలూ, కొని అపురూపంగా దాచింది. స్వెట్టరూ, మేజోళ్ళూ అల్లుతూ కూచునేది.

ఆవిడ ఆరాటం చూస్తే నాకెందుకో భయం వేసేది.

కొన్ని రోజులు మామూలుగానే గడిచాయి. ఒక రోజు రాత్రి మాస్టారొచ్చి హడావిడిగా అమ్మని తీసి కెళ్ళారు. పిన్నికి నెప్పులొస్తున్నాయట. ఎదురు చూసిన ముహూర్తం దగ్గర పడుతూంది. నాకింక మిగతారాత్రి నిద్రపట్టలేదు.

తెల్లారగట్ల మాస్టారొచ్చి చెప్పారు. ఆస్పత్రిలో చేర్పించారట. కడుపులోనే బిడ్డపోయిందట. ఆప రేషన్ చేసి తీసేశారట నిర్లిప్తంగా చెప్పారు.

“మనచేతిలో ఏంలేదు ఆభగవంతుడికే దానికోర్కె తీర్చడం ఇష్టంలేదు”అంటున్న మాస్టారి కంఠం ఒణి కింది.

మాస్టార్ని చూసి జాలేసినా, పిన్నిని తల్చుకుంటే గుండె గుభేలుమంది—ఈ ఆఘాతానికి ఎలా తట్టు కుంటుందో?

‘కాస్త కాఫీ చేసి ఆస్పత్రికి తీసికెళ్ళమని’ చెప్పి వెళ్ళిపోయారు మాస్టారు.

కాఫీ కాస్తున్నానన్న మాటేగానీ, మనసంతా పిన్ని తలపుతో భారమైపోయింది. ఆవిడ పాపాయిమీద పెట్టుకున్న ఆశలూ, అనుకుని మురిసిన మాటలూ తల్చుకున్న కొద్దీ దుఃఖం పొంగుకొచ్చింది.

ఇంకా ఆస్పత్రికి బయలుదేరనే లేదు. వచ్చిపడ్డది అమ్మ. పెద్ద ఆపత్తేదో వచ్చినట్టు చలించిపోతున్న అమ్మను చూస్తూంటే, మాస్టారు చెప్పిన సంగతికే ఇంత బాధపడుతూందన్న నమ్మకం నాకు కలగలేదు. కీడును శంకిస్తున్న మనస్సుతో “ఏమయిందమ్మా?” అని అడిగాను.

“అయిపోయిందమ్మా— అయిపోయింది. పిన్ని చచ్చిపోయింది.” బావురుమంది అమ్మ.

స్తంభించిపోయాను నేను...... ఏదో ఆపద అను కున్నాను గాని ఇంత దారుణం జరుగుతుందనుకోలేదు. కన్నీళ్ళు కాలువలు కట్టినయ్యి. కాస్సేపు ఇద్దరం మాట్లాడలేక పోయాం. అమ్మే వెక్కుల మధ్య చెప్పింది.

ఆపరేషన్ చేసి బిడ్డను తీసేసేటప్పుడే తప్పని సరిగా ఇక బిడ్డలు పుట్టకుండా చెయ్యాలిసి వొచ్చిం దట. లేకపోతే పెద్ద ప్రాణానికే ముప్పంట. స్పృహ వచ్చిన పిన్నికి ఆ విషయం తెలిసిందట! పిన్ని మాస్టార్ని చూస్తూనే ఆవేశంతోనూ, ఆవేదనతోనూ మెలికల్తిరిగి పోయిందట. ఆక్షణంలో ఆమెనెవరూ పట్టు కోలేక పోయారట. ఎంతసేపూ మాస్టార్ని చూసి “మీరే— మీరే ఇలా చేయించారు నాకు తెలుసు— నాకు తెలుసు” అంటూ వూగిపోయిందట. తనుగాని డాక్టర్లుగాని అసలు సంగతి ఎంతచెప్పినా వినిపించు కోలేదుట. కాస్సేపటిలోనే పిన్ని ఈ లోకంనించే వెళ్ళిపోయిందట”—వెక్కివెక్కి ఏడ్చింది అమ్మ.

“ఆసంగతి తెలియక పోయినా, మాస్టారిమీద ఆ అనుమానం అంత బలీయంగా కలగకపోయినా పిన్ని బ్రతికేదే” అంటుంది అమ్మ.

కాని ఎలా నమ్ముతుంది పిన్ని. ఆదినించీ ఆమె మాతృత్వాన్ని అర్థం చేసుకోని ఇంట్లో, తన కడుపు పంట కోసం తానుపడే తపనకి విలువ కట్టలేని ప్రపంచంలో, తమ స్వార్థాలతో తన మనస్సు కలుషం చేసి వదిలిపెట్టిన మనుషులమధ్య, తనకి అన్యాయం జరగలేదన్న నమ్మకమేమిటి?

అందుకే ఈ నమ్మరాని మనుష్యుల మధ్యనించి శాశ్వతంగా వెళ్ళిపోయింది పిన్ని.

మాస్టార్ని చూస్తూంటే జాలేస్తున్నా ఒకొక్కప్పుడు చేతులారా పిన్నిని చంపిన హంతకు డనిపిస్తుంది నాకు. ●

పిల్లలు - గారాబం

ఈ మధ్య జరిగిన ఒక విచిత్రం చూశాక ఈ వ్యాసం తప్పకుండా రాయాలనిపించింది. యింట్లో మార్కులు బాగా రాలేదని మాపిన్ని, బాబాయి తిట్టారని, పౌరుషం వచ్చి 13 ఏళ్ల మా పిన్ని కూతురు లక్ష్మి, వాళ్లనాన్నగారు ఆఫీసుకు వెళ్లగా చూసి 10 రూ.ల కాగితం బీరువాలోనుండి తీసి అన్నమైనా తిన కుండా వెళ్లిపోయింది. ఈ గొడవతెలిసి పిన్ని అన్ని వీధులూ, ఊరంతా గాలించింది. రాత్రి 8 గం. లకు బాబాయి వెతగ్గా, వెతగ్గా స్టేషన్‌లో వుందిట. 10 రూ.లు మార్చి టికెట్‌కొని, (తాతగారి వూరికి) మిగత చిల్లరతో పీక్కీలుకొని, చిరుతిండి తింటూ వైటింగు రూంలో ఫాన్‌క్రింద దర్జాగా చదువుతోం దిట. బాబాయి అదృష్టమా అని ఆరోజు రైలు 4 గం. లేటు. 4 గంటలకు రావల్సినది 8 దాటినా రాలేదు. సరే! బాబాయి ఆపిల్లని యింటికి తీసి కొచ్చాడు.

13 ఏళ్ళ లక్ష్మి చేసిన పని నాకు చాల ఆశ్చర్యమనిపించింది. వయస్సుకు చిన్నదైనా, బుద్ధులకు లోటులేదు. ఆ పిల్ల సాహసాన్కి, ధైర్యాన్కి ఒక ప్రక్క ఆశ్చర్యం, ఆ ప్రవర్తనకు అసహ్యం కలిగాయి. చిన్నా పెద్దా లేకుండా ఆ నిర్లక్ష్యత ఏవగింపు కలిగించింది. 20, 25 ఏండ్ల పిల్ల యౌవనోద్రేకంలో ఏదో చేసిందంటే అనుకోవచ్చు. కాని విచిత్రమేమిటంటే ఆ ప్రవర్తన అందరకూ అసహ్యమనిపించినా ఆ తల్లికి మురిపంగానే వుంది. మా పిన్ని తనకూతురు తెలివితేటలు, ధైర్యసాహసాలు గూర్చి పొగడింది.

లక్ష్మికి యింట్లో తగని గారాబం. ఎవరూ ఏమీ అవడాన్కి వీలులేదు. ఒకవేళ అన్నా పిన్ని నోటిధాటికి నెగ్గలేరు. చేసిన పని ఆ యింట్లో వాళ్లకి ముద్దు అయినా, యిరుగుపొరుగు చెడ్డగా చెప్పుకున్నారు. పైకి మా బాబాయి ఆపిల్ల విషయంలో చాల ముద్దు అయినా ఈపని జరిగాక భార్యతో వాదించి ఆ అమ్మాయిని మంచిమార్గంలో పెట్టడానికి ప్రయత్నించాడు కాని, సామెత చెప్పినట్లు 'మొక్కై వంగనిది మానై వంగుతుందా' అని, చిన్నతనం నుండి అలవాటయిన ఆ పద్ధతులను ఆపిల్ల మార్చుకోలేకపోయింది. తర్వాత కూడా ఆ పిల్లతో వాళ్ళు చాల బాధ పడుతున్నారు.

కొంత అమాయకత్వం, కొంత అజ్ఞానంతో నిండిన వారి పసి హృదయాలను చిన్నతనంలోనే సక్రమ మార్గంలో పెట్టి, వాళ్లని తీర్చిదిద్ది, భావిపౌరులుగా తయారు చేయవలసిన బాధ్యత పెద్దలది. వారిని సరియైన అదుపాజ్ఞలలో వుంచి, చక్కగా పెంచి, వారి భావిజీవితాన్ని ఆనందమయం చేయడం పెద్దల విధి. పిల్లలను పెంచడం చాల జాగ్రత్తతో కూడినది. ఆచరణలో పెట్టేటప్పుడు వచ్చే యిబ్బందులను ఎదుర్కోవాలి.

అయితే ఈపిల్లలను పెంచడం ఒక్క తల్లితండ్రుల దే బాధ్యతకాదు. మన యిళ్లల్లో వుండే అమ్మమ్మలు బామ్మలూ, తాతలూ వగైరా పెద్దలంతా సహాయకారులుగా వుండాలి. పిల్లల్ని చిన్నపుడే సుశిక్షితుల్ని చేయాలే తప్ప పెద్దయ్యాక వారి అలవాట్లను, పద్ధతులను, ప్రవర్తనను మార్చటం చాల కష్టం. చిన్నతనంలో పెద్దవాళ్లు నమ్పే అలవాట్లు పెద్దవాళ్లయాక సత్ఫలితాన్నిస్తే ఫరవాలేదు. కాని, చెడ్డవైతే వారి భావిజీవితం దుఃఖమయం అవుతుంది. తర్వాత విచారించి ప్రయోజనం లేదు.

పిల్లలు ఆడితే పాడితే అలసిపోతారని చూస్తారు మరికొందరు. కాస్త చిన్నపిల్లలు అయితే వంటింటిలోనే కొంగుకు కట్టుకొని పోపులో శనగ బద్దలు మొదలుకొని పంచదార, బెల్లం వగైరాలన్నీ పెడ్తూండడం చేస్తారు. యిదొక చెడ్డ అలవాటు. పొరపాటున ఏ బంధువుల యింటికైనా స్నేహితుల యింటికైనా నాల్గు రోజులు వుందామని వెడితే యిదే అలవాటుతో పిల్లలు ఏడవడం, ఆవిడ ఆ యింటి వాళు ఏమనుకుంటారోనని సిగ్గుతో వాడిని బాదడం జరుగుతుంది. ఒకటి, రెండు అనుభవాలయేసరికి, వాడిని సరియైన త్రోవలో పెట్టి, ఆ దురలవాట్లు మానిపించాలని చూస్తుంది కాని యిపుడు మానతాడా? అలవాటు పడకుండా వుండాలి కాని పడితే మానలేరు, మాన్పించలేము కూడా.

కాస్త జ్ఞానం వచ్చిన పిల్లలయితే యింట్లో కడుపునిండా పెట్టి డబ్బు లివ్వడం పరిపాటి. ఆ డబ్బుతో చిరుతిండ్లు తినడంతో అనారోగ్యంతో బాధపడతారు పిల్లలు. చిరుతిండ్లకు అలవాటు అయిన పిల్లలకు చీటికి మాటికి డబ్బు అవుసరం అవడం, రోగాలతో బాధపడడం జరుగుతుంది. ఒకటి, రెండు రోజులు అడుగుతాడు కాని రోజూ అడగడానికి మొహమాట పడతాడు. మెల్లిగా బామ్మ పత్తుల పెట్లోను, అమ్మ పోపుల డబ్బాలోను, నాన్న జేబులు ఖాళీ అవుతాయి. మొదట్లోనే గమనించి, మొక్కలోనే వుండగా త్రుంచి వేస్తే ఏమీతప్పు, లేకపోతే పెద్దయాక 'పిక్ పాకెట్'లా తయారు. మొదట్లో సరి అయిన చర్య తీసికోకుండా తర్వాత విచారించి లాభంలేదు. చిన్ననాడు వాడిని అదుపులో వుంచకపోతే పెద్దయాక వాని జీవితం అధోగతే. ఏ రోజైనా యివ్వకపోతే యుద్ధం. కాలేజీలకు వెళ్లే పిల్లలకు కూడ తల్లి వాడెక్కడ యిబ్బంది పడ్తాడోనని చాటుగా డబ్బు లివ్వడం, వాడు దాన్ని సినిమాలు, సిగరెట్లు వగైరా జల్సాలకు తగలెయ్యడం, చదువులు పోగొట్టుకోవడం కూడా నాకు బాగా తెల్సు.

మాకు తెల్సినావిడ కొడుకుని ఎంతో గారంగా పెంచింది. తండ్రికి ఆ అలవాట్లు నచ్చక, ఎపుడేనా పిల్లవాని భవిష్యత్ మీద బాధకొద్దీ కేకలేస్తే, ఆవిడ 'ఎందుకు వాణ్ణలా కేకలేస్తారు? వాడు చేయకపోతే మనం చేస్తామా? ఎపుడూ వాడిమీద విరుచుకు పడతారు, బావుంది వరస' అనేది. తల్లి సపోర్టుతో పట్టపగ్గాల్లేక అబ్బాయి ఒక్కొక్క క్లాసు రెండేసి సంవత్సరాలు చొప్పున చదివి, పునాది గట్టి చేసుకునే వాడు. కొంత కాలాన్కి ఆయన పోయాడు. వాడి ప్రవర్తనలో మార్పు లేదు. తల్లినే చులకనగా మాట్లాడేవాడు. వాడి ప్రవర్తనకు విసుగెత్తిన తల్లి వాడిని నయాన,



భయాన లాలించి, బుజ్జగించి, ఆఖరికి బెదిరించి కూడ చూసింది. కాని వాడు వింటేనా? ఆవిడనే యింట్లో నుంచి గెంటేశాడు. అపుడు ఆవిడ కళ్ళు విడివడ్డాయి. కాని ఫలితం శూన్యం. తాను చేసిన పనికి తానే అనుభవించి బాధ పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఆడపిల్లల విషయంలో బాధ్యత తల్లిది. 'కూతురు రీగ్గైన మాత తప్పు' అని 'సూరకవి' ఉదహరించినట్లు ఆడ పిల్లవలన ఏ తప్పున్నా తల్లి నంటారు కాని తండ్రి ననరు. 'మా అమ్మాయికి కాఫీ కూడ మేడమీదకు తెచ్చివ్వాలి. కాలేజీకి వెళ్ళేటప్పుడు బూటు కూడా అందించాలి' అంటూ తన కూతురు గురించి అనర్గళంగా ఉపన్యాస మిస్తుంది ఒక మాతృశ్రీ.

ఇద్దరు ముగ్గురు పిల్లలున్నపుడు ఆ గారం అమలు జరుగుతుంది కాని రానురాను సంసారం పెరిగిన కొద్దీ బాధ్యతలు పెరగడం, ఖర్చులు, ధరలు పెరిగి ఆదాయాన్ని మించిన వ్యయం అవడం ఓపిక తగ్గడంతో ముందువలెగారం అమలు జరప డానికి ఆ తల్లికి అవకాశం ఉండదు. ఆ పిల్ల గారం అపుడు ఆ తల్లి తండ్రులకు పెంకెతనంగా కన్పిస్తుంది. ఈ చిరాకులో చిన్నవాళ్ళకు దెబ్బలు, పెద్ద వాళ్ళయితే తిట్లు, దీవనలు ప్రారంభమవు తాయి. యికపోతే గారం భర్త దగ్గర అమలు జరగాలని కొంద రమ్మాయిల ఉద్దేశ్యం. కాని సాగనివ్వకపోతే ఎదిరించడం, నిర్లక్ష్యం చేయడం (భర్తని). యిక ఆ తల్లి తన కూతురుని అల్లుడు నానాబాధలు పెడుతున్నాడని ఏడుపులు, పెడ బొబ్బలు, మంచం ఎక్కడందాక వస్తుంది.

కూతురు కష్టపడకుండా వుండాలంటే అత్త మామలు, ఆడబడుచులు పోరులేనిచోట, ఒక కారు, నౌకర్లు గల ఆఫీసరుకు యివ్వాలనుకుంటారు. మన కెన్ని ఆశయాలున్నా విధివ్రాతను తప్పించ లేము గదా! ఈ గారాబంతో పిల్లలు మొండికెత్త డమే గాకుండా ఎంతసేపూ తమ ఆయస్సు, తమ ఆరోగ్యం తప్ప యితరుల గొడవ వుండదు. దానితో ఆ పిల్ల యిటు తల్లిదండ్రులకు, అటు భర్తకు విడటియని సమస్యగా తయారయి, బాధ పెడు తుంది.

ఆడపిల్లలకు గారంకొద్దీ పనులు నేర్పకపోతే అత్తవారింట్లో భర్తచేత చివాట్లు తప్పవు. 'యింట్లో తల్లి వదినగార్లు, అక్కలూ వగైరా వున్నారు. దానికి పని చేయాల్సిన అవసరం ఏమిటి' అనే పెద్దలున్నారు. నిజమే! కనీసం భర్తకి వేళకు వండి పెట్టాలికదా! కొత్తలో భర్త అభిరుచులు, అలవాట్లు, వీని కనుగుణంగా చేయడం అలవాటు అవాలంటే కష్టమే. కొందరు వాళ్ల అభిరుచుల కనుగుణంగా మారలేరు. కాని మరి కొస్త పెంకి వాళ్ళయితే 'నాకు యిట్లాగే వచ్చు, తింటే తినండి లేకపోతే మానేయండి అనీ, నాకు ఈ పనులు చాత రావు' అనీ మొండి జవాబు చెప్తారు. ఫలితం భర్తకీ విసుగే వస్తుంది. ఇక అమ్మాయి పుట్టింటికి ఉత్తరాలు భర్త తనను వేధిస్తున్నాడనీ.

భార్య భర్తలున్న యిళ్లల్లో కూడా పిల్లల శిక్షణ ఏమంత బాగుండదు. దానికి వారి మాన సిక బలహీనతే కారణం. పిల్లల్ని తల్లి కొడుతూంటే సహించలేక తండ్రి వెనకేసుకు వస్తాడు. అట్లాగే తండ్రి పిల్లల్ని శిక్షిస్తూంటే తల్లి సమర్థిం చటం జరుగుతుంది. ఈ విధంగా మాతృత్వం పితృత్వం సంఘర్షణపడి పిల్లల భవిష్యత్తును పాడు చేస్తాయి. ఒకరికి తెలీకుండా ఒకరు పరిహారంగా డబ్బు చెల్లించడం జరుగుతుంది. చేతిలో నాలుగు డబ్బులు గలగల లాడుతూంటే దుస్సహవాసాలకు, దురభ్యాసాలకు లోనవుతాడు.

'మా వాడికి బోలెడు డబ్బుంది. చదువుకోక పోయినా ఫరవాలేదు. చదువుకున్న వాళ్లని గుమా స్తాలుగ వేసుకుంటాడు' అంటూ గొప్పలు చెప్పే వారు మాకు తెల్సినాయన. 'పోనీ ఆ గుమాస్తాలు చేసే పనయినా సరిగా వుందో లేదో చూడడానికి కాస్త అక్షర జ్ఞానం అయినా వుండాలి కదండీ' అనేదాన్ని. తర్వాత కొద్ది నెలలకే ఆయన పోవడం జరిగింది. ఆ పిల్లవాని భవిష్యత్ నాశన మయింది. లోకజ్ఞానం శూన్యమయింది. సినిమాలు, సిగ రెట్లు వంటి దుర్వ్యసనాలతో వ్యాపారం చూచు కోకపోవడంతో దివాలా తీశాడు. అబ్బాయి పరి స్థితి అడుక్కుతినే వరకూ వచ్చింది. అపుడు తెల్సింది గారం మహాత్యం ఆ తల్లి కొడుకులకి. కాని పరిస్థితులు చేయిదాటి పోయాయి అప్పటికే. 'చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం?' ఈవిధంగా తండ్రి అహంభావంతో పిల్లవాడు బికారవాల్సిన దుర్గతి పట్టింది. ఇట్లా తలితం డ్రులు తమ పిల్లలపై గారంకొద్దీ వారి భవిష్య జ్జీవనం నాశన మవడానికి కారకు లవుతారు. పిల్లల పసి హృదయాలు అజ్ఞానంతో నిండి వుంటాయి. మనం ఎట్లా పెంచితే అట్లా తయా రవుతారు పిల్లలు.

శిల్పాన్ని మలిచినట్లుగా ప్రతీతల్లి తన పిల్లల రూపు రేఖలు దిద్దాలి. వారికి దేహాన్నేకాక మనసును, మనఃప్రవృత్తినీ కూడా యివ్వాలి. ఈ విషయం మరిచిపోయి చాలమంది పెద్దలు పిల్లలను ఆడి పోసుకుంటారు. దేహ నిర్మాణం, మనో నిర్మాణం తలి తండ్రుల గుణగణాలను బట్టి జరుగుతోంది. గృహమెపుడూ గృహిణి వలన నిర్మిత మవుతోంది. పిల్లలు ఆదర్శ జీవులుగా, భావిభారత పౌరులుగా తయారవాలంటే ఆ గురుతర బాధ్యత తల్లితండ్రు లిద్దరిదీ. వారు కన్న తల్లికీ, మాతృదేశానికీ కీర్తిప్రతిష్టను ఆర్జింప చేశేలా చూడాలి.

పిల్లల మనస్సు మెత్తని బరికలా వుండి, ఎలా మలిస్తే అటువంటి ఆకారాన్నే ధరిస్తుంది. కాబట్టి చక్కని బొమ్మ తయారు కావాలంటే అది శిల్పి శక్తి సామర్థ్యాలపైన ఆధారపడి వుంటుంది. అట్లాగే ఉత్తమ పౌరుడుగా రాణించాలంటే అలా మలచవలశిన బాధ్యత స్త్రీపైన వుంది. ఈ విషయం తల్లి మరువరాదు.

"నేటి బాలలే రేపటి పౌరులు."

— శ్రీమతి వారణాశి జానకీదేవి

డాక్టర్ కబుర్లు

కాయలు

పనిచేస్తే కాయలు కాస్తా యంటారు. భుజంమీద కాయ కాస్తే బరువులుమోసే మనిషి; అరిచేతులమీద ఉంటే చేతిపనులు చేసే మనిషి; పెదవులమీద పక్కనవుంటే వాద్యాలు ఊదే మనిషి; బొటనవేళ్లు కాయలు కాస్తే తోటపనిచేసే మనిషి— ఈ విధంగా అనుకోవచ్చు.

కాని మోకాళ్లపయి భాగంలో కాయలు కాస్తే కారణం ఊపిరి తిత్తుల బాధలు ఏదయినా అయి ఉండవచ్చు! వీటికి సంబంధం ఏమిటి? కొంచెం ఆలోచించి చూస్తే, ఆయాసం ఉండేవారు మోకాళ్లమీద మోచేతులు ఆనించి కూర్చుంటూ ఉంటారని గుర్తుకివస్తుంది. ఈ విధంగా ఊపిరితిత్తుల్యాటం తేలిక అవుతుంది.



మోచేతుల వత్తిడివల్ల మాత్రం కాయలు కాస్తాయి!

హెచ్. ఎల్. హెర్షెన్‌సోన్

(కాపీరయిటు)

జనాభా పెరుగుదల నివారణ కృషి

అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్న నవయుగం ఇది. త్వరలో ఏదో ఒకనాడు చంద్రమండలం చేరుకోగలనని మానవుడు ఆశిస్తున్నాడు. ఇలా ఇతర గ్రహాలకు వెళ్లాలనే కోరికకు భూమిమీద జనాభా విపరీతంగా పెరిగి పోయి జనులతో మరీ క్రిక్కిరిసిపోయిందని అనుకోవడం కారణం కాకపోవచ్చు. కాని ఈశతాబ్దం ఆఖరునాటికి ప్రపంచ జనాభా అంతూ పొంతూ లేకుండా పెరిగి పోయే ప్రమాదం కన్పిస్తున్నది. అందువల్ల అప్పటికి మానవులు ఈకారణంగా కూడా ఇతర గ్రహాలకు వలస వెళ్లాలని కోరవచ్చు.

జనాభా పెరుగుదల సమస్య అన్ని దేశాలకూ సంబంధించినది. అందులో ముఖ్యంగా వర్ధమాన దేశాలకు ఈ సమస్య క్లిష్టతరమైనదిగా కన్పిస్తున్నది. 1951 నాటికి భారతదేశ జనాభా 36 కోట్లు. కాని 15 సంవత్సరాలలో 1966 నాటికి దేశజనాభా 50 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం దేశ జనాభా 53 కోట్లవరకు ఉన్నదని అంచనా. 2000 నాటికి మనదేశ జనాభా నూరుకోట్లకు పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి. అంటే మరోమాటల్లో చెప్పాలంటే షుమారు 50 సంవత్సరాలలో మనదేశం జనాభా 1951 నాటి జనాభా కంటె దాదాపు మూడురెట్లు పెరుగుతుంది.

ఇలా జనాభా విపరీతంగా పెరిగి పోవడంవల్ల మనం సుదీర్ఘకాలం ఎంతో కష్టపడి సాధించిన అభివృద్ధి నిరుపయోగం అవుతున్నది. అభివృద్ధి ఫలితాలు వినియోగం లోకి రాకుండా పోతున్నాయి. అందువల్ల జనాభా పెరుగుదలను అరికట్టవలసిన అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని గుర్తించి భారత ప్రభుత్వం వివిధ శాస్త్రీయమైన కుటుంబ నియంత్రణ పద్ధతుల ద్వారా జననాల సంఖ్య క్రమంగా తగ్గించడానికి పూనుకొన్నది.

దేశంలో దంపతులు అందరూ ముగ్గురుపిల్లలతో సంతృప్తిపడి కుటుంబాలను పరిమితం చేసుకొంటే జననాలసంఖ్య 41 నుంచి 25కు తగ్గించడానికి వీలవుతుందని అంచనా. ప్రస్తుతం ప్రతి వెయ్యిమందికీ 41 చొప్పున జననాల మూలంగా జనాభా పెరుగుతున్నది. దేశంలో శీఘ్రంగా అమలు జరుగుతున్న కుటుంబనియంత్రణ కార్యక్రమాలమూలంగా 1975—76 నాటికి ఏటా జననాల సంఖ్య 25 కూ 1978 నాటికి జననాల సంఖ్య 23కూ తగ్గించాలని ఉద్దేశిస్తున్నారు. ప్రజలు కుటుంబ నియంత్రణ పద్ధతులు ఐచ్ఛికంగా అవలంబిస్తేనే ఈలక్ష్యం సాధించడానికి వీలవుతుంది.

ఆడపిల్లలు 20 సంవత్సరాలు దాటినతర్వాత, యువకులు 25 సంవత్సరాలు దాటిన తర్వాత వివాహం చేసుకోవడం జరిగితే వచ్చే పది సంవత్సరాలలో ఏటా జననాల సంఖ్య 15 కు తగ్గుతుందని అంచనా వేశారు. యువతీయువకులకు ఆవయసు వచ్చేసరికి చదువు పూర్తి అవుతుంది. తలితండ్రులుగా బాధ్యతలు స్వీకరించడానికి వారికి అప్పటికి అన్నివిధాలాశక్తిసామర్థ్యాలు చేకూరుతాయికూడానూ. శారీరకంగానే కాక మానసికంగా కూడా వారికి పరిణతి వస్తుంది. చదువుకొన్న స్త్రీలు సామాన్యంగా తమ కుటుంబాలు పరిమితంగా ఉండాలనే కోరుకొంటూ ఉంటారు.


జననాల సంఖ్య తగ్గించినంతమాత్రాన, కుటుంబాలను పరిమితం చేసుకొన్నంత మాత్రాన ఈ సమస్య పరిష్కారం కాదు. దీనికి తోడు కాన్పుకూ, కాన్పుకూ మధ్య బాగా ఎడం ఉండేలా చూడవలసి ఉన్నది. ఇందువల్ల తల్లికీ, బిడ్డకూ ఇద్దరికూ ప్రయోజనం కలుగుతుంది. ఆ తల్లి తిరిగి మంచి ఆరోగ్యం సంపాదించడానికి, బిడ్డకు మంచి పోషణ లభించడానికీ అవకాశం కలుగుతుంది. బిడ్డలకు మొదటి మూడు నాలుగు సంవత్సరాలలో మంచి పోషకాహారం లభించకపోతే శారీరకంగానూ, మానసికంగానూ పెరుగుదల తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని శాస్త్రజ్ఞులు అభిప్రాయం.

దంపతులు సామాన్యంగా ముగ్గురు కంటె ఎక్కువమంది పిల్లలు కలగాలని కోరుకోరు. వారికి అంతకు ఎక్కువమంది సంతానం ఉండవచ్చు. అది వేరు విషయం. కోరుకొన్న వారికంటే ఎక్కువ మంది పిల్లలు కలగడానికి ప్రధాన కారణం కుటుంబ నియంత్రణను గురించివారికి తెలియక పోవడమే.


నవదంపతులు ప్రథమ సంతానం కొంచెం ఆలస్యంగా కలగాలనుకొంటే 'నిరోధ్'—గర్భనిరోధం నిమిత్తం ఉపయోగించే తొడుగులు ఉపయోగించవచ్చు. ప్రథమ సంతానం కలిగాక ద్వితీయ సంతానం కలగడానికి తగినంత వ్యవధి కల్పించాలనుకుంటే లూప్ ధరించి అవసరం లేదనుకొన్నప్పుడు తీసివేయవచ్చును. ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు కలిగాక భార్యాభర్తలతో ఎవరో ఒకరు ఇంక సంతానం కలుగకుండా శస్త్రచికిత్స చేయించుకోవచ్చును. ఈ చికిత్సవల్ల ఏవిధమైన అపాయమూ లేదు. పైగా ఇందువల్ల ఖర్చుఅయ్యేదీ ఏమీ లేదు. వైద్యాలయాలలో ఈ శస్త్ర చికిత్స ఉచితంగా చేస్తారు.

దేశంలో అన్ని ప్రాంతాలలోనూ ప్రజల సౌకర్యార్థం కుటుంబ నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు అయాయి. అనేకవిధాల సేవాసహకారాలను అందచేయడానికి ఏర్పాట్లు జరిగాయి. ఇటువంటివి ఎక్కడ లభిస్తాయో గుర్తించడం కష్టం కాదు. ప్రస్తుతంలాగే ఇకముందుకూడా అధిక సంఖ్యలో ప్రజలు ముందుకువచ్చి ఈ సౌకర్యాల మూలంగా ప్రయోజనం పొంది కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంబించి ముగ్గురు పిల్లలతో తృప్తి పడి కుటుంబాలను పరిమితం చేసుకొని, కాన్పుకూ, కాన్పుకూ మధ్య కనీసం మూడు నాలుగు సంవత్సరాల వ్యవధి ఉండేలా చూచుకొంటే దేశంలో జననాల సంఖ్య తగ్గించడం ద్వారా జనాభా పెరుగుదలను అరికట్టడానికి, తద్వారా ఆర్థికాభివృద్ధి ఫలితాలు ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొనిరావడానికీ దోహదం కలుగుతుంది.

—(పి. ఐ. బి)



ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు... చాలు !



కుటుంబ నియంత్రణ కేంద్రానికి గుర్తు ఎఱ్ఱ త్రికోణం

ఓ మనిషి ప్రయాణం



వి. రాజారామమోహనరావు

మనిషి...పుట్టుక...బలహీనత వీటి పరస్పర సంబంధాల్ని ఆలోచిస్తూ బలరాం మరింత బలహీనంగా తయారయ్యాడు.

బలరాం గురించి ఆ వీధిలో ప్రత్యేకంగా ఎవరూ ఏమీ చెప్పుకోరు. చెప్పుకోవాల్సిందేమీ లేదు కూడా. ముప్పై ఏళ్ళు దాటిన మనిషని ఎవరూ అనుకోరు. వయస్సుని అతని విషయంలో అంచనా కూడా వేయలేరు. బలహీనతకి, ఎముకలతో ఓ ఆకారం కూర్చి, ఓ పల్చటి పొర కప్పినట్టుంటాడు.

రోజులాగే నిద్రలేచాడు బలరాం, కిటికీలోంచి వచ్చే వెలుగుకి. గదికి ఉన్న ఆ ఒక్క కిటికీ అంటే బలరాంకి చాలా ఇష్టం. అతని సుషుప్తికి, జాగ్రదావస్థకి సరిహద్దు ఆ కిటికీ...

కళ్ళు తెరవగానే అలమారులో పచ్చ డబ్బా...ఈ రోజు ఇంకొంచం మెరుస్తూ కనపడంది. ఈ మధ్య ప్రతి ఉదయం బలరాంకి అలా అనిపిస్తూనే ఉంది. సాయంత్రానికి మామూలుగానే ఉంటుంది. మామూలంటే ఆ డబ్బాని అలమారులో ఉంచిన రోజు తోచినట్టు...

ఆ డబ్బాని చూస్తూ నవ్వాడు. రోజు రోజుకి బలరాం మనసులో బరువు పెరుగుతోంది. అది సంతోషమో, విచారమో... తెలియని బరువు.

చింకి చాపమీంచి లేవకుండా 'ఇది ఆనందమే...' అనుకుంటాడు. లేచింతర్వాత సందేహం మామూలే.

కాలు తిన్నగా సాగలేదు. చలికి చర్మం బిగుసుకుని, పుండుమీద గట్టిన గాడు నొప్పి...చిరాగ్గా కాలులాగటంవల్ల పుండు రేగింది. రసి...చీము...నెత్తురు...

'ఇంక ఇది తగ్గదు...'

సూదులు గుచ్చినట్టు పుండుసలుపు. నెమ్మదిగా లేచాడు. దొడ్లో అక్కడో చితుకు...అక్కడో చితుకు ... వో కొబ్బరి మట్ట...మరో తాటాకు ... కుంటుతూనే ఏరిమంట...ఎండ బాగా వేడెక్కే వరకూ అదే కార్యక్రమం బలరాంకి...కాలు సలుపుకి సవనగా ఉంటుంది.

ఆ ఎర్రటి మంటల్లో...దూ ర ం గా ఏనాటివో నీలిమంటలు...చిటపట చప్పుళ్ళు కళ్ళముందు కదుల్తాయి బలరాంకి. అదో వోదార్పు ... స్మృతుల అవలోకన ...

'నేను కాబట్టే తల్లి చితి కాల్చింటే గొప్పపని చేసినవాడిలా మురిసి పోయాను.' మంటలోని తాటాకు కదుపుతూ అనుకున్నాడు.

మంట వేడి ... కళ్ళల్లో నీరు తిరిగింది. నెమ్మదిగా లేచి మళ్ళీ గదిలోకి. మామూలే...చూరుమీద అక్కడక్కడ చెదరిన పెంకులు ... ఒక్కటే కిటికీ ... అలమారు...అలమారులో ఒక్కటే డబ్బా...

ఆ డబ్బాని అలా లోపల పెడుతు గట్టిగా పకాపకా, సినిమాలో వికృతవిజయం సాధించిన వాడిలా నవ్వాలనిపించింది బలరాంకి

ఆరోజు...కాని మామూలుగాకూడా నవ్వలేక పోయాడు.

ముప్పైఏళ్ల జీవితంలో బలరాం ఏ ఒకటిరెండు సార్లో చూశాడు సినిమా... చూసిన ఆ ఒకటి రెండుసార్లు ఆశ్చర్యం తప్ప ఆనందం కలుగలేదు. బలరాం జీవితం సినిమాతో పోసిగే జీవితంకాదు.

నెమ్మదిగా చింకిచాప చుడుతుంటే, మూల చిరుగులబొంత కనిపించింది.

'అమ్మది ...' బలరాం మనసు అనుకుంటుందా బొంతనెప్పుడు చూసినా.

'ఇలాగే ఆ చాపపక్కనే బొంత వేసుకుని పడుకునేది అమ్మ' గుర్తు తెచ్చుకున్నాడు బలరాం.

తల్లిని తలుచుకున్నప్పుడల్లా స్మశానం ...మంటలే గుర్తొస్తాయి బలరాంకి...

రోజూ పెట్టే రెండు ముద్దలఅన్నం... వేసే చింకిగుడ్డలపక్క ...ఆ ఆప్యాయపు చూపులు...ఆగది నాలుగుమూలలాఉన్నట్టే ఉంటాయి. బలరాంకి. కాని అవి బలరాంని చేరుకోవటంలేదు: ఎర్రటి మంటల్లో కాలిపోతున్నాయి. తల్లి తలపులకి, బలరాంకి మధ్య ఎర్రటిమంట అడ్డు. అప్పుడప్పుడు వాటిని దాటుతుంటాడు బలరాం అప్పుడే తల్లి మాటల్ని మననం చేసుకోగలడు.

'నలుగురి తర్వాత నాకు మిగిలిన వెర్రిబాబువి...అసలే అంతంతమాత్రం మనిషివి. పట్టుమని పదడుగు లేయలేవు. కడుపు నిండా తిండేనా పెట్టలేక పోతున్నాను. నామూలాన్నే నువ్విలా అయ్యావు. ముందెలా బతుకుతావో వెర్రిబాబువి.'

ఆముందు బతుకంటే అర్థం తెలియలేదు బలరాంకి ఆనాడు. అంతదూరం ఆలోచించే చైతన్యంలేదు. తల్లి అస్తమానం అన్నం... అన్నం అంటే ఆలోచించేవాడు. అన్నం కొంచమే ఎందుకు దొరుకుతోందా అని...

తల్లి నడిగితే...'అదేనా వాళ్లదయేకదు బాబు...నావయస్సెంత...నేనుచేసేపనెంత?' అంది.

బలరాంకికూడా నిజమే అనిపించింది... సుదర్శనంగారు నిజంగా మరి ధర్మాత్ముడే తల్లి ఏపనిచేయలేదని తెలుసు. ఎన్నో ఏళ్లనుంచి ఉన్నందుకుగాను పొమ్మనలేక, పేరుకి రెండుగదులు ఊడ్పించుకుంటూ... మిగిలిందో...మిగిల్చిందో...రెండు కబళ్ళ అన్నంపెడుతున్నారంటే...దొడ్లో ఇంట్లో తలదాచుకోనిస్తున్నారంటే, తల్లిమీద అభిమానమే...

* * *

గడచిన రోజుకి గడవబోయే రోజుకి పెద్దతేడా కనిపించేదికాదు బలరాంకి దైనందిన కార్యక్రమంలో...

దొడ్లో తిరగటం...పెంకులవేపు చూడటం...రాలిన చింతకాయలు తినటం... రోజులో ఎక్కువసేపు కిటికీదగ్గర కూర్చుని వచ్చేపోయే వాళ్లని చూడటం...

ఎన్నో ఆలోచనలొచ్చేవి ... కిటికీలోంచి చూస్తూ ఎన్నోకలలు...కాని ఏదీ స్థిరంగా నిలిచి తన సంపూర్ణ స్వరూపాన్ని చూపలేదు...

ఈనాడు జీవితంఅంతా గుర్తు తెచ్చుకుంటే...అక్కడోరోజు...అక్కడోరోజు... వేళ్లమీద లెక్కపెట్ట గలిగినన్ని మాత్రం గుర్తొస్తాయి బలరాంకి...

తల్లి కొత్తచొక్కా తొడిగినరోజు... కొత్తదనం అంటే ఏమిటో తెలిసిన మురిపెం...సుదర్శనంగారి దగ్గర నాలుగక్షరాలు నేర్చుకుంటున్న కొత్తలో సరదా... అలా...వాటిల్లో ఆనాడు...ఆరోజు...

కిటికీలోంచి చూస్తుంటే...వెడుతూ వెడుతూ ఆగిపోయింది. మాసిన చిరుగుల చీర...ఎత్తయిన గుండెల్ని పూర్తిగా కప్పలేని జీవితం...అదుక్కునేది ... బలరాంని రెండుక్షణాలు అలా చూస్తూ నవ్వింది.

అది అందం నవ్విన నవ్వుకాదు. స్త్రీత్వంలోని జాలి...లాలన నవ్విన నవ్వది... ఆడతనం నవ్విన నవ్వది... ఆరోజు కిటికీలోంచి ఎన్నోరంగులు, ఇదివరకు కనపడనివి ఎన్నెన్నో కనిపించాయి బలరాంకి...సూటిగా సాగి గబుక్కుని విరిగిపోయే బలరాం ఊహలు ఆరోజు కొద్దిగా మలుపుతిరిగి కొత్త చైతన్యంవేపు చూశాయి...మరి బలరాం జీవితమే మలుపు తిరిగిందేమో...

* * *

రోజుకి రోజుకి తేడాకనిపించని బలరాంకి ఆరోజు పెద్ద తేడాకనిపించింది.

ఆలోచనో...బాధో...ఏమిటో తెలియని స్థితి...

ఆ క్షణాన తెలిసిం దొక్కటే బలరాంకి తల్లి చచ్చిపోయిందని...అందరిలాగే తన తల్లి పోతుందనే ఆలోచనెప్పుడూ లేదు బలరాంకి...

సుదర్శనంగారు భుజం తట్టేవరకు ఏమీ తెలియలేదు. ఆయన్ని చూడగానే గుండెల్లో...నిశ్శబ్దంలో ... ఏడుపు ఒక్కసారిగా పగిలింది...

'ఊరుకో బలరాం...ఏదోనాడు అందరం అంతే...ఇంకా నయం మూలపడలేదు. కాలు చెయ్యి వంగకుండా దాటిపోయింది. మూలపడితే మందు మాకూ చూడగలిగే వాడెవా చెప్పు. ముందు జరగాల్సిందేమిటో చూడు.'

'ముందు జరగాల్సిందంటే...' సుదర్శనంగారు చెప్పేవరకు తోచలేదు బలరాంకి...

జీవి రూపు ఏర్పరచుకున్న క్షణంనుంచి ఆ రూపం నశించేవరకూ ముడిపడిన అవసరం...డబ్బు...

ఆనాడు అభిమానం అడ్డురాలేదు. విపరించలేని ఆ స్థితిలో...ఆనాడు అలాఅంత మందిని ఎలా అర్థించ గలిగానో అనుకుంటాడు బలరాం...

'మా వాళ్ల తద్దినా లే పెట్టలేక చస్తుంటే...ఊళ్లోవాళ్ల గొడవొకటి...' ఓ ఇంటావిడ పావలాఇస్తూ అన్నమాట.

'అడుక్కోటంలో అనేక రకాలు ...' ఇంకో ఇంటావిడ చీదరింపు.

'మనిషి బతగ్గానే సరా...జీవితంఏమిటి ఎందుకు అనే ఇంగితం ఉండఖర్లా ... అంతగతి లేకపోతే ఏ కార్పొరేషన్‌వాళ్లనో బతిమాలితే లాక్కు పోతారుగా...' ఇంకో ఇంటాయన ...

వాళ్లందరూ కలిసి ముద్దగా ముఖం మీద విసిరిన అపహ్యం బాధ కలిగించలేదానాడు.

తల్లికి అంత్యక్రియలు చేయాలి. తల్లి పోయిందన్న బాధకన్నా తల్లికి అంత్యక్రియలు చేయలేక పోతానేమో అన్నబాధ ఎక్కువైంది బలరాంకి...

ఆఖరి కెలాగైతేనేం... ఆ చితిమంటల్ని చూడ గలిగాడు. గర్వంగా...ఏడ్చాడు...

అందుకనే తల్లి గుర్తొచ్చినప్పుడల్లా అడ్డొస్తాయి, ఆ మంటలు ఆలోచనకి ...

ఆనా డనుకుంది...తర్వాత బలపడింది... ఈ పచ్చడబ్బా రూపు ...

ముందెలా బతుకుతావో వెర్రిబాబువి అన్న తల్లి మాటలకి 'మామూలుగానే' అనాలనిపించేది బలరాంకి. ఆ మాటే

ఓ మనిషి ప్రయాణం

నిజమైంది. తల్లి ఊద్చే రెండు గదులు తనే ఊదుస్తున్నాడు...అదే గమనం...అదే జీవనం...

* * *

బలరాం పోయాడన్న వార్త అందరూ చాలా సహజంగానే విన్నారు, ఒక్క సుదర్శనంగారు తప్ప. వీలున్నవాళ్ళు చూటానికి వచ్చారు.

'అయ్యో పాపం' అన్నారు,

నిశ్చలంగా పడున్న బలరాంని చూస్తూ తనకి ఈ తద్దినం తప్పదనుకున్నారు సుదర్శనంగారు.

మరి ఎందుకో తెలియదు కాని నాలుగు వేపులా కలయచూశారు. అలమారులో వచ్చ డబ్బా ఆకర్షణీయంగా ఉంది. అందుకున్నారు. బరువుగాఉంది. మూత తీస్తే... సుదర్శనంగారి కళ్ళు చెదిరాయి ... ఏదో కాయితం...కళ్ళజోడు లేదు ...

పక్కకుర్రాడెవరో అందుకున్నాడు ...

ఇది ఎవరూ చదవాలని రాయలేదు. నన్ను నేను దాచుకోలేక రాసుకుంటున్నాను. ఎవరో ఒకళ్ళు చదవాలన్న ఆశ లేకపోలేదు.

నా జీవితం మీ అందరికి తెలిసున్నదే... శారీరకంగా పూర్తి బలహీనుణ్ని...కష్టపడి ఏ పనిచేసే శక్తిలేనివాణ్ని ... చేయాలన్న ఉద్దేశం కలిగినా అమ్మ సాగనివ్వలేదు. మనిషికి మనిషెంత బరువో...మనిషి జీవితం విలువెంతో, అమ్మ పోయిననాడు తెలిసింది. ఆ నాడు అమ్మ చితికి నిప్పంటిస్తూ ఎంతో గర్వపడ్డాను, కొడుకును కాబట్టి ...నన్నలా తగలేస్తూ ఎవరూ గర్వపడరని తెలుసు...

'మనిషి బతగ్గానే సరా...జీవితం ఎందుకు, ఏమిటనే ఇంగితం ఉండఖర్లా..' అన్నా డొకాయన ఆనాడు ... జీవితం ఎందుకు అనే ప్రశ్నకి సమాధానం దొరకలేదు. ఏమిటి అన్నదానికి అంతే...

చిన్నప్పుడు అమ్మ ఒకసారి 'రేపు ఊరు వెడదాం' అంది.

ఏ ఊరో తెలియదు. ప్రయాణం ఎందుకో తెలియదు ... కాని ఎంతో సరదా వేసింది ఏదేదో ఉంటుందని.

ఆ ప్రయాణం చేయనేలేదు...కాని అది చాలా మురిపించింది. నా జీవితం గురించి ఆలోచిస్తే ఇదీ ప్రయాణమే అనిపిస్తోంది. సొంత చలనంలేని ప్రయాణం...

ఎంతో ఇరుకుగా గడిపిన జీవితంలో చైతన్యానికి తావే లేకపోయింది...ఆ ఒక్క రోజు తప్ప...ఆ ఒక్క చూపు తప్ప...ఎన్నో ఊహలు, కదలికలు నిండిన రంగులు కళ్ళముందు నిలిచాయి...ఇంచు మించుగా అమ్మ అప్పుడే పోయింది. నా హీనస్థితికి లోకం విసిరిన అసహ్యపుముద్ద ఆరంగుల్ని మళ్ళీ కనపడ నివ్వలేదు. ఆ నాటినుంచి మిగిలిన ఆలోచన ఇదొక్కటే ...

సంఘంలో ఆ ఏర్పాటుందని తెలుసు... అనాథప్రేతాన్ని లాగేయకపోరు...కాని అదీ ఉద్యోగధర్మమే... మళ్ళీ అసహ్యం...చీదరింపులు...

ఆ స్థితి నాకు కలగకూడదనే ఈ శ్రమ పడ్డాను. ఈ పచ్చడబ్బాలోది అరవై రూపాయలు కాదు, నా రక్తం ... ఏనాడూ శ్రమించి ఎరుగని నాబలహీన దేహపుశ్రమ...

చావుతరువాత...ఆత్మ...నాకయోమయం. ఆలోచన అంతదూరంసాగినా అర్థంచేసుకుని నిర్ణయించుకోగలశక్తి నాలోలేదు. ఈ ప్రయాణంలో, మనిషి తనంతగా తాను దాటలేని ఆఖరి మజిలీని 'దాటించే ఈఖర్చుని. ఎవరి నెత్తిమీదేనా వేసుకుని అసహ్యంచు కుంటారేమోనని బాధ...ఈడబ్బు దానికి వినియోగించండి...ఇలా నాకు నేనుగా... ఈఏర్పాటు.. బాధో...ఆనందమో తెలియటంలేను. కాని ఓ బరువు...ఎవరికేనా భరించటం కష్టమేనేమో...

ఎదుటివారి హీనస్థితికి సహకరించలేనినాడు...కనీసం ఎవరి అసహ్యాన్ని వాళ్ళ గుండెల్లో దాచుకున్నా గొప్పసహాయమే ...

'బలరాం'

శవాన్ని ఎత్తుతుంటే నలుగురితోపాటు ఓ బిచ్చగత్తెకూడా 'నారాయణా' అంది...

చరిత్ర ప్రసిద్ధిగాంచిన రచయిత్రులు

వేదకాలంలో లబ్ధప్రతిష్ఠలైన విదుషీమణులలో ఎవరు మనవారో, ఎవరు పెరవారో చెప్పడం కష్టంకావి, రెండు వేల సంవత్సరాల క్రితం తెలుగు గడ్డపై సంకలితమైన తొలి కవితా కదంబం—గాథసప్తశతిలో కానవచ్చే కవయిత్రులలలో పలువురు తెలుగు తల్లులవి నిస్సంశయంగా చెప్పగలం. వారి గాథలలోని కోమల శృంగారం, సరసహాస్యం, జీవితం వండి పరమార్థం పిండి చెప్పిన సత్యాలూ మనను ఆహా అనేట్టు చేస్తాయి.

ఎండుమ్రరిద్రావి యండను జేరి చ
ప్పట్లు సరచిన గిరి పాంథజనులు
తమ్మజూచి బెదరి దాని యాకుల పండ్ల
వగిదియున్న చిలుక లెగిరిపోవ— అని తనకు దినం కలుగుతున్న భ్రాంతిని అణులచ్చి ఆర్యాబద్ధం చేయగా, బెజ్జా మహాదేవి
ఇంద్రచాపంబు గొడుపుతో నెత్తి పొడువ
నొప్పి నోర్వక బిట్టుగ రొప్పుచుండు
మొగిలనెడు కారుదున్న కడుపునను వెడలి
వ్రేలు చుండెడి వ్రేగు కాబోలు మెరుపు
వర్షా మేఘాన్ని తను అనుదినం చూచే కారుడున్నతో ఉత్ప్రేక్షించింది.

మాధవీదేవి—రోహాదేవి

ఇక మాధవీదేవి ప్రణయోప విషద్రహస్యాన్ని—
దొరతనంబు తమది నెరవక, దాసులు
బోలె నలుకగొన్న వేళ దేర్చు
వారె ప్రియులు సుమ్ము! వనితల కొరులెల్ల
బనికి రాని వట్టి భర్తలంతె.
అవి ఉపదేశించగా, రోహాదేవి తను దినమూ వంటింట్లో చూచే ఘటనలనే
పండుగకు దంచుచుండిన పిండి ఎగిరి
తెల్ల బారిన చనుదోయి తెరవ గవిగొ
మోము తెలిదమ్మి చాటున గోము దేరు
కలికిరాయంచ కవవోలె గానవచ్చె
సరసకోమల శృంగారంతో చెప్పింది. (ఈ అనువాద పద్యాలు సుగృహీత నామధేయులు (శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారివి.)

ప్రాకృత భాషా కవయిత్రుల తర్వాత పన్నెండు వందల ఏళ్లకు గావి తెలుగు కవయిత్రుల తేనె పలుకులు వినిపించలేదు. ఆ పలికిన రెండు తేనె పలుకులు ఒకమహావీరునికి రెండువేల ఒల్లెల ములుకలయ్యాయి.

చానమ్మ

మనుమసిద్ధి సేనాపతి ఖడ్గతిక్కన ఏ చోళ రాజాతో పోరాటంలోనో రణరంగం నుంచి పారి వచ్చాడు. (కాటమరాజుతో పోరాటంలో మాత్రం కాదని నా నమ్మకం.) ఆయన పత్ని చానమ్మకు తల కొట్టినట్లయింది. భర్తను అవమానించదలచి స్నానానికి సీమంతినీ యోగ్యమయిన ప్రసాధన సామగ్రి పెట్టింది.

పగరకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపునాయకు లెందున్?
ముగు రాడవారమైతిమి,
వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్?
అన్న మాటలు మరుగు నుంచి వినిపించాయి. అంతటి సేనానీ ఆ మాటలు విని కిక్కురుమనలేదు. భోజన సమయంలో అతనికి తల్లి ప్రోలమ్మ విరిగిన పాలు వడ్డించింది. పాలెందుకు విరిగిందని తిక్కన ప్రశ్నించాడు.

అసదృశముగ నరివీరుల
పసమీరగ గెలువలేక పంద్రకియ స్నీ
వసి వైచి తిరిగి వచ్చిన
పసులున్ విరిగినవి, తిక్క! పాలున్ విరిగెన్.
అని ప్రోలమ్మ కోడలి కంటె రెచ్చిపోయి మరి రెండు వడ్డించింది.


తిమ్మక్క

ఈ వీరపత్ని, వీరమాత తిక్కన కాలపు తొలి తెలుగు కవయిత్రులుగా మనకు సాక్షాత్కరించారు. వీరి పలుకులతో ప్రారంభమయిన తెలుగు కవిత తాళ్లపాక తిమ్మక్క చేతిలో తొలిసారిగా మంజరీ ద్విపద కావ్యరూపం దాల్చింది. 'సుభద్రా కల్యాణ' మనే పేరుతో.

తాళ్లపాక తిమ్మక్క 'పదకవితా పితామహుడు' తాళ్లపాక అన్నమయ్య పత్ని. అందువల్ల ఆమెకు సహజంగానే పాండిత్యం, పాట వచ్చాయి. అందువల్లే తను "వరకవి తా తాళ్లపాక తిమ్మప్ప" అని చెప్పుకొంది. (తిమ్మప్ప అంటే తిమ్మక్కే. పురుషుడని భయపడేరు!) ప్రాస వూసులేని మంజరీద్విపదను విన్నుకొని తన ఇష్టం వచ్చినట్టు గొంతెత్తి పాడింది. స్త్రీలు తప్ప మరొకరు చేయని వ్యూహాలు వర్ణన చేసింది.

ఒప్పైన బంగారు టుప్పరిగలోను
కప్పురవాసనల్ గ్రమ్ముకొనంగ
సాంబ్రాణిధూపముల్ సఖితానువేసి
చిత్రముల్ నిర్మించె చెలియ యంతటను
దిక్కుల మాణిక్యదీపముల్ వెలుగ
నిలువు టద్దమ్ములు నెలత చెక్కించె
వెయ్యి దీపంబులు వెలుగంగనందు
గవుసెనల్ దీయించె గాజు కంబముల
బంగారు తరికోళ్ల పట్టెమంచమ్ము
అంగన వెలయించి యమరించె సెజ్జ
సన్నవిరి మల్లెలు జాజి మల్లెలును
బొండు మల్లెలు జాల నిండ బరపించి
యిరు దెసల్లలగడ లిమ్ముగా దాపి
బంగారు మరటి దా సడతి వెట్టించె
పంకించి బాగాలు బరణులం బోసి
గాలించి సున్నముకాయ పెట్టించి
పండుటాకులు దెచ్చి పడతి మడిపించి
మదిరాక్షి యునిచెను మరియునచ్చటను."
అని ఈమె వర్ణించిన శయ్యాగృహం సభ్యతకు భంగం కలిగించదు. వెగటనిపించదు. సుభద్రను ద్రౌపది పడకటింటిలోకి పంపుతూ చెప్పిన మాటలు పూర్తిగా ఆడవారి మనఃప్రవృత్తికి తార్కాణః

"నాల్గు నెలలు భిక్షమేల్గ ల్గబెట్టె
ఇప్పుడిటు వలె సిగ్గు లేటికే సుదతి
అనుచు సుభద్రను అతివ తోడ్కొంచు



విజయుని నాస్నేన వేడ్కలో నుంచె
తలుపులు మూసుకు తరుణియేతెంచె."

అంతటి ప్రేమలో సుభద్రను పడకటింటిలోకి పంపిన ద్రౌపది

"ఏమి నష్టమునైన నియవచ్చు గాని
ప్రాణేశు నిచ్చి మరి బ్రతకంగరాదు."

అని బాధ పడుతుంది.

మొల్ల

తిమ్మక్క చేతిలో స్త్రీ సహజమైన సొబగు, స్వాతంత్ర్యం సంతరించుకొన్న తెలుగు కవిత, నూరేళ్ల తర్వాత మొల్ల మాటలలో ఛందోబద్ధ మయింది. రామాయణ రూపంలో కావ్యబద్ధమూ అయింది. తనకు పాండిత్యం గీండిత్యం అనేవేవీ తెలియవని, 'గోపవరపు శ్రీకంఠ మల్లేశు వరమున చేత నెరిగవిత్వము చెప్పగా నేర్చుకొంటి' అని అన్నప్పటికీ, ఆమె సందో లక్షణాలను ఎక్కడా అతిక్రమించలేదు.

హనుమంతుడు సీతాదేవిని చూచివచ్చిన తర్వాత రామునికి ఆమె స్థితిని తెలిపే పద్యం ఒక్కటే చాలు ఆమె కవయిత్రి అనడానికి:—

"కట్టిన వస్త్రంబు కట్టుకొంగే తక్క
జీర్ణించిపోయిన చీరతోడ,
ఉడుగని నగలచే నొగంత ప్రొగ్గుచు
జెక్కింటచేర్చిన చేయితోడ
వుడమిష్ట బొరలాడు గొడలు బూడిద బ్రుంగి
నిరతంబు దొరగు కన్నీటి తోడ
విడుద పెన్నెరి వేణి సడలించి జడలతో
విరత నిరాహారనియతి తోడ
కినుక జరించు దైత్యకామినుల నడుమ
తపము జేయుచు దనుజ బాధలకు నోర్చి
వనిత ప్రాణంబుదక్క సర్వము త్యజించి
నిత్యమును మిమ్ము మదిలోన నిల్పియుండు."

మొల్ల మాటలలో మల్లెల సౌరు నింపుకొన్న తెలుగు కవిత తంజావూరు పాలకుడు విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి రంగాజమ్మ ఉష

..కవయిత్రులు

పరిణయం, మన్నారుదాన నాటకం మొదలయిన కావ్యనాటకాలలో ఆనాటి సంఘాచారాలను కూడా కూడగట్టుకొని ముద్దుపళని మాటలలో రసరాజ మయిన శృంగారానికి, తనకు కూడా పట్టాభిషేకం చేయించుకుంది.

ముద్దు పళని

ముద్దుపళని తంజావూరు రాజ్యం పాలించిన మహారాష్ట్ర రాజు ప్రతాపసింహుని ఆశ్రితురాలు. 'రాధికా సాంత్వన' మనేపేరు విరహి జనావేదనను తన హృదయంతో పాటు, నాలుగాశ్వాసాల కావ్యంగా కుమ్మరించింది.

తాళ్లపాక తిమ్మక్క ద్రౌపదిలాగే ముద్దుపళని రాధిక ఇళాదేవికి కృష్ణుని అప్పగించి

"సొమ్ములియ్యవచ్చు సొమ్మంద మియవచ్చు
నియ్యరాని ప్రాణమియ్య వచ్చు
దనదు విభుని వేరుతరుణి చేతికి నిచ్చి
తాళవశమె యెట్టిదానికైన"

అని పరితపిస్తుంది.

గంగాదేవి

ప్రాకృతంలో కవితలు చెప్పినట్లే సంస్కృతంలోను తెలుగు పడతులు కవితలు చెప్పకపోలేదు. వారిలో మధురావిజయం వ్రాసిన గంగాదేవికి మనం, మనమే ఏమిటి దేశమంతా పెద్ద పీట వేయవలసిందే.

ఈమె బుక్కరాయల కుమారుడు కుమార కంపణుని రాణి. ఆయన వెంట మధుర దండయాత్రకు వెళ్లింది. దండయాత్రను కనుల గట్టి నట్టు వర్ణించింది. ఇంతటి చారిత్రక కావ్యం దక్షిణభారతంలో మరొకటి లేదు. ఆహా! గంగాదేవి ఎంత సులభంగా స్వేచ్ఛగా చెప్పింది కవిత! యుద్ధ యాత్రను అనుష్టుప్ వంటి చిన్న ఛందస్సులో గంభీరంగా చెప్పడంలో ఈమె పలువురు సంస్కృత ప్రాచీన కవులను తోసిరాజన్నది.

అథ మందర సంఘట్ట
క్షోభితాంభోధి మండలః
తరాణ కోణాభిహతో
రణనిర్యాణ దుందుభిః

మధురా విజయానికి అనుకరణగా "రఘునాథ నాయకాభ్యుదయః" మనే చారిత్రక కావ్యాన్ని రామభద్రాంబ వ్రాసింది. ఈమెలాగే కనకాభిషేకం చేసుకున్న మధురవాణి సంస్కృతంలో రామాయణం రచించింది. ఈమె "మాధుర్యైక ధురం ధరాంధ్ర కవితా నిర్మాణ సామ్రాజ్య" అని తనను గురించి చెప్పుకొంది.

తెలుగు తోబుట్టువులయిన తమిళ కన్నడ మలయాళాలలోను ప్రాచీన కవయిత్రులు వివిధ రచనలను చేసినవారే. తమిళంలో ఆముక్తమాల్యద— చూడికొడుత్తా నాచ్చియార్‌ది— సహజ మధురం.

కంతి

నిన్నిత్తమేమిటంటే, తెలుగు రచయిత్రుల లాగే కన్నడ కవయిత్రులూ మొదట ఆశువులు ముక్తకాలు, చెప్పినవారే. కన్నడంలో కంతి అనే కవయిత్రి 11 వ శతాబ్దం తుది భాగంలో వుండేది. ఈమె కాలంలో అభినవ పంప మహాకవి ఉన్నాడు. ఇప్పటికి తెలిసినంతవరకు ఈమే కన్నడంలో తొలి రచయిత్రి.

ఈమె జైన కవయిత్రి. ద్వారసముద్రం పాలించిన బల్లాళరాయని సభలో వుండేది. అభినవ పంపనికి ఈమెతో నెగ్గలేకపోతానేమోనని చాల ఆశగా ఉండేదట. ఒకసారి ఆయ మరణించినట్టుగా అభినయించాడట. వెంటనే కంతి నిజమే అనుకుని అభినవ పంపని కవితను ముక్తకంఠంతో పొగిడిందట. అతడు అంతట విని తర్వాత లేచాడట. అవును, సహృదయ గనుక నిజంగానే చాల ఆనందించింది.


ఈమె పేరుతో ఎన్నో చాటువులున్నాయి. అభినవ పంపడు రాజాస్థానంలో సమస్యలు ఎన్నో ఇచ్చాడు. ఆమె మహాసమర్థంగా వాటిని పూరించింది. ఒకసారి నిరోష్ఠ్యకంద మొకటి సమస్యగా పూరణం చేసింది ఈ విధంగా:

...నాగాభీశ్వర
హీరకిరీటాగ్రలగ్న చరణసరోజా
ధీరోధార చరిత్రా
త్వారిత కరుణారస ర్సిగళ్కరినర్తా

బసవేశ్వరుని కాలంలో ఉన్నంత మంది కవయిత్రులు కన్నడ సాహిత్యంలోనే కాదు, మరే సాహిత్యంలోను లేరు. అక్కామహాదేవి, నీలమ్మ, బిజ్జలదేవి, కాళవ్వ, గోగవ్వ, సిరమ్మ, రెమ్మవ్వ, రేచవ్వ, సోమవ్వ, గుడ్డవ్వ, ఇలా ఎందరో ఉన్నారు. వీరంతా మహాభక్తురాండ్రు. కవిత వీరి భావాలకు అనుగుణంగా దానంతట అదే వాలుకొని వచ్చింది.

నీలమ్మ

నీలమ్మ బసవేశ్వరుని భార్య. ఈమె ప్రసాద సంపాదనే, కాలజ్ఞానం అనే గ్రంథాలు రచించింది. ఇక వచనాలు అసంఖ్యాకాలు. వచనాలంటే, గీతాం



జలి వంటి భక్తి వైరాగ్య జ్ఞాన విశేష సమ్మిళిత గీతలు.

అక్కా మహాదేవి

అక్కామహాదేవి వీరందరిలోను గొప్ప స్థానం పొందింది. ఈమె శివ మొగ్గ జిల్లా ఉడుతడి అనే పట్టణంలో జన్మించింది. తండ్రి నిర్మలసెట్టి, తల్లి సుమతి. చాల అందమైన విగ్రహం. చిన్న నాటి నుంచే విరాగిణి.

ఆ ప్రాంతాన్ని కౌశికుడనే జైనుడు పాలించే వాడు. శివభక్తి విరహితుడైన జైనుని చేపట్ట దలచుకోలేదు. తన పతి శాశ్వతుడైన శివుడేనని తెలిపి నిరాకరించింది. "చావులేని చెడుపులేని రూపులేని చెలువుని నే వలచితినమ్మా. నెలవులేని కడలేని, తెరపు లేని, గురుతులేని చెలువుని వలచితి నమ్మా. నీవు వినుమా తల్లి! భవము లేని, భయము లేని నిర్భయ చెలువుని నేవలచితి నమ్మా. కులము లేని నిస్సీమ చెలువని వలచితి నేను. ఈ కారణమున చెన్నమల్లికార్జునుడు నలువు పతి నాకు. ఈ చావు బ్రతుకుల పతులను తెచ్చి పొయిలో బెట్టుము" అని నిరాకరించింది.

తర్వాత ఈమె కల్యాణ కటకం చేరి అల్లమ ప్రభు, బసవేశ్వరాదుల గోష్ఠిలో వుండి, శివపారమ్య ప్రచారం చేసి, చివరి శ్రీశైలంలో లింగైక్యం, పొందింది. ఈమె వచనాలు కవితకు మారురూపు.

శ్రీ గిరివాసుడు తన్ను వలవలేదనే ఆవేదన తెలిపే వచనం ఎంత సహజంగా వుంది—

"ఒమ్మె కామన కాలిహిడివె. మత్తొమ్మె చంద్ర మంగె సెరగొడ్డి బేడువె. సుడలివిరహా. నా నారిగె ధృతిగెడువె. చెన్న మల్లికార్జునదేవ నన్న వొల్లద కారణ ఎల్లరిగె హంగుగిత్తి యాదెనవ్వా!"

ఒకపరి కాముని కాలు పట్టెద. మరియొక పరి చంద్రునికి చెరిగొడ్డి వేడెద. కాల్చునీ విరహము. నే నెవరికి భయపడుదు? చన్న మల్లికార్జున దేవుడు నన్ను వలవని కారణమున అందరి కిని హంగుదారు నైతినమ్మా.

ఆమెను ఎవరో దూషించారు. దానిని అభి మానులు ఆమెకు చేరవేశారు. దానికి ఆమె సమా ధాన మిలా చెప్పింది—

"మలపై యిల్లు కట్టి మృగములకు వెరచున దెట్లయ్యా? కడలి తటమున యిల్లు కటి నురుగు తెరలు కలగు టెట్లయ్యా? సంతలో ఒక యిల్లు కట్టి సందడికి సిగ్గుపడు టెట్లయ్యా? — చెన్న మల్లికార్జున దేవా వినుము య్యా? లోకమునందు పట్టిన పిదప స్తుతినిందలు వచ్చిన మనమున కోపము పొందక సమాధానియై యుండవలె నయ్యా! (ఈ అనువాదాలు శ్రీ జి. టి. అక్కులయ్య దీక్షితులుగారివి.)

ఇలాటి వచనాలు వ్రాసిన భక్తురాండ్రు 16వ శతాబ్ద ప్రారంభంలో మగణమ్మ, రేకమ్మ, కాయమ్మ మొదలయినవారున్నారు.

మహాలక్ష్మి

కాని, కావ్యరూపంలో మహిళల కవిత మహాలక్ష్మి అనే కవయిత్రిదని చెప్పవచ్చు. ఈమె క్రీ. శ.



నీలాంశుక చీర చూడుకా ధారి

1881 లో కొన్ని కలకత్తా షాపులవారు 'చోళీ' ల అమ్మకాన్ని ప్రకటించారుట. ఒక బ్రాహ్మణ యువకుడు ఒకచోళీకొని తనభార్యకి ఇచ్చాడుట. తానొక పడుపు కత్తెని కానంటూ ఆమె దానిని తిరగకొట్టి వేసిందట!

ఇది జరిగిన ఏడెనిమిది వందలఏళ్లకి పూర్వం కాశ్మీర్ దేశంలో హర్షుడనేరాజా కూడా తన రాజ్యంలో స్త్రీలందరూ చోళీలు వేసుకోవాలని ఆజ్ఞాపించాడట. రాజాగారు పోయిన కొద్ది కాలంలోనే చోళీల ఫాషన్ మరుగు పడిపోయింది.....

'చోళీ' అంటే ముందు ముడివేసే రవిక అని ఒక సుప్రసిద్ధ చరిత్రకారుడు (ఘుర్యే) అన్నారు. పాతకాలాలలో, స్థూలంగా చెప్పాలంటే చోళీ దక్షిణ ప్రాంతాలలోనూ, 'కంచుకం' ఉత్తర ప్రాంతాలలోనూ ఎక్కువ వాడకంలో ఉండేదిట. చోళీకి ముందు ముడి వేస్తే కంచుకాన్ని వీపుమీద ముడివేసే వారు, లేక దారాలతో కట్టేవారుట (దీనినే 'జాలిక' అనేవారుట)

అసలు భారతదేశంలో సుమారు 11వ శతాబ్దం దాకా ఆడవారు రవికలనే వాడేవారు కారని డా. ఫాబ్రీ అంటారు. ఈవిష యాన్ని గురించి ఎన్నో పుస్తకాలలో ఎన్నో రకాల చర్చలు, వాదవివాదాలు జరిగాయి! ఆధునిక సభ్యతా ప్రమాణాలు ప్రాచీన కాలాలకి వర్తించ నక్కర లేదని కొందరు అంటారు. పదకొండవ శతాబ్దందాకా శిల్పాలలో దేశస్త్రీలకి రవికలు ఉన్నట్లే చూపించ బడలేదని వారి వాదం. కాని, కేవలం సభ్యతఒకటే కాదు కదా లెక్కలోకి తీసుకొన వలసినది! ఉత్తర దేశంలో చలి ఎక్కువ. సిగ్గు కోసం కాకపోయినా దేహారోగ్యానికైనా చొక్కా అవసరం. శాలువాలు కప్పుకున్నంత మాత్రాన చాలదు.

అంతే కాకుండా పుస్తకాలలో చొక్కాల ప్రసక్తి ఉంది. 'గాధాసప్తశతి'లో కుసుంభ రాగయుక్త కంచుకాభరణ మాత్రా':—అనే వాక్యం ఉంది కాబటి ఆకాలం వనితలు ఏదోరకం చొక్కాలు వేసుకునే వారని ప్రొ. ఘుర్యే సహేతుకంగానే అన్నారు. ఇవి ముందు ముడి వేసే రవికలేనని కూడా ఆయన సహేతుకంగా నిరూపించారు. హేమంత శిశిరాలలో కూర్పాసకాలని గురించి కాళిదాస మహాకవి రాసిన సంగతిని ఆయన ఉదహరించారు.

భర్తకి దూరమయిన స్త్రీ నీలం రంగు రవికె వేసుకునే అలవాటుని 'దశకుమార చరిత్ర'లో దండి వర్ణించాడని అనుకుంటారు కాని ఈ అభిప్రాయాన్ని కొందరు ఖండించారు. నీలం రంగు చొక్కా (నీలాంశుక చీర చూడికా) అభిసారిక లక్షణంట......

'కూర్పాసకం', 'కంచులి(క)' ఒకటేనని ప్రొ. ఘుర్యే అభిప్రాయం. బాణుడు స్థానీశ్వర స్త్రీలు కంచుకాలు వేసుకున్నట్లు రాశాడుట. మాఘుడు కూడా 'శిశుపాలవధ'లో చెమట పట్టి గట్టిగా అయిన చొక్కాలని కొందరు వనితలు విప్పివేసిన ఘట్టాన్ని వర్ణించాడు కాబట్టి వంటిమీద అసలే చొక్కాలు ఉండేవి కావనటం అంత సబబుగా తోచదు!

13 శతాబ్దంలో అర్జునవర్మదేవుడనే వ్యాఖ్యాత 'చోళిక' దక్షిణదేశపు చొక్కా అన్నాడుట.

వివిధ కావ్యాలలోని వర్ణనలనిపట్టి ప్రొ. ఘుర్యే ఉత్తరదేశపు రవికలు 'కంచుకం, కంచులికా' వగైరాలనీ, దక్షిణదేశపువి 'చోళీ' లనీ అన్నారు. ఇవి కేవలం వదులు కంచుకాలు కావనటానికి చాలా ఆధారాలు ఉన్నాయని ఆయన నిరూపించారు. వక్షప్రదేశాన్ని నగ్నంగా వదిలివేసే అలవాటు భారతదేశంలో అసలే లేదని ఎవరూ అనలేరు. కాని, ఇది సాంఘికాచారాలమీద మాత్రమేకాక, చలి, వేడిమిలమీద కూడా ఆధారపడి వుంటుంది!

—పీతాంబరం

1750 ప్రాంతంలో ఉడుపిలో జన్మించింది. శ్రీరామపట్టాభిషమనే కావ్యాన్ని రచించింది, వార్ధక్యంలో.

అవ్వయ్యార్

ఇక తమిళులు అన్ని విషయాలలోను మనకంటే ముందున్నట్టే కవితలోను ముందున్నారు. సంఘ కాలంలో అవ్వయ్యార్ అనే ఒక గొప్ప కవయిత్రి ఒకరున్నారు. రెండువేల ఏళ్ళ క్రింద వున్నట్టు చెబుతారు సంగకాల సాహిత్యమైన అగనానూరులో ఈమె కవితలు నాలుగు, కరుంతొగ్గైలో 15, నట్రిణైలో ఏడు, పురనానూరులో 33— మొత్తం 50 కవితలున్నాయి. ఈ పరణర్ అనే సంగకవికాలంలో వుంది.

చిన్నపిల్లల జిలిబిలి పలుకులను గురించి, నీటిలో పడిన ఏనుగు కొమ్ములను పిల్లలు కడుగుతూ ఆడుకోడం మొదలయిన సన్నివేశాల వర్ణనలు గొప్పగా వుంటాయి.

..రచయిత్రులు

ఈమె రచనలలో మృదంగం, ఎడ్లు, శకటాలు, అచ్చు వంటి వృత్తుల ప్రస్తావన వుంది

రెండవ అవ్వయార్ 12వ శతాబ్దంలో కంబ మహాకవి, మొదలయిన వారికి సమకాలికురాలు. ఈమె జననం గురించి, పోషణ గురించి రకరకాల కథలున్నాయి

ఈమెకు ఏడుగురు సహోదరులు ఈమె పెద్దది. ఏదో కారణం వల్ల ఈమెను తల్లిదండ్రులు పుట్టగానే వదలి పెడతారు ఒక పాణసి ఈమెను పెంచుతాడు.

ఈమె రచనలు ఆబాలవృద్ధం అన్నిదశల వారికీ ఉపయోగపడేవి ఆత్తిచ్చూడి, కొన్రైవేందన్, మూాదురై, నల్వళి—అనేవి నీతి పుస్తకాలు. ఈమె పేరుతోవుండే గ్రంథాలెన్నో నేడు లుప్తమై పోయాయి.

ఈ అవ్వయార్‌ను గురించి ఒక చిన్నకథ వుంది. ఈమె తను చాల మేధావినని గర్వపడుతూ వుండట. దానికి భగవంతుడే ఒక ఉపాయం చేసి, గర్వభంగం చేశాడట.

ఒకమారు అవ్వయార్ ఎక్కడికో వెళ్ళుతున్నది. దారిలో ఒక నేరేడు చెట్టు కనిపించింది. పళ్ళు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. పైన ఎవరో కుర్రవాడు పండ్లు కోసుకొంటున్నాడు. అవ్వయార్ తనకూ కొన్ని పళ్ళు రాల్చమంది. "వేడిపళ్ళు కావాలా? చల్లారిన పళ్ళు కావాలా?" అని అడిగాడట కుర్రవాడు. ఆమెకు అర్థం కాలేదు. అయినా వేడిపళ్లే వేయమందట. వాడు పళ్ళు కిందికి విసిరి వేశాడట. "ఏమిటి ఇలా చేశావు? పళ్ళు మట్టిలో కూరుకుపోయాయే?" అన్నదట ఆమె. "మొదట్లోనే అడిగాను. వేడిపళ్లు కావాలన్నావు. వేడిగా వున్నాయి. వూదుకోని తిను." అన్నాడట కుర్రాడు.

ఆమె అతని తెలివితేటలకు విస్తుపోయిందట. అప్పటి నుంచి గర్వపడడం మానిందట.

ఆండాళ్

తమిళ సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే ఆండాళుకు గొప్పస్థానం వుంది. ఈమె శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుని పెంపుడు కుమార్తె. ఆయనే పెరియాళ్వారు. ఆయన అక్కడి దేవాలయార్చకుడు అతనికి ఆమె దేవాలయ నందనోద్యానంలో దొరికింది ఆమెకు గోద అని పేరుపెట్టాడు. ఆమె శబరి లాగా మొదట తాను పూవులు ధరించి, వాటి అందం చూచి, తర్వాత పెరుమాళ్ళకు సమర్పించేది. అందువల్ల ఈమెకు చూడిక్కొడుత్త నాచ్చియార్ 'ఆముక్తమాల్యద' అని పేరు వచ్చింది.

ఈమె కవితలలో గొప్పవి తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి అనేవి తిరుప్పావైలో ఆమె భగవత్ప్రేమపారవశ్యం వనితా సహజమైన భావుకతతో ప్రవహిస్తుంది. నాచ్చియార్ తిరుమొళిలో "ప్రియుణ్ణి ఇప్పుడే కలుసుకోవాలి" అనే ఆవేదన వెల్లివిరిసి వుంది.

ఈమెకు యుక్తవయస్సు రాగానే, తండ్రి పెళ్లికి ప్రయత్నించగా, రంగణ్ణి తప్ప మరొకడు తనకు భర్త కాదంది ఆండాళ్. ఆవిధంగానే పెండ్లివారు తరలినట్లే విష్ణుచిత్తుడు ఆమెను శ్రీవిల్లిపుత్తూరు నుంచి శ్రీరంగానికి పిలుచుకొనిపోయాడు. ఆమె జీవితమంతా అక్కడే గడిపి, ఆయనలో ఐక్యం చెందింది.

శైవ భక్తులైన నాయనార్లలోను ఒక భక్తురాలున్నది. ఈమె కూడా అవివాహితే.

మన సంఘంలో అనాదిగా ఇలా బ్రహ్మచారిణులుగా వున్నవారు, సంఘానికి, దేశానికి, భాషకు ఉన్నతిని తెచ్చినవారూ ఎందరో వున్నారు వారి మనః ప్రవృత్తిని బట్టే వివిధ కాలాలలో వివిధ సాహిత్య ప్రక్రియలు రూపొందుతూ వచ్చాయి. గాథలతో ప్రారంభమైన మహిళల రచనాధ్వరం నేడూ వివిధ రీతుల కొనసాగుతూనే వున్నది.

—తిరుమల రామచంద్ర




తెలుగుదేశంనుంచి మదరాసుకి వచ్చిన ఒక పెద్ద మనిషి తన మిత్రుడితో అన్నాడుట— ఇక్కడి ఆడవారు ముక్కుకి రెండు వైపులా పుడక పెట్టుకుంటున్నారు ఎందుకు? అని మిత్రుడు సరైన సమాధానం చెప్పలేకపోయేసరికి ఆయనే 'ఇక్కడి వారికి ఆచారం ఎక్కువ అందుకని రెండు ముక్కు పుడకలు వాడుతున్నా'రని సరిపెట్టుకున్నాడుట.

దీనినిబట్టి నాసికాభరణాలు ఆచారప్రకారం —మంగళసూత్రం, నల్లపూసలు, గాజులు, వాటివలే—ధరించేవి అని ఆయన వూహించినట్లు గ్రహించవచ్చు. కాని, ఎందరో చరిత్రకారులు ఈ అభిప్రాయాన్ని సమర్థించటంలేదు. 'తాళి' కట్టటం దక్షిణ ప్రాంతానికి ప్రత్యేకం అని ఒక ధర్మశాస్త్రంలో ఉందిట. బొట్టు పెట్టుకునే పద్ధతులు దేశంలో వివిధ ప్రాంతాలలో రక రకాలుగా ఉంటాయి. మెడచుట్టూ నల్లపూసలు, అన్ని ప్రాంతాల వనితలూ వాడుతున్నారా అనేది ప్రశ్నీయాంశం. ముక్కు పుడకలలో కూడా తేడాలు ఉంటాయి. కొన్ని ముక్కుపుటాలకి తగిలించేవి, కొన్ని (పేరు వేరే ఉన్నా!) ముక్కు మధ్య తగిలించుకునేవి ఉంటాయి.

ప్రాచీన సాహిత్యంలోకాని, శిల్పాలలో కాని, చిత్రపటాలలోకాని ముక్కు పుడకలు ఆడవారి అలంకరణలలో ఒక రకం అనేందుకు ఆధారాలు లేవని ఒక సుప్రసిద్ధ చరిత్రకారుడు (అల్టేకర్) రాశాడు. ఈరకం ఆభరణాలు మహమ్మదీయులతోనే భారతదేశంలోకి వచ్చాయని ఆయన అభిప్రాయం. అతి ప్రాచీనకాలాల నుంచీ భారతదేశానికీ, పశ్చిమ ఆసియా ప్రాంతాలకీ సంబంధ బాంధవ్యాలు ఉండేవి. మన సంస్కృతిలో ఎన్నో అంశాలు అక్కడినుంచి వచ్చినవే! 'మధ్యప్రాచ్యం' నుంచి వచ్చినవన్నీ మహమ్మదీయ ప్రభావాలే అనుకోనవసరం లేదు. పారశీకసామ్రాజ్యం భారతదేశం ప్రాంతాల దాకా వ్యాపించిఉండేది కాని, ముక్కు పుడక చరిత్రమాత్రం—మనదేశంలో మహమ్మదీయ యుగం ముందరిది కాదని పండితులు అంటున్నారు!

— సుబ్బలక్ష్మి



బహు భర్తృత్వం

బహు భార్యల పద్ధతి కన్నా బహు భర్తల పద్ధతి అరుదు అని వేరే చెప్పనవసరం లేదు! అందు చేతనే భారతంలోని అయిదుగురు భర్తల కథని అంత ప్రత్యేకంగా చెప్పటం జరిగింది. ఒకే వనితకి ఒకరుకన్నా ఎక్కువ భర్త లుండటం అనేది, ప్రాచీన కాలాలలో, ప్రపంచంలో ఎన్నోచోట్ల ఉండేదిట. ఇంగ్లాండు ఉత్తరాన ఉండే పిక్ట్‌లనే వారి తెగలోనూ, బ్రిటన్‌లలోనూ, అరబ్బులలోనూ కూడా ఈ అలవాటు ఉన్నట్లు చరిత్ర కారులు ఊహిస్తున్నారు. కొందరు మాత్రం, ఇది ఉట్టి బహు భర్తృత్వమా లేక ఒక రకమయిన సామాజిక — లైంగిక — జీవితమా, అని అడుగుతారు. ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పటం కష్టం!

ఇదంతా ప్రాచీన కాలాలకి సంబంధించినది. ఆధునిక కాలాలలో పరిస్థితి ఎలా ఉంది? నేటికీ బహు భర్తృత్వం ఆఫ్రికా, మార్క్వెసా ద్వీపాలు, భారతదేశం, భారత దేశం దగ్గరి ప్రాంతాలలోనూ అమలులో ఉంది. వీటన్నిటిలోనూ భారత దేశానిదే ప్రథమ స్థానంట.

భారతదేశంలో దక్షిణాదినా ఉత్తరాదినా కూడా పలుపురు మొగుళ్ల అలవాటు కొన్ని తెగలలో ఉంది. అయితే ఈ పద్ధతి ఉన్న ప్రాంతాలలో బహు భార్యల పద్ధతి కూడా మిళితమై ఉందని పరిశోధకులు అంటారు.

ముఖ్యంగా బహు భర్తృత్వం నీలగిరి ప్రాంతంలో ఉండే తోడాలలో; కేరళ నాయర్లలో కొందరిలో; సిమ్లా, రాజస్థాన్‌కి చెందిన కొందరు బ్రాహ్మణులలో ఉంది. హిమాలయ ప్రాంతంలో ఇది బాగా ఎక్కువ. టిబెట్టులో సరేసరి.


బహు భర్తృత్వాన్ని రెండు రకాలుగా విభజించారు. సోదరులకి సంబంధించినది, అందరికీ సంబంధించినదీ. మొదటి రకం పద్ధతి ఉత్తర హిందుస్తానంలో ఎక్కువ. అయితే తోడాలలోనూ ఈ పద్ధతి ఉంది. దీనిని మెక్‌లెన్నాన్ అనే అతను 'టిబెటెన్ పాలియాండ్రీ' అన్నాడు.

రెండవ రకం బహు భర్తృత్వం నాయర్లలో అధికం కాబట్టి దానినే 'నాయర్ పాలియాండ్రీ' అని మెక్‌లెన్నాన్ వర్ణించాడు. వీరిలో అన్నదమ్ములు మాత్రమే ఒక వనితని వివాహం చేసుకోనవసరం లేదు. కొందరు కలిసి ఒక స్త్రీని పెళ్లాడవచ్చు. ఆస్తి ఆడవారి ద్వారానే వస్తుంది కాబట్టి పంపకంలో, తండ్రి ఎవరన్న విషయంలో పెద్ద చిక్కులు రావు.

ఇవి రెండూ కాక చిల్లర రకం బహు భర్తృత్వం పద్ధతులు కొన్ని ఉన్నాయి. తండ్రీ, కొడుకులు, మేనమామ, మేనల్లుళ్లూ కూడా ఒకే అమ్మాయిని పెళ్లి చేసుకోనటం మెలనేసియా ద్వీపాలలోఉంది.

సాధారణంగా ఒకచోట నిలవక దేశ ద్రిమ్మరులుగా వుండే తెగలలోనే ఈ అలవాటు ఎక్కువ అంటారు. ఇది కొంతదాకా నిజమే అయి వుండవచ్చు. స్త్రీలు ఎక్కువ అయినచోటకూడా ఈ పద్ధతి ఉండటంలో ఆశ్చర్యం లేదు. [తోడాలలో ఆడబిడ్డలని చంపివేసే అలవాటు ఉం(డే)దిట.] కాని, వ్యవసాయం ఆడవారు కనిపెట్టినది అని చరిత్రకారులు అంటారు. వ్యవసాయం భూగోళంమీద పశ్చిమ ఆసియాలో ప్రారంభం అయిందని కూడా చెప్తారు. ఇక్కడి ఆడవేలుపుల పూజకీ దీనికీ సంబంధం వుందంటారు. మరి ఈ ప్రాంతాలలో కొందరు 'పూజారిణులు' భర్తలని మార్చటం అలవాటు ఎలా వచ్చింది? ఇటువంటి ప్రశ్నలకి సమాధానం చెప్పటం కష్టం. కాని సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు కే. శే. మజుందార్ చెప్పినట్లు బహుభర్తృత్వం క్రమంగా తగ్గిపోతోంది. నాయర్లలో బహుభర్తృత్వమే లేదనేవారు వున్నారు. పెద్ద అన్న చేసుకున్న అమ్మాయి వయస్సు మరీ అధికం అని పెళ్లిని తప్పించుకునే హిమాలయప్రాంతం ఆధునిక యువకులూ వున్నారు!

—సూర్యం



ఆడజాతికే అవమానం

జనవరి 26వ తేది ప్రత్యేకత యేమిటి?—

అది మన రిపబ్లిక్ దినం. భారత రిపబ్లిక్ దినం.

అంతేకాదు. ఈ సంవత్సరం జనవరి ఇరవయ్యారో తారీఖున మరొక విశేషం ఉంది. అది ఒక విషాద దినం. ఆగాధ తలపుకి వస్తేనే వళ్ళు జలదరిస్తుంది...

దేశం దేశమంతా అవాళ పతాకోత్సవాలతో, విందులతో, వినోదాలతో మునిగి తేలుతూ వుంది. అటువంటి సమయంలో— బొంబాయి పూనా నగరాల మధ్యనున్న 'వాడా' తాలూకాలో జరిగిందో విశేషం...

రాత్రి 8 గంటలకు — జరగవలసిన విందుకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ విందుకి తాలూకా డాక్టరు, తాసిల్దారు, పోలీసు అధికారి, పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు, ప్రముఖులు వస్తారు. కనుక నిజంగా సరదడిగానే ఉంటుంది.

రాత్రి విందుకి ఏర్పాట్లు జరుగుతున్న ఆ 6 గంటల సమయంలో ఒక చిన్న కోలాహలం: కాడూన్ ప్రాంతపు ఆదివాసులు ఏదో వార్త మోసుకు వచ్చారు. నించున్న పాటున పెద్దల్ని రమ్మని మరి మరి కోరారు. ప్రాధేయపడ్డారు. విందు ముగిశాక వస్తాంలే పొమ్మన్నాడు, తాలూకా డాక్టరు. ఎటువంటి ఆపత్సమయం కాకపోతే అంత కలవరపడుతారు ఆ ఆదివాసులు?—వాళ్ళ చూపుల్లో అంత భీతావహం ఎందుకని?—

* * *

ఠాణాజిల్లాలో—కుటుంబ నియంత్రణ శాఖలో పనిచేస్తున్నది, మిస్ కమల్ విద్యా. కాడూన్ గ్రామంలో కుటుంబ నియంత్రణ ప్రచారం చెయ్యడం ఆమె ఉద్యోగం. ఠాణా పట్నంలో వాళ్ళ అక్కా, బావ ఉంటే, వాళ్ళతోపాటు వుంటూ ఉద్యోగం చేసుకుంటూ వుంది—విద్యా.

జనవరి 26 వ తేదీ కాడూన్ గ్రామ పొలిమేరలో ఆదివాసుల గుడిసెల వేపు వెళ్ళింది—మిస్ విద్యా.

'మగ్యా' అనే ఆదివాసి యువకుడొకడు తారస పడ్డాడు. తనకి సాయంగా రమ్మంది విద్యా. సరేనన్నాడు మగ్యా.

దోవలో—మగ్యా ప్రవర్తన చాలా అసభ్యంగా, అసహ్యకరంగా, అమానుషంగా పరిణమించింది. చివరికి ఆమెను చెరచటానికే ప్రయత్నించాడు. అతని ప్రయత్నం సాగనివ్వలే దామె. దారిన పోయే ఇద్దరు ఈ దృశ్యం చూశారు. వాళ్ళమీద మగ్యా రాళ్ళు రువ్వాడు. భయపడి వాళ్ళు తప్పించుకుపోయారు.

మరి కాస్సేపట్లోనే ఆ యిద్దరూ ఊళ్ళో వాళ్ళని వెంటబెట్టుకు వస్తారని భీతి పట్టుకుంది మగ్యాకు.

సరిగ్గా అలాగే జరిగింది.

కానయితే—సార్థక మేమిటి?—

వాళ్ళు వచ్చేటప్పటికి విద్యా పీక నులిమి వేయబడి వుంది. ఆమె శవం మాత్రమే కనిపిస్తూంది. అంతలోనే మగ్యా పరారి అయిపోయాడు!—

* * *

డాక్టరు వచ్చాడు, రాత్రి 11 గంటలకి. నడిరోడ్డు మీదే పోస్ట్ మార్టం చేసి, శవ దహనానికి అనుమతించాడు. గ్రామస్థులు శవాన్ని తీసుకుపోయారు.

మరునాడు పదకొండు గంటలకిగాని విద్యా బావగారికి చావు కబురందలేదు. ఆదరాబాదరా ఆయన విద్యా పనిచేసే ఆఫీసుకి వెళ్ళాడు. సంగతి సందర్భాలు తెలుసుకున్నాడు. వెంటనే తన కొక జీపుగాని, కారుగాని ఇప్పించమని అధికారుల్ని కోరాడు. వీల్లేదన్నారు వారు.

ఎలా అయితేనేం, మధ్యాహ్నం రెండు గంటలకి కాడూన్ గ్రామం చేరుకున్నాడు. అక్కడ విద్యా లేదు. విద్యాశవంకూడా లేదు. పట్టెడు బూడిద మాత్రం మిగిలివుంది!

* * *

దారుణమైన ఈ హత్యను గురించి ప్రజలు ప్రభుత్వాన్నిలా ప్రశ్నిస్తున్నారు:

1. ప్రభుత్వోద్యోగంలో ఉండే స్త్రీలకు ఇటువంటి ప్రమాద స్థలాలలో తగిన రక్షణ ఇవ్వాలని ప్రభుత్వానికి తెలియదా?—

2. హత్య సంగతి ఆరుగంటలకు తెలిసిన డాక్టరు పదకొండు గంటలదాకా ఎందుకు వెళ్ళలేదు?—అక్కడికి రెండు మైళ్ళ దూరంలో—గవర్నమెంటు డ్యూటిలో ఉన్న స్త్రీ చచ్చి పడివుంటే, అధికారులు విందు ఎలా ఆరగించ గలిగారు?—

3. అటువంటి ఆపత్సమయంలో విద్యా బావకు సాయం చెయ్యకుండా ప్రభుత్వోద్యోగులు ఎందుకు నిర్లక్ష్యం చేశారు?—

4. ఈ విషాద సంఘటన జరిగి కొన్ని నెలలయినా, మహారాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తగినచర్య తీసుకోలేదు?—

పూనాలో జరిగిన మహిళల సభలో తీవ్రప్రతిఘటన తెలుపుతూ తీర్మానం చేశారు. అసంఖ్యాకంగా లేఖలు కురిపించారు.

ప్రముఖ మహారాష్ట్రపత్రిక 'కేసరి'లో ఒకమహిళ ఇలా రాసింది—'మన రాజ్యాంగమైతే మహిళల కెంతో గౌరవం ఇచ్చింది. అయితే అది ఉత్త అక్షరాల రూపంలోనేనని ఈనాడు తెలుసుకున్నాం. అసలు స్వరూపం చూస్తే—స్త్రీకి పూర్వపు అధమస్థానమే ఈనాడూ అమలులో వుందన్నమాట.

ఒకమహిళ ప్రధానిగా వుంటున్న ఒక దేశంలో 'కమల్ విద్యా హత్య' వంటి దారుణాలు జరుగుతున్నాయంటే, అంతకంటె అవమానం మరేం కావాలె?'—

మూలం: 'విసు'

అనువాదం: శివకుమారి



మచ్చా వెంకటరమణయ్య, ఉరవకొండ.

ప్ర: ఆశలు, ఆశయాలు స్త్రీ పురుషులలో ఎవరికి ఎక్కువగా ఉంటాయో దయచేసి తెలుపుతారా?

జ: ఆశ లేనిదే ప్రయాసలేదు; ఆశయం లేనిదే లక్ష్యం సాధించలేము. స్త్రీ అయినా పురుషుడయినా ఆశ, ఆశయం లేనిదే అభివృద్ధిలోకి రావడం కష్టం.

బొటం చంద్రశేఖరరావు, శ్రీకాకుళం.

ప్ర: మీకు ముక్కు మీద కోపమంటారు? నిజమేనా?

జ: ఏం బాబూ, కోపం తగ్గించే మందు ఏమయినా పంపదల్చావా!

జె. వి. వేదశ్రీ, విల్లుపురం.

ప్ర: మనిషికి కాలం విలువ ఎప్పుడు తెలుస్తుంది?

జ: మనిషికి మనిషి విలువ ఎప్పుడు తెలుస్తుందో సెలవిస్తారా!

కె. ఉషారాణి, ఆమదాలవలస.

ప్ర: మిమ్మల్ని చూస్తే నాకు గొప్ప సరదా; మీ కండ్లు యెప్పుడూ మత్తుగా వుంటాయి. ఎందుకండీ?

జ: మీ లాంటి వాళ్లమత్తును పోగొట్టేదానికే నాకళ్లు మత్తుగా వుంటాయేమో; అందుకే నన్నుచూస్తే మీకు గొప్ప సరదా అనుకుంటా.

ఎస్. శ్రీనివాసులు, గిద్దలూరు.

ప్ర: వివాహం పై మీ అభిప్రాయమేమిటి? మీ నిశ్చయమేమిటి?

జ: నేను హైందవస్త్రీని; వివాహం అనేది జీవితంలో మరపురాని మనోహర ఘట్టం; కాలం, కర్మ కలిసివచ్చినప్పుడు తప్పక పెళ్లిచేసు కోవడమే.

ఎం. డి. నజీర్‌భాషా, పొదిలి.

ప్ర: మీరు యిప్పటివరకు నటించిన చిత్రాలలో మీకు నచ్చిన పాత్ర, సన్నివేశము తెలుపుతారా?

జ: ఇంతవరకు నేను ధరించిన ప్రతి పాత్ర మీ అభిమానాన్ని చూరగొన్నదే. ప్రతి సన్నివేశము మీ మెప్పును పొందేవిధంగా నటిస్తూనే వున్నాను.

ఎం. బాబురావు, దండకారణ్యం.

ప్ర: ఏమిటో యీ జీవిత మంటే... అనుకొనే కోరికలలో ఒకటైనా తీరుతుందా?

జ: జీవితం (మానవజీవితం) పూల మందిరం; కోరిక సవ్యమయిందయితే తప్పక యీడేరుతుంది.

పడగా మురళీకృష్ణ, ఏలూరు.

ప్ర: నేటి తెలుగు చిత్రపరిశ్రమపై మీ అభిప్రాయమేమిటి?

జ: తెలుగుచిత్ర పరిశ్రమ నాకు అన్నం పెడుతున్న అన్నదాన పరిశ్రమ. మన పరిశ్రమ నానాటికి అభివృద్ధి చెందాలనేదే నా ప్రార్థన.

బి. శ్రీనివాసరావు, అనకాపల్లి.

ప్ర: మీకు నటీమణుల్లో ఎవరంటే ఎక్కువ యిష్టం?

జ: హిందీలో నర్గీస్, వహీదా రెహ్మాన్, నూతన్, తమిళంలో కె. ఆర్. విజయ, తెలుగులో భానుమతి, సావిత్రి అంటే నాకు చాలా యిష్టం.

ఎం. ఆర్. కృష్ణయ్య, మాధవరం.

ప్ర: మీరిప్పుడే చిత్రంలో నయినా హీరాయిన్‌గా నటించుచున్నారా?

జ: శ్రీ టి. ఎల్. కాంతారావు నిర్మిస్తున్న 'జానపదం' లోనూ; శ్రీ రామానాయుడు తీసే జానపదంలోనూ కథానాయిక వేషం వేస్తున్నాను.

తాడాల రామకృష్ణారావు, పిఠాపురం.

ప్ర: మానవుడు చెడును తొందరగా అలవాటు చేసుకుంటాడు; మరి మంచిని తొందరగా అలవాటు చేసుకోలేడు? కారణ మేమిటంటారు?

జ: అదేనండీ యెవ్వరికీ తెలియని 'కిటుకు.'

బహుమతి పొందిన ప్రశ్న

ఒ. రామభద్రగౌడు, గుంతకల్లు.

ప్ర: చిత్రాలలో ముద్దుల్ని ప్రదర్శించడంపై మీ అభిప్రాయమేమిటి?



జ: నేను పసిదాన్ని; ఇలాంటి ప్రశ్నకు సమాధానమిచ్చే వయసూ మనసూ నాకెక్కడిది.

చలనచిత్ర పరిశ్రమలో నటుల ప్రాధాన్యత?

వెండితెర కథానాయకులు కేవలం నటజీవులేకాదు—ప్రజావాహినియొక్క అభిమాన ధనులు అనెడి సత్యాన్ని ప్రపంచచిత్ర పరిశ్రమయొక్క ముఖ్యనటులు నిరూపించారు. అలా నిరూపించిన వారెవరు? వారి ప్రసిద్ధికి కారణమేమిటి?



మార్లన్ బ్రాండో

ఉదాహరణకు హాలీవుడ్ నటులు మార్లన్ బ్రాండో, రాక్‌హడ్సన్‌ను తీసుకోండి. మార్లన్‌బ్రాండో నటించే చిత్రానికి ప్రేక్షకుల డిమాండ్ అధికంగా వుండడానికి కారణం అతని సాంఘికసేవా కార్యక్రమాలే. అమెరికా నీగ్రోల హక్కుల సంరక్షణకై తాను పూనుకొని ప్రజల మంచిచెడ్డలను స్వయంగా పరామర్శించి వారికి కావలసిన సహాయ సహకారాల్ని అందచేస్తూ ప్రజానురంజితు డయ్యాడు. అలాగే రాక్‌హడ్సన్ సాంఘిక చిత్రాల్లోని ప్రణయ సన్నివేశాల్లో నయితేనేమి, వుదాత్త గంభీర దృశ్యాల్లో నయితేనేమి తన నటనా వైదుష్యంతో ప్రేక్షకుల్ని అట్టే ఆకర్షించేశక్తిని పొందియున్నాడు: అంతేగాక తను ప్రజలమధ్యకు వెళ్లి వారి విమర్శలను సహృదయంతో స్వీకరిస్తూ ప్రజలుమెచ్చిన నాయకుడు కాగల్గాడు.

ఇక బొంబాయి సంగతంటారా, దిలీప్ కుమార్, రాజకపూర్లు గత 20 సంవత్సరాలుగా హిందీ చిత్రపరిశ్రమకు మూలస్తంభాలయ్యారు. భారతదేశంలో యే నటుడు తీసుకోని డబ్బును తీసుకునే యేకైక నటుడిగా గణుతికెక్కాడు దిలీప్ కుమార్. చిత్ర పరిశ్రమయొక్క బాగోగులను ప్రభుత్వానికి, ప్రజలకు, తెలియచేస్తూ తన బాధ్యతను సక్రమంగా నెరనేరుస్తున్నాడు. తను ధరించే ప్రతి పాత్ర ప్రేక్షకులు మరువలేని విధంగా పోషించి సెభాష్ అనిపించుకుంటున్నాడు. ఇక రాజకపూర్‌నుగూర్చి వ్రాయాలంటే ఒక గ్రంథమే తయారవుతుంది. ఇతడు చేసే ప్రతిపని అనితర సాధ్యమనిపిస్తుంది. ఇతడు తీసే ప్రతిచిత్రం అసమానంగా ప్రజలచే కొనియాడబడుతుంది. యజమాని అనే భావం యే కోశాన తలపక పనివాండ్లల్లో కలిసి మెలిసి తిరుగుతూ వారి యోగక్షేమాలను పరిరక్షిస్తున్నాడు. దేశంలో యెలాంటి యిబ్బందులు యేర్పడినా తనకు తోచిన సహాయాన్ని అందచేస్తూ ఆపదలో వున్నవారిని ఆదుకుంటూ ప్రజాభిమానాన్ని విపరీతంగా చూరగొన్నాడు.

ఇక తమిళ సినిమారంగాన్ని పర్యావలోకనం చేస్తే ఎం. జి. రామచంద్రన్, శివాజిగణేశన్‌లు ప్రతివాడన ప్రసిద్ధులయ్యారనడానికి నిదర్శనంగా వారిపేరున



రాజ్ కపూర్




ఎన్. టి. రామారావు

వెలసిన ప్రేక్షక సంఘాలు నిరూపిస్తాయి. ప్రజలకు యిబ్బందులు యేర్పడ్డప్పుడల్లా యీ యిద్దరూ పోటా పోటీలుగా విరాళాలిచ్చి ఆదుకుంటూ వున్నారు. ప్రతి వూరికి వెళ్లి ప్రజలే మనుకుంటున్నారు? వాళ్లకు యేం కావాలి? అని పర్యవేక్షించి తదనుగుణంగా తమ పద్ధతులను పరిమితం చేసుకుంటున్నారు.

మన తెలుగు చిత్ర పరిశ్రమను ఎన్. టి రామారావు, నాగేశ్వరరావులు సర్వతోముఖం చేసారనడంలో అతిశయోక్తి లేదు. ప్రజల్లో వీరిద్దరిపై అచంచల విశ్వాసం, గాఢ అభిమానం యేర్పడ్డాయి. మిగతా వాళ్లకి మనవాళ్లు యేం తీసిక్కట్టుకారు అని నిరూపించే విధంగా ప్రజలను తమవైపుకు త్రిప్పుకునేందుకు కావలసిన సాధన సామగ్రిని యేర్పరిచి ప్రజలకు సన్నిహితు లయ్యారు.

ప్రజల్లో ప్రాబల్యం నటులకేనా అని మీరు ప్రశ్నించవచ్చు. ప్రేక్షకుల అభిమానాన్ని నటులవలె నటీమణులు కూడ పొందవచ్చునేమోగాని నాయకులవలె ప్రజలమధ్యకువెళ్లి తిరుగాడడం కష్టం అదే నా అభిప్రాయం.

—శ్రీనివాస్


NAVAJYOTHI PICTURES
నవజ్యోతి పిక్చర్స్
నడమంత్రపుసిరి
నిర్మాతలు
సాంబశివరావు, వందనం
దర్శకుడు
తాతినేని రామారావు
KE
రాయల రిలీజ్
STUDIO Ketha



'పేదరాశిపెద్దమ్మ'లో విజయలలిత, రామకృష్ణ.

సినిమా

మనందరం ఆనందంగా గడిపే పండుగ దసరా. ఈ సంతోష సమయంలో మీకు కొంగ్రొత్త వార్తలను అందించడం నా కర్తవ్యం. ఆ వుద్దేశ్యంతోనే మద్రాసు నగరంలో గల మన తెలుగు సినిమా కంపెనీలకు వెళ్ళి, వాళ్ళుయిచ్చిన వివరాల్ని మీ ముందు పెడ్తున్నా.

నేను పాండీ బజారుకేసి వెళ్లబోతుంటే, నా పక్కగా ఒక పెద్ద కారు వచ్చి నిల్చింది. కారు వెనుకసీటులో వున్న శ్రీ రామానాయుడు 'కొడైకెనాల్‌కు వస్తారా?' అని అడిగారు; ఏమిటి విశేషం అని ప్రశ్నించా. 'మరేంలేదు మన పిక్చరు షూటింగు అక్కడ జరుగబోతూంది. మీరు వస్తే కొడైకెనాల్‌కు వచ్చినట్లు వుంటుంది; మా మ్యాన్ కవర్‌చేసినట్లు వుంటుంది' అన్నారు. 'సారీసార్, వదిరోజులు మీతో వుండిపోతే యిక్కడి చిత్ర వార్తలను యెవరు సేకరిస్తారు చెప్పండి' అంటూ 'మీ పిక్చరుయొక్క వివరాలను చెప్తారా?' అని అడిగాను. 'ఓ. ఎస్. సురేష్ పిక్చర్స్ బ్యానర్‌లో ఒక జానపద చిత్రాన్ని మొదలుపెడ్తున్నాను. సముద్రాల రచన, వేణు సంగీతం, మార్తాండ్ కూర్పు, కళ రాజేంద్రకుమార్ నిర్వహించే యీ చిత్రానికి విశ్వనాథం దర్శకుడు. మొదటి షెడ్యూలులో కాంతారావు, విజయనిర్మల, కృష్ణ, విజయలలిత, రాజబాబు, రమాప్రభలు సంతోష తరంగాల్లో తేలియాడుతూ వయస్సు రేపే వలపు తలపులలో తియ్యటి భావాల్ని పెనవేసుకుంటూ వుల్లాసంగా ఆడిపాడే దృశ్యాల్ని చిత్రీకరిస్తాం. వెంకటరత్నం ఛాయాగ్రహణం నిర్వహిస్తారు. ఔట్‌డోర్ ముగించుకొని వెను వెంటనే ఇన్‌డోర్‌ను ప్రారంభిస్తాం' అని ముగించారు శ్రీ రామానాయుడు.

తెలుగులో చైనా టౌన్

నాయుడుగారితో పది నిమిషాలు గడిపి నాల్గు అడుగులు ముందుకు వేసానో లేదో తారకరామ పిక్చర్స్ పుండరీకాక్షయ్యగారు యెదురయ్యారు. మహమ్మద్ రఫీచే మనోజ్ఞంగా పాడించినందుకు మనసారా అభినందిస్తూ చిత్ర వివరాలను చెప్పమని అడిగాను. 'ఇంకా యెవ్వరికీ చెప్పలేదండీ; అయినా మీరు యింతగా అడుగుతున్నారు గాబట్టి చెప్పడం నాధర్మం' అని చెప్ప సాగాడు. 'చైనా టవున్' చిత్రాన్ని నిర్మిస్తున్నా. శ్రీ రామారావు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. నాయికగా కె. ఆర్. విజయను నిర్ణయించాను. ఒక ముఖ్యపాత్రను రేలంగి పోషిస్తారు. అక్టోబరులో షూటింగును ప్రారంభిస్తాను. బి. ఎ. సుబ్బారావు డైరెక్టుచేసే యీ చిత్రానికి టి. వి. రాజు సంగీత దర్శకుడు. మహమ్మద్ రఫీచే తెలుగులో తియ్యగా పాడించిన ఘనత శ్రీయుతులు త్రివిక్రమరావు, నారాయణరెడ్డికి చెందుతుంది అన్నారు.

సినిమా డైరీ

- కళాదర్శకుడు శ్రీ బి. ఎన్. కృష్ణ తన చిరంజీవి అనుపమ జన్మదినోత్సవ సంరంభాన్ని హోటల్ అశోక్‌లో వైభవంగా జరిపారు.
- లజం ఆర్ట్స్ "ఖైదీ" చిత్రాన్ని తెలుగులో నిర్మిస్తారు. శ్రీ ఎన్. టి. రామారావు కథానాయకుడిగా నటిస్తారు.
- విఠల్‌కంబైన్స్ నిర్మించనున్న జానపద చిత్రం యొక్క షూటింగు డిసెంబరు నుండి ప్రారంభమవుతుంది. శ్రీ ఎన్. టి. రామారావు కథానాయకుడిగా నటించనున్న యీ చిత్రానికి శ్రీ విఠలాచార్య దర్శకులు.
- గౌతమీ పిక్చర్స్ "ఆలీబాబా నలభై దొంగలు" చిత్రాన్ని శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. శ్రీ రామారావు నాయకుడిగా నటించేందుకు అంగీకరించారు.
- శ్రీధర్‌మూవీస్ నిర్మించనున్న చిత్రంలో నాయకుడిగా నటించేందుకు శ్రీ నాగేశ్వరరావు అంగీకరించారు. శ్రీ వి. మధుసూదనరావు డైరెక్టు చేస్తారు.
- శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు సారథిను డియోన్‌కి నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యొక్క షూటింగు మూడు షెడ్యూల్సు పూర్తయింది. నాయకీ, నాయకులుగా వాణిశ్రీ, నాగేశ్వరరావు నటిస్తున్నారు.
- ప్రతిమాఫిలింస్ "నేనే మొనగాణ్ణి" అక్టోబరు 4న విడుదలవుతుంది.
- నాగేంద్రఫిలింస్‌వారు 'మల్లెమనసులు' నిర్మిస్తున్నారు. త్వరలో సెట్స్‌మీదకు వెళ్లబోతున్న ఈ చిత్రానికి దర్శకుడు మానాపురం అప్పారావు. నిర్మాత యన్. జితేంద్రరావు.

ప్రస్తుత విశేషాలు


పుండరీకాక్షయ్యగారి వద్దనుండి నేరుగా కృష్ణారావునాయుడు వీధికి వెళ్ళాను. నేను వెళ్ళడం, ప్రత్యగాత్మగారు రావడం ఒకటిగా జరిగింది. ఇద్దరం ప్రసాద్ ఆర్టు పిక్చర్సు ఆఫీసులోకి వెళ్ళాం. వెళ్ళిన మమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానించారు, శ్రీ అనుమోలు వెంకట సుబ్బారావు. 'ఏమిటండీ సుబ్బారావుగారు, మీరేమిటి యీసారి చాల గ్యాప్ వదిలి పెట్టారే!' అని అడిగా. 'ఏం చెయ్యమంటారు చెప్పండి సరయిన స్టోరీ దొరికేసరికి యింతకాలం పట్టిందండీ. మన బ్యానర్‌కు తగ్గ పిక్చరు తియ్యాలి గదండీ' అన్నారు. మరి మీ కొత్త చిత్రానికి సంబంధించిన న్యూస్ యిస్తారా అన్నందుకు 'కాస్త ఓపిక పట్టండి సార్; యీ నెలాఖరుకు కంప్లీట్ న్యూస్ యిస్తాను. ఇప్పటికి వ్రాయదల్చుకుంటే ప్రత్యగాత్మను దర్శకుడిగాను, జయలలిత, నాగేశ్వరరావులను నాయకీ నాయకులుగ నియమించినట్లు వ్రాయండి' అంటూ ట్రంక్‌కాల్ రిసీవ్ చేసుకునేందుకు ఎ. సి. రూంలోకి వెళ్ళారు.

* * *

డైరెక్టరు ప్రత్యగాత్మను కదిలించాను. 'ఏమిటిసార్, మీరు దర్శకత్వం వహించిన 'రాజా—ఔర్—రంక్' ను ప్రేక్షకులు యెలా రిసీవ్ చేసుకున్నారు' అని ప్రశ్నించా. 'ఇట్‌యీజ్ మోర్‌దాన్ ఏవరేజి, అన్నారు. మరి 'తమన్నా' షూటింగు పూర్తయి వచ్చేనా అని అడిగాను. 'లేదండీ మా హీరోయిన్ మాలాసిన్హా గర్భవతిగా వుంది: అందువల్ల డిసెంబరుకుగానీ పూర్తికాదు అనుకుంటున్నా' అన్నారు. తెలుగులో పి. ఎ. పి. కి గాక మరి రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలకు డైరెక్టుచేసి పెడ్తానని మాట యిచ్చానన్నారు. ఎ. సి. రూం నుండి పిలుపురావడంతో ప్రత్యగాత్మగారు వెళ్ళారు.

ఇద్దరమ్మాయిలు ఒకే నాయకుడు

నాకున్న చనువును పురస్కరించుకుని క్యాషియర్ రూములోకి వెళ్ళాను. అక్కడ శ్రీ పి. సుబ్బారావు స్క్రిప్టుపై దీర్ఘాలోచన చెయ్యడాన్ని గమనించి ఆయన నిర్మించనున్న చిత్రం తాలూకుదేనని వూహించి వివరాల్ని చెప్పమని అడిగాను. 'నా సంస్థకు త్రివేణి అనిపేరు పెట్టాను. శ్రీ బాలమురుగన్ వ్రాసిన కధను కొన్నాను.



'అగ్గిమీదగుగ్గిలంలో' విజయలలిత.

పరిచయం:



సంగీత దర్శకుడు

కె. వి. మహాదేవన్

"మూగమనసులు" చిత్రంలోని ప్రతి పాటను మన మనస్సుల్లో పదికాలాలపాటు నిల్చేవిధంగా సంగీతాన్ని సమకూర్చిన శ్రీ కె. వి. మహాదేవన్ యిప్పటికి 200 చిత్రాలకు సంగీత దర్శకత్వాన్ని నిర్వహించారు. కర్ణాటకంలోనయితేనేమి, జానపదంలోనయితేనేమి, పాశ్చాత్య బాణీలను సమకూర్చడంలోనయితేనేమి సంగీతదర్శకునికి సన్నివేశం బాగాతెలిసి వుంటే, దానికి తగ్గ ప్రతిఫలాన్ని ఆర్కెస్ట్రా యివ్వడం సులభసాధ్యమేనంటాడు మహాదేవన్. పాటయొక్క ఆర్కెస్ట్రయిజేషన్‌కు తగినట్లు పిక్చరైజేషన్ వుంటేనే పాట పాప్యులర్ అవుతుంది, అంటాడు కె. వి. ఎం. ఒకపాటకు యెంతటి మధురమయిన ట్యూను విన్పించినా, దాన్ని పాడేవాడిమీద దాని విజయం ఆధారపడి వుంటుంది. గాయకుడి వాయిస్‌ను అనుసరించి వాల్యూమును మార్చుకుంటే ప్రతిపాట మనం ఆశించిన ఫలితాన్ని యివ్వగలదు అంటాడు.

మలయాళం మాతృభాషగా గొన్న శ్రీ కె. వి. ఎం.కు తెలుగు, తమిళం రాకపోయినా ఆ భాషయొక్క లాలిత్యాన్ని గ్రహించే సూక్ష్మబుద్ధిని భగవంతుడిచ్చాడు. కవితోఒక సమావేశం కుదిరితే చాలు —పది నిముషాల్లో విభిన్న బాణీలను విన్పించే ప్రజ్ఞను యిచ్చాడు భగవంతుడు.

శ్రీ కె. వి. ఎం. సంగీతసామర్థ్యానికి మెచ్చి ప్రముఖ సంగీత నిర్దేశకుడు శ్రీ సి. రామచంద్ర అధ్యక్షతన బొంబాయి "షణ్ముగానందసభ"లో "సంగీతచక్రవర్తి" బిరుదు యిచ్చారు. ఇప్పుడు శ్రీ మహదేవన్ నాదస్వరానికి తన వాయిద్యాలను జోడించి సంగీతంలో కొత్త రికార్డును సృష్టించాడు.

సినిమా

గ్రామీణ వాతావరణంకు సంబంధించిన యీకథలో యిద్దరు అమ్మాయిలు వుంటారు. శ్రీ నాగేశ్వరరావు నాయకుడిగ నటిస్తారు. శ్రీ టి. రామారావు డైరెక్టు చేసే యీ చిత్రంయొక్క షూటింగు జనవరిలో ప్రారంభం అవుతుంది' అన్నారు.

సమస్యాత్మక సాంఘిక కథ

ఇంతదాకా వచ్చానుగదా అని పి. ఎ. పి. నుండి బోగ్‌రోడ్డులోగల శ్రీదేవి కంబైన్స్ ఆఫీసుకి వెళ్లాను. నిర్మాత శ్రీ తోట సుబ్బారావు అప్పుడే ఫియట్‌నుండి దిగి నన్ను పైకి రమ్మన్నారు. మిద్దెపైన శ్రీయుతులు పేకేటి, పినిశెట్టి స్క్రిప్టుపై తర్జనభర్జనలు చేస్తూ, నన్ను జూచి నిస్తబ్ధులయ్యారు. సుబ్బారావుగారితో ఆయన కార్యక్రమాన్ని గురించి అడిగాను. 'నేను ఒక సమస్యాత్మకమయిన సాంఘిక కథను యెన్నుకున్నాను. పినిశెట్టి సంభాషణలు వ్రాస్తున్నారు. పేకేటి డైరెక్టు చేసే ఈ చిత్రానికి ఘంటసాల సంగీత దర్శకుడు. పాటల రికార్డింగును విజయదశమినాడు ప్రారంభించి, షూటింగును అక్టోబరు పదినుండి మొదలెడుదామనుకుంటున్నాను' అని ముగించబోతుంటే



చింతకాయపురంలో' రమాప్రభ

'నాయకీ, నాయకులవాటి చెప్పరేం' అని అడిగాను. 'నాయికగా నటించేందుకు కె.ఆర్. విజయ అంగీకరించింది. శ్రీ రామారావుగారు చాలా బిజీగా వుండడంవల్ల చిన్న తారాగణంతో ఈ చిత్రాన్ని పూర్తి చేసి, శ్రీ ఎన్. టి. ఆర్. చిత్రాన్ని ఫిబ్రవరిలో ప్రారంభిస్తా' నన్నారు.

మిద్దె దిగివస్తూంటే నిర్మాత ఆజం పైకి ఎక్కుతూ నన్ను జూచి కాస్సేపు ఆగారు. దొరికిన అవకాశాన్ని జారవిడువ కూడదుగదా అని 'ఏమిటండీ, 'పల్లె ప్రేమ' తర్వాత యేదయినా అనుకున్నారా లేదా?' అని ప్రశ్నించాను. 'ఎందుకు లేదండీ. ఇప్పుడు తెలుగు, మలయాళం చిత్రాలను ప్రారంభించాను. రాజశ్రీ, కృష్ణ నాయకీ నాయకులుగ నటిస్తున్నారు. విజయ కృష్ణమూర్తి సంగీతాన్ని విన్పిస్తున్నారు. ఆత్రేయ సంభాషణలను పదిహేనురోజుల్లో వ్రాసియిచ్చారు' అన్నారు. 'మరి ఎన్. టి. ఆర్. గారితో యిప్పట్లో పిక్చరు లేనట్లేనా?' అని అడిగాను. 'మీకు తెలియనట్లు నన్ను డుగుతున్నారే, అని అంటూ ఆయన ఫిబ్రవరినుండి కాల్‌షీట్లు యిచ్చారండీ. వంగభాషలో విజయవంతంగా ప్రదర్శించబడిన ఒక చిత్రాన్ని కొన్నాను' అన్నారు.

కొత్త నిర్మాణసంస్థ

బోగ్‌రోడ్డు నుండి తిరుమూర్తి వీధి కెళ్లాను. కల్పనాచిత్రకు వెళ్లి అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో యెదురుగా వున్న ఫల్గుణాపిక్చర్స్‌కి పోయాను. ఇది కొత్తగా వెలసిన నిర్మాణసంస్థ. దీన్ని స్థాపించిన వారు శ్రీయుతులు ఏకామ్రేశ్వరరావు, రాఘవ. వీరు ఐ. ఎన్. మూర్తిని దర్శకుడిగా నియమించారు. కోదండపాణి సంగీతాన్ని అందిస్తారు. నిర్మాతల్లో ఒకరయిన శ్రీ ఏకామ్రేశ్వరరావు చిత్ర కథలోని కొంత భాగాన్ని వివరించారు. 'ఈ చిత్రంలో ఎస్. వి.రంగారావు దొంగగాను,గుమ్మడి డిటెక్టివ్‌గాను నటిస్తున్నారు. నాయకీ, నాయకులుగ వాణిశ్రీ, కృష్ణ నటిస్తున్నారు. అని చెప్తూ కథా రచయిత యెవరనుకున్నారు' అని నన్ను ప్రశ్నించారు. 'నాకేం తెలుసు మీరు చెప్పందే' అన్నాను. 'మన విశ్వప్రసాద్‌ను యెరుగుదురుగా' అన్నారు. 'నేనేమిటి, విశ్వప్రసాద్ ఆంధ్ర పాఠకులకు

కూడ చిరపరిచితుడే. ఆయన వ్రాసిన డిటెక్టివ్ కథలు బహుళ ప్రజాదరణ పొందినవే' అన్నాను. ఒక ప్రముఖ రచయితను సినిమా రంగానికి పరిచయం చేస్తున్న శ్రీ ఏక్నామేశ్వరరావు అభినందనీయుడు.

* * *

తిరుమూర్తి వీధి నుండి దగ్గర్లోనే వున్న శ్రీ ఆదుర్తి సుబ్బారావు యింటికి వెళ్ళాను. ఆయన అప్పుడే బయటకి వెళ్ళడానికి రెడీ అయి కారు దగ్గరకు రాబోతూ ఫోన్ వచ్చేసరికి లోపలి కెళ్ళారు. నేను కూడ ఆయన్ను అనుసరించాను. 'ఏమిటండీ చాలా హడావిడిగా బయల్దేరుతున్నారే' అని అడిగాను. 'ఎడిటింగు రూంకు వెళ్తున్నా. 'ఉండమ్మా బొట్టు పెడతా'ను సెప్టెంబరు 28న రిలీజు చెయ్యాలిగా' అన్నారు. 'సుడిగుండాలు' తర్వాత మీ ప్రాజెక్టు యేమిటి?' అనడిగాను. 'జాన్సన్ వ్రాసిన కథను గూర్చి ఆలోచిస్తాను. ఇదిగాక 'అగ్నిపుత్రిని' హిందీలో నిర్మించడానికి నిశ్చయించాను. వహీదా రెహ్మన్, సునీల్‌దత్ ముఖ్య పాత్రధారులు; లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శకత్వాన్ని నిర్వహిస్తారు. షూటింగు



'ఉండమ్మా బొట్టు పెడతా'లో ప్రసన్నరాణి.



పాత బొమ్మలు - కొత్త కబుర్లు

ఈ బొమ్మలోవున్న గెడ్డపాయన ఎవరో కనిపెట్టగలరా?.... తెలుగు టాకీ యుగం ఆరంభమయ్యాక నిర్మించబడిన సాంఘిక చిత్రాలలో రెండవ చిత్రంలోనిదీ స్టిల్. ఆ చిత్రం పేరు చెప్పుకోగలరా? ఇది రెండో సాంఘికం కదా—మొదటి సాంఘికం పేరు చెబుతాను. అప్పుడైనా కనిపెట్టగలరేమో ప్రయత్నించండి. తెలుగులో వచ్చిన మొదటి సాంఘిక చిత్రంపేరు 'గృహలక్ష్మి.'

* * *

వాహినీవారు 1938 లో నిర్మించిన "వందేమాతరం" లో దీ ఫోటో. ఫోటోలో వున్న వ్యక్తి శ్రీ ముదిగొండ లింగమూర్తి..... సందర్భం ఏమిటంటే— చిత్రంలో ఆయన డాక్టరు. పేదవారికి ఉచితంగా వైద్యం చేస్తూ, హస్తవాసి మంచిదనిపించుకొన్న డాక్టరు. ప్రేమించి విఫలురాలైన రెండవ నాయకి (కల్యాణి)కి మేనమామ. ఆ భగ్న హృదయానికి ఓదార్పు నందజేసి ఆ మలుపు నించి మళ్లించి, సంఘ సేవకురాలిగా మార్చినప్పటి దృశ్యం.

* * *

"శైశవావస్థలో వుండేది పరిశ్రమ. అపుడు తాము నటించే చిత్రం బాగుండాలనీ, బాగా చెయ్యాలనీ కళాకారులు తీసుకునేవారు. ప్రతివారిలోను తృష్ణ, టీమ్ వర్క్ ఉండేది. అప్పటి సంస్థల్లో వాహినీ, ఆదర్శంగా ఉండేది. వాహినీకి ఆ రోజుల్లో శ్రీ రామ్‌నాథ్ ఛీఫ్. ఆయన దగ్గర ఎంతో నేర్చుకున్నాం. ఆయన వల్లనే మేమింత నటులం కాగలిగాం" అన్నారు శ్రీ ముదిగొండ లింగమూర్తి.

—మోహన్ కుమార్

సినిమా

ప్రసాద్ స్టుడియోస్‌లో జరుగుతుంది. ఇదే చిత్రాన్ని శ్రీ నాగేశ్వరరావుతో వీలునుబట్టి తెలుగులో కూడ నిర్మిస్తాను. నాయికగా జమునను పెట్టాలని ఆలోచిస్తున్నా' అన్నారు. 'మీరు బయటి నిర్మాతల చిత్రాలను డైరెక్టు చెయ్యరా' అని అడిగాను 'ఎందుకు చెయ్యనండి. మంచి సబ్జెక్టు, మంచి నిర్మాత వుంటే తప్పకుండా చేస్తాను. సారీ యేమనుకోకండి, నాకు టైం అయింది. మరోసారి కలుద్దాం' అంటూ కారును స్టార్టు చేసి వడపళిని వైపు రివ్వున పోనిచ్చారు. —శ్రీనివాస్ ●

గాంధీ నేర్పిన...

(7–వ పేజీ తరువాయి)

వారు పెద్ద పరిశ్రమల ఉత్పత్తులయిన గడియారాలూ, మోటారుకార్లూ, టెలిఫోన్లూ వాడటం ఆపరు. గాంధీగారు రైలుబండిని ఎక్కననలేదు. ఆయన గడియారాన్ని సక్రమంగా వినియోగించేవారు. రైలుబళ్లనీ, గడియారాలనీ వాడితే వాటిని తయారు చెయ్యటం తప్పా? గాంధీగారు ఎందుకని కుటీర పరిశ్రమలని ప్రోత్సహించా లనేవారు అర్థం చేసుకోవాలి. ఆయనకి పేదలంటే ఎంతో సానుభూతి. పల్లె ప్రాంతాలలో నిరుద్యోగంతో బాధపడుతున్న వారికి ఉత్పత్తి అవకాశాలు పెంచి దేశ సంపదని పెంపొందించాలని ఆయన ఉద్దేశం. ఆయనది సున్నితమయిన మనస్తత్వం. పరిశ్రమలు ప్రారంభంఅయ్యే కాలంలో క్రూరంగాఉండే పరిస్థితులు కొన్ని ఏర్పడుతాయి. ఈ పరిస్థితులు ఆయనని కదిలించి వేశాయి. ఈ విధంగా బాధపడినవారిలో ఆయన మొదటివారు కారు. మానవుని ధ్యేయం గురించి ఆలోచించే ఋషికాబట్టి ఆయన మనం సృష్టించిన వాటికి మనమే బానిసలయి పోరాదని హెచ్చరించారు, అంతే.

గాంధీగారు ఒక పొడి సిద్ధాంతాల లేక ఆదేశాల సంకలనం కారు. నా మట్టుకు నాకు ఆయన మానవుడు ఎంత స్థాయికి లేవగలడో నిరూపించగలిగిన ఒక మనిషి. గతంలోని మంచిఅంతా ఆయనలో ఉంది. ఆయన వర్తమానంలో జీవించాడు కాని భవిష్యత్తుకోసం జీవించాడు. ప్రస్తుతమయిన సమస్యలెన్నిటికో ఆయన పరిష్కారాలు సూచించారు. ఆధ్యాత్మికంగా మారదర్శానికి పనికి వచ్చే సూచనలు కూడా చేశారు. పరోక్షంగా తెలుసుకున్న సమాచారంమీదకాక స్వయంగా అనుభవించినవాటితో ఆయన తన జీవితాన్ని ఒక ప్రయోగకేంద్రం చేసుకున్నారు.

* * *


జవహర్‌లాల్‌నెహ్రూ చెప్పినట్లు: 'సత్యానికి అంకితం చేసుకొనటమే మనం చెయ్యగలిగిన ప్రార్థనలలోకెల్లా గొప్పది. ఈ లక్ష్యంకోసమే ఈయన దేశ సహవాసి జీవించాడు. ఈ లక్ష్యంకోసమే ఆయన మరణించాడు.'

('మహాత్మాగాంధీ: 100 సంవత్సరాలు'నుంచి. సంపాదకులు డా. ఎస్. రాధాకృష్ణన్, ప్రచారకులు గాంధీ శాంతి సంస్థ, న్యూఢిల్లీ. కాపీరయిటు గాంధీ శాంతిసంస్థ.) ●

ఆటలు

[illegible]

క్రీడారంగంలో దక్షిణ ఆఫ్రికా స్థానం పూర్తిగా దిగజారి పోయింది. అదోగతిపాలయింది. ఆదేశం ప్రధాన మంత్రి శ్రీ ఫోర్‌సర్ విధానందీనికి బాగా తోడ్పడింది.



కొంతకాలం కింద బ్రిటిషు ఎమ్. సి. సి. జట్టు ద. ఆఫ్రికా పర్యటనకి పూనుకున్నది. ఆజట్టు లో శ్వేతేతరుడయిన డి ఒలివెయిరా అనే అతన్ని కూడా వేశారు. అతన్ని తమ దేశంలోనికి రానివ్వమని దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వం వారు అన్నారు. కొంత తటపటాయింపు తర్వాత ఎమ్. సి. సి.వారు అసలు తమ పర్యటననే మానుకున్నారు. క్రీడారంగానికే కాదు దీనివల్ల నష్టం కలిగింది. దక్షిణాఫ్రికా ప్రజలకి ఒక అపూర్వ క్రీడా విశేషం చూసే అవకాశం పోయింది.


రాజకీయాలని ఆటలతో కలిపి క్రీడారంగాన్ని నాశనం చెయ్యరాదని నేను ఎన్నో సార్లు రాశాను. టెన్నిస్‌లో, ఒలింపిక్స్ ఆటలలో దక్షిణ ఆఫ్రికా పాల్గొనటానికి సిద్ధపడినప్పుడు రష్యా దానిని వ్యతిరేకించింది. భారతదేశం 1967లో బార్సెలోనా అనే స్పెయిన్ దేశం నగరంలో దక్షిణ ఆఫ్రికాతో డేవిస్‌కప్ పోటీ ఆడింది కాని భారత ప్రభుత్వం ఈ ఏడు దక్షిణ ఆఫ్రికాతో ఆటలు పనికి రావని నిషేధించింది. మెక్సికోలో ఒలింపిక్స్‌లో దక్షిణ ఆఫ్రికా పాల్గొనరాదని ఆ అఖిల నిర్వాహకులు నిర్ణయించారు — పాల్గొనే వారిలో ఎక్కువమంది తాము దక్షిణ ఆఫ్రికాతో ఆడమని చెప్పిన తర్వాత. దీని కంతటికీ కారణం దక్షిణ ఆఫ్రికా విచక్షణ విధానాలే కదా కారణం! కారణం! భారతదేశానికే, ద.ఆఫ్రికాకీ మధ్య దవుత్య సంబంధాలు లేవు కాని డేవిస్‌కప్ పోటీలు జరిగాయి. అంటే, రాజకీయాలు ఆటలకి అడ్డు పడలేదన్న మాట. ఈ సహృదయ ప్రవర్తనని గుర్తించి దక్షిణ ఆఫ్రికా తన విధానాన్ని మార్చుకున్నదా?

అలాగే ద. ఆఫ్రికా కామన్వెల్తులో లేకపోయినప్పటికీ అంతర్జాతీయ క్రికెటు సమితివారు, ఇతరులు ఆదేశాన్ని తమ క్రికెటు ఆటలలో పాల్గొననిచ్చారుకదా! చివరికి దక్షిణ ఆఫ్రికాని సంతోషపెట టానికి ఎమ్. సి. సి. వారు డి ఒలివెయిరాని వదిలి వెయ్యటానికి కూడా సిద్ధ పడ్డారుకదా? ప్రజాభిప్రాయానికి దడిసిగానివారు తమ పర్యటనని మానుకోలేదు కదా? (ముందు డిఒలి వెయిరాని 'బదిలీ' ఆటగానిగా తీసుకువెడదా మనుకున్నారు. కాని, ద. ఆఫ్రికా ప్రధాని ఫోర్‌సర్ దానికి కూడా అంగీకరించలేదు.)

దక్షిణ ఆఫ్రికా నేడు క్రీడారంగంలో ఒంటరి అయిపోయింది. ఆవేశంలో ఎందరో తమ ప్రభుత్వం విధానాలని ఖండించారు. ఆటలు రాజకీయాలని కూడా మార్చగలవేమో! దక్షిణ ఆఫ్రికా వైఖరిని చూసి గర్హించని వారు అరుదు.

—కె. ఎస్. నరసింహన్

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.


MAFATLAL GROUP
అతిమనోహరం!
ఫ్యాషనులో వింతయైన,
విపరీతమైన మార్పులు
వచ్చేయి. ఈ వాయిల్
చూడండి—చాపల్యమెక్కువ.
గంభీరంగా, సవాలు
చేస్తుంటుంది. ఈ వాయిల్సులో
ఎదురు చూడనివి ఎదురవు
తుంటాయి. మీ మానసికస్థితి
ఎలాగున్నా దానికి సరిపడే
మఫత్‌లాల్ వాయిలొకటి
కట్టుకెళ్ళండి...ఇక, దేనికైన
సిద్ధపడి ఉండండి.
మఫత్‌లాల్ గ్రూప్
2 x 2 వాయిల్సు
ఇంకా లీనోస్
'టెరీన్'/కాటన్,
టెరిలైజ్డ్ &
మాఫిసైజ్డ్ రకాలు
M 365 TL
న్యూ షోరాక్ (షోరాక్), అహమ్మదాబాద్ . న్యూ షోరాక్, నడియాద్ . స్టాండర్డ్, బొంబాయి . స్టాండర్డ్ (న్యూ చైనా), బొంబాయి . స్టాండర్డ్, దేవాస్ . సాసూన్, బొంబాయి . సాసూన్ (న్యూ యూనియన్), బొంబాయి
సూరత్ కాటన్, సూరత్ . మఫత్‌లాల్ ఫైన్, నవసారి . మిహిర్ టెక్స్‌టైల్స్, అహమ్మదాబాద్

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

